
www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



బాబు.. పవర్‌ఫుల్ సీఎం!

అత్యంత శక్తిమంతులైన టాప్ టెన్ నేతల్లో ఐదో స్థానం

'ఇండియా టుడే' కథనం 13

మొదటి 4 ర్యాంకుల్లో మోదీ, భాగవత్, షా, రాహుల్

బాబు తర్వాత నితీశ్, యోగి, స్టాలిన్, మమత, అఖిలేశ్

రాజకీయ అనిశ్చితి నుంచి ఉన్నతస్థాయికి
ఫీనిక్స్ పక్షిలా బాబు పునరుత్తేజం.. మీడియా సంస్థ కితాబు

బుధవారం | 13-11-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 208 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం; తిథి: ద్వాదశి మ. 1.02 తదుపరి త్రయోదశి; నక్షత్రం: రేవతి తె. 3.11 తదుపరి అశ్విని; వర్జ్యం: సా. 4.25 -5.51; దుర్ముహూర్తం: ఉ. 11.36-12.21; అమృతఘడియలు: రా. 1.01-2.27; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.22; సూర్యాస్తమయం: 5.35 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

చిచ్చు పెట్టే ముఠా!



వర్రా రవీంద్రా రెడ్డి



అర్జున్‌రెడ్డి



భార్గవ్‌రెడ్డి

వైసీపీ సోషల్ మీడియా 'ఆర్గనైజ్డ్ క్రైమ్'

- వర్రా రవీంద్రా రెడ్డి అందులో భాగస్వామి
- సజ్జల భార్గవ్ రెడ్డి, అర్జున్ రెడ్డి కీలక పాత్ర
- రిమాండ్ రిపోర్టులో సంచలన విషయాలు
- 45 మంది టీమ్‌పై కేసు.. ఏ1 వర్రా, ఏ2 భార్గవ్ రెడ్డి
- సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు, నీచ పోస్టులు
- సమాజంలో అలజడి.. కులాల మధ్య వైషమ్యాలు
- మహిళలు, బాలికలను మానసికంగా హింసించడం, దళితుల్ని కించపరచడం.. బెదిరించి డబ్బులు వసూలు
- రాష్ట్రంలో ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు కుట్రలు
- పులివెందుల కోర్టుకు వివరించిన పోలీసులు
- వర్రాకు 14 రోజులు రిమాండ్.. భార్గవ్‌పై ఎల్‌వోసీ


ఇది కేవలం సోషల్ మీడియా పోస్టులకు సంబంధించిన కేసు కాదు! ఇదో... వ్యవస్థీకృత నేరం! కులాల మధ్య కుంపట్లు రాజేయడం! సమాజంలో చిచ్చు పెట్టడం! మహిళలను మానసికంగా వేధించడం! బాలికలనూ వదలకుండా కామెంట్లతో హింసించడం! గౌరవంగా బతికే దళితులను అవమానించడం! ప్రభుత్వాన్ని అస్థిరపరచడం! పనిలోపనిగా బలవంతపు వసూళ్లకూ పాల్పడటం! వైసీపీ సోషల్ మీడియా వెనుక ఇంతటి విషం దాగుందని పోలీసులు పేర్కొన్నారు.

అమరావతి/పులివెందుల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కూటమి నేతలు, వారి కుటుంబ సభ్యులపై సోషల్ మీడియాలో కాలకూట విషం చిమ్మే ఎంపీ అవినాశ్ రెడ్డి అనుచరుడు వర్రా రవీంద్రా రెడ్డి రిమాండ్ రిపోర్టులో పోలీసులు అనేక సంచలన విషయాలు వెల్లడించారు. ఈ కేసులో వర్రాను ఏ1గా పేర్కొనగా... వైసీపీ సోషల్ మీడియా విభాగానికి ఇన్‌చార్జిగా వ్యవహరించిన సజ్జల భార్గవ్ రెడ్డిని రెండో నిందితుడిగా (ఏ2) చేర్చారు. వర్రాతోపాటు... అతడికి సహకరించిన గుర్రంపాటి వెంకట సుబ్బారెడ్డి, గురజాల ఉదయ్ కుమార్ రెడ్డిని పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. వర్రా వాంగ్మూలం ఆధారంగా అనేక కీలక అంశాలను గుర్తించామని, ఈ వ్యవస్థీకృత నేరంలో భాగస్వాములైన మొత్తం 45 మందిపై కేసు నమోదు చేశామని రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. పులివెందుల కోర్టుకు దీనిని సమర్పించారు. వర్రా రవీంద్రా రెడ్డి తన

మిగతా 14వ పేజీలో...

బాధ్యతగా ఉందాం

బూతులు తిడితే ప్రజలు స్వాగతించరు.. వైసీపీ ఎమ్మెల్యేల్లా చేయొద్దు: సీఎం



కూటమి ఎమ్మెల్యేల సమావేశంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, విష్ణుకుమార్ రాజు, పల్లా

- ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం మన విధి
- వ్యవస్థలన్నీ పతనావస్థకు చేరాయి
- 150 రోజుల్లో గాడిన పెట్టాం
- ఇసుక, మద్యం జోలికి ఎవరూ వెళ్లొద్దు
- ప్రతి ఎమ్మెల్యే జాగ్రత్తగా ఉండాలి
- నియోజకవర్గానికో ఇండస్ట్రియల్ పార్కు
- ఎమ్మెల్యేలే వాటికి చైర్మన్లు
- సచివాలయ వ్యవస్థ పునర్వ్యవస్థీకరణ
- కూటమి సభ్యుల శిక్షణ కార్యక్రమం, ప్రత్యేక సమావేశంలో చంద్రబాబు

"ప్రజలకు ఏం అవసరమో, వారికి ఏం చేశామో చెప్పడానికి అసెంబ్లీ ఒక వేదిక. అసెంబ్లీకి తాము పంపిన ప్రతినిధి తమ కోసం ఏం మాట్లాడుతున్నారని ప్రజలు ఎప్పుడూ గమనిస్తుంటారు. ప్రజా సమస్యలపై మాట్లాడకుండా బూతులు తిడితే ప్రజలు స్వాగతించరు. మనతో పాటు వైసీపీ వాళ్లు కూడా గెలిచారు కాబట్టి అసెంబ్లీకి రావాలి. ప్రజా సమస్యలపై చర్చించాలి. కానీ రాలేదు. కూటమి ఎమ్మెల్యేలు కూడా వైసీపీ ఎమ్మెల్యేల్లా చేయవద్దు. అలా చేస్తే వాళ్లలాంటి పరిస్థితే మనకూ వస్తుంది"

- కూటమి ఎమ్మెల్యేలతో సీఎం చంద్రబాబు

అమరావతి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఎన్డీయే ప్రభుత్వం దెబ్బతిన్న వ్యవస్థలను పునర్నిర్మిస్తూ ముందుకెళుతోందని టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. "నేను నాలుగో సారి సీఎం అయ్యా. కానీ ఎప్పుడూ ఇంతలా వ్యవస్థల విధ్వంసం చూడలేదు. వ్యవస్థలన్నీ పతనావస్థకు చేరాయి. లోతుకు వెళ్లే కొద్దీ భయంకర విషయాలు బయటపడుతున్నాయి. వాటన్నింటినీ 150 రోజుల్లో గాడిన పెట్టాం. ఇక వేగం పెంచాల్సిన అవసరం ఉంది" అని చంద్రబాబు స్పష్టంచేశారు. మంగళవారం మధ్యాహ్నం వెలగపూడిలోని అసెంబ్లీలో ఎన్డీయే ఎల్పీ సమావేశాన్ని ఆయన నిర్వహించారు. అంతకుముందు స్పీకర్

మిగతా 13వ పేజీలో...

చంద్రబాబు భేష్

బాగా కష్టపడుతున్నారు: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

విద్యార్థులు, మహిళలకు వర్క్ ఫ్రమ్ హోమ్

భారీ పెట్టుబడికి రిలయన్స్ సై!

రూ.65 వేల కోట్లతో 500 కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్లు

- 8 జిల్లాల్లో ఒక్కోటి 130 కోట్లతో ఏర్పాటు
- బాబు సమక్షంలో అవగాహన ఒప్పందం
- సీబీజీ ప్లాంట్లతో ప్రభుత్వానికి రూ.57,650 కోట్ల ఆదాయం
- రెండున్నర లక్షల మందికి ఉపాధి
- ప్రభుత్వం, పెట్టుబడిదారులు సమాంతరంగా పరుగులు తీయాలి
- అప్పుడే 20 లక్షల ఉద్యోగాల లక్ష్యం సాకారం
- క్లీన్ ఎనర్జీ విధానంతో సత్ఫలితాలు: సీఎం

అమరావతి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మూడేళ్లలో కంప్రెస్డ్ బయో గ్యాస్ (సీబీజీ) ప్రాజెక్టుల్లో రూ.65 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు రిలయన్స్ సంస్థ రాష్ట్రప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. మంగళవారమిక్కడ వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఇంధన శాఖ అధికారులు, రిలయన్స్ బయో ఎనర్జీ లిమిటెడ్ ప్రతినిధులు

మిగతా 2వ పేజీలో...

యురేనియంకు బ్రేక్

కర్నూలు జిల్లాలో బోర్ల తవ్వకాల ప్రక్రియ నిలిపివేత

- ఇకపై ఏ విధంగానూ ముందుకెళ్లొద్దు
- అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం
- ప్రజల ఆందోళనల దృష్ట్యా నిర్ణయం
- ప్రక్రియను ఆపేస్తున్నామని కలెక్టర్ ప్రకటన
- యురేనియంపై తవ్వకాలు, ప్రజల ఆందోళనలపై 'ఆంధ్రజ్యోతి' కథనాలు



యురేనియం తవ్వకాలపై ఆందోళన చేస్తున్న కప్పట్రాళ్ల, మట్టుప్పల్లం గ్రామాల ప్రజలు (ఫైల్)

కర్నూలు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): యురేనియం తవ్వకాలకు వ్యతిరేకంగా ఆందోళనలు చేస్తున్న కర్నూలు జిల్లాలోని కప్పట్రాళ్ల సహా 15 గ్రామాల ప్రజలకు ఊరట కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. యురేనియం లభ్యత, పరిశోధన కోసం బోర్ల తవ్వకాల ప్రక్రియను ఆపేయాలని సీఎం చంద్రబాబు మంగళవారం అధికారులను ఆదేశించారు. ప్రజల

మిగతా 12వ పేజీలో...

కడపలో అసలేమైంది.. యురేనియం కష్టాలపై ప్రత్యేక కథనం 12లో



13

డిప్యూటీ స్పీకర్‌గా రఘురామ కృష్ణరాజు

పేరు ఖరారు చేసిన చంద్రబాబు

ఎన్నిక లాంఛనప్రాయమే



జీవీ ఆంజనేయులు పంచుమర్తి అనురాధ

శాసనసభ చీఫ్ విప్‌గా జీవీ ఆంజనేయులు

మండలి చీఫ్ విప్‌గా అనురాధ

11 మంది టీడీపీ, ముగ్గురు జనసేన, ఒక బీజేపీ ఎమ్మెల్యేకు విప్‌లుగా చాన్స్

ఆరు కార్పొరేషన్లలో 90 మంది డైరెక్టర్ల నియామకం 13

గ్రూప్-2 మెయిన్స్ ఫిబ్రవరి 23కు వాయిదా 3

సైతాన్ సైన్యానికి నేత జగన్



- నాపై తప్పుడు ప్రచారం చేయించింది ఆయనే
- విషనాగులతో పాటు అనకొండనూ పట్టాలి
- అసెంబ్లీకి వచ్చే ధైర్యం లేకపోతే రాజీనామా చేయాలి
- 11 సీట్లే ఎందుకొచ్చాయో ఆత్మవిమర్శ చేసుకోవాలి
- వైసీపీ ఎమ్మెల్యేలకు షర్మిల బహిరంగ లేఖ 14

పెద్దిరెడ్డి చెప్పారని కట్టబెట్టారు!

- ఆయన సన్నిహితుల సంస్థకే కాంట్రాక్టు.. అడ్డగోలుగా సోలార్ రూఫ్ టాప్ టెండర్లు
- 15% లెస్‌కు వేసిన బిడ్డర్‌కు రిక్తహస్తం.. 8.5% లెస్‌కు వేసిన సంస్థకు అప్పగింత 12
- అదీ నకిలీ సర్టిఫికెట్‌తో.. అమరావతి స్మార్ట్ సిటీ కార్పొరేషన్‌లో మాజీ మంత్రి హవా

దుర్గా కోఆపరేటివ్ బ్యాంకు లైసెన్సు రద్దు




- బ్యాంకింగ్ కార్యకలాపాలు నిలిపివేసిన ఆర్బీఐ
- రూ.5 లక్షల లోపువారికి పూర్తి చెల్లింపులు 13
- ఆపై ఎంత వేసినా ఇచ్చేది రూ.5 లక్షలే!
- లిక్విడేటర్‌ను నియమించిన తర్వాతే చెల్లింపులు

అవినీతి 'ద్వారం' మూత

- అక్రమాల అడ్డాగా మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి రొయ్యల ఫ్యాక్టరీ
- రొయ్యల ఎగుమతి యూనిట్‌లో భారీ ఉల్లంఘనలు గుర్తింపు
- వ్యర్థ జలాలు నేరుగా పంట కాలువలు, డ్రైనేజీల్లోకి విడుదల
- కాలుష్య నివారణకు గ్రీన్ బెల్ట్ నిర్వహించాల్సి ఉన్నా బేఖాతరు
- అక్రమాలు సరిదిద్దుకోవాలని గడువిచ్చినా లెక్కచేయని వైనం
- దాంతో ఫ్యాక్టరీలో ఉత్పత్తి నిలిపివేస్తూ పీసీబీ ఆదేశాలు 14

ఉగ్రవాదుల్లో పాక్‌వాసులే అధికం

- తగ్గుతున్న స్థానికుల సంఖ్య
- జమ్మూ-కశ్మీర్‌లో చురుగ్గా 119 మంది




శ్రీనగర్, నవంబరు 12: జమ్మూ-కశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని నిర్మూలించడానికి నిశితంగా కృషి చేస్తున్న భద్రత బలగాలు క్షేత్రస్థాయి సమాచారాన్ని క్షుణ్ణంగా సేకరిస్తున్నాయి. ప్రస్తుతం మొత్తంగా 119 మంది ఉగ్రవాదులు చురుగ్గా వ్యవహరిస్తున్నట్టు నిఘా వర్గాలు గుర్తించాయి. ఇందులో 79 మంది పీర్ పంజాల్ ఉత్తర భాగంలో ఉన్నారు. వీరిలో 18 మంది స్థానికులు కాగా, 61 మంది పాక్ జాతీయులు. దక్షిణ భాగంలో 40 మంది ఉండగా వారిలో 34 మంది విదేశీయులు. ఆరుగురు స్థానికులు. ఈ ఏడాదిలో ఇంతవరకు 25 ఉగ్రవాద సంబంధిత సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఈ సందర్భంగా జరిగిన ఎదురు కాల్పుల్లో 24 మంది జవాన్లు, అధికారులు ప్రాణాలు కోల్పోయారు. ఎన్‌కౌంటర్లలో మొత్తం 61 మంది ఉగ్రవాదులు హతం కాగా, వారిలో 21మంది పాక్ జాతీయులు. ఉగ్రవాద ముఠాల్లో చేరడానికి స్థానికులు ఆసక్తి చూపించకపోవడంతో పాకిస్థాన్‌లోని నిరుద్యోగ, నిరక్షరాస్య యువతపై అవి దృష్టి పెట్టాయి. కాగా, పొరుగు దేశం నుంచి ఉగ్రవాద ముప్పు ఇంకా సవాలేనని అధికార వర్గాలు భావిస్తున్నాయి.

మతమార్పిళ్లకు పాల్పడే ఎన్జీవోలపై కన్నెర్ర

న్యూఢిల్లీ, నవంబరు 12: బలవంతపు మతమార్పిళ్లకు పాల్పడటం, అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకోవడం వంటి చర్యలకు పాల్పడే స్వచ్ఛంద సంస్థల(ఎన్జీవో) రిజిస్ట్రేషన్లను విదేశీ విరాళాల నియంత్రణ చట్టం(ఎఫ్‌సీఆర్‌ఏ)-2010 ప్రకారం రద్దు చేస్తామని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ప్రకటించింది. దీనికి సంబంధించి ఎఫ్‌సీఆర్‌ఏ డైరెక్టర్ కె.సంజయన్ ఈ నెల 8న నోటీసు విడుదల చేశారు. విదేశీ వ్యక్తులు, సంస్థల నుంచి విరాళాలు పొందే స్వచ్ఛంద సంస్థలు సామాజిక, మతపరమైన సామరస్యాన్ని దెబ్బతీసే చర్యలకు పాల్పడితే ఎఫ్‌సీఆర్‌ఏ రిజిస్ట్రేషన్ కోల్పోతాయని స్పష్టం చేశారు. ఉగ్రవాద, రాడికల్ సంస్థలతో సంబంధాలు కలిగి ఉన్నా, కుట్రపూరితంగా నిరసనలు, అవాంఛనీయ కార్యకలాపాలతో అభివృద్ధి నిరోధక చర్యలకు పాల్పడినా ఎఫ్‌సీఆర్‌ఏ రిజిస్ట్రేషన్ రద్దు చేస్తామన్నారు. అంతేకాదు ఎఫ్‌సీఆర్‌ఏ చట్టం ప్రకారం ఆయా స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామన్నారు. విదేశీ వ్యక్తులు, సంస్థల నుంచి విరాళాలు పొందే స్వచ్ఛంద సంస్థలు తాము పెట్టుకున్న లక్ష్యాలకు అనుగుణంగా ప్రాజెక్టులు చేపట్టకపోయినా ఎఫ్‌సీఆర్‌ఏ రిజిస్ట్రేషన్ కోల్పోతాయి. విదేశాల నుంచి విరాళాలు పొందాలనుకునే స్వచ్ఛంద సంస్థలు విదేశీ విరాళాల నియంత్రణ చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకోవడం తప్పనిసరి. లైసెన్సులు కోల్పోతే విదేశీ నిధులు రావు.

లోకం తీరు



తెలుగువారు వలస వచ్చిన వాళ్లు కాదు

- తమిళనాడు అభివృద్ధిలో వారిది క్రియాశీలక పాత్ర
- నటి కస్తూరి వ్యాఖ్యలపై మద్రాస్ హైకోర్టు

చెన్నై, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): తెలుగువారు తమిళనాడుకు వలసవచ్చిన వారు కాదని, రాష్ట్రాభివృద్ధిలో వారి క్రియాశీలకమైన భాగస్వామ్యం ఉందని మద్రాసు హైకోర్టు వ్యాఖ్యానించింది. చెన్నపట్నంలో తెలుగువారి ప్రాబల్యం ఎక్కువగా ఉందని, అలాంటి వారిని ఎలా వేరుచేసి చూడగలమని న్యాయమూర్తి జస్టిస్ ఆనంద్ వెంకటేశ్ నేతృత్వంలోని మద్రాస్ హైకోర్టు మదురై ధర్మాసనం ప్రశ్నించింది. ఇటీవల ఓ సభలో నటి కస్తూరి తెలుగువారినుద్దేశించి చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమైన విషయం తెలిసిందే. ఆ వ్యాఖ్యలపై పలు తెలుగు సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసనలు వ్యక్తం చేయగా, చెన్నై, మదురై, సేలం తదితర ప్రాంతాల్లో పోలీసులు కస్తూరిపై ఆరు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఆమెను అదుపులోకి తీసుకునేందుకు రెండు ప్రత్యేక బృందాలు కూడా ఏర్పాటయ్యాయి. ఈ నేపథ్యంలో ముందస్తు బెయిల్ కోరుతూ కస్తూరి మదురై బెంచ్‌లో పిటిషన్ దాఖలు చేయగా దానిపై మంగళవారం విచారణ జరిగింది. కస్తూరి తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ కస్తూరి తన వ్యాఖ్యలపై క్షమాపణ తెలిపారని, అయినా రాజకీయ దురుద్దేశంతో కేసులు నమోదు చేశారని చెప్పారు. ధర్మాసనం తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది.

చైనాలో స్పోర్ట్స్ సెంటర్‌లోకి దూసుకెళ్లిన కారు

- 35 మంది మృతి..43 మందికి గాయాలు

బ్యాంకాక్, నవంబరు 12: దక్షిణ చైనాలోని జుహయ్‌లో ఓ కారు బీభత్సం సృష్టించింది. డ్రైవర్ అదుపు కోల్పోవడంతో స్పోర్ట్స్‌సెంటర్‌లో వ్యాయామం చేస్తున్న వారిపైకి అతి వేగంగా దూసుకువెళ్లింది. సోమవారం రాత్రి జరిగిన ఈ ప్రమాదంలో 35 మంది మరణించగా, 43 మంది గాయపడ్డారు. కారు డ్రైవర్(62)ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు ఉద్దేశపూర్వకంగా దాడి చేశాడా? లేక నిజంగానే ప్రమాదమా? అనేది దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. జుహయ్‌లో ప్రతి ఏటా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే ఎయిర్‌షోకు ఒక్కరోజు ముందు ఈ ఘటన చోటుచేసుకుంది.

'మల్లూ హిందూ ఆఫీసర్స్' గ్రూప్ సృష్టికర్త ఐఏఎస్ గోపాలకృష్ణన్‌పై సస్పెన్షన్ వేటు

న్యూఢిల్లీ, నవంబరు 12: కేరళలో కేవలం హిందూ ఐఏఎస్ అధికారుల నంబర్లతో ప్రత్యేకంగా "మల్లూ హిందూ ఆఫీసర్స్" పేరుతో వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసిన ఐఏఎస్ అధికారి గోపాలకృష్ణన్‌ను కేరళ ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఆ వాట్సాప్ గ్రూప్ రాష్ట్రంలోని అఖిల భారత సర్వీసు అధికారుల మధ్య ఐక్యతను దెబ్బతీసి, విభజన సృష్టించేలా ఉందని సస్పెన్షన్ ఆర్డర్‌లో పేర్కొంది. అందుకే గోపాలకృష్ణన్‌పై చర్యలు తీసుకొన్నట్లు తెలిపింది. వాట్సాప్ గ్రూప్ వివాదం అక్టోబరులో బయటకు వచ్చింది. అయితే, తన ఫోన్‌ను ఎవరో హ్యాక్ చేశారని, తనకు తెలియకుండా ఆ గ్రూప్‌ను క్రియేట్ చేసి తనను అడ్మిన్‌గా పెట్టారని గోపాలకృష్ణన్ అప్పుడే వివరణ ఇచ్చారు. ఈ వ్యవహారంపై విజయన్ ప్రభుత్వం సీఎస్ శారదా మురళీధరన్ నేతృత్వంలో విచారణ బృందాన్ని నియమించింది.

విజయవంతంగా దీర్ఘశ్రేణి క్షిపణి ప్రయోగం

న్యూఢిల్లీ, నవంబరు 12: డీఆర్‌డీఓ మంగళవారం విజయవంతంగా దీర్ఘశ్రేణి క్షిపణి- లాంగ్ రేంజ్ ల్యాండ్ అటాక్ క్రూయిజ్ మిస్సైల్ (ఎల్‌ఆర్‌ఎల్‌ఏసీఎం)ను ప్రయోగించినట్టు రక్షణ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఒడిశాలోని చండీపూర్‌లో ఉన్న ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్‌లో సంచార ఆర్టిక్యులేటెడ్ లాంచర్ ద్వారా ప్రయోగించినట్టు పేర్కొంది. ఈ తరహా క్షిపణిని ప్రయోగించడం ఇదే ప్రథమం కావడం గమనార్హం. సుదూరంలో నేలపైన ఉన్న లక్ష్యాలను గురిపెట్టి దీన్ని ప్రయోగిస్తారు. దీని నిర్మాణంలో బెంగళూరులోని ఎరోనాటికల్ డెవలప్‌మెంట్ ఎక్విప్‌మెంట్ సంస్థ, భారత్ ఎలక్ట్రానిక్స్ సంస్థ, హైదరాబాద్‌లోని భారత్ డైనమిక్స్ లిమిటెడ్ సంస్థలు పాలు పంచుకున్నాయి.

'ఉన్నతి'ని సద్వినియోగం చేసుకోండి: పవన్

అమరావతి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఎన్‌ఆర్‌జీఎస్‌లో పని చేస్తున్న కూలీల కుటుంబాల్లోని యువత 'ఉన్నతి' కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. కూలీల కుటుంబాల్లోని యువతీయువకులు నైపుణ్యాలు పొంది జీవన ప్రమాణాలను పెంచుకోవడానికి ఇది ఉపయోగపడుతుందన్నారు. శిక్షణా కాలంలో వయోజనులకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ నిర్దేశించిన రోజు కూలీ రూ.300 చొప్పున 90 రోజులకు రూ.27,000 లభిస్తుందన్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో వంద రోజుల పని పూర్తి చేసిన కుటుంబాలకు చెందిన వయోజనులు శిక్షణకు అర్హులని తెలిపారు. 18 నుంచి 45 ఏళ్ల వయస్సు ఉండి, టెన్త్ పాస్ లేదా డిగ్రీ ఫెయిల్ అయినవారు శిక్షణకు అర్హులన్నారు. శిక్షణ కాలపరిమితి 90 నుంచి 120 రోజులు ఉంటుందన్నారు. కూలీల కుటుంబాలు దీర్ఘకాలం ఎన్‌ఆర్‌జీఎస్‌పైనే ఆధారపడకుండా నైపుణ్యం కలిగిన వృత్తుల్లోకి ప్రవేశించి, అన్ని రంగాల్లో ముందుకు వెళ్లాలని, ఇందుకు ఉన్నతి శిక్షణా కార్యక్రమాలను ఉపయోగించుకోవాలని పవన్ కోరారు.

నేడు అసెంబ్లీలో మూడు బిల్లులు

అమరావతి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): బుధవారంనాడు అసెంబ్లీలో ప్రభుత్వం మూడు బిల్లులు ప్రవేశపెట్టనుంది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం సవరణ బిల్లు-2024ను ప్రవేశపెట్టనున్నారు. మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ బిల్లు-2024, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రభుత్వ ఉద్యోగుల బిల్లు-2024ను ప్రవేశపెడతారు. అనంతరం బడ్జెట్‌పై చర్చ ప్రారంభం అవుతుంది.

కెనడాలో భారతీయులకు గండం!

పాక్ ఉగ్ర గ్రూపులతో ఖలిస్థానీ నేతల సమావేశం.. త్వరలో నిరసనలు హింసాత్మకంగా మారే ప్రమాదం

- ఈ ఏడాది చివరికి పరిస్థితి తీవ్రం
- నిఘా వర్గాల ఆందోళన



అట్టవా, నవంబరు 12: కెనడాలో నివసిస్తున్న భారతీయులు ఖలిస్థానీ తీవ్రవాదుల నుంచి తీవ్ర ముప్పును ఎదుర్కొంటున్నారు. వాట్సాప్‌లో గ్రూపులను ట్రాక్ చేయడం నుంచి భౌతిక ఘర్షణలు, నిరసనలు, బెదిరింపుల వరకూ ఖలిస్థానీ అనుకూల సంస్థలు (పీకేఈ) అక్కడి భారతీయ సమాజాన్ని టార్గెట్ చేస్తున్నాయి. ఈ నెల మొదటి వారంలో కొందరు పాకిస్థాన్ నాయకులతో పాటు ఆ దేశానికి చెందిన ఉగ్ర గ్రూపులతో సమావేశమైన తర్వాత ఖలిస్థానీ నాయకత్వం నిరసనల దూకుడును తీవ్రతరం చేసిందని భారత నిఘా వర్గాలు చెబుతున్నాయి. ప్రత్యేకించి భారతీయులు అధిక సంఖ్యలో నివసించే ప్రాంతాల్లో దీని ప్రభావం స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొన్నాయి. ఈ నిరసనలు త్వరలోనే హింసాత్మకంగా మారి, పీకేఈకి చెందిన వారు భారతీయులను బెదిరించడంతో పాటు దాడులకు పాల్పడవచ్చని, వారిపై కేసులు కూడా నమోదు చేసే అవకాశం ఉందని ఆ వర్గాలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. స్థానిక పోలీసులు, అధికారుల సహకారంతో కెనడాలోని వివిధ ప్రాంతాల్లో ఖలిస్థాన్‌కు వ్యతిరేకంగా గళం విప్పుతున్న భారతీయుల వివరాలను ఈ సంస్థలు సేకరిస్తున్నాయి. వారి చిరునామా, ఫోన్ నంబర్లు తదితర కీలక సమాచారాన్ని గ్రూపుల్లో షేర్ చేస్తుండటంతో ఆయా కుటుంబాలు ప్రస్తుతం తీవ్ర ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి. వివిధ భారతీయ కమ్యూనిటీలకు చెందిన సోషల్ మీడియా గ్రూపుల్లో ఖలిస్థానీ సంస్థల సభ్యులు చొరబడ్డారని, ఖలిస్థానీ మద్దతుదారులను రెచ్చగొట్టడానికి వీరు చాట్‌లు, సందేశాలను ఉపయోగిస్తున్నారని ఓ అధికారి వివరించారు. ఖలిస్థాన్‌కు మద్దతివ్వాలని, లేకుంటే కెనడా నుంచి వెంటనే వెళ్లిపోవాలని డిమాండ్ చేస్తూ భారతీయులను బెదిరిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో కెనడాలో నివసిస్తున్న చాలామంది భారతీయులు ఇప్పటికే తమ ఆస్తులను అమ్ముకోవడం ప్రారంభించారు. వారంతా స్వదేశానికి తిరిగి రావాలని యోచిస్తున్నారు. ఈ ఏడాది చివరికి పరిస్థితి మరింత తీవ్రమవుతుందని, కెనడాలో నివసిస్తున్న భారతీయులకు మరింత ప్రమాదకరంగా మారుతుందని భారత నిఘా సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

ఎన్‌డీపీకి ఖలిస్థాన్ విరాళాలు

కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో మాజీ మిత్రుడు జగ్మీత్ సింగ్ నేతృత్వంలోని న్యూ డెమొక్రటిక్ పార్టీ (ఎన్‌డీపీ)కి ఖలిస్థానీ ఉగ్రవాదుల నుంచి నిధులు సమకూరాయని తెలిపోయింది. కెనడాలో హత్యకు గురైన ఖలిస్థానీ తీవ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ 2014 నుంచి 2019 వరకూ ఎన్‌డీపీకి విరాళాలు ఇచ్చినట్లు రుజువు చేసే కీలక పత్రాలు వెలుగులోకి వచ్చాయి. అదేవిధంగా ఖలిస్థానీ ఉగ్రవాదులు మో దలివాల్, తేహల్ సింగ్, భగత్ బ్రార్, మల్కీత్ సింగ్, దులాయ్ తదితరులు కూడా ఎన్‌డీపీకి విరాళాలు ఇచ్చినట్లు వెల్లడైంది. కాగా, భారత కాన్సులేట్ ఆధ్వర్యంలో బ్రాంప్టన్‌లోని త్రివేణి మందిరంలో ఈ నెల 17న నిర్వహించాల్సిన లైఫ్ సర్టిఫికెట్ల జారీ కార్యక్రమం రద్దయింది. అత్యంత హింసాత్మక నిరసనలు జరిగే ప్రమాదం ఉందని నిఘా వర్గాలు హెచ్చరించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆలయ వర్గాలు మంగళవారం ప్రకటించాయి.

కెనడా వీసా నిబంధనలు కఠినతరం

- బహుళ ప్రవేశ వీసా జారీకి కొత్త నిబంధనలు విడుదల

కెనడా ప్రభుత్వం బహుళ ప్రవేశ వీసాల జారీ నిబంధనలను కట్టుదిట్టం చేసింది. ఆ మేరకు కొత్త నిబంధనలను మంగళవారం విడుదల చేసింది. సింగిల్ ఎంట్రీ వీసా పొందిన వ్యక్తులు ఆ వీసాతో ఒక్కసారి మాత్రమే కెనడాలోకి ప్రవేశించగలరు. బహుళ ప్రవేశ వీసా పొందిన వ్యక్తులు అది చెల్లుబాటయ్యే గడువు వరకు ఎన్నిసార్లు అయినా కెనడాకు రావొచ్చు. తాజా నిబంధనల ప్రకారం.. గరిష్ఠ కాలానికి జారీ చేసిన బహుళ ప్రవేశ వీసాలను ఇకపై ప్రామాణిక పత్రంగా పరిగణించబోరు. ఏదేని వ్యక్తికి వీసాను సింగిల్ ఎంట్రీకి జారీ చేయాలా? లేక బహుళ ఎంట్రీకి జారీ చేయాలా? అనేది ఇకపై కెనడా ఇమ్మిగ్రేషన్ విభాగం ఐఆర్‌సీసీ నిర్ణయిస్తుంది. వీసా చెల్లుబాటు గడువును కూడా ఐఆర్‌సీసీనే నిర్ణయిస్తుంది. బహుళ ప్రవేశ వీసాలు గరిష్ఠంగా పదేళ్ల వరకు లేదా ట్రావెల్ డాక్యుమెంట్, బయోమెట్రిక్‌ల చెల్లుబాటు గడువు ముగిసే వరకు(ఏది ముందు అయితే అదే) చెల్లుబాటు అవుతాయి. గరిష్ఠంగా ఎంతకాలానికి బహుళ ప్రవేశ వీసాను జారీ చేయాలనేది అధికారులే నిర్ణయిస్తారు. ఏ కారణంతో కెనడాకు వస్తున్నారు? వారి ఆరోగ్య పరిస్థితి, కెనడాలో నివసించే కాలానికి అయ్యే వ్యయానికి సరిపడా నిధులు ఉన్నాయా? తదితర కారణాలను పరిశీలించి సింగిల్ ఎంట్రీ వీసా ఇవ్వాలా? లేక బహుళ ఎంట్రీ వీసా ఇవ్వాలా? అనేది నిర్ణయిస్తారు.

బలికోరుతున్న రోడ్లు

పదేళ్లలో 15.3 లక్షల మంది మృతి

న్యూఢిల్లీ, నవంబరు 12: దేశంలో రహదారులు బలికోరుతున్నాయి..! రహదారులు.. వనరులు అభివృద్ధి చెందుతున్నా.. ఏటా రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయే తప్ప.. తగ్గడం లేదు. చట్టాలు కఠినంగా లేకపోవడం.. జరిమానాలు సాధారణంగా ఉండడంతో నిర్లక్ష్య డ్రైవింగ్, రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట పడడం లేదని నిపుణులు ఆందోళన చెందుతున్నారు. 2014-23 మధ్యకాలంలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో మృతుల సంఖ్య 15.3 లక్షలుగా ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ సంఖ్య చండీగఢ్ జనాభా కంటే ఎక్కువే..! రోడ్లు, వనరులను ప్రభుత్వాలు అభివృద్ధి చేస్తున్నా.. డ్రైవర్ల నిర్లక్ష్యం కారణంగానే ఘోర ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. 2012లో దేశవ్యాప్తంగా 48.6 లక్షల కిలోమీటర్ల మేర రోడ్లు ఉండగా.. 2019 కల్లా.. 63.3 లక్షల కిలోమీటర్లకు పెరిగాయి. అదే సమయంలో.. 2012లో 15.9 కోట్లుగా ఉన్న వాహనాలు.. 2024 అక్టోబరు కల్లా.. 38.3 కోట్లకు చేరుకున్నాయి. వాహనాలు రెండింతల కంటే ఎక్కువ పెరిగినా.. అందుకు తగ్గట్లు వనరులు అభివృద్ధి కావట్లేదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

మన దేశంలోనే ఎక్కువ

రోడ్డు ప్రమాదాల్లో మరణాల సంఖ్య మన దేశంలోనే ఎక్కువగా ఉంటున్నాయి. ఏటా ప్రతి 10 వేల మందికి 250 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారు. మన జనాభాకు దాదాపు సగం ఉన్న చైనాలో ఈ సంఖ్య 119గా ఉంది. అమెరికాలో 57, ఆస్ట్రేలియాలో 11గా ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. మనదేశంలో రహదారి భద్రతపై వాహనదారులు, పాదచారుల్లో అవగాహన లేకపోవడంతో ప్రమాదాలు పెరుగుతున్నాయని నిపుణులు వివరిస్తున్నారు.

కాంట్రాక్టు పనుల్లో ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్

- ప్రతిపాదన మాత్రమే: కర్ణాటక సీఎంవో

బెంగళూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు పనుల్లో ముస్లింలకు 4% రిజర్వేషన్ కల్పించాలనే ప్రతిపాదన కర్ణాటకలో వివాదాస్పదమవుతోంది. ఇప్పటికే వక్ఫ్ భూముల అంశం ప్రభుత్వానికి తీరని చెడ్డపేరు వచ్చింది. మూడు నాలుగు తరాలుగా సాగు చేసుకుంటున్న భూమిని వక్ఫ్‌కు చెందినదంటూ రైతులకు నోటీసులు ఇవ్వడంతో రాష్ట్రమంతటా ఆందోళనకు కారణమైంది. తాజాగా కాంట్రాక్టు పనుల్లో నాలుగుశాతం రిజర్వేషన్ ముస్లింలకు కేటాయించాలనే ప్రతిపాదన చర్చనీయాంశమైంది. ఈ అంశంలో ఎస్సీ, ఎస్టీలకు ప్రస్తుతం 24శాతం రిజర్వేషన్ ఉంది. కేటగిరీ -1 కింద ఓబీసీలకు 4శాతం, కేటగిరీ-2ఏ కింద 15శాతం ఇలా మొత్తం 43 శాతం రిజర్వేషన్ అమలవుతోంది. ముస్లింలకు 4శాతం కల్పిస్తే.. 47శాతానికి పెరుగుతుంది. శాసనసభ శీతాకాల సమావేశాల్లో ఈ బిల్లు తీసుకొచ్చే అవకాశాలున్నాయి. అయితే, ప్రస్తుతానికి ఇది ప్రతిపాదన మాత్రమేనని, ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని సీఎం కార్యాలయం(సీఎంవో) స్పష్టం చేసింది.

వక్ఫ్ ఆస్తులు పెరిగితే దేశానికి ముప్పు

బెంగళూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ ఆస్తులు గడిచిన పదేళ్లలో 30 శాతం పెరిగాయని, ఇదే తరహాలో కొనసాగితే దేశ వ్యతిరేక శక్తులు కుమ్మక్కవుతాయని, దేశానికి పెనుప్రమాదం తలెత్తవచ్చని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. దావణగెరెలో మంత్రి మంగళవారం మీడియాతో మాట్లాడుతూ, వక్ఫ్ ఆస్తులను ముస్లిం సమాజం వినియోగం కోసం కేటాయిస్తారని అన్నారు. అక్కడ ఎటువంటి వ్యవహారాలు జరుగుతాయనేది విడమరచి చెప్పాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు. ప్రత్యేక హోదా కల్పించినందుకు కశ్మీర్ ఉగ్రవాదుల కేంద్రంగా మారలేదా అని ప్రశ్నించారు.

ఆ వినాశనం మీకే తెలుసు ఖర్గే!

- మీ గ్రామాన్ని రజాకార్లు కాల్చేశారు
- మీ తల్లిని, సోదరిని చంపేశారు
- అయినా,ముస్లిం ఓట్లు పోతాయన్న భయంతో మీరెక్కడా ప్రస్తావించరు
- కాంగ్రెస్ అధ్యక్షుడిపై యోగి విమర్శలు



ముంబై, నవంబరు 12 : రజాకార్లు తన గ్రామాన్ని కాల్చివేసి, తల్లిని, సోదరిని హత్యచేసిన విషయాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎలా విస్మరిస్తారని ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ ప్రశ్నించారు. బుజ్జగింపు రాజకీయాల కోసం ఖర్గే తన బాల్యంలో జరిగిన ఈ విషాదాన్ని మరిచిపోతున్నారని విమర్శించారు. మహారాష్ట్రలోని అచల్‌పూర్‌లోని ఎన్నికల ప్రచారంలో మంగళవారం ఖర్గేపై యోగి పెద్దఎత్తున విమర్శల దాడి చేశారు. భారత యూనియన్‌లో చేరడానికి నిరాకరించి హైదరాబాద్ సంస్థానం తిరుగుబాటు చేయగా, సంస్థానం, నిజాం తరఫున రజాకార్లు పోరాడారు. అప్పట్లో హైదరాబాద్ సంస్థానంలో భాగంగా ఉన్న కర్ణాటకలోని కొన్ని ప్రాంతాల్లో ఘర్షణలు జరిగాయి. 1948లో జరిగిన ఈ ఘర్షణల్లో బీదర్ ప్రాంతంలోని ఖర్గే గ్రామం రజాకార్ల దాడికి గురైంది. ఇటీవల ఎన్నికల సభలో ఖర్గే మాట్లాడుతూ.. కొందరు ఒకవైపు కాషాయ దుస్తులు ధరిస్తూనే, మరోవైపు 'విడిపోతే మన దేహాలు ముక్కలవుతాయి' అంటూ విద్వేష వ్యాఖ్యలు చేస్తుంటారంటూ యోగిపై ధ్వజమెత్తారు. "కొందరు కాషాయ దుస్తులు ధరిస్తారు. జుట్టు లేని నున్నటి తలతో ఉంటారు. సాధువుల వేషంలో ఉంటారు. కానీ, వాళ్లు రాజకీయ నాయకులు, ముఖ్యమంత్రులు కూడా అవుతారు. నిజమైన యోగి రాజకీయాలకు దూరంగా ఉంటాడు" అని ఖర్గే వ్యాఖ్యానించారు. దీనిపై స్పందించిన యోగి.. నిజాం కాలం నాటి విషయాలను తన ఎన్నికల ప్రసంగంలో గుర్తుచేస్తూ.. ఖర్గేపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. విడిపోవడం ఎంత భయానకమో..వాళ్లు (రజాకార్లు) ఎన్ని అకృత్యాలకు పాడిగడతారనేందుకు ఖర్గే బాల్యంలో చోటు చేసుకున్న విషాదమే నిదర్శనమని యోగి అన్నారు. కానీ, ముస్లిముల ఓట్లు పోతాయనే భయంతో అప్పటి విషయాలూ, దేశం కోసం తన కుటుంబం చేసిన త్యాగం గురించి ఖర్గే ఎక్కడా ప్రస్తావించరని దుయ్యబట్టారు. తనపై కాకుండా.. ఖర్గే తన గ్రామాన్ని, కుటుంబాన్ని, హిందువులను తగలబెట్టిన రజాకార్లపై ఆగ్రహించాలన్నారు. కాగా, మహా వికాస్ అఘాడి అధికారంలో ఉండగా.. లవ్ జిహాద్, ల్యాండ్ జిహాద్‌కు అడ్డాగా మహారాష్ట్ర మారిందని యోగి అన్నారు. .

హిందువులు ఏకం కావాలి

శాఖాపరంగా ఎన్ని తేడాలు ఉన్నప్పటికీ హిందువులంతా ఏకం కావాల్సిందేనని జగద్గురు రామభద్రాచార్య అన్నారు. 'విడిపోతే మన దేహాలు ముక్కలవుతాయి' అంటూ యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ చేసిన వ్యాఖ్యలను తాను సమర్థిస్తానన్నారు. 'యోగి చెప్పింది వాస్తవమే. మనమెన్నటికీ విడిపోరాదు. మనం ఒక్కటిగా ఉంటే ఎవరూ మనకు హాని తలపెట్టలేరు' అని వ్యాఖ్యానించారు.

నేడే వయనాడ్ ఉప ఎన్నిక

వయనాడ్: కేరళలోని వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గ ఉప ఎన్నిక బుధవారం జరుగనుంది. ఇక్కడ మొత్తం 16 మంది అభ్యర్థులు బరిలో ఉన్నప్పటికీ ప్రధాన పోటీ ప్రియాంకా గాంధీ, లెఫ్ట్ డెమొక్రాటిక్ ఫ్రంట్ (ఎల్‌డీఎఫ్)కు చెందిన సీపీఐ అభ్యర్థి సత్యన్ మొకేరీ, బీజేపీ అభ్యర్థి నవ్య హరిదాస్ మధ్యే నెలకొంది. ఎన్నికల్లో ప్రియాంకకు అనుభవం లేకపోవడం తమకు కలిసి వస్తుందని ఈ ఇద్దరూ భావిస్తున్నారు. సత్యన్ 2014లో ఇక్కడి నుంచి పోటీచేసి కాంగ్రెస్ మెజారిటీని 20 వేలకు తగ్గించారు. 2019లో 4.3 లక్షలకు పైగా మెజారిటీతో గెలిచిన రాహుల్‌కు.. 2024 ఎన్నికల్లో 3.6 లక్షల ఓట్ల ఆధిక్యం మాత్రమే వచ్చింది. 2019లో ఇక్కడ మొదటిసారి గెలిచిన రాహుల్.. నియోజకవర్గానికి అడపాదడపా మాత్రమే వస్తుండేవారు. ఆయన ప్రధాని అవుతారన్న ఉద్దేశంతోనే నియోజకవర్గ ప్రజలు మొన్నటి ఎన్నికల్లో భారీ ఆధిక్యంతో గెలిపించారని.. కానీ ఆయన ఈ సీటుకు రాజీనామా చేశారని.. రాజకీయానుభవం లేని ప్రియాంక కూడా గెలిస్తే కనిపించరని సీపీఐ, బీజేపీ అభ్యర్థులు ప్రచారం చేశారు. అయితే తాను 1989 నుంచి రాజకీయంగా క్రియాశీలంగా ఉన్నానని.. అప్పట్లో తన తండ్రి తరఫున ప్రచారం కూడా చేశానని ప్రియాంక చెప్పుకొన్నారు.

భారీ పెట్టుబడికి రిలయన్స్ సై!

(మొదటి పేజీ తరువాయి)

అవగాహనా ఒప్పందా(ఎంవోయూ)లు కుదుర్చుకున్నారు. 8 జిల్లాల్లో ఒక్కొక్కటీ రూ.130 కోట్ల విలువతో 500 సీబీజీ ప్లాంట్లను రిలయన్స్ నెలకొల్పుతుంది. వీటిని మూడేళ్లలో స్థాపించి రెండున్నర లక్షల మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తామని ఆ సంస్థ పేర్కొనడాన్ని ముఖ్యమంత్రి స్వాగతించారు. రిలయన్స్‌తో ఒప్పందం చరిత్రాత్మకమన్నారు. గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహించేందుకు క్లీన్ ఎనర్జీ-2024 పాలసీ తీసుకొచ్చామని గుర్తుచేశారు. రాష్ట్రంలో పెట్టుబడులను ప్రోత్సహించేందుకు స్పీడ్ ఆఫ్ బిజినెస్ విధానం అమలు చేస్తున్నామని.. పారిశ్రామిక సంస్థలు స్పీడ్ ఆఫ్ ఎగ్జిక్యూషన్ విధానం అమలు చేయాలని సూచించారు. ఈ విధంగా ప్రభుత్వం, పెట్టుబడిదారులు సమాంతరంగా పరుగులు తీస్తే.. ఐదేళ్లలో 20 లక్షల మందికి ఉద్యోగావకాశాలు కల్పించాలన్న తమ ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందన్నారు. 'ప్రభుత్వం పెట్టుబడుల రంగంలో తీసుకొచ్చిన నూతన విధానాలు సత్ఫలితాలిస్తున్నాయి. భారీ ప్రాజెక్టులకు ఎస్కార్ట్ అధికారులుగా ఐఏఎస్ అధికారులను నియమిస్తున్నాం. ఇప్పుడు రిలయన్స్‌తో చేసుకున్న ఒప్పందాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ట్రాన్స్‌కో జేఎండీ కీర్తి చేకూరిని ఎస్కార్ట్ ఆఫీసర్‌గా నియమించాం. రూ.65 వేల కోట్లతో సీబీజీ ప్లాంట్లు స్థాపిస్తే రాష్ట్రానికి రూ.57,650 కోట్ల ఆదాయం లభిస్తుంది. రెండున్నర లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు లభిస్తాయి. రాష్ట్రప్రభుత్వం తరఫున ఘన వ్యర్థాలను ఈ ప్లాంట్లకు ఇస్తాం. వాటి ద్వారా కూడా గ్యాస్ ఉత్పత్తి చేయండి' అని రిలయన్స్‌కు సీఎం సూచించారు. క్లీన్ ఎనర్జీ పాలసీ-2024 ద్వారా రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు.. ఏడున్నర లక్షల మందికి ఉద్యోగాల కల్పనను లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రపంచంలో అతి ఎక్కువ తలసరి ఆదాయం సంపాదించేవారు భారతీయులేనని చెప్పారు. 'ఇంటికో పారిశ్రామికవేత్త' విధానాన్ని తాము అమలు చేస్తున్నామని వెల్లడించారు.

2 వేల ప్లాంట్లలో నాలుగో వంతు మనకే: లోకేశ్

రిలయన్స్‌తో ఒప్పందంపై ఐటీ, ఎలక్ట్రానిక్స్, మానవ వనరులు, నైపుణ్యాభివృద్ధి శాఖల మంత్రి లోకేశ్ హర్షం వ్యక్తంచేశారు. తాము నిర్దేశించుకున్న 20 లక్షల ఉద్యోగాల కల్పనకు ఇది దోహదపడుతుందన్నారు. కొద్దిరోజుల కిందట ముంబైలో రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ, రిలయన్స్ క్లీన్ ఎనర్జీకి సారథ్యం వహిస్తున్న అనంత్ అంబానీతో జరిపిన చర్చల్లో వచ్చిన ప్రతిపాదనలపై ప్రభుత్వం ఇప్పుడు ఒప్పందం చేసుకున్నారు. దేశవ్యాప్తంగా 2 వేల సీబీజీ ప్లాంట్లను పెట్టాలని రిలయన్స్ లక్ష్యంగా పెట్టుకుందని.. వాటిలో నాలుగో వంతు.. అంటే 500 ప్లాంట్లను మన రాష్ట్రంలోనే ఏర్పాటు చేయాలని నిర్ణయించడం సంతోషంగా ఉందని తెలిపారు. సాధ్యమైనంత వేగంగా ఈ ప్రాజెక్టులను స్థాపించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ క్రమంలో ఎలాంటి సహకారమైనా అందించేందుకు తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఇంధన మంత్రి గొట్టిపాటి రవికుమార్, పరిశ్రమల మంత్రి టీజీ భరత్, సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ట్రాన్స్‌కో జేఎండీ కీర్తి చేకూరి, రిలయన్స్ సంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పీఎంఎస్ ప్రసాద్, రిలయన్స్ బయో ఎనర్జీ లిమిటెడ్ చీఫ్ ఆపరేటింగ్ అధికారి బషీర్ అహ్మద్ షిరాజీ, ఇంధన శాఖ సంయుక్త కార్యదర్శి కుమార్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



రిలయన్స్‌తో చేసుకున్న ఒప్పంద ప్రతులను సీఎం చంద్రబాబు సమక్షంలో ప్రదర్శిస్తున్న అధికారులు, చిత్రంలో మంత్రులు టీజీ భరత్, లోకేశ్, గొట్టిపాటి రవి, రిలయన్స్ ప్రతినిధులు

రాష్ట్రంలో పోర్టు ఆధారిత వసతులు

- కొరియా కెగ్జిమ్ సదస్సులో కార్యదర్శి సురేశ్‌కుమార్ వెల్లడి

అమరావతి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో పోర్టు ఆధారిత మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేస్తామని.. 2047 నాటికి రెండు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రం ఎదుగుతుందని రాష్ట్ర మౌలిక సదుపాయాలు శాఖ కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్ అన్నారు. మంగళవారం సియోల్‌లో ఎక్స్‌పోర్ట్ ఇంపోర్ట్ బ్యాంక్ ఆఫ్ కొరియా (కెగ్జిమ్) నిర్వహించిన 29వ ఆర్థిక అభివృద్ధి సహకార నిధి సదస్సులో ఆయన కీలకోపన్యాసం చేశారు. 2030నాటికి ప్రపంచ స్థాయి నౌకాశ్రయ రాష్ట్రంగా ఏపీ ఉంటుందని వెల్లడించారు.

ఏపీలో జపాన్ విద్యా విధానం

- టొయామా వర్సిటీతో ఒప్పందానికి అంగీకారం

పెదకాకాని, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో జపాన్ అనుసరిస్తున్న విధానాలు ప్రపంచానికే మార్గదర్శకం. అక్కడ విద్యార్థులకు చదువుతోపాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, సత్ప్రవర్తన కూడా నేర్పిస్తారు. అందుకే.. ఆంధ్రప్రదేశ్‌లోనూ జపాన్ విద్యా విధానాన్ని అమలు చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. జపాన్‌కు చెందిన టొయామా విశ్వవిద్యాలయంతో 2015లో చేసుకున్న ఒప్పందాన్ని తిరిగి తెరపైకి తెచ్చింది. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (ఏఎన్‌యూ)లో జపాన్ బృందంతో ఏపీలోని ఆరు యూనివర్సిటీల వీసీలు, అధికారులు మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా టొయామా వర్సిటీతో ఏపీలోని విశ్వవిద్యాలయాలు.. విద్య, అధ్యాపక, పరిశోధన రంగాలలో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకునేందుకు అంగీకారం లభించింది. ఏపీ ఉన్నత విద్యా మండలి చైర్మన్, పలు యూనివర్సిటీల వీసీలు తెలిపిన వివరాలను పరిశీలించిన జపాన్ బృందం సానుకూలంగా స్పందించింది. కొలాబరేటివ్ డైలాగ్ ఆన్ ఎడ్యుకేషన్ బిట్వీన్ టొయామా ప్రీఫెక్చర్ అండ్ ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై జరిగిన చర్చల్లో ఉన్నత విద్యా మండలి తాత్కాలిక చైర్మన్ కే.రామ్మోహనరావు, వీసీ కే.గంగాధరరావు, ఇంటర్నేషనల్ ఎఫైర్స్ డివిజన్ డైరెక్టర్ యూకో హోంగో మాట్లాడారు. టొయామా గవర్నర్ ఏపీ పర్యటన సందర్భంగా ఒప్పందాలు ఖరారు చేసుకుంటామని చెప్పారు.

తిరుమలలో రాజకీయ వ్యాఖ్యలు చేస్తే..
కొండ దిగేలోపు కేసు

» అన్యమతస్థులు టీటీడీలో ఉండొద్దు: భానుప్రకాశ్ రెడ్డి

అమరావతి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తిరుమల కొండపై రాజకీయ పరమైన వ్యాఖ్యలు చేస్తే కొండ దిగేలోపు కేసు పెట్టిస్తామని టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాశ్ రెడ్డి హెచ్చరించారు. స్వామి వారి సొమ్మును జీతంగా తీసుకొంటూ ఆయన ప్రసాదం కూడా ముట్టని అన్యమతస్థులు తిరుమల దేవస్థానంలో ఉండటానికి వీల్లేదని స్పష్టం చేశారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. హిందూ ఆలయాలపై దాడులు, విగ్రహాలు మాయం, పవిత్రతకు భంగం కలిగిస్తూ కోట్లాది మంది హిందువుల మనోభావాల్ని గాయపరిచిన వైసీపీ ప్రభుత్వం భూస్థాపితమైందని సంచలన వ్యాఖ్యలు చేశారు. అటువంటి ప్రభుత్వంలో మంత్రిగా పని చేసిన ఒక ఆంబోతు తిరుమలకు వచ్చి దేవుడి దర్శనం చేసుకోవాలి తప్ప అన్యమతస్థుడి ఫోటో చొక్కాపై వేసుకుని రాజకీయ వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదన్నారు. కొండపైకి వచ్చిన ఏ పార్టీ రాజకీయ నాయకుడైనా ఆలయ నియమనిబంధనలు పాటించాల్సిందేనని స్పష్టంచేశారు. 'జగన్‌కు అధికారం ఇచ్చినప్పుడు ప్యాలెస్‌లో ఉన్నారు.. అదే ప్రజలు ప్రతిపక్ష హోదా లేకుండా చేశారు. కనీసం ఎమ్మెల్యేగా అయినా సభకు రాకపోతే వచ్చే ఎన్నికల్లో అది కూడా లేకుండా ఇదే ప్రజలు చేస్తారు' అని భానుప్రకాశ్ రెడ్డి హెచ్చరించారు.

'సోషల్' పోస్టులపై కేసులు పెడతాం

» మహిళా నేతలు మానసికంగా కుంగిపోతున్నారు: పురందేశ్వరి

అమరావతి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో కొందరు దురుద్దేశపూర్వకంగా పెడుతున్న అనుచిత పోస్టులపై సైబర్ క్రైమ్ కింద కేసులు పెడతామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి హెచ్చరించారు. రాష్ట్రంలో కొందరు సైకోలు రెచ్చిపోతున్న తీరుతో మహిళా నేతలు మానసికంగా కుంగిపోతున్నారని అన్నారు. విజయవాడలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన 'వారధి' కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. పలువురు బాధితుల నుంచి వినతులు స్వీకరించి సంబంధిత శాఖలకు పంపారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ఇటీవల సిడ్నీలో జరిగిన కామన్‌వెల్త్ సమావేశంలో భారత ప్రతినిధిగా పాల్గొని.. మహిళలు ఎక్కువగా ఎదుర్కొనే సమస్యలు.. దురాచారాలు.. వేధింపులపై సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు. మహిళల్లో మానసిక స్థైర్యాన్ని నింపాల్సిన బాధ్యత ఉందని తీర్మానం చేసినట్లు వెల్లడించారు. అందులో భాగంగానే రాష్ట్రంలో మహిళలకు అండగా నిలవాలని తాము నిర్ణయించుకున్నామని అన్నారు.

మహిళలపై అసభ్య పోస్టులు సరికాదు

» సీపీఐ రామకృష్ణ

అనంతపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో మహిళలపై అసభ్యకరంగా పోస్టులు పెట్టడం సహించరానిదని, సీపీఐ దీన్ని ఖండిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తెలిపారు. అనంతపురంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అసభ్యకర పోస్టులు పెడుతున్నవారిపై పోలీసులు కఠినచర్యలు తీసుకోవాలని డీజీపీని డిమాండ్ చేశారు. చంద్రబాబు, జగన్ తలుచుకుంటే ఈ తరహా పోస్టులను కట్టడి చేయలేరా అని ఆయన ప్రశ్నించారు.

ఉన్నత విద్యామండలిలో
గోల్‌మాల్!
రెండున్నరేళ్ల క్యాష్‌బుక్‌లు మాయం

» ఏటా రూ.60కోట్ల నగదు లావాదేవీలు
» క్యాష్‌బుక్‌లు లేవన్న మాజీ కార్యదర్శి
» ఖాతాల బాధ్యత అప్పగింతలో చిక్కులు
» మండలి ఉద్యోగులకు ఆగిపోయిన జీతాలు
» వైసీపీ ప్రభుత్వంలోనే క్యాష్‌బుక్‌లకు స్వస్తి
» జేఎన్‌టీయూ-ఏ అధికారిణి చేతివాటం?
» కంప్యూటరైజ్డ్‌కు బదులు మాన్యువల్ బిల్లులు
» హోదాతో కాకుండా అధికారి పేరుతో నగదు డ్రా

అమరావతి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యామండలిలో నిధుల గోల్‌మాల్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. గత వైసీపీ ప్రభుత్వంలో మండలి కార్యదర్శిగా నియమితులైన నజీర్ అహ్మద్‌ను కూటమి ప్రభుత్వం నెల క్రితం తొలగించింది. మండలి జాయింట్ డైరెక్టర్ కృష్ణమూర్తికి పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించింది. అయితే ఆర్థిక ఖాతాల అప్పగింతలో చిక్కులు చోటు చేసుకున్నాయి. క్యాష్‌బుక్‌లు లేకుండా ఖాతాలు అప్పగిస్తామని నజీర్ అహ్మద్ చెబుతుంటే ఇన్‌చార్జ్ కార్యదర్శి అంగీకరించడం లేదు. దీంతో ఈ నెల 13వ తేదీ వచ్చినా మండలి ఉద్యోగులకు జీతాలు అందలేదు. ఇన్‌చార్జ్ చైర్మన్ నుంచి సాధారణ ఉద్యోగుల వరకు అందరికీ జీతాలు నిలిచిపోయాయి. క్యాష్‌బుక్‌లు మాయం కావడంతో మొత్తం నిధుల్లో ఎంతమేర దారిమళ్లాయోననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జగన్ ప్రభుత్వంలో ఉన్నత విద్యామండలిలో నిధులను ఇష్టారాజ్యంగా ఖర్చు చేశారు. రకరకాల ప్రాజెక్టులను తెరపైకి తీసుకొచ్చి రూ.కోట్లలో బిల్లులు చెల్లించారు. చివర్లోనూ హడావిడిగా ఎడెక్స్ అనే కంపెనీతో రూ.50 కోట్ల ఒప్పందం చేసుకున్నారు. గత ప్రభుత్వంలో మండలి చైర్మన్‌గా ఉన్న కె.హేమచంద్రారెడ్డి... జేఎన్‌టీయూ-అనంతపురం నుంచి ఓ మహిళా అధికారిని తీసుకొచ్చి ఆర్థిక ఖాతాలు ఆమె చేతిలో పెట్టారు. అప్పటినుంచి క్యాష్‌బుక్‌లు రాసే సంస్కృతికి మంగళం పాడారు. నిబంధనల ప్రకారం మండలికి ఎంత ఆదాయం వచ్చింది? ఎంత ఖర్చు చేశారు? ఎంత నిల్వ ఉంది? అనే లెక్కలు క్యాష్‌బుక్‌లో రాయాలి. ప్రతి ఖర్చు అనంతరం ఎంత బ్యాలెన్స్ ఉందో పేర్కొనాలి. గత రెండున్నరేళ్లుగా మండలిలో క్యాష్‌బుక్‌లు లేకుండానే రూ.కోట్లు ఖర్చు చేశారు.

దేనికీ లెక్కల్లేవు

మండలిలో ప్రధానంగా మూడు రకాల ఖాతాలు ఉంటాయి. ఈఏపీసెట్, ఈసెట్, ఎడ్‌సెట్ లాంటి సెట్ల నిర్వహణ, మండలి ఖర్చుల నిర్వహణ, కాలేజీల నుంచి వచ్చే ఫీజుల నిర్వహణకు వేర్వేరుగా ఖాతాలు నిర్వహిస్తారు. ప్రతి సెట్‌కు ఒక ప్రత్యేక ఖాతా ఉంటుంది. ఇలా దాదాపు 50 రకాల బ్యాంకు ఖాతాలు ఉంటాయి. గతంలో ప్రతి ఖాతాకు క్యాష్‌బుక్‌లు నిర్వహించేవారు. రెండున్నరేళ్లుగా క్యాష్‌బుక్‌లు లేకపోవడంతో ఫీజుల ద్వారా వచ్చింది ఎంత? ఖర్చు చేసింది ఎంత? అనేదానిపై స్పష్టమైన లెక్కలు లేవు. ఉన్నత విద్యామండలిలో ఏటా సుమారు రూ.60 కోట్ల నగదు లావాదేవీలు జరుగుతాయి. గత రెండున్నరేళ్లుగా వీటికి లెక్కలు లేకపోవడంతో దాదాపు రూ.150 కోట్ల మేర నిధులు దుర్వినియోగమయ్యాయనే అనుమానాలు తలెత్తుతున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో ఉన్నత విద్యామండలిలో ఎక్కువమంది అనంతపురానికి చెందిన అధికారులు పనిచేశారు. అప్పటి చైర్మన్ హేమచంద్రారెడ్డి జేఎన్‌టీయూ-అనంతపురం ప్రొఫెసర్ కావడమే దీనికి కారణం. అయితే అక్కడినుంచి ఉన్నత విద్యామండలికి డెప్యుటేషన్‌పై వచ్చిన మహిళా అధికారి కంప్యూటరైజ్డ్ బిల్లుల విధానం కాదని మాన్యువల్ బిల్లులు రాశారు. ఆ బిల్లు పుస్తకాలు కూడా అనంతపురంలో తయారుచేసి ఇక్కడికి తీసుకొచ్చారు. మండలి నిర్వహణ ఖర్చుల పేరుతో ఎడాపెడా బిల్లులు రాసి నగదు విత్‌డ్రా చేశారు. పైగా మండలి కార్యదర్శి హోదాతో నగదు డ్రా కావాల్సి ఉంటే, అందుకు బదులుగా ఆ సీట్లో కూర్చున్న అధికారి పేరుతో తీసుకున్నారు. ఇప్పుడు క్యాష్‌బుక్‌లు లేకుండానే లెక్కలు అప్పగిస్తామని మాజీ కార్యదర్శి అంటున్నారు. క్యాష్‌బుక్‌లు లేకుండా బాధ్యతలు తీసుకుంటే, అందులో నిధుల దుర్వినియోగం జరిగి ఉంటే ఎవరు బాధ్యత వహిస్తారని కొత్త కార్యదర్శి ప్రశ్నిస్తున్నారు.

గ్రామీణ-పట్టణ ప్రాంతాల అంతరం తగ్గించేందుకు కృషి

» యువతకు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య పిలుపు
» ఘనంగా వీఐటీ నాలుగు దశాబ్దాల వేడుకలు


వీఐటీలో వేడుకలను ప్రారంభిస్తున్న వెంకయ్యనాయుడు

వేలూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ-పట్టణ ప్రాంతాల మధ్య అంతరాన్ని తగ్గించేందుకు యువత కృషి చేయాల్సిన అవసరం ఉందని, ఈ దిశగా యువతను సన్నద్ధం చేయాల్సిన బాధ్యతను విశ్వవిద్యాలయాలు తీసుకోవాలని భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. విద్యతో పాటు విలువలను విద్యార్థులకు అందజేయాలన్న ఆయన.. సమాజంలో నేటికీ అక్కడక్కడ కనిపిస్తున్న వివక్ష, నిరక్షరాస్యత, అవినీతి వంటి సామాజిక సమస్యల పరిష్కారానికి యువత కృషి చేయాలని సూచించారు. మంగళవారం తమిళనాడు రాష్ట్రం వేలూరులోని 'వేలూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ' (వీఐటీ) నాలుగు దశాబ్దాల వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన వెంకయ్యనాయుడు పలువురు విద్యార్థులకు పురస్కారాలను అందజేశారు. అదేవిధంగా వీఐటీ ప్రాంగణంలో నిర్మించిన ఆర్‌జీ టవర్, సరోజిని నాయుడు బ్లాక్‌లను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యతో పాటు ఆరోగ్య సేవలను ఉచితంగా అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలు తీసుకోవాలని, వాటితో పాటు వ్యవసాయ రంగంలో మౌలిక వసతుల కల్పన, రైతులకు ప్రోత్సాహాన్ని అందించే మార్గాల మీద దృష్టి పెట్టాలని సూచించారు. అయితే ప్రతిదానికీ ప్రభుత్వంపై ఆధారపడే పరిస్థితి మంచిది కాదని చెబుతూ.. ప్రతి రంగంలోనూ ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించగలమని పేర్కొన్నారు. 40 ఏళ్ల క్రితం ఓ కళాశాలగా ప్రారంభమైన వీఐటీ విశ్వవిద్యాలయం అందుకు నిదర్శనంగా నిలుస్తుందని, ఈ స్ఫూర్తిని భవిష్యత్తు తరాలు అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వీఐటీ ఛాన్స్‌లర్ డాక్టర్ జి.విశ్వనాథన్‌తో పాటు తమిళనాడు జలవనరులశాఖ మంత్రి దురైమురుగన్, వీఐటీ ఉపాధ్యక్షులు శంకర్ విశ్వనాథన్, డాక్టర్ శేఖర్ విశ్వనాథన్, డాక్టర్ జీవీ సెల్వం, ఈడీ డాక్టర్ సంధ్య పి, అసిస్టెంట్ వైస్‌ప్రెసిడెంట్ కాదంబరి ఎస్. విశ్వనాథన్ తదితరులు పాల్గొన్నారు.

చిరుద్యోగుల్ని బలి చేశారు!

» రోజా, ధనుంజయరెడ్డి మనుషుల కోసమే ఇదంతా..
» భూమి కౌలుకిస్తే అమ్మేసుకున్నారు
» టీడీపీ గ్రీవెన్స్‌లో బావురుమన్న బాధితులు

అమరావతి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో మంత్రి రోజా, సీఎం పేషీలో పని చేసిన ధనుంజయరెడ్డి తాలూకు మనుషులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు.. భవానీ ఐలాండ్‌లో పనిచేసే తమపై దొంగలుగా ముద్ర వేసి, ఉద్యోగాల నుంచి అన్యాయంగా తొలగించారని పలువురు చిరుద్యోగులు వాపోయారు. తప్పు చేసిన అధికారులను రక్షించేందుకు తమను బలి చేశారని పేర్కొన్నారు. ఉద్యోగం పోయిన బాధలో పరిచర్ల రవీంద్ర అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని, మనస్తాపంతో ఆరోగ్యం క్షీణించి, కత్తిరాశెట్టి రవిబాబు మరణించాడని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు మళ్లీ ఉద్యోగ అవకాశాలు కల్పించి, న్యాయం చేయాలని బాధితులు మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజావేదికలో వేడుకున్నారు. గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాలరావు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. భూమి కౌలుకిస్తే.. తమకు తెలియకుండా అమ్మేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మచిలీపట్నానికి చెందిన యక్కల లక్ష్మీకుమారి కోరారు. వాగు భూమిని ఆక్రమించి, పాసుపుస్తకం తెచ్చుకున్న వ్యక్తి, రైతులకు దారి లేకుండా ఇబ్బంది పెడుతున్నారని, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఏలూరు జిల్లా అడవి నెక్కలం రైతులు ఫిర్యాదు చేశారు. ఆశ్రమం తరపున నిత్యాన్నదానం చేస్తున్న స్థలాన్ని ఆక్రమించి, తమపై దౌర్జన్యం చేస్తున్నారని అనంతపురం కాశినాయన సేవా సమితి సభ్యుడు నాగేంద్ర ఫిర్యాదు చేశారు.

'వెలిగొండ'ను త్వరగా పూర్తిచేయాలి

» ముఖ్యమంత్రికి బీవీ రాఘవులు విజ్ఞప్తి

పెద్దదోర్నాల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ముప్పై ఏళ్లుగా కొనసాగుతున్న వెలిగొండ ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక శ్రద్ధ చూపి త్వరితగతిన పూర్తి చేయాలని సీపీఎం కేంద్ర పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు కోరారు. పెద్దదోర్నాల మండలం కొత్తూరు వద్ద నిర్మాణంలో ఉన్న పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టును ఆయన సీపీఎం నాయకులతో కలిసి మంగళవారం సందర్శించారు. కీలకమైన రెండు సొరంగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ ఫ్లోరైడ్ రహిత తాగునీటిని పశ్చిమప్రకాశానికి అందించి, లక్షల ఎకరాలను సస్యశ్యామలం చేసే బృహత్తర సాగునీటి ప్రాజెక్టు వెలిగొండ అన్నారు. అలాంటి ప్రాజెక్టును పూర్తి చేయడంపై ప్రభుత్వాలు మీనమేషాలు లెక్కిస్తున్నాయని విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వం ప్రాజెక్టు పూర్తి కాకుండానే జాతికి అంకితమంటూ ప్రజలను మభ్యపెట్టిందన్నారు. బడ్జెట్‌లో కేవలం రూ.394 కోట్లు కేటాయించడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు.


వెలిగొండ మొదటి సొరంగాన్ని పరిశీలిస్తున్న రాఘవులు

సీఎంకు లంకా దినకర్ కృతజ్ఞతలు

అమరావతి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ ప్రకాశం ప్రజల సాగు, తాగు నీటి కోసం బడ్జెట్‌లో వెలిగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయించిన సీఎం చంద్రబాబుకు ఇరవై సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్ కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.

బాలికపై సర్పంచ్ అత్యాచార యత్నం

» నిందితుడు వైసీపీ సానుభూతిపరుడు

కోసిగి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామ సర్పంచ్ అంటే.. గ్రామానికి ప్రథమ పౌరుడు. గ్రామంలో అభివృద్ధితో పాటు అందరికీ అండగా ఉంటాడని ప్రజలు సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. కానీ ఆదర్శంగా ఉండాల్సిన ఆ సర్పంచ్ 8వ తరగతి చదువుతున్న 13 ఏళ్ల బాలికపై అత్యాచారానికి యత్నించిన సంఘటన కర్నూలు జిల్లా కోసిగి మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. సర్పంచ్ మరో ఇద్దరు వైసీపీ నాయకులతో కలిసి ఈ దారుణానికి యత్నించాడు. బాధితురాలి తండ్రి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కోసిగి మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన దంపతులు తమ కుమారుడితో కలిసి కర్ణాటక రాష్ట్రంలో పత్తి పనుల కోసం వలస వెళ్లారు. స్థానిక పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కుమార్తెను తాతయ్య వద్ద వదిలి వెళ్లారు. అదే గ్రామానికి చెందిన వైసీపీ సానుభూతిపరుడు, గ్రామ సర్పంచ్ హనేనీ.. వైసీపీ నాయకులు తోవి వినోద్, మజ్జిగ నూరి సహకారంతో బాలికపై అత్యాచారానికి యత్నించాడు. గత నెల 30న తాతతో కలిసి బాలిక ఇంటి బయటే నిద్రిస్తుండగా రాత్రి 11 గంటల సమయంలో హనేనీ ఆమె నోరు మూసి ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించాడు. అలికిడికి పక్కనే పడుకున్న తాత లేచి మనుమరాలిపై అఘాయిత్యానికి యత్నిస్తున్న హనేనీని పట్టుకునేందుకు ప్రయత్నించాడు. దీంతో సర్పంచ్‌తో పాటు వినోద్, నూరి అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటనపై బాధితురాలి కుటుంబ సభ్యులు శనివారం కోసిగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మంజునాథ్, ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు. నిందితులు పది రోజులుగా పరారీలో ఉన్నారు.

జనం నమ్మకాన్ని జగన్ వమ్ము చేశారు: ఆనం

అమరావతి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వైసీపీకి ఓట్లేసిన 1.31 కోట్ల మంది ప్రజల నమ్మకాన్ని జగన్ వమ్ము చేశారని టీడీపీ అధికార ప్రతినిధి ఆనం వెంకట రమణారెడ్డి విమర్శించారు. మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వెళ్లకపోవడం.. వారికి ఓటేసిన ప్రజల్ని మోసం చేయడమే. వైసీపీకి జనం 11 సీట్లే ఇస్తే.. జగన్‌కు ప్రతిపక్ష హోదా ఎందుకివ్వాలి? సాధారణ ఎమ్మెల్యే అయిన జగన్ ఏ అర్హత ఉందని ప్రతిపక్ష హోదా అడుగుతున్నారో చెప్పాలి. అసెంబ్లీకే రానప్పుడు ఎమ్మెల్యేలుగా జీతభత్యాలు, గన్‌మేన్లు, ఇతర ప్రభుత్వ సదుపాయాలు వద్దని స్పీకర్‌కు లేఖ రాసి, జగన్, వైసీపీ ఎమ్మెల్యేలు తమ నిజాయితీని నిరూపించుకోవాలి. రాజకీయాల్లో ఎన్నికల సమయంలోనే ప్రత్యర్థులుగా పోరాడాలని, ఆ తర్వాత ప్రజల కోసం పని చేయాలనే జ్ఞానం జగన్‌కు లేదు. ఆయన మానసిక స్థితి బాలేదు. ఎక్స్‌లో, ప్రెస్‌మీట్లలో వింతగా ప్రవర్తిస్తున్నారు. ప్రభుత్వమే వైద్య ఖర్చులు భరించి, లండన్‌లోని మెంటల్ ఆసుపత్రిలో చూపించాలని సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేస్తున్నా. జగన్ మానసిక స్థితి బాగుపడేవరకు భారతీరెడ్డిని పార్టీ అధ్యక్షురాలిని చేయాలని వైసీపీ నేతలకు సూచిస్తున్నా' అని ఆనం వెంకట రమణారెడ్డి అన్నారు.

అమరావతిని నాశనం చేశారు: నీలాయపాలెం

వైసీపీ పాలన అంతా రాష్ట్రం అప్పుల కుప్పగానే ఉందని టీడీపీ అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్‌కుమార్ విమర్శించారు. మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, ' చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రం ఆదాయం, సంపద సృష్టి దిశగా అడుగులేస్తుంటే.. వైసీపీ నేతలకు మింగుడు పడటం లేదు. అప్పులు, తప్పులు చేయడం తప్ప... జగన్‌రెడ్డి, బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి సంపద సృష్టించడం తెలియదు. సంపద సృష్టించే అమరావతిని నాశనం చేశారు. మూడు రాజధానులంటూ రాష్ట్రాన్ని మూడు ముక్కలు చేయాలని చూశారు. వైసీపీ దుర్మార్గమైన విధానాలను ప్రజలు ఛీ కొట్టినా సిగ్గులేకుండా ఆపార్టీ నేతలు పిచ్చి ప్రేలాపనలు పేలుతున్నారు' అని మండిపడ్డారు.

మేరుగుపై దర్యాప్తు కొనసాగిస్తారా? లేదా?

» తప్పుడు ఫిర్యాదు చేశానని బాధిత మహిళే చెప్పారు కదా..
» పూర్తి వివరాలు రాతపూర్వకంగా హైకోర్టు ముందు ఉంచండి
» పిటిషనర్లపై ఈ నెల 27 వరకు తొందరపాటు చర్యలు వద్దు
» పోలీసులకు హైకోర్టు ఆదేశం.. విచారణ నవంబరు 28కి వాయిదా

అమరావతి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): తప్పుడు ఫిర్యాదు చేశానంటూ బాధిత మహిళ ప్రమాణ పూర్వక అఫిడవిట్ దాఖలు చేసిన నేపథ్యంలో వైసీపీ నేత, మాజీ మంత్రి మేరుగు నాగార్జునపై నమోదైన అత్యాచారం కేసులో దర్యాప్తును కొనసాగిస్తారా? లేదా? అని ప్రాసిక్యూషన్‌ను హైకోర్టు ప్రశ్నించింది. వివరాలను రాతపూర్వకంగా కోర్టు ముందు ఉంచాలని, పిటిషనర్లపై ఈ నెల 27వరకు ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 28కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అంతకుముందు కోర్టుకు హాజరైన బాధిత మహిళతో న్యాయమూర్తి నేరుగా మాట్లాడారు. ప్రమాణ పత్రం తానే దాఖలు చేశానని ఫిర్యాదుదారైన ఆ మహిళ సమాధానం ఇచ్చారు. మేరుగు నాగార్జున, మురళీమోహన్‌రెడ్డి తనపై అత్యాచారానికి పాల్పడలేదని, రాజకీయ ఒత్తిడి వల్లే తప్పుడు కేసు పెట్టానని చెప్పారు. వారిపై పోలీసులు నమోదు చేసిన కేసు కొట్టివేయాలని అభ్యర్థించారు. ఉద్యోగం, కాంట్రాక్ట్ పనులు ఇప్పిస్తామని ఆశచూపి తన వద్ద నుంచి డబ్బులు తీసుకోవడమే కాకుండా శారీరకంగా వాడుకున్నారని ఆరోపిస్తూ విజయవాడకు చెందిన మహిళ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా గుంటూరు జిల్లా, తాడేపల్లి పోలీసులు మేరుగు నాగార్జున, మురళీమోహన్‌రెడ్డిలపై కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ వారు ఇరువురు హైకోర్టును ఆశ్రయించారు. ఆ వ్యాజ్యం మంగళవారం విచారణకు రాగా పిటిషనర్ల తరఫున న్యాయవాది దుష్యంత్‌రెడ్డి వాదనలు వినిపించారు. తప్పుడు కేసు పెట్టానని ఫిర్యాదుదారే చెబుతున్నందున కేసు కొట్టివేయాలని కోరారు. పిటిషనర్లను పోలీసులు అరెస్ట్ చేయకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని అభ్యర్థించారు. ఫిర్యాదుదారు మహిళ తరఫు న్యాయవాది నాగార్జునరెడ్డి స్పందిస్తూ.. కేసు ఎందుకు పెట్టాల్సి వచ్చిందో సవివరంగా అఫిడవిట్ దాఖలు చేసేందుకు అనుమతించాలని అభ్యర్థించారు. సహాయ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాయి రోహిత్ స్పందిస్తూ.. బాధిత మహిళ ఎలాంటి కాంప్రమైజ్ పిటిషన్ వేయలేదని, కేవలం మెమో మాత్రమే దాఖలు చేశారన్నారు. వాదనలన్నీ విన్న న్యాయమూర్తి.. తప్పుడు కేసు పెట్టేందుకు కారణమైన వారు ఎవరో కూడా తేల్చాల్సిన అవసరం కూడా ఉంది కదా అని వ్యాఖ్యానించారు.

వైసీపీకి రాజీవ్‌కృష్ణ గుడ్‌బై

» త్వరలో టీడీపీలోకి.. ఇప్పటికే లోకేశ్‌తో మంతనాలు


రాజీవ్‌కృష్ణ

రాజమహేంద్రవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో ఘోర పరాజయం నుంచి కోలుకోలేకుండా వైసీపీకి దెబ్బమీద దెబ్బ తగులుతోంది. తాజాగా తూర్పుగోదావరి జిల్లాలో ఆ పార్టీ షాక్ తగిలింది. ప్రముఖ పారిశ్రామికవేత్త, కీలకనేత ఎస్.రాజీవ్ కృష్ణ వైసీపీకి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన పార్టీ అధ్యక్షుడు జగన్‌కు లేఖ రాశారు. త్వరలో రాజీవ్‌కృష్ణ తెలుగుదేశం పార్టీలో చేరనున్నారు. ఈ మేరకు ఆయన ఇప్పటికే మంత్రి లోకేశ్‌తో మంతనాలు జరిపారు.

మూడు అసెంబ్లీ స్థానాల్లో ప్రభావం

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరు నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి, ఒకప్పుడు టీడీపీలో కీలకంగా వ్యవహరించిన ప్రముఖ పారిశ్రామికవేత్త పెండ్యాల కృష్ణబాబు అల్లుడు రాజీవ్‌కృష్ణ. ఆయన 2012లో వైసీపీలో చేరాక ఆయన వారసుడిగా రాజకీయాల్లోకి వచ్చిన రాజీవ్ కృష్ణ.. 2014లో నిడదవోలు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. తర్వాత కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గాల పరిధిలో ఆ పార్టీకి వెన్నుదన్నుగా నిలబడ్డారు. వైసీపీ హయాంలో ప్రభుత్వ సలహాదారుగా, అధికార ప్రతినిధిగా వ్యవహరించారు. కమ్మ సామాజికవర్గం పట్ల వైసీపీ వైఖరిపై నేరుగా జగన్‌కు ఆయన లేఖ రాసి నిరసన తెలిపారు. రాజీవ్ కృష్ణ కొంతకాలంగా పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉంటున్నారు.

తిరుపతి విమానాశ్రయంలో ప్రయాణికుల ఆందోళన

రేణిగుంట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): తిరుపతి విమానాశ్రయంలో ప్రయాణికులు ఆందోళనకు దిగారు. ఉదయం 8.15 గంటలకు హైదరాబాద్ వెళ్లాల్సిన ఎయిర్ అలయన్స్ విమానాన్ని సాంకేతిక కారణాలతో సోమవారం హైదరాబాద్‌లోనే రద్దు చేశారు. ప్రయాణికులకు సమాచారం ఇవ్వడంతో కొంతమంది నగదు వెనక్కు తీసుకోగా 40మంది మంగళవారం వెళ్లేందుకు సిద్ధమయ్యారు. విమానాశ్రయానికి చేరుకున్న వారికి సాంకేతిక కారణాలతో విమానం రద్దయినట్లు సిబ్బంది చెప్పడంతో ఆగ్రహం వ్యక్తంచేశారు.

పరువునష్టం కేసులో జగన్‌కు ఊరట

» వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు.. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

అమరావతి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారాయణ వేసిన పరువునష్టం కేసులో వ్యక్తిగత హాజరు నుంచి మాజీ సీఎం వైఎస్ జగన్‌కు హైకోర్టు మినహాయింపు ఇచ్చింది. విజయవాడ ఎంపీ,ఎమ్మెల్యేల ప్రత్యేక కోర్టుకు ఆయన తరఫున న్యాయవాది హాజరయ్యేందుకు వెసులుబాటు ఇచ్చింది. ఈ ఉత్తర్వులు ప్రస్తుత పిటిషన్ పై నిర్ణయం వెల్లడించేవరకు అమల్లో ఉంటాయని పేర్కొంది. పిటిషన్‌పై తదుపరి విచారణను డిసెంబరు 20కు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ మంగళవారం మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు. రాజధాని భూముల వ్యవహారంలో తన పరువుకు భంగం కలిగించేలా జగన్ తన పత్రికలో వార్త ప్రచురించారని పేర్కొంటూ 2018లో నారాయణ ప్రత్యేక కోర్టులో పరువునష్టం కేసువేశారు. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ జగన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రత్యేక కోర్టులో తదుపరి చర్యలు అన్నింటినీ నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని అభ్యర్థించారు. ఈ వ్యాజ్యం మంగళవారం హైకోర్టులో విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది శ్రీరామ్ వాదనలు వినిపించారు. "పిటిషనర్‌కు సాక్షి పత్రికతో సంబంధం లేదు. ఆ పత్రికలో వచ్చిన కథనానికి బాధ్యుడిని చేస్తూ జగన్ పై పరువు నష్టం కేసు వేశారు. పత్రికలో ప్రచురించే కథనాలను జగన్ ఎంపిక చేస్తారని ఆరోపించారు. పరువు నష్టం కేసును కొట్టివేయాలని కోరుతూ ఆ పత్రిక ఎడిటర్ ఇప్పటికే కోర్టులో పిటిషన్ వేశారు. గత ఆరేళ్లుగా పిటిషన్ విచారణలో ఎలాంటి పురోగతి లేదు. ఈ నెల 15న పిటిషనర్ కోర్టు ముందు హాజరుకావాల్సి ఉంది. పిటిషనర్ తరఫున ఆయన న్యాయవాది హాజరయ్యేందుకు వెసులుబాటు ఇవ్వండి." అని వాదించారు. న్యాయవాది రాహుల్ చౌదరి స్పందిస్తూ...మంత్రి నారాయణ తరఫున న్యాయవాది గింజుపల్లి సుబ్బారావు వకాల్తా వేశారన్నారు. కేసులో కౌంటర్ వేసేందుకు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు.

ఏపీపీఎస్సీలో గ్రూపుల పునర్వర్గీకరణ!

అమరావతి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ ఉద్యోగ నోటిఫికేషన్ల వర్గీకరణను సమూలంగా ప్రక్షాళన చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం ఉన్న గ్రూప్-1, గ్రూప్-2, ఇతర నోటిఫికేషన్ల గ్రూపులను కొత్తగా వర్గీకరించనుంది. ఇందుకోసం అధ్యయనానికి ఉన్నత స్థాయి కమిటీని నియమిస్తూ సాధారణ పరిపాలన శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ కమిటీకి చైర్మన్‌గా వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ బి.రాజశేఖర్‌ను నియమించింది. అధ్యయన నివేదికను ఈనెల 30వ తేదీలోగా ప్రభుత్వానికి సమర్పించాలని ఆదేశించింది.

గ్రూప్-2 మెయిన్స్ ఫిబ్రవరి 23కు వాయిదా

అభ్యర్థుల అభ్యర్థన మేరకు గ్రూప్-2 మెయిన్స్ పరీక్షను ఏపీపీఎస్సీ వాయిదా వేసింది. ఇటీవల ప్రకటించిన షెడ్యూలు ప్రకారం జనవరి 5న మెయిన్స్ పరీక్ష జరగాలి. అయితే, మెయిన్స్ పరీక్షపై నెలకొన్న అనిశ్చితి కారణంగా పరీక్షకు సన్నద్ధం కాలేకపోయామని, అలాగే ఇతర పోటీ పరీక్షలూ ఉన్నాయని, మెయిన్స్‌ను వాయిదా వేయాలని అభ్యర్థులు ఏపీపీఎస్సీని కోరారు. వారి అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకున్న ఏపీపీఎస్సీ ఫిబ్రవరి 23న గ్రూప్-2 మెయిన్స్ నిర్వహించనున్నట్లు మంగళవారం తెలిపింది.

దక్షిణ కోస్తా, రాయలసీమకు వర్షసూచన

అమరావతి, విశాఖపట్నం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలోని అల్పపీడనం ఉత్తర తమిళనాడు, దక్షిణ కోస్తా తీరాల వెంట కేంద్రీకృతమైందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. దీని ప్రభావంతో బుధ, గురువారాల్లో కోస్తాంధ్ర, రాయలసీమలో అక్కడక్కడా భారీ వర్షాలు, మిగిలిన చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. వర్షాల నేపథ్యంలో వరి కోతలు, ఇతర వ్యవసాయ పనుల్లో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరింది. మంగళవారం రాత్రికి నెల్లూరు జిల్లా దగదర్తిలో 90.75, చెమడాలలో 75.5, మునులపూడిలో 74 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. బుధవారం బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. దక్షిణ కోస్తా తీరంలో బలమైన గాలులు వీస్తున్నందున మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని వాతావరణ శాఖ హెచ్చరించింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

వెలుగు నీడలు

భారత 50వ ప్రధాన న్యాయమూర్తిగా పదవీ విరమణ చేసిన ధనంజయ యశ్వంత్ చంద్రచూడ్ 41 సంవత్సరాల వయస్సు లోపే హైకోర్టు జడ్జి అయిన ప్రతిభామూర్తి. 2016లో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొంది, నవంబర్ 2022లో భారత ప్రధాన న్యాయమూర్తి అయ్యారు. ఇటీవలి దశాబ్దాలలో రెండేళ్ల పదవీకాలం పొందిన ప్రధాన న్యాయమూర్తులలో ఆయనే మొదటివారు. జడ్జిగా, చీఫ్ జస్టిస్‌గా ఉన్న ఎనిమిదేళ్ల కాలంలో ఆయన 1200కు పైగా ధర్మాసనాలలో సభ్యుడు. దాదాపు 600 తీర్పులను స్వయంగా రాశారు. తొలినాటి తీర్పులలో పౌరుల వైయక్తిక హక్కులకు ఆయన ఇచ్చిన ప్రాధాన్యం, బహిరంగ వేదికలపై వెలువరించిన ఉపన్యాసాలు ఆయనకు 'ఉదారవాద ధర్మ యోధుడు'గా పేరు ప్రతిష్ఠలు సమకూర్చాయి. సీజేఐగా, కార్యనిర్వాహక వర్గం నుంచి పూర్తి స్వతంత్రతతో సుప్రీంకోర్టు వ్యవహరించేలా చేయగలరని అందరూ ఆశించారు. అయితే పదవీ విరమణ నాటికి జస్టిస్ చంద్రచూడ్ 'కొత్త మితవాద ఉదారవాది' అనే అప్రతిష్ఠను మూటగట్టుకున్నారు. ముఖ్యంగా అయోధ్య వివాదం, అధికరణ 370 రద్దు కేసులలో ఆయన తీర్పులు విస్తృతామోదం పొందలేక పోయాయి. న్యాయకోవిదులు, ప్రజానీకం చంద్రచూడ్ న్యాయపాలన పట్ల అసంతృప్తికి లోనయ్యారు.

న్యాయవిహిత నిర్ణయాలు తీసుకోకపోవడం కాదు, తీసుకునేందుకు పూనుకోకపోవడమే విషాదం. ఎన్నికల సంఘంలాంటి రాజ్యాంగ సంస్థల స్వతంత్ర ప్రతిపత్తిని పునరుద్ధరించేందుకు, కొన్ని రాష్ట్ర ప్రభుత్వాల బుల్‌డోజర్ దురాగతాలను నిరోధించేందుకు, పౌరులపై చట్ట విరుద్ధ నిఘా నిలిపివేసేందుకు, జమ్మూకశ్మీర్‌కు మళ్లీ రాష్ట్ర ప్రతిపత్తిని కల్పించేందుకు, మహారాష్ట్రలో ప్రజాస్వామ్య విరుద్ధంగా కూల్చివేసిన ప్రభుత్వానికి చట్టబద్ధత పునరుద్ధరించేందుకు, ఎన్నికల ప్రక్రియలో ప్రజల విశ్వసనీయతను పెంపొందించేందుకు జస్టిస్ చంద్రచూడ్ సకాలంలో సరైన నిర్ణయాలు తీసుకోలేదని చెప్పక తప్పదు. ఆయన న్యాయ పర్యవేక్షణలో వేలాది సామాజిక కార్యకర్తలు, పాత్రికేయులు, ప్రభుత్వ విధానాలపై భిన్నాభిప్రాయాలు కలవారు విచారణ లేకుండా, కనీసం బెయిల్ పొందే వెసులుబాటు కూడా లేకుండా జైళ్లలో మగ్గిపోతున్నారు. ఎనభై ఏళ్లు పైబడిన స్టాన్‌స్వామి మరణం, 90 శాతం అవిటితనంతో బాధపడుతున్న ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా మృతి జైళ్లలో ఖైదీలు ఎటువంటి అమానుష పరిస్థితులలో కునారిల్లిపోతున్నారో విశదం చేస్తున్నాయి. జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం 370 అధికరణను ప్రభుత్వం రద్దు చేయడాన్ని సమర్థించింది. కశ్మీర్‌కు రాష్ట్ర ప్రతిపత్తిని తొలగించడాన్ని ఆక్షేపించనప్పటికీ దాని పునరుద్ధరణకు ధర్మాసనం ఆదేశించలేదు కనుకనే ఈ కేసులో న్యాయమూర్తులు న్యాయానికి విఘాతం కలిగించారని దుష్యంత్ దవే వంటివారు గట్టిగా అభిప్రాయపడ్డారు. కశ్మీర్ ప్రత్యేకప్రతిపత్తిని రద్దుచేస్తామని 2014లో బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని ఆ పార్టీ ప్రభుత్వం అమలుపరిచేందుకు చంద్రచూడ్ ఇతర న్యాయమూర్తులు సహకరించారన్నది విమర్శకుల అభిప్రాయం. ఇక అయోధ్యకేసులో తీర్పు వెలువరించిన ధర్మాసనంలో (అప్పటికింకా ఆయన సీజేఐ కాలేదు) చంద్రచూడ్ సభ్యుడు. ఆ తీర్పును ఆయనే రాశారన్నది ఒక బహిరంగ రహస్యం. ఆ తీర్పు ఒక వైరుధ్యాల పుట్ట అని దవే విమర్శించారు. చట్టాలు, న్యాయసూత్రాల ప్రాతిపదికన కాకుండా అధికసంఖ్యాక వర్గ ప్రజల మతపరమైన భావోద్వేగాలను పరిగణనలోకి తీసుకుని న్యాయనిర్ణయం జరిగిందన్నది ఆరోపణ. దీనికితోడు, ఈ తీర్పుకు సంబంధించి ఇటీవల చంద్రచూడ్ చేసిన ఒక వ్యాఖ్య ఆయన ప్రతిష్ఠను మరింత మసకబార్చింది. రామజన్మభూమి కేసు విచారణ సందర్భంలో తాను దేవుణ్ణి ప్రార్థించానని, ఆ ప్రార్థన ఫలితంగానే ఆ కేసుకు ఒక పరిష్కారం లభించిందని ఆయన అన్నారు. రాజ్యాంగం కంటే కానరాని ఒక అమూర్తమూర్తికి ప్రాధాన్యమివ్వడమేమిటని ఆ వ్యాఖ్యపై విమర్శలు వెల్లువెత్తాయి ఈ ఏడాది వినాయక చవితి పండుగ సందర్భంగా తన నివాసానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆహ్వానించడం కూడా చంద్రచూడ్ న్యాయనిబద్ధతను ప్రశ్నార్థకం చేసింది. హిందువుగా గుర్తింపు పొందేందుకు ఆయన బాహాటంగా చేస్తున్న ప్రయత్నాలను రాజ్యాంగ విలువలను సంరక్షించుకునేందుకు ఆరాటపడుతున్నవారు హర్షించలేకపోతున్నారు. 'న్యాయ వ్యవస్థ అధికారం కేసులను పరిష్కరించడంలో గానీ, శిక్షలు విధించడంలో గానీ, కోర్టు ధిక్కారానికి పాల్పడిన వారిని దండించే పద్ధతిలో గానీ లేదు; న్యాయ నిర్ణయాలు, న్యాయపాలనలో సగటు మనిషి నమ్మకం, విశ్వాసం, భరోసాలో ఉందన్నది అమెరికా నాల్గవ ప్రధాన న్యాయమూర్తి జాన్ మార్షల్ అభిప్రాయం. ఆ ప్రకారంగా సీజేఐ చంద్రచూడ్ తన విధ్యుక్త ధర్మనిర్వహణలో విఫలమయ్యారని ఆరోపణ.

ఏ న్యాయమూర్తీ పరిపూర్ణ ధర్మమూర్తి కాడు, కాలేడు. చంద్రచూడ్ సైతం ఇందుకు మినహాయింపు కాదు. న్యాయపాలనలో ఆయన చేపట్టిన కొన్ని మంచి చర్యలనూ ప్రస్తావించవలసిందే. న్యాయవ్యవస్థలో ఈ-న్యాయస్థానాల పద్ధతిని సమర్థంగా నిర్వహించడం, విస్తరింప చేయడం ద్వారా స్వాతంత్ర్యానంతర భారత న్యాయవ్యవస్థలో ఆయన ఒక విప్లవాన్ని తీసుకువచ్చారు. న్యాయమూర్తిగా ఆయన నెలకొల్పిన ప్రమాణాలు ఎప్పటికీ గుర్తుంచుకోదగ్గవి. ఆయన తీర్పులు నిశిత విశ్లేషణలతో తర్కబద్ధంగా సరళరీతిలో సామాన్య విద్యావంతులు సైతం చదవగలిగేవిగా ఉంటాయి. న్యాయవాదనలు విశ్లేషణాత్మక మేధకు ప్రతిబింబాలు. సరళ, సుందర, శక్తిమంతమైన భాషలో తీర్పులు రాయడంలో జస్టిస్ కృష్ణ అయ్యర్‌తో చంద్రచూడ్‌ను పోల్చుతారు. మౌలిక చింతకుడు అయిన చంద్రచూడ్ భారత న్యాయవ్యవస్థ పునాదులను మార్చివేసేందుకు సమకట్టి ఆ కృషిలో ఎన్నో తప్పులు చేశారు.

రాహుల్... ఒకసారి వెనుతిరిగి చూడండి!

ఆర్టికల్ మొదట్లోనే రాహుల్‌గాంధీ గారు "చరిత్ర నాకు తెలియదు" అని ఒప్పుకున్నందుకు సంతోషం (ఆంధ్రజ్యోతి – 06.11.2024). నిజమే, రాహుల్‌గాంధీ గారికీ, వారి కుటుంబానికీ భారతదేశ నిజమైన, సంస్కృతి సంప్రదాయాలతో కూడిన చరిత్ర తెలియదు.

ఈస్ట్ ఇండియా కంపెనీ భారత్‌ను అణిచివేసిందంటూ బ్రిటిష్ పెత్తనాన్ని కేవలం వాణిజ్య దోపిడీగా మాత్రమే చూపేటువంటి ప్రయత్నం చేశారు. కానీ భారతదేశాన్ని ఆర్థికంగానే కాదు, సామాజికంగా సాంస్కృతికంగా తీవ్రంగా ధ్వంసం చేసిన చరిత్ర ఈస్ట్ ఇండియా కంపెనీది. భారతదేశ సాంప్రదాయ బ్యాంకింగ్ వ్యవస్థలను బ్రిటిష్ పాలన చిన్నాభిన్నం చేసిందని రాహుల్‌గాంధీ అంటున్నారు. 1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఎక్కువ కాలం పరిపాలించింది మీరు ప్రాతినిధ్యం వహిస్తున్న మీ కాంగ్రెస్ పార్టీ– అలాగే మీ నాన్న, మీ నానమ్మ, మీ ముత్తాత ఇట్లా మీ కుటుంబంవాళ్లే! మరి వీరందరి పరిపాలనలో బ్రిటిష్ వారికి ధారాదత్తం కాబడిన సంస్కృతీ సాంప్రదాయాలని, భారతీయ ఆత్మను పునరుద్ధరించడంలో కాంగ్రెస్ పార్టీ దారుణంగా విఫలమైందని కూడా మీరు ఒప్పుకున్నట్టే!

కాంగ్రెస్ పార్టీకి రుచించని 'వందేమాతరం', 'భరతమాత' వంటి పదాలను రాహుల్‌గాంధీ తన రాతలలో చూపించడం శుభ పరిణామం, దాన్ని స్వాగతిస్తున్నాను. ఎందుకంటే మీ పార్టీ ద్వారా గెలిపించబడిన ఉపరాష్ట్రపతి వందేమాతరం గీతాన్ని ఆలపించడానికి మనసు ఒప్పక జాతీయ పతాకానికి నమస్కారం చేయడానికి మనసు రాక నిల్చుంటే భరతజాతి యావత్తు సిగ్గుతో తలవంచుకొని బాధపడినటువంటి ఘటన మీకు గుర్తు చేయాల్సినటువంటి సందర్భం ఇది. అలాగే దేశంలో గుత్తాధిపత్యాలు, కుబేరులు కేవలం 2014 తర్వాత మాత్రమే ఉద్భవించినటువంటి బ్రహ్మ పదార్థాలుగా రాహుల్ గాంధీ అభివర్ణించడం శోచనీయం. భారత దేశంలో రాజకీయంగా, ఆర్థికంగా, పారిశ్రామికంగా మొట్టమొదటి గుత్తాధిపత్యం ఎవరు చెలాయించారన్నది ఆయన ఆత్మావలోకనం చేసుకోవాలి. 'లైసెన్స్ రాజ్యం' పేరుతో భారతదేశాన్ని అధోగతి పాలు చేస్తూ దేశీయ పారిశ్రామిక వేత్తలు అభివృద్ధి చెందకుండా అభాసుపాలు చేసిన చరిత్ర మీ ప్రభుత్వానిది కాదా?



రాహుల్ గాంధీ చెప్పినట్టుగా సమాజంలో అట్టడుగున ఉన్న చిట్టచివరి బడుగు జీవిని ఉద్ధరించడమే మన ధ్యేయం కావాలన్నది గాంధీజీ లక్ష్యం కాదు. అది భారతీయ జనతా పార్టీ స్ఫూర్తి ప్రదాత, సిద్ధాంతకర్త స్వర్గీయ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రవచించిన ఏకాత్మ మానవతా సిద్ధాంతం. సమాజంలో చిట్టచివర ఉన్న వ్యక్తికి ప్రభుత్వం తొలి ఫలాలు అందించాలనేది బీజేపీ ప్రథమ ఆశయం.

మీరు చెప్పిన 'మార్కెట్ శక్తులు', లేదా 'బడా వ్యాపారులు', వారితో అధికార సంబంధాలు మీ ప్రభుత్వ పాలనలోనే మొదలయ్యాయి. మీ ముత్తాత ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు టాటా సంస్థల వ్యవస్థాపకులు ఈ దేశంలో వ్యాపారం చేయడానికి మీ ముత్తాతను సంప్రదిస్తే వారి నుంచి వచ్చిన సమాధానం ఏమిటో టాటా వ్యవస్థాపకులు అనేక సందర్భాల్లో దేశ ప్రజలకు చెప్పిన ఉదంతం మీకు తెలియకుండా ఉండదు. ఇక దేశంలో అత్యధిక కాలం ప్రభుత్వాన్ని నడిపిన మీ కుటుంబం ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా అధికారాన్ని మొత్తం మీ చెప్పు చేతుల్లో పెట్టుకొన్నది. బడా వ్యాపార సంస్థల అధినేతలతో లంచ్ పార్టీలు, డిన్నర్ పార్టీలలో ఎవరు ఎలాంటి లబ్ధి పొందారో చరిత్ర మనకు అనేక సాక్ష్యాలను ఇచ్చింది. దయచేసి వెనక్కి తిరిగి చూస్తే అవి మీకు కనపడతాయి.

అలాగే– రాహుల్‌గాంధీ చెప్పినట్టుగా సమాజంలో అట్టడుగున ఉన్న చిట్టచివరి బడుగు జీవిని ఉద్ధరించడమే మన ధ్యేయం కావాలన్నది గాంధీజీ లక్ష్యం కాదు. అది భారతీయ జనతా పార్టీ స్ఫూర్తి ప్రదాత, సిద్ధాంతకర్త స్వర్గీయ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రవచించిన ఏకాత్మ మానవతా సిద్ధాంతం. సమాజంలో చిట్టచివర ఉన్న వ్యక్తికి ప్రభుత్వం తొలి ఫలాలు అందించాలనేది బీజేపీ ప్రథమ ఆశయం.

ఇక మీరు ఆదివాసీల తరఫున నిలబడడం, మణిపూర్ ప్రజల బాధలు వినడం, రైతుల బాధలు వినడం... ఇవన్నీ మీ పార్టీకీ, మీకూ సరిపడని మాటలు! ఎందుకంటే మణిపూర్ ఘటన మీ ముత్తాత మొదలుపెట్టిన రావణ కాష్టానికి పరాకాష్ఠ! అత్యధిక కాలం అధికారంలో ఉన్న మీరు, మీ కుటుంబం, మీ పార్టీ గిరిజనులకు కానీ ఆదివాసీలకు కానీ, రైతులకు కానీ చేసిందేమీ లేదు.

గత పదేళ్ళ పైచిలుకు కాలంలో ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడిదారులకు, వ్యాపారస్తులకు భారతదేశం ఒక స్వర్గధామంగా మారింది. నరేంద్ర మోదీ సారథ్యంలో నడుస్తున్నటువంటి ప్రభుత్వంలో ఎటువంటి దళారుల ప్రమేయం లేకుండా ఏకగవాక్ష విధానంలో పారిశ్రామిక అభివృద్ధి జరుగుతున్నది. భారత దేశంలో తొలిసారిగా ఏ బడా వ్యాపారవేత్తలకు తొత్తులుగా మారకుండా నాయకుల పాలన సాగుతున్నది. ఒకపక్క చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వాళ్లకు ముద్ర లోన్ ఇచ్చి ప్రోత్సహిస్తూ మరోవైపు కొత్తగా వ్యాపార రంగంలో వచ్చేవాళ్లకు బ్యాంకింగ్ రంగంలో సరళమైన విధానంలో ప్రోత్సాహకాలు ఇస్తూ నరేంద్ర మోదీ పాలన భారతదేశాన్ని ఇవాళ ప్రపంచంలో ఐదవ ఆర్థిక శక్తి నిలబెట్టగలిగింది! మీ పేరు చివరన 'గాంధీ' అన్న తోక ఉన్నందుకు తప్ప మరెందుకూ ఈ దేశ ప్రజలు మిమ్మల్నీ, మీ కుటుంబాన్నీ గౌరవించడం లేదు అనే విషయాన్ని ఇప్పటికైనా మీరు గ్రహిస్తే మంచిది.

• ఎం. రఘునందన్ రావు
మెదక్ పార్లమెంట్ సభ్యులు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ-మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

కుల, మత ఎజెండాల 'మహా' ప్రశ్నలు





■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన వర్గాల నుంచి రిజర్వేషన్లను లాక్కొని మైనారిటీలకు కేటాయించే యోచనలో కాంగ్రెస్ ఉందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదివారం మహారాష్ట్రలో అన్నారు. 'కాంగ్రెస్ పార్టీ మీ మంగళ సూత్రాలను లాక్కొని ముస్లింలకు పంచిపెడుతుందని' గత లోక్‌సభ ఎన్నికల్లో రాజస్థాన్‌లో ప్రధాని మోదీ ఉద్ఘాటనకు, ఇప్పుడు అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు పెద్ద తేడా లేదు. మహారాష్ట్రలో ఎన్నికల ఘట్టం సమీపిస్తున్నకొద్దీ నరేంద్రమోదీ, అమిత్ షాల్లో ఎవరో ఒకరు ఆ రాష్ట్రంలో పర్యటిస్తున్నారు. సోమవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రమాణ స్వీకారానికి కూడా అమిత్ షా హాజరు కాకపోవడం మహారాష్ట్ర ఎన్నికలకు బీజేపీ ఇస్తున్న ప్రాధాన్యాన్ని స్పష్టం చేస్తోంది.

లోక్‌సభ ఎన్నికల తర్వాత కులం, రిజర్వేషన్లు, మతం మళ్లీ మహారాష్ట్ర ఎన్నికల్లో విస్తృతంగా చర్చనీయాంశాలు అవుతున్నాయి. రాహుల్‌గాంధీ కుల జనగణనను మరోసారి ప్రధాన అంశంగా చేస్తున్నారు. దీన్ని అడ్డుకోవడానికి మోదీ, అమిత్ షాలతో సహా సమస్త బీజేపీ శ్రేణులు యథా ప్రకారం మత ప్రాతిపదికన ప్రచారాన్ని మొదలుపెట్టాయి. 'మీరు విడిపోతే వేరవుతారు' అని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రకటిస్తే ఏకే హైతో సేఫ్ హై (కలిసి ఉంటే సురక్షితంగా ఉంటాం) అని మోదీ ప్రకటించారు.

భారతదేశ రాజకీయాల్లో మతం పాత్ర ఏ మేరకు ఉన్నదో మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల్లో వెల్లడవనున్నదా? గత లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లో మాదిరి ప్రజలు కుల ప్రాతిపదికగా ఏకమై తమ అభిప్రాయాన్ని వెల్లడిస్తారా? అన్న ఆసక్తికరమైన చర్చ ఇప్పుడు జాతీయ స్థాయిలో జరుగుతోంది. ప్రజలు మత ప్రాతిపదికన ఏకం కాకుండా కుల సమస్యను ప్రధానంగా ఎజెండాపైకి తీసుకురావడానికి గత లోక్‌సభ ఎన్నికల నుంచీ కాంగ్రెస్ తీవ్రంగా యత్నిస్తోంది. రాహుల్‌గాంధీ స్వయంగా తెలంగాణకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన కుల సర్వే గురించి పార్టీ నేతలతో చర్చించారు.

90 సీట్లున్న హర్యానా ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోవడానికి స్వయంకృతాపరాధాలే అధికంగా కారణమయ్యాయి. అక్కడ మత ప్రాతిపదికన ప్రజలు ఓట్లు వేశారని చెప్పడానికి వీల్లేదు. అందువల్ల 288 సీట్లున్న మహారాష్ట్రను, తమ ఎజెండాను నిరూపించుకోవడానికి ఒక ప్రయోగశాలగా బీజేపీ పరిగణిస్తుందనడంలో సందేహం లేదు. 2014లో భారతీయ జనతా పార్టీ దేశ వ్యాప్తంగా అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో మతపరమైన భావోద్వేగాలు పెరిగిపోయాయి. ఒక పద్ధతి ప్రకారం బీజేపీ ప్రజలను మత ప్రాతిపదికగా ఏకం చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది. అందుకు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కూడా తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తోంది. పది సంవత్సరాల నాటి పరిస్థితులతో పోలిస్తే ఇప్పుడు దేశంలో మతపరమైన భావనలు విస్తరిస్తున్నాయి. మతాన్ని తమ అస్తిత్వానికి నిదర్శనంగా భావించేవారు పెరిగిపోతున్నారు. కాని మతం ఒక ఓటు బ్యాంకుగా మారుతుందా అన్న సందేహాలు లేకపోలేదు. లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ సీట్లు సగానికి పడిపోవడం, రామమందిరం నిర్మించిన అయోధ్యలో కూడా బీజేపీ పరాజయం చెందడం ఈ సందేహాలకు కారణం. అంతటితో ఆ పరాజయాన్ని అంగీకరించడానికి బీజేపీ సిద్ధంగా లేదు. ఎందుకంటే భారతీయ జనతా పార్టీ వద్ద మరో ఆయుధం లేదనే చెప్పాల్సి ఉంది. ఎన్నికల సమయం వచ్చినప్పుడల్లా బీజేపీ నేతలు ప్రభుత్వ పనితీరు, ప్రజల సమస్యలు, అభివృద్ధి లాంటి వాటికన్నా మత ప్రాతిపదికన ప్రచారం చేసేందుకు మొగ్గు చూపడమే ఇందుకు నిదర్శనం.

మళ్లీ మళ్లీ వెనుకబడిన వర్గాల రాజకీయాలను భుజాన వేసుకుంటున్న రాహుల్‌గాంధీ వ్యాఖ్యలు మహారాష్ట్ర ఎన్నికల్లో ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయని బీజేపీ భావిస్తోందా? బీసీలు, ఆదివాసీలు, దళితులు హిందూత్వ ప్రభావం నుంచి నిజంగా జారిపోయే అవకాశాలు ఉన్నాయా? ఈ వర్గాలు మైనారిటీలతో కలిసి మళ్లీ కాంగ్రెస్, ప్రతిపక్షాల ఓట్ బ్యాంకును సంఘటితం చేయడం సాధ్యమవుతుందా? కుల ఆధారిత రాజకీయాలను దెబ్బతీసి హిందూ ఓటర్లను బీజేపీ సంఘటితం చేయగలుగుతుందా? మహారాష్ట్ర, అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో ఈ ప్రశ్నలకు సమాధానం లభించే అవకాశాలున్నాయి.

మరో వైపు కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలకు కూడా కులాన్ని ఒక ఎజెండాగా మార్చడం కంటే వేరే గత్యంతరం లేదు. హర్యానాలో ఓడిపోయినప్పటికీ కాంగ్రెస్ వెనుకబడిన వర్గాల రాజకీయాలనే ఎజెండాగా మార్చుకుంది. బీజేపీ, ఆర్ఎస్ఎస్ రాజ్యాంగంపై దాడిచేస్తున్నాయని గతవారం నాగపూర్‌లో జరిగిన సంవిధాన్ సమ్మేళన్‌లో రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టించాయి. బుద్ధుడు, అంబేద్కర్, పూలే తదితరుల ఆలోచనలకు ప్రతిఫలమైన రాజ్యాంగాన్ని భారతీయ జీవన విధానానికి దర్పణంగా అభివర్ణించారు. కులజనగణన చేస్తే కాని దేశంలో వెనుకబడిన, అణగారిన వర్గాల వారు ఏ మేరకు ఉన్నారో, వారికి 50 శాతానికి మించి రిజర్వేషన్లు కల్పించాలో లేదో తెలుస్తుందని రాహుల్ అన్నారు. దీనికి ప్రధానమంత్రి మోదీ నుంచీ దేవేంద్ర ఫడ్నవీస్ దాకా బీజేపీ నేతలందరూ తీవ్రంగా స్పందించారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీకి వంద సీట్లు కూడా తేలేకపోయిన, హర్యానాలో పార్టీకి అధికారం సాధించలేకపోయిన రాహుల్‌గాంధీ చేస్తున్న వ్యాఖ్యలను భారతీయ జనతా పార్టీ ఇంకా సీరియస్‌గా ఎందుకు తీసుకుంటోంది? పట్టువదలని విక్రమార్కుడులా మళ్లీ మళ్లీ వెనుకబడిన వర్గాల రాజకీయాలను భుజాన వేసుకుంటున్న రాహుల్‌గాంధీ వ్యాఖ్యలు మహారాష్ట్ర ఎన్నికల్లో ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయని బీజేపీ భావిస్తోందా? బీసీలు, ఆదివాసీలు, దళితులు హిందూత్వ ప్రభావం నుంచి నిజంగా జారిపోయే అవకాశాలు ఉన్నాయా? ఈ వర్గాలు మైనారిటీలతో కలిసి మళ్లీ కాంగ్రెస్, ప్రతిపక్షాల ఓట్ బ్యాంకును సంఘటితం చేయడం సాధ్యమవుతుందా? కుల ఆధారిత రాజకీయాలను దెబ్బతీసి హిందూ ఓటర్లను బీజేపీ సంఘటితం చేయగలుగుతుందా?

మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో ఈ ప్రశ్నలకు సమాధానం లభించే అవకాశాలున్నాయి. హిందువుల ప్రయోజనాలకోసం పోరాడిన బాల్ ఠాక్రే కుమారుడు ఉద్ధవ్ ఠాక్రేతో పాటు వివిధ శక్తులు కాంగ్రెస్‌తో చేతులు కలపడం వల్ల హిందువుల ఓట్లు చీలిపోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ప్రతిపక్షాలకు వ్యతిరేకంగా హిందువుల ఓట్లను సంఘటితం చేయడం మాత్రమే కాదు, ఓబీసీ ఓటు బ్యాంకును కాపాడుకోవడం బీజేపీకి కీలకంగా మారింది. మహారాష్ట్రలో 175 సీట్లలో ఓబీసీలు నిర్ణాయక స్థితిలో ఉన్నారని బీజేపీ నేతలు సైతం అంగీకరిస్తున్నారు. విదర్భలో కూడా 62 సీట్లలో 36 సీట్ల ఫలితాలను ఓబీసీలు నిర్ణయించే అవకాశాలు ఉన్నాయి. అక్కడ ఓబీసీల్లో 60శాతం పైగా ఉన్న కుంబీల ఓట్లు తమకే లభిస్తాయని కాంగ్రెస్ నేతలు ఆశిస్తున్నారు. మరో వైపు మరాఠా రిజర్వేషన్ ఉద్యమం మూలంగా అసాధారణమైన స్థాయిలో ఓబీసీలు సంఘటితమవుతున్నారని ప్రకాశ్ అంబేద్కర్ లాంటి వారు చెబుతున్నారు. జారంగే పటేల్ వంటి మరాఠా కోటా ఉద్యమకారులను చేరదీసినందుకు ఓబీసీలు ఆగ్రహంతో ఉన్నారని, మరో వైపు మరాఠా కోటాను డిమాండ్ చేసినవారు కూడా మద్దతునీయడం లేదని విశ్లేషణలు వినపడుతున్నాయి. తాజాగా జారంగీ పటేల్ తన అభ్యర్థులందర్నీ ఉపసంహరించుకోవడం ప్రతిపక్షాలకే సహాయపడుతుందని విశ్లేషకుల అంచనా.

జార్ఖండ్‌లో ఆదివాసీలను ఉమ్మడి పౌర స్మృతి పరిధిలోకి తెబోమని బీజేపీ పదే పదే ప్రకటించడం ద్వారా ఆదివాసీల ఓట్లు చీలకుండా ప్రయత్నాలు చేస్తోంది. మరో వైపు ఆదివాసీలకు ప్రత్యేక స్మృతిని అమలు చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. గడచిన కొద్ది దశాబ్దాలుగా ఆర్ఎస్ఎస్ ఆదివాసీల ప్రాంతాల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాలు బీజేపీకి ఎంత ప్రయోజనం చేకూర్చగలవో ఈ ఎన్నికల్లో తేలనున్నది.

ఉత్తరప్రదేశ్‌లో జరుగుతున్న ఉప ఎన్నికలు కూడా వెనుకబడిన వర్గాల రాజకీయాలకు ఒక పరీక్ష అని చెప్పక తప్పదు. అక్కడ కూడా సార్వత్రిక ఎన్నికల్లో కోల్పోయిన ఓట్లను బీజేపీ సాధించేందుకు విశ్వప్రయత్నాలు చేస్తోంది. విడిపోతే వేరవుతాం అన్న నినాదం ఒకవైపు, విడిపోము, వేరు కాము, కలిసికట్టుగా ఉందాము అన్న నినాదం మరోవైపు పోస్టర్ల రూపంలో అంతటా వెలిశాయి. రాహుల్ గాంధీ నినాదం నఫ్రత్ కే బజార్ మే మొహబ్బత్ కే దుకాణ్ (విద్వేష మార్కెట్‌లో ప్రేమ దుకాణం) అన్న నినాదాలు కూడా పోస్టర్లుగా మారుతున్నాయి. ఈ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పోటీ చేయకుండా బీజేపీకి వ్యతిరేకంగా కేవలం ఎస్పీనే దించడం మూలంగా కుల రాజకీయాలకు, మత రాజకీయాలకూ మధ్య ప్రధాన పోటీ ఏర్పడింది. సమాజ్‌వాదీ పార్టీ యథా ప్రకారం పీడీఏ (పిచ్డా, దళిత్, అల్పసంఖ్యాక్) ఫార్ములాను ప్రయోగిస్తోంది.

నరేంద్రమోదీ 2014లో భారతీయ రాజకీయాల్లోకి ప్రవేశించిన తర్వాత బీజేపీ రథం చాలా చోట్ల కుల రాజకీయాలను ఛేదించగలిగింది కానీ మండల్ అనంతర రాజకీయాలను పూర్తిగా ఓడించలేకపోయింది. గడచిన పదేళ్లలో తనకు లభించిన అవకాశాలను బీజేపీ సమర్థంగా ఉపయోగించుకుని ఉంటే ప్రతిపక్షాలు కుల రాజకీయాలను ఎజెండాగా మార్చుకునేందుకు అవకాశం లభించి ఉండేది కాదు. రాజ్యాంగం, సామాజిక న్యాయం చర్చనీయాంశాలుగా మారేవి కావు. మత అస్తిత్వానికి పోటీగా కుల అస్తిత్వం పెరిగేందుకు ఆస్కారం లభించి ఉండేది కాదు. దానికి తోడు మైనారిటీలు కూడా బీజేపీకి వ్యతిరేకంగా సంఘటితమయ్యే పరిస్థితులు వచ్చేవి కావు.

భారతదేశ రాజకీయ చిత్రపటాన్ని మోదీ కొంతమేరకు మార్చగలిగారు. కాని కుల సమీకరణలను రూపుమాపడంలో ఆయన పూర్తిగా సఫలం కాలేకపోయారు. బీజేపీ ఎన్ని ప్రయత్నాలు చేసినా ఓబీసీలను, దళితులను, ఆదివాసీలను హిందుత్వ పరిధిలోకి తీసుకురావడం అంత సులభం కావడం లేదు. మోదీ లాంటి బలమైన నాయకుడి ఆధ్వర్యంలో జాతీయవాదం ఒకశక్తిగా మారగలదనే అభిప్రాయం చాలా మందిలో ఉన్నప్పటికీ ఆ అభిప్రాయాన్ని మార్చుకుంటున్న వారు కూడా కనపడుతున్నారు. ఒక ఆధునిక ప్రజాస్వామ్య దేశంగా అభివృద్ధి చెందాల్సిన దేశంలో కులం, మతం ఇంకా ఎన్నికల ప్రధాన ఎజెండాగా కొనసాగుతుండడం, ప్రజల నిజమైన సమస్యలకు ప్రాధాన్యం లభించకపోవడం ఎంత విషాదకరం?

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)


భారత ప్రజాస్వామ్య పునాదుల్లో పగుళ్లు

73వ రాజ్యాంగ సవరణకు అనుగుణంగా రూపొందించిన (ఉమ్మడి) ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం–1994 అమలులోకి వచ్చి ఏప్రిల్ 2024 నాటికి ముప్పై సంవత్సరాలు పూర్తయ్యాయి. అయినా ఇప్పటికీ పంచాయతీరాజ్ సంస్థల బలోపేతం గురించి, అధికారాలు బదలాయింపు విషయమై చర్చించుకోవాల్సిన పరిస్థితి బాధాకరం. ఇందుకు బాధ్యులెవరు? లోపం ఎక్కడుంది?

అసలు 73వ రాజ్యాంగ సవరణ చట్ట నిర్మాణం పటిష్ఠంగా లేదు. రాజ్యాంగం పదకొండవ షెడ్యూల్లో పేర్కొనబడిన 29 అంశాలకు సంబంధించిన అధికారాల బదలాయింపు రాష్ట్ర ప్రభుత్వాల దయాదాక్షిణ్యాలకు వదిలివేయడం, 73వ సవరణను అనుసరించి రాష్ట్ర పంచాయతీరాజ్ చట్టాన్ని రూపొందించుకునే స్వేచ్ఛ, అధికారం పూర్తిగా రాష్ట్రాలకు కట్టబెట్టడం మొదలైనవి రాజ్యాంగ సవరణలో ఉన్న ప్రధాన లోపాలు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం–1994 విషయానికి వస్తే ఇది కొత్తగా చేయబడిన చట్టం కాదు. పాత చట్టాల అతుకుల బొంత. అప్పటివరకూ అమలులో ఉన్న ఆంధ్రప్రదేశ్ గ్రామ పంచాయతీల చట్టం–1964, ఆంధ్రప్రదేశ్ మండల ప్రజా పరిషత్, జిల్లా ప్రజా పరిషత్, జిల్లా ప్రణాళిక అభివృద్ధి సమీక్షా మండళ్ల చట్టం–1986 లను కలిపి 73వ రాజ్యాంగ సవరణలకు అణుగుణంగా ఒకే చట్టంగా రూపొందించారు. ఒకే చట్టమైతే రూపొందించారు కానీ పాత చట్టాల క్రింద ఏర్పాటైన అధికార వ్యవస్థలు అయిన పంచాయతీ, అభివృద్ధి విభాగాలను ఏకీకృతం చెయ్యలేదు. ఫలితంగా రెండు విభాగాల అధికారవ్యవస్థలు కుమ్ములాడుకొని మొత్తం వ్యవస్థనే సర్వనాశనం చేశాయి. ఈ చట్టం కూర్పులో జరిగిన మరో పొరపాటు ఏమిటంటే మూడు అంచెల మధ్య అవినాభావ సంబంధాన్ని తుంచివేయడం. గ్రామ పంచాయితీలో ఎంపీటీసీకి, సర్పంచ్‌కి మండల ప్రజాపరిషత్‌లో, జడ్‌పీటీసీకి మండల ప్రజా పరిషత్‌లో, ఎంపీపీకి జిల్లా ప్రజాపరిషత్‌లో సభ్యత్వం కల్పించకుండా వారిని 'శాశ్వత ఆహ్వానితులు'గా చేశారు. అందువలన సర్పంచ్‌లు మండల ప్రజాపరిషత్ సమావేశాల్లోనూ, ఎంపీపీలు జిల్లా ప్రజాపరిషత్ సమావేశాల్లోనూ పాల్గొనటానికి ఆసక్తి చూపించటం లేదు. పాల్గొన్నా ఓటు హక్కు లేకపోవడంతో విలువ లేదు. ఈ కారణంగా మూడు అంచెల వ్యవస్థల మధ్య ఉండాల్సిన అవినాభావ సంబంధాలు తెగిపోయి ఎవరికి వారే యమునాతీరే అన్నట్లుగా వ్యవహరిస్తున్నాయి. చేసే పనుల్లో, కార్యక్రమాల్లో మూడు వ్యవస్థల మధ్య సమన్వయం పూర్తిగా కరువయింది.

73వ రాజ్యాంగ సవరణ గ్రామ సభకు రాజ్యాంగ ప్రతిపత్తి, ప్రాధాన్యాన్ని కల్పించింది. గ్రామ సభను ప్రత్యక్ష ప్రజాస్వామ్యానికి వేదికగా, గ్రామ స్వరాజ్యంకు ప్రతీకగా భావించింది. గ్రామ పంచాయతీలో ఓటు హక్కు కలిగిన ప్రతీ ఒక్కరూ గ్రామసభ సభ్యులే. ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టంలో సంవత్సరంలో రెండుసార్లు గ్రామసభ తప్పనిసరిగా నిర్వహించాలని నిర్దేశించారు. తర్వాత సంవత్సరానికి నాలుగుసార్లు అంటే ప్రతీ మూడు నెలలకు తప్పనిసరిగా గ్రామసభలు నిర్వహించాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. అయితే గ్రామసభ ఆచరణ సాధ్యం కాని వ్యవస్థ. గ్రామసభల నిర్వహణకు పలు ప్రతిబంధకాలు ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనవి – గ్రామ పంచాయతీ భౌగోళిక స్వరూపం, ఓటర్ల సంఖ్య, ప్రజల భాగస్వామ్యం. మన గ్రామ పంచాయతీల విస్తీర్ణాన్ని గమనిస్తే చిన్న కుగ్రామం నుంచి అనేక ఆవాసాలతో కిలోమీటర్ల దూరం విస్తరించి ఉన్న అనేక ప్రాంతాలు ఉంటాయి. అలాంటి పంచాయతీల్లో అన్ని ఆవాస ప్రాంతాల వారిని ఒకేచోటకు చేర్చి గ్రామసభ నిర్వహించటం కష్టం. అలాగే గ్రామసభ సభ్యులు– 300 నుంచి 15 వేలకు పైబడిన ఓటర్లు ఉన్న గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వేల సంఖ్యలో సభ్యులు ఉన్న చోట గ్రామసభ నిర్వహించటం, నిర్ణయాలు తీసుకోవడం సాధ్యం కాదు. అసలు సమస్య ప్రజల భాగస్వామ్యం. అనుభవం చెబుతున్నది ఏమిటంటే గ్రామ సభలకు ప్రజలు హాజరు కారు. బలవంతంగా తరలించినా పట్టుమని పాతిక మంది హాజరుకావడం కష్టం. ఇందుకు అనేక సామాజిక, రాజకీయ కారణాలు ఉన్నాయి. వీటితోబాటు ప్రజల ముందు అన్నీ ఉంచటానికి పంచాయతీ పాలకవర్గాల అయిష్టత. ఫలితంగా గ్రామసభల నిర్వహణ ఒక ప్రహసనంగా మారిపోయింది.

మన ప్రజాస్వామ్య మనుగడ పంచాయతీరాజ్ వ్యవస్థల పని తీరుమీదే ఆధారపడి ఉంటుంది. ప్రజాస్వామిక నడవడికకు అవి ప్రాథమిక బడులు. దురదృష్టం ఏమిటంటే ప్రజలు గానీ, ప్రజాప్రతినిధులు గానీ వాటిని అధికార అంచెలుగానే చూస్తున్నారు. సమావేశాలు నిర్వహించటం, సమస్యలు చర్చించటం, పరిష్కారాలు కనుగొనటం అనే బాధ్యతను మరిచిపోయారు. సంకుచిత రాజకీయాలతో పంచాయతీరాజ్ వ్యవస్థలను భ్రష్టుపట్టించారు. ఇందుకు ప్రజాప్రతినిధుల బాధ్యత ఎంత ఉన్నదో, పంచాయతీరాజ్ అధికారులకూ అంతే బాధ్యత ఉన్నది.



పంచాయతీరాజ్ చట్టం గ్రామ సభకు కోరం నిర్ణయించలేదు. దీని పర్యవసానం నోటీసు ఇచ్చి, గ్రామసభ జరిగిపోయినట్లుగా నమోదు చేసుకోవచ్చు. ఈ మధ్య కేంద్ర ప్రభుత్వం కనీసం పది శాతం కోరంగా ఉండాలని అందులో 33 శాతం మహిళలు ఉండాలని అప్పుడే గ్రామసభ నిర్వహించాలని గట్టిగా చెబుతున్నది. అలాగే గ్రామసభ సభ్యుల్లో పదిశాతం మంది కోరితే, వారి కోరిక మేరకు వారు కోరిన అంశాలపై గ్రామసభ నిర్వహించాలి అని పంచాయతీరాజ్ చట్టం చెబుతున్నది. అసలు ఈ పదిశాతం ప్రజాస్వామ్యం ఏమిటో, గ్రామ స్వరాజ్యంను ఆది ఎలా ప్రతిబింబిస్తుందో అర్థం చేసుకోవడం కష్టమే. భారత రాజ్యాంగం మౌలికంగా ప్రాతినిధ్య ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పింది. అందుకు విరుద్ధంగా ప్రత్యక్ష ప్రజాస్వామ్యాన్ని అధిక జనాభా కలిగిన మన దేశంలో అదీ గ్రామీణ ప్రాంతాలలో అమలు చెయ్యాలనుకోవడంలో ఔచిత్యం కనిపించడం లేదు.

73వ రాజ్యాంగ సవరణ ఫలితంగా రెండు కొత్త ప్రాతినిధ్య వ్యవస్థలు– మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యుడు (ఎంపీటీసీ), జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యుడు (జడ్‌పీటీసీ) – సృష్టించబడ్డాయి. ఈ కారణంగా ప్రాతినిధ్య వ్యవస్థలో కొంత గందరగోళం నెలకొని వుంది. ఇవి, ఆరో వేలు లాంటివనే అభిప్రాయం ఒకటి గట్టిగా ఉన్నది. కొత్తగా పుట్టిన ఎంపీటీసీ/జడ్‌పీటీసీ వ్యవస్థలు నిరర్థకమైనవి అనే భావన బలంగా ఉంది. అయితే ఈ వ్యవస్థలను సృష్టించటం వెనుక ఉన్న నిగూఢ లక్ష్యాలు అర్థం చేసుకునే ప్రయత్నం లేదు. ఆ నిగూఢ లక్ష్యాలు ఏమిటి? సర్పంచికి, ఎంపీటీసీకి మధ్య అనివార్య పోటీ లేక ఘర్షణ వాతావరణం నెలకొల్పడం. ఈ పోటీ లేక ఘర్షణ ప్రజలకు మంచి చేస్తుందనే నమ్మకం; ఒకే నియోజకవర్గం నుండి ఇద్దరు ప్రతినిధులలో ఒకరు స్థానిక వ్యవహారాలు చూసేందుకు, ఇంకొకరు ఉన్నత పాలనా సంస్థలో తమ నియోజక అభివృద్ధికి పాటుపడేందుకు, ఒకే ప్రతినిధి సర్వంగా మారిపోయి ప్రజలను పీడిస్తే ప్రత్యామ్నాయ ప్రతినిధిని ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు. ఇవేమీ అర్థం చేసుకోకుండా కొత్త వ్యవస్థలకు జవసత్వాలు సమకూర్చేందుకు కనీసం ప్రయత్నించకుండా వాటిని పురిట్లోనే చంపేశారు? ఎంపీటీసీ/జడ్‌పీటీసీలను ఉత్సవ విగ్రహాలుగా మార్చేశారు.

73వ రాజ్యాంగ సవరణ లక్ష్యం సంపూర్ణ వికేంద్రీకరణ. పంచాయతీల వ్యవస్థాగత నిర్మాణం, విధులు, నిధులు, సిబ్బంది, స్వయం నిర్ణయాధికారం కలిగి స్థానిక ప్రభుత్వాలుగా రూపొందాలని ఆకాంక్ష. అయితే ఆ దిశగా ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం 1994 రూపొందించబడలేదు, దాన్ని సరిదిద్దే ప్రయత్నం ఇంతవరకు పంచాయతీరాజ్ శాఖ చేయలేదు. రాజ్యాంగం పదకొండవ షెడ్యూల్ ప్రకారం పంచాయతీలకు బదిలీ చేయవలసిన 29 అంశాలను యథాతథంగా పంచాయతీరాజ్ చట్టాన్ని ఒకటవ షెడ్యూలులో చేర్చి, ప్రభుత్వం అవసరాలను బట్టి ఆయా అంశాలను పంచాయితీలకు బదిలీ చేస్తుందని పేర్కొన్నారు. తర్వాత ఏదో మొక్కుబడిగా పది అంశాలను బదలాయించినట్లుగా ఆదేశాలు ఇచ్చారు కానీ అవి కాగితాలకే పరిమితమయ్యాయి. అలాగే చట్టం రెండవ షెడ్యూల్లో మండల ప్రజాపరిషత్ నిర్వర్తించవలసిన 15 అంశాలు/ విధులు పేర్కొన్నారు. కానీ ఆయా శాఖల తాలూకా నిధులను గాని, సిబ్బందిని గాని మండల ప్రజాపరిషత్ నియంత్రణలో ఉంచలేదు. ఏతావాతా తేలేది ఏమిటంటే మూడు అంచెల వ్యవస్థలో దేనికీ రాజ్యాంగ సవరణలో పేర్కొన్న 29 అధికారాలు, నిధులు, విధులు, సిబ్బంది చట్టపరంగా దఖలు పరచబడలేదు. 73వ రాజ్యాంగ సవరణకు ముందు ఉన్న పరిస్థితే ఇప్పటికీ కొనసాగుతున్నది.

73వ రాజ్యాంగ సవరణ అనంతరం ప్రభుత్వ పాలనా విధానాలలోనూ, వాటి అమలు, పర్యవేక్షణ, సమీక్షా పద్ధతుల్లోనూ పెను మార్పులు వచ్చాయి. ముఖ్యంగా సమాచార, కమ్యూనికేషన్ టెక్నాలజీ రంగంలో సాధించిన ప్రగతి రియల్ టైమ్ గవర్నెన్స్‌కు తెరలేపింది. ప్రజల వద్దకు పాలన నుంచి గడప వద్దకే పాలనకు వచ్చాం. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య దూరం అనేది మాయమయిపోయింది. కేంద్రీకృత పాలన వికేంద్రీకృతమై ప్రజల ముంగిట్లోకి వచ్చింది. 'సోషల్ మీడియా' విస్ఫోటనం ప్రభుత్వ పాలనలో ప్రజల భాగస్వామ్యం అనే పదానికి అర్థాన్ని మార్చేసింది. రియల్ టైమ్ గవర్నెన్స్ లాగే రియల్ టైమ్ ప్రజల భాగస్వామ్యం నడుస్తోంది. ఇప్పుడు ఉభయ తెలుగు రాష్ట్రాలలోను జిల్లాలు చిన్నవైపోయాయి. అలాగే పెరుగుతున్న పట్టణీకరణ నేపథ్యంలో పంచాయతీరాజ్ సంస్థలను పునర్ నిర్వచించాల్సిన ఆవశ్యకత ఉంది. అలా అని ప్రభుత్వ పాలనలో ఈ వ్యవస్థల అవసరం తీరిపోయిందని అనలేం. కానీ వీటి ప్రాథమ్యాలను ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పునర్ నిర్వచించాల్సి ఉంది. ఈ వ్యవస్థలు నిర్వర్తించాల్సిన అంశాలు ఇప్పటికే చాలానే ఉన్నాయి. అవేమిటో అధ్యయనం చేసి, తదనుగుణంగా చట్టసవరణ చెయ్యాలి. మారిన రాజకీయ, సామాజిక, సాంకేతికతల పరిస్థితులకు అణుగుణంగా ఈ వ్యవస్థలను తీర్చిదిద్దాలి.

ఏది ఏమైనప్పటికీ, పంచాయతీరాజ్ వ్యవస్థ ప్రజాస్వామ్యానికి పునాది. దేశ ప్రజాస్వామిక మనుగడ పంచాయతీరాజ్ వ్యవస్థ పని తీరుమీదే ఆధారపడి ఉంటుంది. భావి నేతలను సృష్టించేవి ఈ వ్యవస్థలే. ప్రజాస్వామిక నడవడికకు అవి ప్రాథమిక బడులు. దురదృష్టం ఏమిటంటే ప్రజలు గానీ, ప్రజా ప్రతినిధులు గానీ వాటిని అధికార అంచెలుగానే చూస్తున్నారు. సమావేశాలు నిర్వహించటం, సమస్యలు చర్చించటం, పరిష్కారాలు కనుగొనటం అనే బాధ్యతను మరిచిపోయారు. సంకుచిత రాజకీయాలతో పంచాయతీరాజ్ వ్యవస్థలను భ్రష్టు పట్టించారు. ఇందుకు ప్రజా ప్రతినిధుల బాధ్యత ఎంత ఉన్నదో, పంచాయతీరాజ్ అధికారులకూ అంతే బాధ్యత ఉన్నది.

■ పరదేశి కె. ఎరికిపాటి
విశ్రాంత పంచాయతీరాజ్ అధికారి



మండలిలో చీఫ్‌విప్‌గా పంచుమర్తి



- అసెంబ్లీలో విప్‌లుగా బొండా, సౌమ్య, యార్లగడ్డ
- 'కూటమి' వర్క్‌షాపులో ప్రకటించిన సీఎం చంద్రబాబు



బొండా ఉమా



తంగిరాల సౌమ్య



యార్లగడ్డ వెంకట్రావు

విజయవాడ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణాజిల్లా టీడీపీ నేతలను మరిన్ని పదవులు వరించాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో కేసులకు భయపడకుండా ప్రజల తరఫున ప్రతిపక్షపాత్రను సమర్థవంతంగా పోషించి ఎమ్మెల్యేలుగా గెలిచిన వారికి పార్టీ గుర్తింపును ఇచ్చింది. మూడు రోజుల కిందట ప్రకటించిన నామినేటెడ్ పదవుల్లో ఉమ్మడి జిల్లాకు సముచితస్థానం కల్పించిన సీఎం చంద్రబాబు ఇప్పుడు ఎమ్మెల్యేలకు గుర్తింపును ఇచ్చారు. అంశం ఏదైనా అనర్గళంగా మాట్లాడే పటిమ ఉన్న ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధను శాసన మండలిలో చీఫ్‌విప్‌గా నియవిుంచారు. అసెంబ్లీలో విప్‌లుగా సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకటరావును నియమించారు. కూటమి ఎమ్మెల్యేలు, మంత్రులకు మంగళవారం జరిగిన వర్క్‌షాపులో చంద్రబాబు ఈ పదవులను ప్రకటించారు. పంచుమర్తి అనురాధ విజయవాడ మేయర్‌గా పనిచేశారు. తర్వాత పార్టీలో క్రియాశీలక పాత్ర పోషించారు. అనారోగ్యం నుంచి కోలుకుని వైసీపీ ప్రజావ్యతిరేక విధానాలను తన వాగ్ధాటితో ఎండగట్టారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో మెజారిటీ లేకపోయినప్పటికీ అనూహ్యంగా విజయం సాధించారు. దీనితో అనురాధ పేరు రాష్ట్రంలో మారుమోగింది. తంగిరాల సౌమ్య 2014లో టీడీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా ఉన్నారు. తండ్రి తంగిరాల ప్రభాకరరావు మరణానంతరం ఆమె రాజకీయ రంగప్రవేశం చేశారు. రాజకీయాల్లో ఆమె తనకంటూ ఒక ప్రత్యేక ముద్రను సంపాదించారు. పేరుకు తగ్గట్టుగానే ఆమె సౌమ్యంగా ఉంటారు. వైసీపీ చేసిన ఇసుక దోపిడీపై ఆమె పోరాటాలు చేశారు. యార్లగడ్డ వెంకటరావు తొలిసారిగా ఎమ్మెల్యే అయ్యారు. ఆయనకూ మంచి గుర్తింపును చంద్రబాబు ఇచ్చారు.

చం పేస్తున్నాయ్!

» చిన్నారులపై రెచ్చిపోతున్న గ్రామసింహాలు 6లో

బూడిదతో కాసుల వేట



సడక్ రోడ్డులో బూడిదను డంప్ చేస్తున్న లారీ, టిప్పర్ (ఇన్‌సెట్‌లో) బూడిద లోడింగ్‌కు ఉంచిన మిషన్

మూలపాడు, జూపూడిలో భారీగా బూడిద నిల్వలు

పర్యావరణానికి హాని కలిగించే బూడిద కొందరికి కాసుల వర్షం కురిపిస్తోంది. ఇబ్రహీంపట్నం మండలం మూలపాడు, జూపూడి తదితర గ్రామాల్లో పాడుబడిన క్రషర్లనే స్థావరాలుగా చేసుకుని భారీగా బూడిద నిల్వ చేస్తున్నారు. డిమాండ్ ఆధారంగా ధరలు నిర్ణయించి మిషన్లతో లోడ్ చేయించి మరీ యథేచ్ఛగా అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. స్థానికంగా టిప్పరుకు రూ.6 వేలు, అదే హైదరాబాద్‌కు అయితే రూ.25 వేల నుంచి 30 వేల వరకు వసూలు చేస్తున్నారు. వీటిని నియంత్రించాల్సిన అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తు న్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ బూడిద దందా వెనుక అధికార, ప్రతిపక్ష పార్టీల నేతల హస్తం ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.



మూలపాడులో ఓ క్రషర్‌లో నిల్వ ఉంచిన బూడిద

- పాడుబడిన క్రషర్లే స్థావరాలు.. మిషన్లతో లోడింగ్
- డిమాండ్‌ను బట్టి రేటు నిర్ణయించి యథేచ్ఛగా అక్రమ రవాణా
- స్థానికంగా టిప్పరు బూడిద రూ. 6 వేలు
- హైదరాబాద్‌కు అయితే రూ.25 వేల నుంచి 30 వేలుపైనే..

ఇబ్రహీంపట్నం,ఆంధ్రజ్యోతి : ఎన్టీటీపీఎస్ బూడిద చెరువు నుంచి బూడిదను పెద్ద ఎత్తున తరలించి ఇబ్రహీంపట్నం మండలం మూలపాడు, జూపూడి తదితర ప్రాంతాల్లో పని చేయని స్టోన్ క్రషర్లలో భారీగా నిల్వ చేస్తున్నారు. అటు తర్వాత దాన్ని డిమాండ్‌ను బట్టి హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో ఉన్న ఇటుక, సిమెంట్ బిళ్లల తయారీ కంపెనీలకు హెచ్చు రేటుకు వి క్రయించుకొని సొమ్ము చేసుకుంటున్నారు. స్థానికంగా ఒక టిప్పర్ బూడిదను రూ.6 వేలకు రవాణా ఖర్చులతో తోలుతున్నారు. అదే హైదరాబాద్‌కు అయితే ఇక ట్రిప్పు రూ.25 వేలు నుంచి రూ.30 వేలు కూడా పలుకుతోంది. దీంతో బూడిద అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తోంది.

అధికార, ప్రతిపక్షాల బుకాయింపు

బూడిద నిల్వలు మావి కావు అంటే మావి కావు అని అధికార ప్రతిపక్ష పార్టీల నేతలు బుకాయిస్తున్నారు. అయితే కూటమి అధికారంలోకి ఇచ్చినా ఇంకా కొందరు వైసీపీ నేతల చేతుల్లోనే బూడిద డంపింగ్ యార్డులు ఉన్నాయంటున్నారు కొందరు పాలకపక్ష నేతలు. ఇంతకు అవి ఎవరివి పాలకపక్ష నేతలవా లేక ప్రతిపక్ష నేతలవా అధికారులే తేల్చాల్సి ఉంది.

అక్రమార్కులకు అధికారుల సహకారం!

కొందరు ఎన్టీటీపీఎస్ అధికారులు సైతం బూడిద అక్రమార్కులకు పూర్తి సహకారం అందిస్తున్నారనే ఆరోపణలున్నాయి. భారీ ఎత్తున బూడిద అక్రమంగా నిల్వ చేసినా చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఎక్కడైనా బూడిద స్టాక్ ఉన్నట్లు తెలిస్తే వెంటనే దాన్ని సీజ్ చేసి డంపింగ్ చేస్తున్న టిప్పర్లకు లోడింగ్ ఆపేయాల్సి ఉంటుంది. కానీ అలాంటి చర్యలు ఇక్కడ శూన్యమంటున్నారు. దీంతో మూడు పువ్వులు, ఆరు కాయలుగా వ్యాపారం సాగుతోంది. ఇక పోలీస్, రెవెన్యూ అధికారులు చాలా మంది చేష్టలుడిగి చూస్తున్నారు. కొందరు అయితే మామూళ్ల మత్తులో జోగుతున్నారని వి మర్శలు వ్యక్తమవుతున్నాయి.

స్థావరాలు ఇవే

ఇబ్రహీంపట్నం మండలం మూలపాడు వద్ద జాతీయ రహదారి వెంట పాడుపడిన స్టోన్ క్రషర్‌లో పెద్ద ఎత్తున బూడిద నిల్వ చేశారు. మూలపాడు నుంచి సడక్ రోడ్డులోకి వెళితే ఖాళీ ప్రదేశాల్లో పెద్ద ఎత్తున బూడిద నిల్వలు కనిపిస్తాయి. జూపూడిలో సడక్ రోడ్డులో ఓ స్టోన్ క్రషర్‌లో సుమారు 20 మీటర్ల మిగతా 6లో..



డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్‌కు రూ.700 కోట్లు!

విజయవాడలో 7 కిలోమీటర్ల మేర నిడమానూరు బిగ్ ఫ్లైఓవర్

విజయవాడ నగరానికే అతి పెద్ద ఫ్లై ఓవర్‌గా అవతరించనున్న ప్రతిపాదిత నిడమానూరు ఫ్లై ఓవర్‌ను డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్‌గా అభివృద్ధి చేసేందుకు భారీ వ్యయం కానుంది. ప్రాథమికంగా రూ.700 కోట్లపైన వ్యయం అవుతుందని ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ అధికారులు భావిస్తున్నారు. తుది అంచనాలు వచ్చే సరికి అది కాస్త రూ.800 కోట్ల వరకు చేరుకోవచ్చని తెలుస్తోంది.

- ఇందులో మెట్రో కారణంగా 4.7 కిలోమీటర్ల మేర డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్
- అలైన్‌మెంట్, అంచనాల బాధ్యత ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్‌కు ఎన్‌హెచ్ అప్పగింత
- ప్రాథమిక అంచనా రూ.700 కోట్లు.. తుది అంచనా రూ.800 కోట్లు అయ్యే అవకాశం.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడలో ఏడు కిలోమీటర్ల మేర నిడమానూరు బిగ్ ఫ్లైఓవర్ నిర్మించనున్నారు. ఇందులో నిడమానూరు జంక్షన్ నుంచి రామవరప్పాడు రింగ్ వరకు 4.7 కిలోమీటర్ల మేర మెట్రో అలైన్‌మెంట్ వస్తుంది. మెట్రో లైన్‌కు ఇబ్బందులు లేకుండా నిడమానూరు ఫ్లై ఓవర్‌ను నిర్మించాలంటే ఆ మేర డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ అనివార్యం. ఎన్‌హెచ్ ఫ్లై ఓవర్‌పైన మెట్రో ఫ్లై ఓవర్‌ను నిర్మించాల్సి ఉంటుంది. దీని కోసం బేస్‌మెంట్ నుంచే డబుల్ డెక్కర్ సామర్థ్యంతో కూడిన విధంగా ఫ్లై ఓవర్‌కు డిజైన్ చేయాల్సి ఉంటుంది. మొత్తంగా ఏడు కిలోమీటర్ల నిడమానూరు ఫ్లై ఓవర్‌లో 4.7 కిలోమీటర్ల మేర నిర్మించే డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్‌కు అంచనాలను మాత్రం మెట్రో రైల్ కార్పొరేషన్ అధికారులు సిద్ధం చేస్తున్నారు. ప్రాథమిక సమాచారం మేరకు నిడమానూరు జంక్షన్ నుంచి రామవరప్పాడు రింగ్ రోడ్డు వరకు 4.7 కిలోమీటర్ల మేర రూ.700 కోట్ల అంచనా అవుతోందని ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ ఇంజనీర్లు అభిప్రాయపడుతున్నారు. తుది అంచనాలలో ఈ మొత్తం రూ.800 కోట్లకు కూడా చేరే అవకాశం ఉందని తెలుస్తోంది. నిడమానూరు ఫ్లై ఓవర్ మొత్తం పొడవు దాదాపుగా ఏడు కిలోమీటర్లు ఉండగా.. 4.7 కిలోమీటర్ల వరకు మెట్రో అలైన్‌మెంట్‌ను దృష్టిలో ఉంచుకుని డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్‌గా తీర్చిదిద్దటానికి అవసరమైన వి ధంగా డిజైన్లు, అంచనాల రూపకల్పన బాధ్యతను ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్‌కే ఎన్‌హెచ్ అధికారులు అప్పగించారు. డబుల్ డెక్కర్‌కు అదనంగా అయ్యే ఖర్చును ఎవరు భరిస్తారన్నది కూడా చర్చనీయాంశంగా మారుతోంది. ఫ్లై ఓవర్ వరకు అయ్యే ఖర్చును ఎన్‌హెచ్ భరించాల్సి ఉంటుంది. మెట్రో రైల్ కార్పొరేషన్‌కు ప్రస్తుతం దీని ఖర్చు భరించే పరిస్థితి లేదు. దీంతో మినిస్ట్రీ ఆఫ్ రోడ్డు ట్రాన్స్‌పోర్టు అండ్ హైవేస్ (మోర్త్) శాఖ మిగతా 6లో..



నిమ్మకూరులో బాలయ్య

సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తన స్వగ్రామమైన నిమ్మకూరులో మంగళవారం సందడి చేశారు. సమీప బంధువుల ఇంట్లో కొంత సమయం గడిపిన ఆయన గ్రామంలోని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. 8లో

అభివృద్ధిలో సహకార పాత్ర కీలకం

- రేపటి నుంచి సహకార వారోత్సవాలు
- ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ నిధి మీనా 8లో

విజయవాడ తూర్పు బైపాస్‌లో ఆప్షన్-2నే ప్రతిపాదించాం

ఆప్షన్ -1,3 అనే ప్రచారాలు అవాస్తవం

- రైతులను గందరగోళ పరిచే ప్రకటనలపై ఎన్‌హెచ్ ఆగ్రహం
- రియల్ ఎస్టేట్‌ను దృష్టిలో పెట్టుకుని తప్పుదారి పట్టించవద్దని విజ్ఞప్తి
- కేంద్రం నిర్ణయం తర్వాతే .. స్పష్టత వస్తుందని ప్రకటన

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ తూర్పు బైపాస్ అలైన్‌మెంట్‌పై వస్తున్న ఊహాగానాలపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతిపాదిత ఆప్షన్లలో ఆప్షన్ - 2ను మాత్రమే కేంద్ర ప్రభుత్వానికి ఎన్‌హెచ్ అధికారులు రికమండ్ చేస్తూ ప్రతిపాదించగా.. ఆప్షన్ - 3ని రికమండ్ చేసినట్టుగా సోషల్ మీడియాలో ప్రచారం జరగటాన్ని ఖండిస్తున్నారు. ఈ ప్రచారాలు వాస్తవం కాదని చెబుతున్నారు. తాము ఆప్షన్- 2ను మాత్రమే కేంద్ర ప్రభుత్వానికి రికమండ్ చేశామని, ఇంకా కేంద్ర ప్రభుత్వం నుంచి ఆమోదం రాలేదని పేర్కొంటున్నారు. అతి త్వరలో కేంద్ర ప్రభుత్వం నుంచి ఆమోదం లభిస్తుందని అప్పటి వరకు లేని పోని అపోహలకు తావివ్వవద్దని విజ్ఞప్తి చేస్తున్నారు.

కావాలనే తప్పుడు ప్రచారం

సోషల్ మీడియాలో కొందరు తూర్పు బైపాస్‌ను తప్పుదోవ పట్టించేలా ఆప్షన్- 1 కు ఆమోద ముద్ర వేశారని, ఆప్షన్-3కి ఆమోద ముద్ర వేశారని ఇలా రకరకాలుగా ప్రచారం చేయటంతో భూములిచ్చే రైతుల్లో అనవసర గందరగోళానికి తావిస్తున్నారన్నది ఎన్‌హెచ్ అధికారుల వాదన. ఆప్షన్- 2కు సంబంధించి తాము స్టేక్ హోల్డర్స్‌తో సమావేశం కూడా పెట్టుకోవటం జరిగిందని, కేంద్రానికి దీనిపైనే నివేదిక అందించామని అధికారులు చెబుతున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని పెంచేందుకు కొంత మంది కావాలనే పొట్టిపాడు - కాజా అలైన్‌మెంట్ విషయంలో ఆప్షన్ - 1, 3 దగ్గర సర్వే జరుగుతోందని, పెగ్ మార్కింగ్ చేస్తున్నారంటూ ప్రచారం చేస్తున్నారు.. ఇది వాస్తవం కాదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. పొట్టిపాడు నుంచి కాజ వరకు కన్సల్టెన్సీ మూడు ఆప్షన్లను సూచిస్తూ డీపీఆర్ రూపొందించిందని, ఇందులో భవన నిర్మాణాలకు నష్టం వాటిల్లకుండా భూములు మాత్రమే సేకరించగలిగే ఆప్షన్-2ను మాత్రమే కేంద్రానికి ప్రతిపాదించినట్లు చెబుతున్నారు. కేంద్రం స్థాయిలోనే ఎలాంటి నిర్ణయమైనా తీసుకోవాల్సి ఉంటుందని, అతి త్వరలో ప్రకటన వస్తుందని భావిస్తున్నామని, ఈ లోపు అనవసర గందరగోళాలకు తావిచ్చి రైతులను ఇబ్బంది పెట్టవద్దని ఎన్‌హెచ్ అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎలివేటెడ్‌లో మార్పులు!



ఇంద్రకీలాద్రి పరిస్థితి మామూలు రోజుల్లో ఒకలా, శరన్నవ రాత్రులు, భవానీ దీక్షల సమయంలో మరోలా ఉంటుంది. ఉత్సవాల్లో అయినా, మామూలు రోజుల్లో అయినా విధానం ఒకేలా ఉండాలని మాస్టర్ ప్లాన్ రూపొందించారు. ఎలివేటెడ్ క్యూ కాంప్లెక్స్ నిర్మాణం ఇందులో ఒక భాగం. దర్శనానికి వచ్చే భక్తులను ఈ కాంప్లెక్స్ నుంచి పంపాలన్నది మాస్టర్‌ప్లాన్ స్కెచ్. ఇప్పుడు ఇందులో మార్పులు చేయాలన్న వాదన తెరపైకి వస్తోంది.

మాస్టర్ ప్లాన్‌లో ఎలివేటెడ్ క్యూ కాంప్లెక్స్

- కనకదుర్గనగర్ ప్రారంభం నుంచి గోశాల వరకు క్యూ లైన్
- గోశాలకు వెనుక భాగంలో కంపార్ట్‌మెంట్ల నిర్మాణం
- ఇందులో మార్పులు అవసరమని తెరపైకి వస్తున్న వాదన
- ఎలివేటెడ్ క్యూను మహామండపం క్యూలైన్‌కు అనుసంధానం చేయాలన్న ఆలోచన

త్వరలో దీనిపై ఉన్నత స్థాయిలో చర్చలు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) మల్లికార్జున మహామండపం వద్ద మాస్టర్ ప్లాన్‌లో రూపొందించిన భవనాల పనులు సాగుతున్నాయి. మల్లేశ్వరస్వామి ఆలయం మెట్ల వద్ద అన్నదానం కాంప్లెక్స్ నిర్మిస్తున్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల కారణంగా కొన్ని రోజులు పనులను నిలుపుదల చేశారు. మళ్లీ వాటిని మొదలుపెట్టిస్తున్నారు. ఇది కాకుండా గోశాలకు చెంతనే ప్రసాదాల పోటు భవనాన్ని నిర్మిస్తున్నారు. ఈ రెండింటితోపాటు కనకదుర్గనగర్ ప్రవేశద్వారం నుంచి నిర్మించాలనుకున్న ఎలివేటెడ్ క్యూ కాంప్లెక్స్ పనులు ఇంకా ప్రారంభం కాలేదు. దీనికి అవసరమైన మేరకు గొయ్యిని తవ్వి సిమెంట్ బూడిదను వేశారు. ఇప్పుడు ఈ ఎలివేటెడ్ క్యూ కాంప్లెక్స్ నిర్మాణంలో మార్పులు చేయాలన్న వాదన వినిపిస్తోంది.

ఇదీ ప్రస్తుత ప్లాన్

మహామండపానికి పక్కనే కొత్తగా ఒక క్యూ కాంప్లెక్స్ నిర్మాణం చేయబోతున్నారు. మహామండపానికి చెంతన పాత మెట్ల మార్గం ఉంది. దీనికి పక్కన ఖాళీ స్థలం ఉంది. ఇక్కడే పోటు భవనం నిర్మాణపు పనులు జరుగుతున్నాయి. దీనికి అనుబంధంగా తిరుమల మాదిరిగా కంపార్టుమెంట్లు నిర్మించాలని భావించారు. ఇదే స్కెచ్‌ను మాస్టర్‌ప్లాన్‌లో చూపించారు. ఈ కాంప్లెక్స్‌ను మహామండపం ఎత్తునకు సమానంగా బహుళ అంతస్తుల్లో నిర్మిస్తారు. భక్తులకు కూర్చునేందుకు వీలుగా కంపార్టుమెంట్లు ఏర్పాటు చేస్తారు. దసరా, భవానీ దీక్షల సమయంలో భక్తులు భారీ సంఖ్యలో వస్తారు. ఆయా కంపార్టుమెంట్లలో కూర్చోబెడతారు. ఒక కంపార్టుమెంట్‌లోని భక్తులను దర్శనానికి వదిలినప్పుడు తర్వాత మరో కంపార్టుమెంట్‌లోని భక్తులను ఖాళీ అయిన కంపార్టుమెంట్‌లోకి పంపుతారు. మామూలు రోజుల్లో భక్తులు ఇటు కనకదుర్గనగర్ నుంచి, ఘాట్‌రోడ్డు మార్గాన దర్శనానికి వెళ్తారు. శరన్నవరాత్రులు, భవానీ దీక్షల సమయంలో మాత్రం ఘాట్‌రోడ్డు మార్గంలో మాత్రమే దర్శనానికి వెళ్లాల్సి ఉంటుంది. దీనికోసం వినాయకుడి ఆలయం నుంచి క్యూలైన్లు ఏర్పాటు చేస్తారు. అన్ని రోజుల్లోను ఒకేలా ఉండేలా ఎలివేటెడ్ క్యూ కాంప్లెక్స్‌ను నిర్మించాలని నిర్ణయించారు. కనకదుర్గనగర్ ప్రవేశద్వారం నుంచి ఈ ఎలివేటెడ్ క్యూను నిర్మించి, గోశాల వద్ద నిర్మించే కంపార్ట్‌మెంట్లు ఉన్న భవానికి అనుసంధానం చేయాలని మాస్టర్‌ప్లాన్‌లో చూపించారు. దీనికి వ్యయం రూ.13 కోట్లు అవుతుందని అంచనా వేశారు.

మహామండపానికే కలిపేస్తే!

ఎలివేటెడ్ క్యూ నిర్మాణానికి ఇంకా పునాదులు పడలేదు. గోతులు మాత్రమే తవ్వారు. ఇప్పుడు దీని విషయంలో కొత్త అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం మల్లికార్జున మహామండపం మెట్ల నుంచి క్యూలైన్ ఉంది. ఇక్కడ నుంచి ఏడో అంతస్తు వరకు ఈ క్యూలు ఉన్నాయి. కనకదుర్గనగర్ నుంచి నిర్మించే ఎలివేటెడ్ క్యూను మహామండపం నుంచి ఉన్న క్యూలకు అనుసంధానం చేయాలన్న వాదన కొత్తగా వినిపిస్తోంది. ఇప్పటికే ఈ విషయం దేవస్థాన అధికారుల దృష్టికి వెళ్లింది. వైసీపీ ప్రభుత్వ పదవీ కాలం ముగుస్తున్న సమయంలో మాస్టర్‌ప్లాన్‌ను ఆమోదించారు. ప్రస్తుతం దీని ప్రకారమే భవన నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇందులో రూపొందించిన ఎలివేటెడ్‌లో మార్పులు చేయాలంటే ప్రభుత్వం దృష్టికి విషయాన్ని తీసుకెళ్లాల్సి ఉంటుంది. దేవదాయ శాఖ ఉన్నతాధికారులతో చర్చించిన తర్వాత తుది నిర్ణయం తీసుకునే యోచనలో దేవస్థాన అధికారులు ఉన్నారు.

చంపేస్తున్నాయ్!

» పిల్లలపై రెచ్చిపోతున్న గ్రామసింహాలు » రోడ్డుపైకి వెళ్లాలంటేనే భయపడిపోతున్న ప్రజలు





సోమవారం కుక్కల దాడిలో మృతి చెందిన బాలుడు



మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్

(పెనుగంచిప్రోలు, ఆంధ్రజ్యోతి)
గ్రామాల్లో విచ్చలవిడిగా తిరు గుతున్న వీధి కుక్కలు పసిపిల్లల ప్రాణాలు తీసేస్తున్నాయి. అభం శుభం తెలియని చిన్నారులు ఆడుకునేందుకు వీధిలోకి వస్తే చాలు మూకుమ్మడిగా దాడి చేస్తున్నాయి. రాత్రివేళల్లో ప్రజలు ఒంటరిగా వెళ్లాలంటేనే భయపడిపోతున్నారు. ప్రతి వీధిలోనూ పదుల సంఖ్యలో కుక్కలు సంచరిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తున్నాయి.

సోమవారం కుక్కల దాడిలో రెండేళ్ల బాలుడు మృతి చెందడంతో ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఘటన ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు తుఫాన్ కాలనీలో అప్పటి వరకు ఇంటి ముందు ఆడుకుంటున్న బాలుడిని వీధికుక్కలు వెంటాడి కరిచి చంపేశాయి. బాలతోటి గోపాలరావు-నాగమణి దంపతులకు ఎనిమిదేళ్ల తర్వాత ప్రేమ్‌కుమార్ పుట్టాడు. ఒక్కగానొక్క సంతానం కావటంతో తల్లిదండ్రులు అల్లారుముద్దుగా చూసుకుంటున్నారు. గోపాలరావు స్థానిక స్టేషన్ సెంటర్‌లో సెల్‌ఫోన్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. తల్లి నాగమణి వ్యవసాయ కూలీ. సోమవారం సాయంత్రం తల్లి ఇంట్లో ఉండగా, ప్రేమ్‌కుమార్ ఆడుకుంటూ రోడ్డుపైకి వచ్చాడు. అక్కడికి సమీపంలోనే గుంపులుగా ఉన్న వీధి కుక్కలు ప్రేమ్‌కుమార్‌ను సమీపంలోని ఖాళీ స్థలంలోకి లాక్కెళ్లి దాడి చేశాయి. అంతలో తల్లి వచ్చి కుమారుడు కోసం వెతుకుతుండగా, కుక్కల దాడిలో గాయపడి ఉన్న ప్రేమ్‌కుమార్‌ను అటుగా వెళుతున్న చర్చి ఫాదర్ గమనించాడు. అప్పటికే అపస్మారక స్థితిలో ఉన్న ప్రేమ్‌కుమార్‌ను స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చూపించి పరిస్థితి విషయమించటంతో నందిగామ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ప్రేమ్‌కుమార్ మృతిచెందాడు. ఒక్కగానొక్క కొడుకు మృతి ఆ తల్లిదండ్రులకు తీరని శోకాన్ని మిగిల్చింది. గ్రామస్థులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకొని ప్రేమ్‌కుమార్ భౌతికకాయాన్ని చూసి భోరున విలపించారు. జగ్గయ్యపేట సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ ఎం.ఎస్.కె.అర్జున్, వీఆర్వో చైతన్య వివరాలను నమోదు చేసుకున్నారు. బాలుడి మృతితో తుఫాన్ కాలనీలో విషాద ఛాయలు అలముకున్నాయి. ప్రేమ్‌కుమార్ భౌతికకాయానికి జగ్గయ్యపేట ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మంగళవారం మధ్యాహ్నం తల్లిదండ్రులకు అప్పగించారు. బాలుడు భౌతికకాయాన్ని ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ సందర్శించి నివాళులర్పించారు. ప్రేమ్‌కుమార్ భౌతికకాయానికి కుటుంబసభ్యులు, బంధువులు మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

కాలనీవాసుల ఆందోళన

గ్రామంలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉందని స్థానిక పాత సినిమా హాలు సెంటర్‌లో తుఫాన్ కాలనీ వాసులు రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు. పంచాయతీ వారు ఇప్పటికైనా స్పందించి కుక్కల బెడదను నివారించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రేమ్‌కుమార్ తల్లిదండ్రులకు పెనుగంచిప్రోలుకు చెందిన ఆర్యవైశ్య ప్రముఖుడు, టీడీపీ నేత స్వామి మురళీకృష్ణ రూ.10 వేలు సాయమందించారు.



కొరియా బృందంతో సీఎం చంద్రబాబు

సమర్థ్ ప్రాజెక్టు ప్రారంభం

» సీఎం చంద్రబాబును కలిసిన కొరియా బృందం

వన్‌టౌన్/ఆటోనగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కొరియా సహకారంతో సుస్థిర సంస్థల పురోగతికి విజయవాడలో మంగళవారం జరిగిన ఒక కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరైన సమర్థ్ ప్రాజెక్టును దక్షిణ కొరియా రాయబారి లింగ్‌సాంగ్ వూ మంగళవారం ప్రారంభించారు. ఆయన నేతృత్వంలోని ఆరుగురు కొరియన్ ప్రతినిధుల బృందం నగరంలోని అలీప్ పారిశ్రామిక వాడను సందర్శించి అనంతరం సీఎం చంద్రబాబు నాయుడును కలిసింది. ఆంధ్రప్రదేశ్‌లోని సంస్థలు కొరియా ఇంటర్నేషనల్ కో-ఆపరేషన్ ఏజెన్సీ ద్వారా నిధులు సమకూర్చటానికి సిద్ధమయ్యాయి. భారత, కొరియా ద్వైపాక్షిక సహకారం గురించి డైరెక్టర్ డూచాన్ చాంగ్ మాట్లాడుతూ, ఇరు దేశాల సుస్థిర అభివృద్ధికి ఇది ఒక మైలురాయి అన్నారు. కోస్మే డైరెక్టర్ జె క్యోంగ్ లీ మాట్లాడుతూ, పరస్పర సహకారంతో సుస్థిర సంస్థల పురోగతికి తోడ్పడుతూ రెండు దేశాలను ప్రపంచ పటంలో ఉన్నత స్థానంలో నిలుపవచ్చన్నారు. ఒడిసా రాష్ట్ర ప్రతినిధులు ప్రభాకర్‌రావు, అన్వేషి రౌత్, ఆంధ్రప్రదేశ్ ప్రతినిధులు నందినీ సవారియా, వైదేహి, చంద్రిమా చటర్జీ, డాక్టర్ పిడికిటి జ్యోతిరావు, కొరియా నిపుణులు జెడాంగ్ కాంగ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ రామగిరి బిజినెస్ సలహాదారు సాంగ్ గీ హాంగ్, డాక్టర్ బ్యాంకింగ్ డే చోయ్, అలీప్ సంస్థల అధ్యక్షురాలు, ముఖ్య కార్య నిర్వహణ అధికారి కె.రమాదేవి, తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు నిర్వహించిన వర్క్‌షాప్‌లో మహిళల సాధికారిత కోసం చేస్తున్న వివిధ కార్యక్రమాల గురించి కొరియన్ ప్రతినిధుల బృందానికి రమాదేవి వివరించారు. భారత సుస్థిర సంస్థల ప్రోత్సాహక సంస్థ ముఖ్య సాంకేతిక సలహాదారు సుదీప్త భద్ర మాట్లాడుతూ, కొరియా సహకారంతో సుస్థిర సంస్థల పురోగతికి సంబంధించిన కీలక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా అలీప్ సంస్థ ద్వారా శిక్షణ పొందిన మహిళలు తయారుచేసిన వస్తువులను ప్రదర్శించారు.



పాండురంగస్వామికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి రవీంద్ర

పాండురంగని ఉత్సవాలకు ఏర్పాట్లు

» పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి రవీంద్ర

మచిలీపట్నం టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పాండురంగస్వామి బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, ఉత్సవాలను వైభవంగా జరుపుతున్నామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మంగళవారం చిలకలపూడి పాండురంగస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా మంత్రి కుటుంబసమేతంగా ఆలయానికి విచ్చేసి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ప్రత్యేక అర్చనల్లో మంత్రి రవీంద్ర ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, జనసేన నేత బండి రామకృష్ణలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పాండురంగస్వామి ఉత్సవాలకు పూర్వవైభవం కల్పిస్తున్నామన్నారు. బుధవారం స్వామి వారి రథోత్సవంలో నగర ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. కూటమి నేతలు పంచపర్వాల కాశీవిశ్వనాథం, పిప్పళ్ల కాంతారావు, రత్నారావు, లంకే శేషగిరి, కుంచేనాని, కొట్టె వెంకట్రావు పాల్గొన్నారు.



పవిత్ర సంగమం వద్ద కోతకు గురైన కృష్ణవేణమ్మ పాదుకలు

కార్తీక పౌర్ణమికి కానరాని ఏర్పాట్లు!

» సాగర తీరం వద్ద అధికారుల పర్యవేక్షణ కరవు

కోడూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 15వ తేదీన కార్తీక పౌర్ణమి వస్తున్నప్పటికీ హంసలదీవి సాగర తీరాన ఏర్పాట్లు కానరావటం లేదు. కార్తీక పౌర్ణమికి సుమారు 12 వేలమంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తారు. కృష్ణమ్మ సముద్రుడిలో కలిసే పవిత్ర పుణ్యక్షేత్రం వద్ద కార్తీక స్నానాలు ఆచరించేందుకు భక్తులు ఆసక్తి చూపుతారు. పవిత్ర సంగమం హంసలదీవి, కృష్ణా సంగమ ప్రదేశం, సముద్ర పరీవాహక ప్రాంతంలో భక్తులు స్నానాలు ఆచరించేందుకు కనీస ఏర్పాట్లపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. వైసీపీ ప్రభుత్వంలో సాగర తీరం వద్ద అభివృద్ధి, కనీస ఏర్పాట్లపై నాటి పాలకులు శ్రద్ధ చూడకపోవటంతో భవనాలు శిథిలావస్థకు చేరాయి. పవిత్ర సంగమం వద్ద కృష్ణవేణి పాదాలు కోతకు గురయ్యాయి. జల్లు స్నానాల ఏర్పాట్లు చేయకపోవడంతో అధికారులపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం హంసలదీవి సంగమ ప్రదేశాన్ని డేంజర్ జోన్‌గా చిత్రీకరించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సాగర తీరం వద్ద మరుగుదొడ్లు ఎప్పుడూ తాళాలు వేసే ఉంటున్నాయి. డాల్ఫిన్ భవనాన్ని వదిలేశారు. సముద్ర తీరానికి వెళ్లే రోడ్డు మార్గానికి కనీస మరమ్మతులు లేవు. కార్తీక పౌర్ణమికి భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు ఏర్పాట్లు చేయాలని భక్తులు కోరుతున్నారు.

దైన్యస్థితిలో గురుకుల పాఠశాల



సింక్‌లో పేరుకుపోయిన ఆహార వ్యర్థాలు

» అస్తవ్యస్తంగా పారిశుద్ధ్య నిర్వహణ
» ప్రశ్నించిన విద్యార్థినులపై ఉపాధ్యాయుల జులుం
» మరుగుదొడ్లు శుభ్రం చేయాలని హుకుం
» ఎక్కడి చెత్త అక్కడే.. ప్రిన్సిపాల్ నిర్లక్ష్య ప్రవర్తన
» పిల్లల పరిస్థితిపై తల్లిదండ్రుల ఆందోళన

పేదల పిల్లలంటే అందరికీ అలుసే.. ప్రభుత్వ వసతిగృహాలు, గురుకులాల్లో చదువుకునేందుకు వచ్చే వారిపై అక్కడి సిబ్బంది తీరు అమానుషం. అపరిశుభ్ర వాతావరణంలో పిల్లలను ఉంచుతారా అని విద్యార్థినుల తల్లిదండ్రులు ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బందిని నిలదీస్తున్నారు.

(గుడివాడ/గుడివాడరూరల్ ఆంధ్రజ్యోతి)
గుడివాడ మండలం మోటూరులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల ఆది నుంచి వివాదాలకు కేంద్రంగా నిలిచింది. పాఠశాలలో కనీస వసతులు లేవని.. మరుగుదొడ్లు కంపుకొడుతున్నాయని.. భోజనంలో పురుగులు వస్తున్నాయని.. మరుగుదొడ్లకు తలుపులు లేవని, ఆవరణలో చెత్తను తొలగించాలని.. ట్యాప్‌లో నీళ్లు రావడం లేదని.. ఇలాంటి సమస్య ఏదైనా చెబితే వారి పరిస్థితి అంతే. ప్రశ్నించిన వారే మరుగుదొడ్లను కడగాలి. పై అంతస్తుకు నీటిని తీసుకువెళ్లాలి. 100 గుంజీలు తీయాలి. ఈ శిక్షలను ఇక్కడి విద్యార్థినులపై అమానుషంగా అమలుచేస్తుంటారు. పిల్లల పట్ల ప్రిన్సిపాల్ సహా ఉపాధ్యాయులు క్రూరంగా ప్రవర్తిస్తారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పిల్లలను చూసేందుకు వచ్చిన తల్లిదండ్రులకు బాధలు చెప్పుకుంటే ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు వారిపై విరుచుకుపడతారు. సమస్యలను పరిష్కరించకుండా విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యధోరణిగా వ్యవహరిస్తున్నారు. ఏదైనా దుర్ఘటనలు జరిగినప్పుడు మాత్రం హడావుడి చేయడం, సమస్యను పక్కదారి పట్టించి చేతులు దులుపుకోవడం ఇక్కడ పరిపాటిగా మారింది.

రాష్ట్ర ప్రభుత్వం బాలికా విద్యను ప్రోత్సహిస్తూ వారి కోసం ప్రత్యేకంగా వసతిగృహాలు, గురుకులాలను ఏర్పాటు చేసింది. అక్కడ మౌలిక వసతులను కల్పించి ఆహ్లాదకర వాతావరణంలో నాణ్యమైన విద్యాబోధన ఉండాలని ఏర్పాట్లు చేసింది. ఇదే క్రమంలో మోటూరులో బాలికల గురుకుల పాఠశాల ప్రారంభించింది.

ఎక్కడ చూసినా చెత్తే..

గురుకుల పాఠశాలలో ఎక్కడ చూసినా చెత్త దర్శనమిస్తున్నది. అపరిశుభ్ర వాతావరణంతో విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. వంటశాల, షింక్‌లలో ఆహార వ్యర్థాలను తొలగించకపోవడంతో డైనింగ్ హాల్ కంపుకొడుతోంది. మరుగుదొడ్ల పరిస్థితి మరీ దారుణం.. తలుపులు లేక తీవ్ర దుర్గంధంతో విద్యార్థినులు బెంబేలెత్తిపోతున్నారు. పారిశుద్ధ్య సిబ్బంది లేకపోవడంతో మరుగుదొడ్లను పిల్లలతోనే కడిగిస్తున్నారు. పాఠశాల తరగతి, వసతి గదుల వద్ద పెద్దఎత్తున చెత్త దర్శనమిస్తున్నది. ఆహారంలో పురుగులు వస్తున్నాయని చెబితే ఎవరికీ రాని పురుగులు నీకే వచ్చాయా.. అంటూ పిల్లలను గదమాయిస్తుండటంతో చేసేది లేక నోరు కట్టేసుకుంటున్నారు.

● నోరు తెరిచి అడిగితే ఆ శిక్షలే వేరు..

తాగునీరు రావడం లేదంటే ఫిర్యాదు చేసిన వారే నీళ్లను మోసుకువెళ్లాలి. పాఠశాలలో విద్యార్థినులపై జరుగుతున్న దాష్టీకాలను బయటకు చెబితే వీపు విమానం మోగుతుంది. కనీసం తమ అవస్థలను తల్లిదండ్రులకు కూడా చెప్పుకోవడానికి వీలు లేదు. చెబితే ఉపాధ్యాయులే శిక్షలు అమలు చేస్తుంటారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. కనీస వసతులు లేవని అడిగినందుకు 100గుంజీల శిక్షను విధించినట్లు భోరున విలపించారు. విద్య బాగానే ఉన్నా ఉపాధ్యాయులు విధించే శిక్షలను తట్టుకోలేకపోతున్నామని కన్నీటిపర్యాంతమవుతున్నారు.

● గుడివాడ నుంచి ఉపాధ్యాయులు..

నిబంధనల ప్రకారం తప్పనిసరిగా ఉపాధ్యాయులు గురుకులంలోనే నివాసముండాలి. కానీ ఇక్కడ ఎవరూ పాటించడం లేదు. అధిక శాతం ఉపాధ్యాయులు గుడివాడ నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. పాఠశాలపై పర్యవేక్షణ కొరవడటంతో ఎవరికి వారు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు.

● మిగిలిన ఆహారాన్ని అమ్మేస్తున్నారు!

గురుకులంలో పిల్లలు తినగా మిగిలిన ఆహారాన్ని సైతం అమ్ముకుంటున్నట్టు సమాచారం. వీటిని తీసుకువెళ్లేందుకు శేరీగొల్లేపల్లికి చెందిన చేపలచెరువు రైతు ప్రతి నెల రూ.30వేలు చెల్లిస్తున్నట్టు గ్రామంలో గుసుగుసలు వినవస్తున్నాయి.

● తల్లిదండ్రుల ఆగ్రహం

గురుకులంలో గత ఆదివారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. తమ పిల్లలు పడుతున్న బాధలు, కష్టాలు తెలుసుకుని వారిలో ఆవేశం కట్టలు తెంచుకుంది. ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులను నిలదీశారు. తమ పిల్లలతో వెట్టిచాకిరి చేయిస్తారా అని నిలదీశారు. కొందరు అక్కడి మరుగుదొడ్ల పరిస్థితి, అపరిశుభ్ర వాతావరణాన్ని సెల్‌ఫోన్లలో చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పెట్టారు. అయిన పరిస్థితిలో మార్పు రాలేదు.

● విద్యాశాఖ అధికారుల తనిఖీలు..

సామాజిక మాధ్యమాల ద్వారా దారుణాలను తెలుసుకున్న విద్యాశాఖాధికారులు మోటూరు గురుకులానికి వెళ్లి తనిఖీలు చేపట్టారు. అక్కడి పరిస్థితులు, పిల్లల అవస్థలను చూసి అవాక్కయ్యారు. అపరిశుభ్ర వాతావరణంలో తమ చిన్నారులు రోగాల బారినపడే ప్రమాదముందని గుర్తించారు. సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తనిఖీలకు వచ్చిన ఎంఈవోలు విజయ్, బాలాజీలు తెలిపారు.

● ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదు..

- పేరెంట్స్ కమిటీ చైర్మన్ మొవ్వ అనీల్

గురుకులంలో అపరిశుభ్ర వాతావరణంపై స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. తరచు పిల్లలు జ్వరాల బారిన పడుతున్నారు. ఆహార వ్యర్థాలను నాలుగు రోజులుగా తొలగించడంలేదు. అధికారులు తక్షణమే బాధ్యులపై చర్యలు చేపట్టాలి.



పాఠశాల ప్రాంగణంలో పేరుకుపోయిన చెత్త



లోపలున్న చెత్తపై ఆరా తీస్తున్న అధికారులు



వంటశాలలో తనిఖీలు చేస్తున్న అధికారులు



ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న అధికారులు

బస్టాండ్‌లో.. సమస్యల తిష్ట!

» బస్‌స్టేషన్‌లో కానరాని వసతులు
» ప్రయాణికులకు తప్పని అవస్థలు
» ఆధునికీకరణ పేరుతో వైసీపీ పాలకుల నిర్లక్ష్యం
» కూటమి ప్రభుత్వంలో పూర్వ వైభవం తెస్తాం : వర్ల రాజా

టీడీపీ వ్యవస్థాపకుడు దివంగత ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీరామారావు మానస పుత్రికగా.. ఎంతో ముందుచూపుతో ఆయన స్వంత మండల కేంద్రం పామర్రులో ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన బస్టాండ్ నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రయాణికులకు ఎంతగానో సేవలందించింది. కాలక్రమంలో బస్టాండ్‌ను పట్టించుకునే నాథుడు లేక ఎంతో చరిత్రగల పామర్రు బస్టాండ్ రూపు కోల్పోయి.. పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలిచింది.



అసంపూర్తిగా బస్టాండ్ ఆధునీకరణ పనులు

(పామర్రు, ఆంధ్రజ్యోతి)
రెండు జాతీయ రహదారుల మధ్య జంక్షన్‌లో నాడు మహనీయుడు ఎన్టీఆర్ బస్ స్టేషన్‌కు 1984లో శంకుస్థాపన చేసి 1986 మార్చి 15న ప్రజలకు అంకితమిచ్చారు. నాటి నుంచి ప్రయాణికులతో నిత్యం ఎంతో రద్దీగా ఉండే బస్‌స్టేషన్.. ప్రస్తుతం కనీస వసతుల లేమితో కొట్టుమిట్టాడుతోంది. ప్రయాణికులకు కనీసం మరుగుదొడ్లు లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆధునికీకరణ పేరుతో సుమారు 20 మరుగుదొడ్లను అధికారులు కూల్చి వేసి వాటి స్థానంలో తాత్కాలికంగా రేకులతో నిర్మించినా ఇప్పటికీ ప్రయాణికులకు అందుబాటులోకి రాలేదు. తాగునీటి సౌకర్యం కూడా లేదు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం స్పందించి దివంగత ముఖ్యమంత్రి స్వంత మండల కేంద్రంలోని బస్‌స్టేషన్‌లో ప్రయాణికుల ఇబ్బందులను పరిష్కరించి పూర్వవైభవం తీసుకురావాలని కోరుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆధునీకరణ పేరుతో కోట్లాది రూపాయల దుర్వినియోగంపై విచారణ జరపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



1884లో దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ శంకుస్థాపన చేసిన శిలాఫలాకం

పూర్వ వైభవం తెస్తాం

ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా

పామర్రు బస్‌స్టేషన్‌కు పూర్వవైభవం తెచ్చేలా ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణతో ఇప్పటికే చర్చించాం. ఈ విషయంపై అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళతా. ఆధుకినీకరణపేరుతో గత వైసీపీ పాలకుల అవినీతిపై విచారణ జరిపించి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

ఫ్లైఓవర్‌కు రూ.700 కోట్లు!

(5వ పేజీ తరువాయి)

దీని భారాన్ని భరించే అవకాశం కనిపిస్తోంది.

రామవరప్పాడు నుంచి వదిలేయటం సరికాదు

రామవరప్పాడు రింగ్ రోడ్డు వరకు ప్రస్తుతం మెట్రో అలైన్‌మెంట్ వస్తోంది.. అక్కడి నుంచే డబుల్ డెక్కర్ గురించి ఆలోచిస్తామనటం సరికాదు. భవిష్యత్తులో ఏలూరు రోడ్డు, బందరు రోడ్డు కారిడార్లను ఎన్‌హెచ్ - 16 మీద అనుసంధానించాల్సిన పరిస్థితులు తలెత్తుతాయి. అప్పుడేం చేస్తారు? ఈ లోపు నిడమానూరు ఫ్లై ఓవర్ నిర్మాణం జరిగిపోతుంది. అప్పుడు ఎలా అనుసంధానం చేస్తారు ? ఈ ప్రశ్నలను దృష్టిలో ఉంచుకుని మొత్తం ఏడు కిలోమీటర్ల మేర కూడా డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్‌కు ప్రతిపాదించాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే రామవరప్పాడు రింగ్ రోడ్డు నుంచి మహానాడు జంక్షన్ వరకు కూడా ఈ ఫ్లై ఓవర్ ఉంటుంది. ఇక్కడి వరకు డబుల్ డెక్కర్ పొడిగించకపోతే.. భవిష్యత్తులో పక్కగా వేయాల్సి వస్తుంది. సర్వీసు రోడ్డులో వేయలేరు కానుక గ్రీన్ బెల్ట్‌లోకి తీసుకు వెళ్లాల్సి వస్తుంది. అది కూడా మహానాడు జంక్షన్ వరకు మాత్రమే చేయగలరు. మహానాడు జంక్షన్ నుంచి మళ్లీ సెంట్రల్ డివైడర్ మీదుగానే వెళ్లాల్సి ఉంటుంది. ఎందుకంటే రెండు వైపులా బెంజిసర్కిల్ ఫ్లై ఓవర్లు ఉంటాయి. రామవరప్పాడు రింగ్ నుంచి మహానాడు జంక్షన్ వరకు అలైన్‌మెంట్ దారితప్పినట్టుగా ఉంటుంది. దీనిని కూడా ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ అధికారులు పరిగణనలోకి తీసుకుని తుది అంచనాలు తయారు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బూడిదతో కాసుల వేట

(5వ పేజీ తరువాయి)

ఎత్తులో ఎకరం భూమిలో పెద్ద ఎత్తున్న బూడిదను అక్రమంగా డంప్ చేసి 200 మిషన్ పెట్టి అక్రమంగా పగలు, రాత్రి తేడా లేకుండా వ్యాపారం సాగిస్తున్నారు.

వరదలను వరంగా మార్చుకుని..

మూడు మాసాల కిందట బుడమేరు, కృష్ణానదికి వచ్చిన వరదలు సైతం బూడిద అక్రమార్కులకు వరంలా మారాయి. ఇబ్రహీంపట్నం, జి.కొండూరు, మైలవరం మండలాల్లో ఉన్న ఇటుక బట్టీల్లో నిల్వ ఉంచిన బూడిద మొత్తం వరదలకు కొట్టుకుపోయింది. దీంతో ఇటుకల తయారీకి బూడిద లేక బట్టీల నిర్వాహకులు అల్లాడిపోతున్నారు. దీంతో బూడిద రవాణా చేసే వారు ఎంత చెబితే అంతకు బూడిదను కొనుక్కోవాల్సి వస్తుందని పలువురు బట్టీల నిర్వాహకులు వాపోతున్నారు.

వాయు కాలుష్యం కోరల్లో పచ్చని పల్లెలు

ఇలా డంపింగ్ పెట్టిన బూడద పెద్ద ఎత్తున గాలికి లేచి సమీపంలో ఉన్న ఊళ్ల మీద పడుతుందని ఆయా గ్రామాల ప్రజలు అల్లాడిపోతున్నారు. ఇక డంపింగ్ యార్డ్‌ల పక్కన ఉన్న పంట పొలాలు బూడిదతో దెబ్బంతింటున్నాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొగ మంచుతో పాటు పైకి లేస్తున్న బూడిద కలిసిపోయి తీవ్రమైన వాయు కాలుష్యంగా మారడంతో జనం అల్లాడిపోతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు, ఎన్టీటీపీఎస్ యాజమాన్యం స్పందించి బూడిదను అక్రమంగా డంపింగ్ చేసి సొమ్ములు చేసుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వెంటనే చర్యలు చేపడతాం

- వెంకటేశ్వర్లు, తహసీల్దార్ ఇబ్రహీంపట్నం

బూడిద అక్రమ నిల్వలపై దాడులు చేసి చర్యలు తీసుకుంటాం. వెంటనే ఆయా వీఆర్వోలకు ఆదేశాలు ఇచ్చి అక్రమంగా నిల్వ ఉంచిన బూడిదను సీజ్ చేయిస్తాం. ఎవరైనా అక్రమాలకు పాల్పడితే చూస్తూ ఊరుకునేది లేదు.

కార్పొరేషన్లలో కూటమి నేతలకు స్థానం

మచిలీపట్నం, నవంబరు12(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన కూటమి నేతలను కార్పొరేషన్ సభ్యులుగా నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. కళింగ కార్పొరేషన్ సభ్యుడిగా గుడివాడకు చెందిన మజ్జాడ నాగరాజు(టీడీపీ)ను నియమించారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ సభ్యుడిగా మచిలీపట్నం నియోజకవర్గానికి చెందిన మోటమర్రి వెంకటబాబాప్రసాద్(టీడీపీ), గుడివాడ నియోజకవర్గానికి చెందిన గోకవరపు వెంకట్(టీడీపీ), ఎన్టీఆర్‌జిల్లా నందిగామ నియోజకవర్గానికి చెందిన ఏచూరి రామకృష్ణ(టీడీపీ)లను నియమించారు. అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ సభ్యులుగా పెనమలూరు నియోజకవర్గానికి చెందిన పీతా గోపిచంద్(టీడీపీ), తిరుమలశెట్టి చంద్రమౌళి(జనసేన), ఒడుగు తులసీరావు(టీడీపీ)లను నియమించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	119, 128, 139
చికెన్ విత్ స్కిన్	224
చికెన్ స్కిన్‌లెస్	234

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 535

అడ్వాన్స్ టెక్నాలజీ ఇన్ బయాలజీపై రెండు రోజుల శిక్షణ

లబ్బీపేట, నవంబరు 12 (ఆంధ్ర జ్యోతి): సిద్ధార్థ మహిళా కళాశాలలో మంగళవారం కళాశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ మైక్రోబయాలజీ అండ్ బయోకెమిస్ట్రీ ఆధ్వర్యంలో పాస్టర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ లేబొరేటరీ గుంటూరు సహకారంతో అడ్వాన్స్ టెక్నాలజీ ఇన్ బయాలజీ అనే అంశంపై రెండు రోజుల శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రీసెర్చ్ సెంటర్ ఎండీ డాక్టర్ ఎం.గురవయ్య మోల్‌క్యులర్ టెక్నాలజీ ప్రాముఖ్యతను, పీసీఆర్ టెక్నాలజీ, ఐసోలేషన్ ఆఫ్ డీఎన్ఏ, ప్లాస్‌నిడ్ డీఎన్ఏ తదితర అంశాలతో పాటు ఆకుల నుంచి ఐసోలేష్ చేసే విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మాధవి పాల్గొన్నారు.



కనకదుర్గా నగర్ కాలనీ అంతర్గత రోడ్డులో



కరెన్సీనగర్ కాలనీ మురుగు కాల్వ సమీపంలో

దోమలతో ప్రజలు బేజారు

- పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలు
- పట్టించుకోని స్థల యజమానులు, అధికారులు
- ఆందోళనలో స్థానికులు

(భారతీనగర్,ఆంధ్రజ్యోతి)

నివాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలాలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడో డివిజన్ పరిధిలోని కరెన్సీనగర్ కాలనీ, శ్రీ రామచంద్రనగర్ కాలనీ, విజయలక్ష్మీ కాలనీ, గణేష్ నగర్, కనకదుర్గనగర్ తదితర కాలనీలోని అంతర్గత రోడ్లలో నివాసాల మధ్య అక్కడక్కడ ఖాళీ స్థలాలు ఉన్నాయి. ఈ స్థలాల విషయమై స్థల యజమానులు, సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో, రోడ్డుకు తక్కువ ఎత్తులో ఉండడంతో మురుగు నీరు, పచ్చగడ్డి, పిచ్చి మొక్కలు, చెత్త, ఇతర వ్యర్థాలు పేరుకుపోయాయి. ఈ ఖాళీ స్థలాల్లో మురుగు, పచ్చగడ్డి వలన దోమలు బాగా వృద్ధి చెందుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ దోమల వలన చిన్నారులు, వృద్ధులు ఎక్కడ అనారోగ్యానికి గురవుతారోనని భయభ్రాంతులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ముగిసిన సీబీఎస్ఈ రీజినల్ సైన్స్ ఎగ్జిబిషన్

విజేతలకు బహుమతులు ప్రదానం



గవర్నర్‌పేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నలంద విద్యానికేతన్ సెకండరీ విభాగంలో నిర్వహిస్తున్న సీబీఎస్ఈ రీజినల్ సైన్స్ ఎగ్జిబిషన్ మంగళవారం ముగిసింది. రెండు రోజుల పాటు నిర్వహించిన ఎగ్జిబిషన్‌లో వివిధ ప్రాంతాల నుంచి 40 సీబీఎస్ఈ పాఠశాలలకు చెందిన 120 మంది విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ వైజ్ఞానిక నమూనాలకు న్యాయనిర్ణేతలు విజేతలను ప్రకటించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎన్ఐసీ అడిషనల్ ఎస్ఐవో పి. చంద్రశేఖరన్ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విజ్ఞాన శాస్త్రం ప్రాముఖ్యత, దాని ప్రయోజనాలు వివరించారు. భవిష్యత్తు అవసరాలు తీర్చడానికి ప్రస్తుతతరాన్ని సిద్ధం చేయడానికి ఇటువంటి ప్రదర్శనలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. నలంద విద్యానికేతన్ ప్రిన్సిపాల్ మాదల పద్మజ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీపై అవగాహన

భారతీనగర్, నవంబరు 12 (ఆంధ్ర జ్యోతి): లయోలా ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం జాతీయ విద్యాదినోత్సవం సందర్భంగా నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గుడివాడకు చెందిన ఏఎన్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.శంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ 2020లోని నూతన విద్యా ప్రణాళికలను విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఫాదర్ జోజిరెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ డి. బాలస్వామి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఒ.మహేష్, విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మర్యాదపూర్వక కలయిక

భారతీనగర్, నవంబరు 12 (ఆంధ్ర జ్యోతి): నాయీ బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం బందర్‌రోడ్డులో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన వైద్యశాఖ మంత్రి సత్యకుమారు యాదవ్‌ను సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. నాయీ బ్రాహ్మణుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని, సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రచయిత, స్టేట్ కన్వీనర్, సూర్యపల్లి శ్రీనివాస్, ఏపీ చాప్టర్ నవజమాజ చారిటబుల్ సొసైటీ ప్రెసిడెంట్ గుంటుపల్లి ఉమామహేశ్వరరావు, నాయీ బ్రహ్మణ జనసేవా సమితి జిల్లా కన్వీనర్ తెన్నేటి సోమశేఖర్ పాల్గొన్నారు.



పుట్టగొడుగుల పరిశ్రమ సందర్శన

లబ్బీపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సిద్ధార్థ మహిళా కళాశాల విద్యార్థినులు మంగళవారం కళాశాల వృక్షశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో నున్నలోని పుట్టగొడుగుల పరిశ్రమను సందర్శించి, పుట్టగొడుగుల పెంపకం, వ్యాపార వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పరిశ్రమ నిర్వాహకురాలు పి.జ్యోతి మాట్లాడుతూ పుట్టగొడుగుల పరిశ్రమ ద్వారా ఎక్కువ లాభాలు వస్తాయని, ఆసక్తి గలవారు ఈ పరిశ్రమ పెట్టేందుకు ముందుకు రావాలని అన్నారు. ఈ సందర్భంగా పుట్టగొడుగుల పెంపకం, ఇక్కడ వాడే కంపోస్టు, ఇతర ఎరువుల వాడకం, పరిశ్రమ పెట్టేందుకు తీసుకోవలసిన చర్యలు, తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకురాలు టి.సలోమి, వి.ఐశ్వర్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేసి చూపించడం టీడీపీకే సాధ్యం

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

గుణదల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి నోచుకోని ప్రాంతాలను అభివృద్ధి చేసి చూపించడం టీడీపీ ప్రభుత్వానికే సాధ్యపడుతుందని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. స్థానిక రెండో డివిజన్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు గద్దె మంగళవారం భూమిపూజ చేశారు. 2వ డివిజన్‌లోని మాచవరం ప్రతిభానికేతన్ రోడ్డు, లక్ష్మీ స్వీట్స్ షాప్ పక్కన ఉన్న వాటర్ ట్యాంక్ రోడ్డులో డ్రెయినేజీ పనులకు, కార్మికనగర్లోని విజ్‌డమ్ స్కూల్ పక్క రోడ్డు కొండప్రాంతం మెట్లకు రైలింగ్ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను అనేక బడ్జెట్ సమావేశాల్లో పాల్గొన్నానని, బడ్జెట్ ప్రవేశపెట్టి గంట వ్యవధిలోనే చదవడం పూర్తయ్యేదన్నారు. అలాంటిది కూటమి ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను ఉదయం 10 గంటలు మొదలుకొని మధ్యాహ్నం ఒంటి గంట వరకు మంత్రులు బడ్జెట్‌ను



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

చదువుతునే ఉన్నారని చెప్పారు. జగన్ పాలనలో చంద్రబాబు ప్రతిపక్ష నేతగా సమర్థవంతంగా వ్యవహరించారన్నారు. ఆనాడు ప్రతిపక్ష హోదాకు సరిపడా ఎమ్మెల్యేల సంఖ్య ఉంది కాబట్టే టీడీపీకి ప్రతిపక్ష హోదా ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దాసరి గాబ్రియేల్, సుగసాని రత్నశ్రీ, వెలిశీల సురేష్‌బాబు, వేమన రవికుమార్, జనసేన నాయకులు ముత్యాల కృష్ణ, బీజేపీ నాయకుడు ఎలిశాల శ్రీనివాస్, బండారు చిన్ని పాల్గొన్నారు.

అయ్యప్పనగర్‌లో మహా అన్నదానం

పటమట: 12వ డివిజన్ అయ్యప్పనగర్ సుబ్రహ్మణేశ్వర స్వామి దేవాలయం వద్ద కార్తీక మాసాన్ని పురస్కరించుకుని మంగళవారం మహా అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులు తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, 12వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు శాయన సత్యనారాయణలు సంయుక్తంగా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుమారు 5వేల మంది భక్తులు అన్నదానాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ధనేకుల సత్యనారాయణ, అట్లూరి కిషోర్, పుప్పాల శాంతిబాబు, గుళ్లపల్లి వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు.



గురుమూర్తిని సన్మానించిన టీడీపీ బీసీ నాయకులు

వీరంకి వెంకట గురుమూర్తికి ఘన సత్కారం

వన్‌టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఏపీ గౌడ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియామకమైన వీరంకి వెంకట గురుమూర్తిని విజయవాడలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్ మాట్లాడుతూ అధికారం ఉన్నా లేకపోయినా పార్టీకి అంకితభావంతో గురుమూర్తి పనిచేశారన్నారు. టీడీపీ అంటేనే బీసీల పార్టీ అని కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తను చంద్రబాబు గుర్తిస్తారని, గౌరవిస్తారని అనడానికి గురుమూర్తి ఉదాహరణ అన్నారు. రాష్ట్రంలో ఉన్న గౌడ కులస్తుల అభివృద్ధికి గురుమూర్తి కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురుమూర్తికి పదవి ఇచ్చినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు, లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు ఈశ్వర్ పేరేపి, ఎరుబోతు రమణరావు, పామర్తి కిషోర్ బాబు, శొంఠి శివరామప్రసాద్ గౌడ్, కత్తుల మణికంఠ, మాదు శోభన్, మొకర ఆదిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ విజయసారథికి సన్మానం

భారతీనగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఉత్తమ అధ్యాపకుల అవార్డుల ప్రదానోత్సవంలో విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ విజయసారథి రాష్ట్ర ఉత్తమ ప్రిన్సిపాల్‌గా ఎంపికై అవార్డు తీసుకున్న సందర్భంగా మంగళవారం కళాశాల సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు కె.విజయభాస్కర్, శివప్రసాద్, నాయక్, నాగరాజు, కొండారెడ్డి, శైలజ, పద్మావతి, బీటీ ఆర్ కె. ప్రసాద్, మధుసూదన్‌రావు, రమణ, నాగార్జున, జయరామ్ పాల్గొన్నారు.



ప్రిన్సిపాల్ విజయసారథికి జ్ఞాపికను అందజేస్తున్న విభాగాధిపతులు విజయభాస్కర్, శివప్రసాద్, నాయక్ తదితరులు



14వ డివిజన్ దర్శిపేట ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్ పక్కనే చెట్లు కొమ్మలను నరికి అలా వదిలేశారు. గడిచిన ఐదు రోజుల నుంచి ఆ కొమ్మలు అలానే ఉన్నాయి.ఆ వ్యర్థాలు దోమలకు ఆవాసాలు కాకముందే, నరికిన చెట్ల కొమ్మలను సంబంధిత అధికారులు వెంటనే తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.
(భారతీనగర్, ఆంధ్రజ్యోతి)

అవార్డు మరింత బాధ్యతను పెంచింది

డాక్టర్ వెంకట సూర్యబాలసుబ్రహ్మణ్యం

గుణదల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందించిన ఉత్తమ అధ్యాపక అవార్డు తనలో మరింత బాధ్యతను పెంచిందని ఉత్తమ అధ్యాపక అవార్డు గ్రహీత డాక్టర్ వెంకట సూర్యబాలసుబ్రహ్మణ్యం అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా సోమవారం ఉత్తమ అధ్యాపక అవార్డును అందుకున్న ఎస్ఆర్ఆర్ కళాశాల పరిపాలన విభాగం అధ్యాపకుడు డాక్టర్ వెంకట సూర్య బాలసుబ్రహ్మణ్యంకు సన్మాన కార్యక్రమం ఎస్ఆర్ఆర్ కళాశాలలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా తోటి అధ్యాపక బృందం, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యలక్ష్మిలు ఆయనను దుశాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు.



డాక్టర్ వెంకట సూర్య బాలసుబ్రహ్మణ్యంను సన్మానిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యలక్ష్మి, సిబ్బంది తదితరులు

సిబ్బంది విద్యార్థులను ఉద్దేశించి వెంకట సూర్య బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ అవార్డును అందించి ప్రభుత్వం తనపై మరింత బాధ్యతను పెంచినట్లయిందన్నారు.

జంక్షన్‌లో ఫ్లెక్సీతో ట్రాఫిక్‌కు అంతరాయం

- రోడ్డు మధ్యలో పెద్ద ఫ్లెక్సీ ఏర్పాటు
- వాహనాలు కనపడక తరచూ ప్రమాదాలు

పటమట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం పుట్టినరోజు, పెళ్లిరోజు, పెద్ద ఖర్మలకు, పార్టీ నాయకుల అభినందనలకు ఫ్లెక్సీలు కట్టడం పరిపాటిగా మారింది. ఫ్లెక్సీ కట్టడంలో తప్పులేదు గానీ, జంక్షన్‌లో కట్టి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడం వల్ల వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

దర్శిపేట ఐదు రోడ్ల జంక్షన్‌లో తరచూ పెద్ద సైజు ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారు. అధికార పార్టీ, విపక్ష పార్టీలు పోటీ పడి దర్శిపేట జంక్షన్‌లో ఫెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. ఎన్టీఆర్ సర్కిల్ నుంచి రామలింగేశ్వరనగర్ వరకు, రామలింగేశ్వర్‌నగర్ నుంచి పటమట ఎస్ఎస్ఎం స్కూల్‌కు, యనమలకుదురు రోజుకు వేలాది మంది ప్రయాణం చేస్తుంటారు. పెద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేయడం వలన ఒక పక్కవారికి, మరొక పక్క వాహనదారులు కనబడక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు స్పందించి దర్శిపేట జంక్షన్‌లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



దర్శిపేట ఐదు రోడ్ల జంక్షన్‌లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

నిమ్మకూరులో బాలయ్య

● సమస్యలపై పెద్దలతో చర్చ
● తక్షణం పరిష్కరించాలని జేసీకి ఫోన్‌లో ఆదేశం

పామర్రు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ సినీ హీరో, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ మంగళవారం స్వగ్రామం నిమ్మకూరును సందర్శించారు. ఎలాంటి హడావుడి, ఆడంబరాలు లేకుండా వచ్చిన బాలయ్య సమీప బంధువు ఇంట్లో కొంతసేపు గడిపారు. నిమ్మకూరు సమస్యలపై గ్రామ పెద్దలతో బాలకృష్ణ చర్చించారు. నిమ్మకూరు గ్రామ సమస్యల పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్‌ను ఆయన ఫోన్‌లో ఆదేశించారు. నిమ్మకూరులోని ఏపీ రెసిడెన్షియన్ వసతి గృహాల ఆధునికీకరణకు చర్యలు తీసుకుంటానన్నారు. వేంకటేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధి విషయమై టీటీడీ అధికారులతో ఆయన మాట్లాడారు. మండల టీడీపీ అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్ చంద్ర నిమ్మకూరు గ్రామంలో చేపట్టనున్న ఇతర అభివృద్ధి పనులను బాలకృష్ణకు వివరించారు. గ్రామ సర్పంచ్ పడమటి శ్రీనివాసరావు, ప్రముఖులు నందమూరి శివరామకృష్ణ, జయకృష్ణ ప్రసాద్, సూరపనేని చంద్రశేఖర్, కుదరవల్లి నాగేశ్వరరావు, జంపాన చిన్ని, రజాక్, మంతెన రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



వరుణ్‌తేజ్‌కు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో రామారావు

కనకదుర్గమ్మ సేవలో వరుణ్‌తేజ్

వన్‌టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను సినీ హీరో వరుణ్ తేజ్, మట్కా చిత్ర బృందం మంగళవారం దర్శించుకున్నారు. ఈ.వో రామరావు, ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం ఆయనకు దుర్గమ్మ చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు అందజేశారు.



లక్ష బిల్వార్చన పూజలు చేస్తున్న అర్చకులు

మల్లేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన

వన్‌టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం శుద్ధ ఏకాదశి సందర్భంగా దుర్గామల్లేశ్వర దేవస్థానంలో మల్లేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన నిర్వహించారు. ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని కోరుతూ లక్ష బిల్వార్చన జరిపారు. బిల్వాల దర్శనంతోనే పాప విముక్తులవుతారని, ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని విశ్వాసం. ప్రత్యేకించి శుద్ధ ఏకాదశి, పౌర్ణమి, మాసశివరాత్రి తదితర పుణ్య దినాలలో మల్లేశ్వరునికి బిల్వార్చన చేస్తే మంచిదని వేదపండితులు పేర్కొన్నారు.



జయంతి సందర్భంగా టీవీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీవీ ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ జిల్లా కో ఆర్డినేటర్ అరవ రమేష్, టీవీ కుమారులు

బాలల హక్కుల పరిరక్షణకు

టీవీఆర్ అలుపెరగని పోరాటం

●108వ జయంతిలో వక్తల నివాళి

వన్‌టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వీధి బాలలు, ఆపదలో ఉన్న బాలల సంరక్షణ, బాలల హక్కుల పరిరక్షణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అలుపెరగని పోరాటం చేసిన నేత విజయవాడ నగర ప్రథమ మేయర్ టి.వెంకటేశ్వరరావు (టీవీఆర్) అని టీవీ ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ జిల్లా కో ఆర్డినేటర్ అరవ రమేష్ పేర్కొన్నారు. హనుమాన్‌పేటలోని టీవీ భవన్‌లో టి.వెంకటేశ్వరరావు 108వ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన అరవ రమేష్, టి.వెంకటేశ్వరరావు కుమారులు టి.రమేష్, టి.సురేష్ తదితరులు టీవీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. టీవీఆర్ కుమారులు రమేష్, సురేష్ మాట్లాడుతూ తన తండ్రి టీవీఆర్ ఆశయసాధనకు కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రజా గాయకుడు ఆర్.పిచ్చయ్య మాట్లాడుతూ నగర అభివృద్ధికి టీవీఆర్ విశేష కృషి చేశారన్నారు. బర్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ సెక్రటరీ కె.ప్రకాష్ కుమార్, నవజీవన్ బాలభవన్ కౌన్సెలింగ్ కో ఆర్డినేటర్ ప్రసన్న కుమారి, కృపా ఫౌండేషన్ అధినేత రవీంద్ర, వీఎంసీ రిటైర్డ్ ఉద్యోగి మోహన్ కుమార్, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సిబ్బంది, బాలలు పాల్గొన్నారు. బాలలకు స్వీట్లు, పండ్లు, ఆహారం అందజేశారు.



బాలోత్సవ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమిటీ అధ్యక్షుడు ఎస్.పి.రామరాజు, ప్రధాన కార్యదర్శి రామిశెట్టి కొండలరావు

అమరావతి బాలోత్సవ్ 15 నుంచి

మొగల్రాజపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : అమరావతి బాలోత్సవ్ (పిల్లల పండగ)ను ఈనెల 15, 16, 17 తేదీల్లో పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నామని బాలోత్సవ్ కమిటీ అధ్యక్షుడు ఎస్.పి.రామరాజు, ప్రధాన కార్యదర్శి రామిశెట్టి కొండలరావు తెలిపారు. పీబీ సిద్ధార్థ కళాశాల సమావేశ మందిరంలో మంగళవారం బాలోత్సవ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రతి ఏడాది వలనే ఈ ఏడాది కూడా బాలోత్సవ్ నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే 200 పాఠశాలల నుంచి 12 వేల మంది తమ పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. 20 అంశాలలో 65 విభాగాలుగా విద్య, సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తామన్నారు. బాలోత్సవ్ పోటీల వేదికలకు ప్రఖ్యాత శాస్త్రవేత్తల పేరు పెట్టామన్నారు. ఈ కార్యక్రమాన్ని బాలోత్సవ్ వ్యవస్థాపకులు వాసిరెడ్డి రమేష్‌బాబు, సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు ప్రారంభిస్తారన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోటీలు జరుగుతాయన్నారు. పలు రంగాల కమిటీ సభ్యులు యార్లగడ్డ సుబ్బారావు, నాగళ్ల విద్యాఖన్నా, బాయన వెంకట్రావు, రవీంద్రబాబు, వెంకట్, గుమ్మా సాంబశివరావు పాల్గొన్నారు.

అభివృద్ధిలో సహకార రంగం పాత్ర కీలకం

● రేపటి నుంచి సహకార వారోత్సవాలు
● విజయవంతం చేయండి
● ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ నిధి మీనా



అఖిల భారత సహకార వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ నిధి మీనా, ఉన్నతాధికారులు

కృష్ణలంక, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన, మెరుగైన ప్రపంచ నిర్మాణంలో సహకార రంగం పాత్ర కీలకమని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ నిధి మీనా అన్నారు. ఈనెల 14వ తేదీ నుంచి నిర్వహించనున్న సహకార వారోత్సవాలను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని ఆమె పేర్కొన్నారు. 71వ అఖిల భారత సహకార వారోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఇన్‌చార్జి కలెక్టర్ నిధి మీనా మంగళవారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు.

డాక్టర్ నిధి మీనా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సహకార్ సే సమృద్ధి యోజన పథకంలో ఇప్పటికే పలు కార్యక్రమాలను అమలు చేయడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా ప్రధాన మంత్రి జన ఔషధి ద్వారా జిల్లాలో ఐదు జనరిక్ మందుల కేంద్రాలను ప్రారంభించడం జరిగిందన్నారు. మూడు పెట్రోల్ బంకుల నిర్వహణను సహకార సంఘాలకు అప్పగించామన్నారు. సహకార సంఘాల కార్యకలాపాలను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు జిల్లాలోని అన్ని సహకార సంఘాల డేటాను ఆన్‌లైన్‌లో పొందుపరచడం అభినందనీయమన్నారు. వారోత్సవాలలో భాగంగా 14వ తేదీన సహకార శాఖ అమలు చేసే నూతన కార్యక్రమాలను వివరించడం, 15వ తేదీన నూతన ఆవిష్కరణలు, సాంకేతిక సుపరిపాలన, 16వ తేదీన వ్యవస్థాపకత, ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధిలో సహకార సంఘాల పాత్ర, 17వ తేదీన సహకార సంస్థలు వ్యాపార సంస్థలుగా రూపాంతరం చెందడం, 18వ తేదీన సహకార సంఘాల మధ్య సహకారాన్ని పెంపొందించడం, 19వ తేదీన మహిళలు, యువత, బలహీనవర్గాలకు చేయూతలో సహకార సంఘాల పాత్ర, 20వ తేదీన సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో సహకార సంఘాల పాత్ర అంశాలపై అవగాహన కల్పించి సహకార సంఘాల బలోపేతానికి కృషి చేయాలని నిధి మీనా తెలిపారు. జిల్లా కో ఆపరేటివ్ అధికారి డాక్టర్ ఎస్.శ్రీనివాసరెడ్డి, జిల్లా కో ఆపరేటివ్ ఆడిట్ ఆఫీసర్ సిహెచ్.శైలజ, డివిజనల్ కో ఆపరేటివ్ అధికారి పి.కిరణ్‌కుమార్, డిప్యూటీ రిజిస్ట్రార్ ఎస్.కేశవకుమార్ పాల్గొన్నారు.

మనస్తాపంతో టెన్త్ విద్యార్థి ఆత్మహత్య

ఇబ్రహీంపట్నం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : టెన్త్ విద్యార్థి ఎన్టీటీపీఎస్ వేడినీళ్ల కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇబ్రహీంపట్నం జడ్పీ ఉన్నత పాఠశాలలో టెన్త్ చదువుతున్న బత్తుల మస్తాన్ (17) ఆర్టీసీ డిపో వెనుక తన నానమ్మ వద్ద ఉంటున్నాడు. ఆదివారం రాత్రి ఇంట్లో స్వల్ప వివాదం జరిగింది. సోమవారం సాయంత్రం షాపునకు వెళ్లి వస్తానని బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా గాలించారు. మంగళవారం వేడి నీళ్ల కాలువలో మస్తాన్ మృతదేహం వెలుగుచూసింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని విజయవాడ ప్రభుత్వాసుపత్రికి పంపి కేసు నమోదు చేసి ఎస్సై ఫణీందర్ దర్యాప్తు చేస్తున్నారు.



అక్కడికక్కడే మృతి చెందిన నాగరాజు

టిప్పర్ ఢీకొని రైతు మృతి

మైలవరం రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రహదారి గోతులు రైతు ప్రాణాన్ని బలిగొన్నాయి. వెల్వడం గ్రామానికి చెందిన ప్రత్తిపాటి నాగరాజు (55) టీవీఎస్‌పై పత్తి చేలోకి వెళ్లి తిరిగి వస్తుండగా వెనుక నుంచి టిప్పర్ ఢీ కొట్టింది. టీవీఎస్ మోపెడ్‌ను గుంత నుంచి తప్పించే క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో నాగరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని మైలవరం ప్రభుత్వాసుపత్రికి తరలించి ఎస్సై సుధాకర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య పిల్లలు ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాలు పునరుద్ధరించాలి

● పోతుల బాలకోటయ్య

ధర్నాచౌక్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి రద్దు చేసిన 27 సంక్షేమ పథకాలను పునరుద్ధరించి నిధులు కేటాయించాలని అమరావతి బహుజన జేఏసీ అధ్యక్షుడు పోతుల బాలకోటయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ పాలనలో ఎస్సీ, ఎస్టీలు దగా పడ్డారన్నారు. దశాబ్దాలుగా అయా ప్రభుత్వాలు అమలు చేసిన సంక్షేమ పథకాలతో పాటు ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల కోసం పోరాడామని గుర్తు చేశారు. సంక్షేమ పథకాలు అమలు కాకపోవడంతో ఆయా వర్గాల యువత ఇతర రాష్ట్రాలకు వలసపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ పాలనలో దళితులకు జరిగిన అన్యాయాలపై విచారణ కమిటి వేసి న్యాయం చేయాలన్నారు. నవక్రాంతి పార్టీ అధ్యక్షుడు కనకం శ్రీనివాసరావు, రెల్లి సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగేంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.



ముసాయిదా కౌలు చట్టాన్ని ఆవిష్కరిస్తున్న కౌలు రైతులు, రైతు సంఘం నేతలు

ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే

కౌలురైతుల గుర్తింపు చట్టాన్ని ప్రవేశపెట్టాలి

●ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం డిమాండ్

గవర్నర్‌పేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కౌలు రైతుల గుర్తింపు కార్డుల చట్టాన్ని ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రవేశపెట్టాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి. శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం ఏపీ కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ సాగుదారుల హక్కుల చట్టం సవరణలు చ - ప్రత్యామ్నాయాలు అంశంపై చర్చా కార్యక్రమం జరిగింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై. రాధాకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం తీసుకురానున్న కౌలు రైతుల గుర్తింపు కార్డుల చట్టానికి సవరణలు చేస్తూ కౌలు రైతు సంఘం తయారు చేసిన నూతన ముసాయిదా చట్టాన్ని అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న శ్రీనివాసరావు భార్య నాగమణి ఆవిష్కరించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ యజమాని సంతకం తప్పనిసరి చేస్తూ తీసుకువచ్చిన చట్టం వల్ల కౌలు కార్డుల జారీ గణనీయంగా పడిపోయిందన్నారు. కార్డులు పొందడానికి ఆటంకంగా తయారైన చట్టం వల్ల కౌలు రైతులకు పంట రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీలు, ప్రభుత్వ పథకాలు అందడం లేదన్నారు.

మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ చట్టాన్ని ప్రస్తుత సమావేశాల్లోనే ప్రవేశపెట్టడంతో పాటు కాలయాపన లేకుండా వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతుల ప్రయోజనాల కోసం తీసుకువచ్చిన చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సంఘ కార్యదర్శి ఎం. హరిబాబు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం పాత ప్రభుత్వం మీద సాకులు చెబుతూ కౌలు రైతుల చట్టాన్ని శాసనసభలో ప్రవేశపెట్టకుండా కాలయాపన చేయడం తగదన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా ప్రకాశం జిల్లా నాయకుడు చుండూరు రంగారావు, కౌలు రైతుల సంఘం రాష్ట్ర నాయకులు టీవీ లక్ష్మణస్వామి, బైరగాని శ్రీనివాసరవు, పంచకర్ల రంగారావు, వల్లు రాజబాబు, ఎం. రామాంజనేయులు, జి. గోపాల్, కె. శివనాగేంద్ర, బాలరంగయ్య పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ అండర్-19 ఫెన్సింగ్ జట్ల ఎంపిక నేడు

విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : నగరంలోని కృష్ణలంక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 13న ఉదయం 9 గంటలకు కృష్ణాజిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 బాల, బాలికల ఫెన్సింగ్ జట్ల ఎంపిక జరుగుతుందని జిల్లా కార్యదర్శి వి.రవికాంత ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు వ్యక్తిగత ఫెన్సింగ్ కిట్ (ఎలక్ట్రానిక్ కిట్), ఎంటీ ఫారం, కళాశాల స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డుతో ఎంపిక సమయానికి రావాలని ఆమె కోరారు.



కబడ్డీలో ప్రతిభ చూపి ట్రోఫీ అందుకుంటున్న సిద్దార్థ మహిళా కళాశాల జట్టు

కబడ్డీ, క్రాస్ కంట్రీల్లో సిద్దార్థ మహిళల సత్తా

విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మైలవరంలోని డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కృష్ణా యూనివర్శిటీ అంతర్ కళాశాలల కబడ్డీ పోటీల్లో విజయవాడ శ్రీ దుర్గామల్లేశ్వర సిద్దార్థ మహిళా కళాశాల టీమ్ తృతీయ స్థానం సాధించింది. పి.దీవెన త్రివేణి ప్రతిభ చూపి ఈ నెల 28 నుంచి 30 వరకు అలగప్ప యూనివర్శిటీలో జరిగే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్శిటీ పోటీలకు ఎంపికయ్యారని కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ మాధవి తెలిపారు. కళాశాల యాజమాన్యం, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎన్ హేమ, కోచ్ పి శివభాస్కరరావు వారిని అభినందించారు. నూజివీడులోని ధర్మ అప్పారావు డిగ్రీ కళాశాలలో జరిగిన కృష్ణా యూనివర్శిటీ అంతర్ కళాశాలల క్రాస్ కంట్రీ పోటీల్లో సిద్దార్థ మహిళా డిగ్రీ కళాశాల జట్టు రన్నరప్ నిలిచింది. ఆర్ యమునాబాయి ఈనెల 18 నుంచి మంగళూరులో జరిగే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్శిటీ టోర్నీకి ఎంపికైందని కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు.

పొట్టిశ్రీరాములు ఇంజనీరింగ్‌లో చెస్ పోటీలు



చెస్ పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అమర సుధీర్

వన్‌టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కాకినాడ జేఎన్‌టీయూ స్పోర్ట్స్ కౌన్సిల్ ఆదేశాల మేరకు పొట్టిశ్రీరాములు చలువాది మల్లిఖార్జునరావు ఇంజనీరింగ్ కాలేజీ ఆతిథ్యంలో చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పొట్టిశ్రీరాములు ఇంజనీరింగ్ కాలేజీ కార్యదర్శి సీఏ అమర సుధీర్ తెలిపారు. మహిళలు, పురుషుల చెస్ పోటీల పోస్టర్లను ఆయ ఆవిష్కరించారు. అన్ని కళాశాలల నుంచి 300 మంది విద్యార్థులు పాల్గొంటున్నారన్నారు. చెస్ పోటీల పర్యవేక్షకుడిగా యూనివర్శిటీ సెక్రటరీ డాక్టర్ జె.పి.రాజు వ్యవహరిస్తున్నారన్నారు. ఈ పోటీల్లో విజేతలు డిసెంబరు 4వ తేదీ నుంచి 7వ తేదీ వరకు చెన్నైలోని వెల్‌టెక్ యూనివర్శిటీలో జరిగే టోర్నమెంట్‌లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కోశాధికారి కాజ రాఘవయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ శరవణకుమార్, అకడమిక్ వైస్ ప్రిన్సిపాల్ ఎ.పతంజలి శాస్త్రి, పరిపాలనా విభాగం వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సురేష్ బాబు, పరీక్షల పర్యవేక్షణ అధికారి డాక్టర్ ఎస్.మణికంఠ, ఫిజికల్ డైరెక్టర్ విక్టర్ జాన్సన్, తదితరులు పాల్గొన్నారు.



అబాకస్‌లో విజయవాడ సత్తా

భవానీపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కోల్‌కతాలోని సిప్ అబాకస్ ఇండియా ఈనెల 10న నిర్వహించిన 21వ అంతర్జాతీయ పోటీల్లో విజయవాడలోని భవానీపురం, వన్‌టౌన్ సిప్ అబాకస్ శాఖల నుంచి 12 మంది పాల్గొనగా, 11 మంది విద్యార్థులు వివిధ స్థాయిల్లో ట్రోఫీలు సాధించినట్లు నిర్వాహకులు మధుసూదన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. అబాకస్ మెంటల్, అర్థమెటిక్ పోటీల్లో ఆరువేల మంది పోటీ పడగా, కె సాయి జెస్సిక, నోయల్ శామ్యూల్, యం.హృదయ్ సిద్విక్, ఎం.బృంద, షేక్ హనీఫా, శ్రీ హర్ష, కె విహాన్, సీహెచ్ జగదీశ్వర్, ఎన్ .దీక్షిత, ఆర్ ప్రభాస్ ట్రోఫీలను అందుకున్నారన్నారు. ముఖ్య అతిథులు సిప్ అబాకస్ మేనేజింగ్ డైరెక్టర్ దినేష్ విక్టర్, అన్ని రాష్ట్రాల ఇన్‌చార్జులు, అధ్యాపకులు పాల్గొన్నారు.


నైపుణ్యం కలిగిన క్రీడాకారులను తయారు చేయాలి



సమగ్ర శిక్ష పీడీతో శాప్ చైర్మన్ రవినాయుడు

విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల స్థాయి నుంచి నైపుణ్యం కలిగిన క్రీడాకారుల తయారీకి కంకణబద్ధులు కావాలని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు అన్నారు. పటమటలోని సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావుతో శాప్ చైర్మన్ సమావేశమై క్రీడల ప్రాధాన్యతలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, ఇతర వ్యవహారాలపై చర్చించారు. 2024-25 సంవత్సరానికి సమగ్ర శిక్ష అందించాల్సిన క్రీడా సామాగ్రిలో పంపిణీలో నాణ్యత, పారదర్శకతతో పాటు, క్రీడలకు ప్రతి పాఠశాలలో ప్రాధాన్యత ఉండేలా తగుచర్యలు తీసుకోవాలని కోరారు.

ఉమ్మడి కృష్ణా స్కేటర్లకు పతకాల పంట



పతకాలు సాధించిన స్కేటర్లు, జట్టు మేనేజర్ జి.దుర్గాకుమార్

విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కాకినాడలో జరిగిన ఏపీ స్టేట్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఉమ్మడి కృష్ణా స్కేటర్లు సత్తా చాటి పతకాలను కైవసం చేసుకున్నట్లు శరత్ రోలర్ స్కేటింగ్ అకాడమీ మేనేజర్ దుర్గాకుమార్ తెలిపారు. 9-11 విభాగంలో భార్గవ్‌కు స్వర్ణం, 14-17 ఏళ్ల విభాగంలో యోషిత్‌రెడ్డి రెండు స్వర్ణ, రెండు రజత పతకాలు, పయ్యావుల రిషికేష్ స్వర్ణ, కాంస్య పతకాలు, లీలా వెంకట్ సుధీర్ స్వర్ణం, రెండు కాంస్య పతకాలు, 17 ఏళ్ల పైబడిన బాలికల విభాగంలో తిరుమలశెట్టి గీష్మిత రెండు రజత, ఒక కాంస్య పతకం, బాలుర విభాగంలో రత్నరాజు రెండు స్వర్ణ పతకాలను సాధించి మైసూర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. క్రీడాకారులను, శిక్షణ ఇచ్చిన కోచ్ మాకాని శరత్‌ను ప్రముఖ పారిశ్రామికవేత్త మల్లిఖార్జునరావు అభినందించారు.



పెరికీడులో అఘోరీ కారు వద్ద గుమిగూడిన ప్రజలు

జంక్షన్‌లో అఘోరీ

హనుమాన్‌జంక్షన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇటీవల ట్రెండింగ్‌గా మారిన అఘోరి (నాగసాధు) మంగళవారం హనుమాన్‌జంక్షన్‌లో కన్పించింది. పిఠాపురం నుంచి విజయవాడకు జంక్షన్ బైపాస్‌లో వెళుతూ మార్గమధ్యలో పెరికీడు అండర్ పాస్ కింద కాసేపు కారులోనే విశ్రాంతి తీసుకున్నారు. కారు మీద పెద్ద అక్షరాలతో అఘోరి నాగసాధు అనే పేరుతో పాటు కారు బ్యానెట్ మీద పుర్రెలు కనిపించాయి. కారంతా అఘోరి స్టిక్కర్లు అంటించి ఉండడం తో స్థానికులు గుర్తించి గుమిగూడారు. కారు లో నిద్ర పోతున్న నాగసాధును ఆసక్తిగా చూస్తూ కారుతో సెల్ఫీలు తీసుకున్నారు.

బీసీలకు ప్రభుత్వం పెద్దపీట


గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి

వన్‌టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్‌లో రూ.39 వేల కోట్లు కేటాయించటం ద్వారా బీసీ సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేసిందని ఏపీ గౌడ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి అన్నారు. ఆటోనగర్‌లోని జిల్లా టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీల పట్ల ప్రేమాభిమానాలు చూపిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లకు అభినందనలు తెలిపారు. బడుగు బలహీనవర్గాలకు టీడీపీ ప్రభుత్వం ఆది నుంచి అండగా నిలుస్తోందన్నారు. గతంలో లోటు బడ్జెట్, ఆర్థిక సమస్యలు, రాజధాని లేని పరిస్థితులలో కూడా వేల కోట్లు బడ్జెట్ కేటాయింపులు జరిపి బీసీలను ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధి చేసిన ఘనత చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. ఈ సమావేశంలో బీసీ నాయకులు పి. థామస్, కత్తుల మణికంఠ, శొంఠి శివరామ్ ప్రసాద్ గౌడ్, మల్లిఖార్జున్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతలపై కేసు కొట్టివేత

గన్నవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నేతలపై నమోదు చేసిన అక్రమ కేసును గన్నవరం కోర్టు కొట్టివేసింది. ఎమ్మెల్యే వల్లభనేని వంశీ 2021లో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరిపై చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను ఖండిస్తూ టీడీపీ శ్రేణులు శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే పోలీసులు వైసీపీ ప్రభుత్వం ఒత్తిడితో ఎఫ్ఐఆర్ నెంబర్ 498-2021, 341, 188 సెక్షన్‌ల కింద ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారని, జాతీయ రహదారిపై అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహించారని అభియోగం మోపుతూ కేసు నమోదు చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు, ఉంగుటూరు మండల పార్టీ అధ్యక్షుడు ఆరుమళ్ల కృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి దొంతు చిన్న, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు మండవ అన్వేష్, ఎస్సీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మకూరి మధు, బోడపాటి రవి, మేడేపల్లి రమా, షేక్ అబుల్యాజ్, చిక్కవరపు నాగమణి తదితరులుపై కేసు నమోదు చేసి కోర్టుకు పెట్టారు. గన్నవరం అదనపు జూనియర్ సివిల్ జడ్జి మంగళవారం కేసును కొట్టివేస్తూ తీర్పునిచ్చారు. న్యాయవాది, టీడీపీ లీగల్ సెల్ నాయకుడు జాస్తి తాతారావుకు పార్టీ నాయకులు ధన్యవాదాలు తెలిపారు.

నందిగామ ఏసీపీగా తిలక్




విజయవాడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నందిగామ ఏసీపీగా ఏబీజీ తిలక్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కాశీబుగ్గ డీఎస్పీగా పనిచేస్తున్న ఆయనను కొద్దిరోజుల క్రితం నందిగామకు బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం తిలక్ పోలీసు కమిషనర్ రాజశేఖరబాబును మర్యాద పూర్వకంగా కలిశారు. ఇంతకుముందు ఏబీజీ తిలక్ కాకినాడలో లా అండ్ ఆర్డర్, సీఐడీ విభాగాల్లో పనిచేశారు.

విద్యుత్ విజిలెన్స్ దాడులు


ఎ.కొండూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ విజిలెన్స్ అధికార్లు మండలంలోని వినియోగదారుల గృహాలు, వాణిజ్య సముదాయాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు విజిలెన్స్ ఎస్పీ అల్ఫాన్స్ తెలిపారు. విద్యుత్ సిబ్బంది 43 బృందాలుగా 1670 గృహ సర్వీసులు, 319 వాణిజ్య సముదాయాలు, 14 ఇతర సర్వీసులు తనిఖీ చేసి 135 సర్వీసులకు అదనపు లోడుకు రూ, 4.20 లక్షలు జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. తొమ్మిది మంది మీటర్లు లేకుండా విద్యుత్ వినియోగిస్తుండడంతో రూ.8465 విధించామన్నారు. దాడుల్లో ఈఈలు, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, డీఈఈ, రామకృష్ణ, ఏఈలు, నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం సీజ్

మైలవరం రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పొందుగల గ్రామంలో సోమవారం రాత్రి అనంతవరం రోడ్డులో ఉన్న కోళ్ల ఫారంలో 20 క్వింటాళ రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లై డీటీ మాధవి సీజ్ చేశారు. చిలుకూరు రంగారెడ్డి అనే వ్యక్తి రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేశారనే సమాచారంతో కోళ్ల ఫారాలపై దాడులు చేసి బియ్యాన్ని సీజ్ చేసినట్లు ఆమె తెలిపారు. అతనిపై 6 ఏ కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.








కుబేరుడి కొత్త లుక్



ధనుష్, నాగార్జున హీరోలుగా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తెరకెక్కుతోన్న మల్టీస్టారర్ 'కుబేర'. సంపద చుట్టూ అల్లుకున్న కథతో యాక్షన్ థ్రిల్లర్‌గా రూపుదిద్దుకుంటున్న చిత్రమిది. మంగళవారం నాగార్జున పోస్టర్‌ను యూనిట్ విడుదల చేసింది. తన చుట్టూ సంపదను ప్రతిబింబించే వస్తువులు ఎన్ని ఉన్నా జీవితంలో విలువైనదేదో కోల్పోయినట్లు విషాదంగా కనిపించారు నాగార్జున. "కుబేర' చిత్రీకరణ చివరి దశలో ఉంది. పాటల చిత్రీకరణ మిగిలి ఉంది. నిర్మాణానంతర కార్యక్రమాలు శరవేగంగా సాగుతున్నాయి. ఈ నెల 15న 'కుబేర' ఫస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేస్తాం' అని యూనిట్ తెలిపింది. ఈ చిత్రంలో రష్మిక మందన్న కథానాయిక. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్‌రావు నిర్మిస్తున్నారు. సంగీతం: దేవిశ్రీ ప్రసాద్.

వీరుడి పేరు... పౌర్ణమి రోజు



పొడవాటి జుట్టు, గుబురు గడ్డం, నెత్తురంటిన గొడ్డలిని చేతబూని రౌద్రరూపంలో కనిపించారు నందమూరి బాలకృష్ణ. బాబీ కొల్లి దర్శకత్వంలో ఆయన కథానాయకుడిగా నటిస్తున్న ('ఎన్‌బీకే 109'- వర్కింగ్ టైటిల్) చిత్రం పోస్టర్‌లోనిదీ దృశ్యం. ఈ భారీ పీరియాడిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో మునుపెన్నడూ చూడని సరికొత్త పాత్రలో బాలకృష్ణ కనిపించనున్నారు. చిత్రబృందం మంగళవారం ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసి, ఈ నెల 15న కార్తీక పౌర్ణమి సందర్భంగా 'ఎన్‌బీకే 109' టైటిల్‌ను వెల్లడించనున్నట్లు తెలిపింది. దాంతోపాటు టీజర్‌ను విడుదల చేయనున్నట్లు యూనిట్ ప్రకటించింది. ప్రస్తుతం తుదిదశ చిత్రీకరణ జరుగుతోంది. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. బాబీడియోల్ ఈ చిత్రంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. థమన్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: విజయ్ కార్తీక్ కన్నన్

జీబ్రా సూపర్‌హిట్ అవుతుంది



చిరంజీవి

'సత్యదేవ్‌లాంటి విలక్షణ నటుల కొరత తెలుగు పరిశ్రమలో ఉంది. తను అద్భుతమైన నటుడే అయినా అతనికి మంచి సినిమాలు పడడం లేదనిపించేది. ఆ లోటును 'జీబ్రా' చిత్రం తీరుస్తుందని నమ్ముతున్నాను. ఈ సినిమా కచ్చితంగా సూపర్ హిట్ అవుతుంది' అని చిరంజీవి అన్నారు. సత్యదేవ్ కథానాయకుడిగా ఈశ్వర్ కార్తిక్ దర్శకత్వం వహించిన చిత్రం 'జీబ్రా'. ఈ నెల 22న విడుదలవుతోంది. చిత్ర బృందం మంగళవారం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో నిర్వహించింది. చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరై 'జీబ్రా' ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "జీబ్రా చిత్రం మంచి కంటెంట్‌తో వస్తోంది. సత్యదేవ్, ధనంజయ్, సత్యరాజ్ లాంటి ప్రతిభావంతులైన నటులు ఉన్నారు. వినోదంతో పాటు కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలు ఈ సినిమాలో ఉన్నాయి' అని చెప్పారు. సత్యదేవ్ మాట్లాడుతూ 'చిరంజీవి గారు నాపైన నమ్మకంతో 'గాడ్‌ఫాదర్' సినిమాలో అవకాశం ఇచ్చారు. ఆ సినిమా వల్లే మా నిర్మాతలు 'జీబ్రా' సినిమాలో నాకు అవకాశం ఇచ్చారు. ఇక నుంచి ప్రేక్షకులు కొత్త సత్యదేవ్‌ను చూస్తారు' అని అన్నారు. ఈశ్వర్ కార్తిక్ మాట్లాడుతూ 'సత్యదేవ్, డాలీ ఇద్దరూ అద్భుతంగా నటించారు. ప్రేక్షకులకు మంచి సినిమాను అందించబోతున్నాం. పతాక సన్నివేశాలు ప్రేక్షకులను అలరిస్తాయి' అని తెలిపారు. వినూత్నమైన కథతో జీబ్రాని తెరకెక్కించామని నిర్మాత ఎస్.ఎన్ రెడ్డి చెప్పారు. ఇదొక కంప్లీట్ ఫ్యామిలీ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ అని డాలీ ధనంజయ్ అన్నారు.

మన హీరోలకు ఏం తక్కువ?



డైరెక్టర్ కరుణకుమార్

వరుణ్ తేజ్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'మట్కా' ఈనెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు కరుణకుమార్ మీడియాతో మాట్లాడుతూ "మట్కా' కథకి ఆలోచన ఒక మ్యారేజ్ ఫంక్షన్‌లో వచ్చింది. ఇక్కడే ఈ గేమ్ గురించి మొదటి సారి విన్నాను. ఈ గేమ్ ఎవరిదని రీసెర్చ్ చేశాను. వాస్తవానికి దీని గురించి తెలుసుకున్నాక 'వాడి పోయిన పూలు' అని ఒక కథ రాద్దామనుకున్నా. మట్కాలో ఒక వెలుగు వెలిగి బలైపోయిన ఓ వ్యక్తి జీవితంపై షార్ట్ స్టోరీ రాద్దామనుకున్నా. అలా మొదలు పెట్టిన తర్వాత ఇది సినిమా మెటీరియల్ అని నాకు అర్థమైంది. దీనిని తిరిగి సినిమా వర్షన్‌లో కథ రాసుకున్నా. చాలా మంది తమిళ సినిమాలు బాగుంటాయి, కన్నడ సినిమాలు బాగుంటాయి, హిందీ సినిమాలు బాగుంటాయి అని అంటుంటారు. కానీ, మన తెలుగువాళ్లు తీసిన సినిమాలు ఇప్పటి వరకూ ఎవరూ తీయలేదు. ఆ సత్యాన్ని గుర్తించడం లేదు. బెంగాలీ సాహిత్యం తరవాత బెస్ట్ సాహిత్యం ఉన్నది తెలుగులోనే. ఒక తమిళ సినిమా వస్తే మనం సూపర్‌హిట్ చేసి ఆదరిస్తాం. రజనికాంత్ హోదా సూపర్‌స్టార్. ఇక్కడ కూడా ఆయనను సూపర్ స్టార్ హోదాలోనే ఆదరిస్తున్నాం. రజనీకాంత్ కంటే చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేశ్ ఏ విధంగా తక్కువ?. 'మట్కా' పక్కా కమర్షియల్ సినిమా. ఇందులో కమర్షియల్ ఎలిమెంట్స్ అన్నీ ఉంటాయి. ఆ రోజుల్లో టెలిఫోన్ సౌకర్యం సరిగా లేదు, టెలిగ్రామ్ రెండు రోజులు పడుతుంది. ఒక ట్రంకాల్ బుక్ చేయాలంటే ఆరు, ఏడు గంటలు పడుతుంది. కానీ ప్రతి రోజూ ఐదు గంటలకు దేశం మొత్తం ఒకే నంబరు వస్తుంది. ఇదంతా ఒకరు ఆర్గనైజ్ చేస్తారు. ఇదే నాకు ఇంట్రస్టింగ్ పాయింట్ అనిపించింది కథ రాయడానికి. ఈ సినిమాను వరుణ్ తేజ్‌తో చేస్తే బాగుంటుందని వైరా ప్రొడక్షన్స్ వాళ్లే సూచించారు. ఈ సినిమాలో ఆయన అత్యద్భుతంగా నటించారు' అని అన్నారు.

23 పాత్రల ఎర్రచీర



సుమన్ బాబు స్వీయ దర్శకత్వం వహిస్తూ ముఖ్య పాత్రలో నటిస్తున్న చిత్రం' ఎర్రచీర-ద బిగినింగ్'. ఈ సినిమాలో నటుడు రాజేంద్ర ప్రసాద్ మనవరాలు తేజస్విని నటిస్తోంది. ఎస్.వి.వి.సుబ్బారెడ్డి, సీహెచ్ వెంకట సుమన్ నిర్మాతలు. మదర్ సెంటిమెంట్, హారర్, యాక్షన్ సెంటిమెంట్‌తో ఈ సినిమా తెరకెక్కుతోంది. చిత్ర దర్శకుడు, నటుడు సుమన్ బాబు మాట్లాడుతూ 'యాక్షన్, మదర్ సెంటిమెంట్‌తో ఈ సినిమాను రూపొందించాను. చిత్రంలో 22 పాత్రలతో పాటు ఎర్రచీర 23వ పాత్ర పోషిస్తుంది' అని తెలిపారు. హీరోయిన్ కారుణ్య చౌదరి మాట్లాడుతూ 'సినిమా చూసిన వాళ్లు కన్నీళ్లు పెట్టుకుంటారు. అందరూ మాకు సపోర్ట్ చేయాలని కోరుతున్నా' అని అన్నారు. నిర్మాత అంబికా కృష్ణ మాట్లాడుతూ' ప్రస్తుత ట్రెండ్ ప్రకారం ప్రేక్షకులకు కావాల్సినంత కంటెంట్ ఉన్న చిత్రమిది' అని అన్నారు.

'ప్రతి కథపైనా హీరో పేరు రాసి ఉంటుంది'



ప్రశాంత్ వర్మ

అర్జున్ జంధ్యాల దర్శకత్వంలో అశోక్ గల్లా, వారణాసి మానస హీరో, హీరోయిన్లుగా నటించిన చిత్రం 'దేవకీ నందన వాసుదేవ'. సోమినేని బాలకృష్ణ నిర్మాత. ఈ మూవీకి హనుమాన్ ఫేమ్ డైరెక్టర్ ప్రశాంత్‌వర్మ కథను అందించారు. సినిమా ఈనెల 22న థియేటర్లలో విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో మంగళవారం ట్రైలర్ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. 'ఈ భూమి మీద ఎక్కడా లేని విధంగా సుదర్శన చక్రంతో వాసుదేవుడి విగ్రహం ఉంది' అనే డైలాగ్‌తో ట్రైలర్ ప్రారంభం అవుతుంది. యాక్షన్ సీన్స్ బాగున్నాయి. టాలీవుడ్ నటుడు రానా, హీరో సందీప్ కిషన్, దర్శకుడు ప్రశాంత్‌వర్మ, గల్లా జయదేవ్, రచయిత సాయిమాధవ్ బుర్రా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అశోక్ గల్లా మాట్లాడుతూ 'రానా నాకు ఎప్పుడూ సపోర్ట్‌గా ఉంటారు. ప్రశాంత్‌వర్మ కథతో డైరెక్టర్ అర్జున్ తన విజన్‌తో మరో మెట్టును ఎక్కించారు' అని అన్నారు. 'ఈ సినిమాలో భాగం అయినందుకు చాలా సంతోషంగా ఉంది. అశోక్‌తో కలసి నటించడం ఫన్నీగా ఉంది' అని హీరోయిన్ వారణాసి మానస అన్నారు. 'ప్రతి కథపైనా హీరో పేరు రాసి పెట్టి ఉంటుందని నేను నమ్ముతాను. ఈ కథను ఏడేళ్ల క్రితం రాసుకున్నా. ఈ సినిమాను అశోక్ గల్లా చేసినందుకు చాలా ఆనందంగా ఉంది. నా తదుపరి సినిమా అప్డేట్ రెండు వారాల్లో ఇస్తాను' అని ప్రశాంత్ వర్మ అన్నారు.

సీనియర్ దర్శకుడు వీఎస్ బోస్ కన్నుమూత



హీరో కృష్ణతో 'వింత కథ', మురళీమోహన్‌తో 'గ్రహణం విడిచింది' చిత్రాలను రూపొందించిన సీనియర్ దర్శకుడు వీఎస్ బోస్ మంగళవారం ఉదయం విజయవాడలో కన్ను మూశారు. 81 ఏళ్ల బోస్ పూర్తి పేరు వీరపనేని సుభాష్‌చంద్ర బోస్. 'పాతాళ భైరవి', 'మాయాబజార్' వంటి పలు చిత్రాలకు కళా దర్శకత్వం వహించిన కళాధర్ మేనల్లుడు బోస్. విఠలాచార్య, బాపు, జి.విశ్వనాథం, దాదా మిరాసీ వంటి దర్శకుల దగ్గర పదిహేను చిత్రాలకు సహాయ దర్శకుడిగా పని చేశారు. ఎన్టీఆర్‌కు సన్నిహితుడిగా పేరు తెచ్చుకున్నారు. హీరో శోభన్‌బాబుతో ఏరా అంటే ఏరా అనుకునేంత స్నేహం ఉండేది. చాలా కాలం క్రితమే విజయవాడకు వచ్చిన బోస్ అక్కడే సెటిల్ అయ్యారు.



స్పోర్ట్స్

లేహ్‌లో పారా శిక్షణ కేంద్రం

హైదరాబాద్: పారా అథ్లెట్ల కోసం ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన ప్రదేశం లద్దాక్‌లోని లేహ్‌లో అత్యుత్తమమైన శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు హైదరాబాద్‌కు చెందిన ఆదిత్య మెహతా ఫౌండేషన్, లద్దాక్ స్వతంత్ర పర్వతాభివృద్ధి మండలి మధ్య ఒప్పందం కుదిరింది. 2028 పారాలింపిక్స్‌ను దృష్టిలో ఉంచుకొని భారత అథ్లెట్లకు ఇక్కడ శిక్షణ ఇవ్వనున్నారు. ఆర్చరీ, టెన్నిస్, అథ్లెటిక్స్, పవర్ లిఫ్టింగ్, షూటింగ్ ఇలా పలుక్రీడల్లో శిక్షణ ఇస్తారు.

పాక్‌లో పర్యటించడానికి అంధుల జట్టుకు క్రీడాశాఖ అనుమతి

న్యూఢిల్లీ: పాకిస్థాన్‌లో ఈనెల 22 నుంచి జరిగే అంధుల టీ20 వరల్డ్‌కప్‌లో పాల్గొనడానికి డిఫెండింగ్ చాంప్ భారత జట్టుకు క్రీడామంత్రిత్వ శాఖ అనుమతి మంజూరు చేసింది. ఇక.. హోం, విదేశాంగ శాఖల నుంచి గ్రీన్ సిగ్నల్ కోసం జట్టు వేచిచూస్తోంది. ఆయా శాఖల నుంచి అనుమతులు రాగానే వాఘా బోర్డర్ నుంచి 17 మంది సభ్యుల జట్టు ఈ నెల 21న పాక్‌కు బయల్దేరనుంది. కాగా, భారత జట్టు రాకపోయినా టోర్నీని ఆపే ప్రసక్తేలేదని పాకిస్థాన్ అంధుల క్రికెట్ మండలి ప్రకటించింది.

భారత్ ఎందుకు రాదో.. కారణాలు చెప్పండి?

ఐసీసీని కోరిన పీసీబీ

దుబాయ్: పాకిస్థాన్‌లో వచ్చే ఏడాది జరిగే చాంపియన్స్ ట్రోఫీలో ఆడలేమని భారత్ ఇప్పటికే స్పష్టం చేసింది. ఇదే విషయాన్ని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ)కు ఐసీసీ తెలియజేసింది. అయితే, బీసీసీఐ నిరాకరించడానికి గల కారణాలను లిఖితపూర్వకంగా తెలియజేయాలని ఐసీసీని పీసీబీ కోరింది. హైబ్రిడ్ విధానంలో చాంపియన్స్ ట్రోఫీని నిర్వహించడానికి పీసీబీ నిరాకరిస్తోంది. దీంతో మొత్తం టోర్నీని దక్షిణాఫ్రికాకు తరలించాలన్న ఆలోచనలో ఐసీసీ ఉన్నట్టు సమాచారం. అదే జరిగితే ఏకంగా టోర్నీనే బహిష్కరించాలని పాక్ భావిస్తోందట.



అర్జున్ అదరహో

నోయిడా: అర్జున్ దేశ్వాల్ 19 పాయింట్లతో చెలరేగడంతో జైపూర్ పింక్ పాంథర్స్ ఈ సీజన్‌లో నాలుగో విజయం అందుకుంది. మంగళవారం జరిగిన ఈ పోరులో జైపూర్ 39-32తో బెంగళూరు బుల్స్‌పై నెగ్గింది. పుణెరి పల్టన్-దబాంగ్ ఢిల్లీ మధ్య జరిగిన మరో మ్యాచ్ 38-38తో టైగా ముగిసింది.

బ్యాటింగ్ మెరుగైతేనే..!

రాత్రి 8.30 నుంచి స్పోర్ట్స్18, జియో సినిమాలో..

నేడు మూడో టీ20

- బౌలర్లపై అధిక భారం
- విజయమే లక్ష్యంగా టీమిండియా
- జోష్‌లో దక్షిణాఫ్రికా



సెంచూరియన్: నాలుగు టీ20ల సిరీస్ రసవత్తరంగా మారింది. తొలి మ్యాచ్‌లో భారత్.. ఆ తర్వాత ఆతిథ్య దక్షిణాఫ్రికా ఘనవిజయాలతో నువ్వా.. నేనా? అనే రీతిలో చెలరేగుతున్నాయి. ఈనేపథ్యంలో బుధవారం జరిగే కీలక మూడో టీ20లో ఇరు జట్లు గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగబోతున్నాయి. ఎందుకంటే ఈ మ్యాచ్‌లో నెగ్గిన జట్టు సిరీస్ కోల్పోయే అవకాశం ఉండదు. అయితే రెండు మ్యాచ్‌ల్లో భారత్ తరఫున బౌలర్లు మాత్రమే అంతో ఇంతో రాణించగలిగారు. కానీ అనూహ్యంగా బ్యాటింగ్ ఆర్డర్ నుంచి మాత్రం ఎలాంటి సహకారమూ అందలేదు. సంజూ శాంసన్ మెరుపు సెంచరీ కారణంగానే తొలి మ్యాచ్‌లో నెగ్గగలిగాం. కానీ రెండో టీ20లో బ్యాటర్లు ప్రత్యర్థి పేసర్లకు దాసోహమయ్యారు. చివర్లో హార్దిక్ షాట్ల కారణంగా స్కోరు 120 దాటగలిగింది. భారత్ ఇక్కడ ఆడిన ఒకే టీ20 మ్యాచ్ (2018లో)లో ఆరు వికెట్ల తేడాతో ఓడింది. హార్దిక్ మాత్రమే అప్పటి జట్టులో ఉన్నాడు. అటు సఫారీలు మాత్రం రెట్టించిన ఉత్సాహంతో ఉన్నారు. వారి బ్యాటింగ్ కూడా ఫామ్‌లో లేకపోయినా ఆఖర్లో ఒత్తిడిని తట్టుకుని స్టబ్స్, కొట్జీ జట్టును గెలిపించారు. బౌలర్లు సూపర్ ఫామ్‌లో ఉండడంతో మరో విజయంతో ఆధిపత్యం చూపాలనుకుంటోంది.

మార్పులుంటాయా?

ఓపెనర్‌గా అభిషేక్ శర్మ వైఫల్యం జట్టు శుభారంభంపై ప్రభావం పడుతోంది. వరుసగా విఫలమవుతున్న అతడిని కొనసాగించడం సందేహమే. అతడిని పక్కనబెడితే శాంసన్‌కు జతగా తిలక్ వర్మను పంపి.. ఆల్‌రౌండర్ రమణ్‌దీప్ సింగ్‌ను బరిలోకి దించే అవకాశం ఉంది. అతడి రాకతో మిడిలార్డర్‌లో బ్యాటింగ్ బలపడుతుంది. అలాగే కెప్టెన్ సూర్య, రింకూ సింగ్ ఈ సిరీస్‌లో పెద్దగా ప్రభావం చూపలేదు. హార్దిక్ రెండో మ్యాచ్‌లో 39 రన్స్ చేసినా 45 బంతులు తీసుకున్నాడు. తొలి బౌండరీ కోసమే 28 బంతులు ఆడాల్సి వచ్చింది. కాబట్టి శాంసన్‌కు తోడుగా ఈ ముగ్గురు చెలరేగితేనే భారత్ భారీ స్కోరు చేయగలుగుతుంది. పేసర్ అర్ష్‌దీప్ డర్బన్ మ్యాచ్‌లో ఆకట్టుకున్నా.. రెండో టీ20లో దెబ్బతీశాడు. అతడి చివరి రెండు ఓవర్లలో 28 పరుగులివ్వడం స్వల్ప స్కోరు ఛేదనలో తీవ్ర ప్రభావం చూపింది. ఒకవేళ వైశాక్, యష్‌లలో ఒకరిని పరీక్షిస్తారేమో చూడాలి. స్పిన్నర్లు వరుణ్, బిష్ణోయ్‌లను ఎదుర్కోవడంలో సఫారీ బ్యాటర్లు తెగ ఇబ్బందిపడుతున్నారు. నేటి మ్యాచ్‌లోనూ వీరే కీలకం కానున్నారు.

ఒత్తిడిలో వెటరన్ త్రయం

దక్షిణాఫ్రికా బ్యాటింగ్ ఆర్డర్ తమ సొంత గడ్డపై కూడా ఎలాంటి ప్రభావమూ చూపడం లేదు. కెప్టెన్ మార్క్రమ్‌తో పాటు క్లాసెన్, మిల్లర్‌పై జట్టు భారీగా ఆశలు పెట్టుకుంది. కానీ రెండు మ్యాచ్‌ల్లోనూ ఈ త్రయం దారుణంగా విఫలమైంది. సన్‌రైజర్స్ రూ.23 కోట్లతో అట్టిపెట్టుకున్న క్లాసెన్ కొంతకాలంగా ఫామ్‌లేమితో ఇబ్బందిపడుతున్నాడు. మూడో టీ20లో భారత్‌పై సులువుగా గెలవాలంటే వీరిలో ఇద్దరైనా రాణించాల్సి ఉంటుంది. స్టబ్స్, కొట్జీ పుణ్యమాని రెండో మ్యాచ్‌లో గెలవగలిగారు. బౌలింగ్‌లో పేసర్లు, స్పిన్నర్లు పరుగులను కట్టడి చేస్తూనే వికెట్లను రాబడుతుండడం సానుకూలాంశం కానుంది.

తుది జట్లు (అంచనా)

భారత్: సూర్య కుమార్ (కెప్టెన్), శాంసన్, తిలక్ వర్మ, హార్దిక్, అక్షర్, రింకూ, రమణ్‌దీప్, అర్ష్‌దీప్, బిష్ణోయ్, అవేశ్, వరుణ్ చక్రవర్తి.

దక్షిణాఫ్రికా: హెన్‌డ్రిక్స్, రికెల్టన్, మార్క్రమ్ (కెప్టెన్), స్టబ్స్, క్లాసెన్, మిల్లర్, జాన్సెన్, కేశవ్, కొట్జీ, సిమలానె, సిపామ్లా.

పిచ్, వాతావరణం

సెంచూరియన్ పార్క్ పేసర్లకు స్వర్గధామం. ఇక్కడి బౌన్స్, పేస్ వికెట్ వారికి అనుకూలంగా ఉంటుంది. అలాగే బ్యాటర్లు పరుగులు సాధించడం కష్టమే. అదనపు బౌన్స్‌తో స్పిన్నర్లు కూడా లాభపడతారు. టాస్ గెలిచిన జట్టు బౌలింగ్ ఎంచుకునే అవకాశం ఉంటుంది.

హాకీ అమ్మాయిల రెండో గెలుపు

ఆసియా చాంపియన్స్ ట్రోఫీ



రాజ్‌గిర్ (బిహార్): ఆసియా హాకీ చాంపియన్స్ ట్రోఫీలో భారత మహిళలు వరుసగా రెండో విజయాన్ని నమోదు చేశారు. మంగళవారం జరిగిన పోరులో భారత్ 3-2తో దక్షిణ కొరియాను ఓడించింది. మలేసియాతో జరిగిన తొలి మ్యాచ్‌లో డబుల్ గోల్స్‌తో విజృంభించిన సంగీతా కుమారి (3వ నిమిషం) కొరియాతో పోరులోనూ సత్తాచాటుతూ ఓ గోల్ కొట్టింది. ఇక, దీపిక (20వ, 57వ) రెండు గోల్స్‌తో చెలరేగింది. ఆతిథ్య భారత్ తమ మూడో మ్యాచ్‌ను గురువారం థాయ్‌లాండ్‌తో ఆడనుంది. ఇక, మంగళవారం జరిగిన ఇతర మ్యాచుల్లో జపాన్, థాయ్‌లాండ్ జట్ల మధ్య పోరు 1-1తో డ్రాగా ముగియగా.. చైనా 5-0తో మలేసియాపై గెలిచింది. చైనాకు ఇది వరుసగా రెండో విజయం.

హైదరాబాద్ X ఆంధ్ర

నేటి నుంచి ఉప్పల్‌లో రంజీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్-ఆంధ్ర జట్ల రంజీ మ్యాచ్ ఇక్కడి ఉప్పల్ స్టేడియంలో బుధవారం నుంచి జరుగనుంది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు ఆడిన నాలుగింట్లో ఒక్క మ్యాచ్‌లోనూ రెండు తెలుగు జట్లు స్థాయికి తగిన ప్రదర్శన చేయలేదు. రంజీ ప్లేట్ నుంచి ఈ ఏడాది ఎలీట్ గ్రూప్‌లోకి వచ్చిన హైదరాబాద్ ఆడిన నాలుగింట్లో రెండింట్లో ఓడిపోయి, ఒక మ్యాచ్‌ను డ్రా చేసుకుంది. పసికూన పుదుచ్చేరిపై గెలిచి పరువు దక్కించుకుంది. కెప్టెన్ తిలక్ వర్మ అందుబాటులో లేకపోవడం, ఓపెనర్లు తన్మయ్ అగర్వాల్, అభిరథ్ రెడ్డి నిలకడ లేమి, ఆరంభ స్పెల్‌లో ప్రత్యర్థి బ్యాటర్లను వణికించే నాణ్యమైన పేసర్ లేని లోటు జట్టులో కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. అయితే, మిడిలార్డర్‌లో కెప్టెన్ రాహుల్ సింగ్, గత మ్యాచ్ సెంచరీ హీరో హిమతేజ, ఆల్‌రౌండర్ సీవీ మిలింద్, స్పిన్నర్ తనయ్ త్యాగరాజన్ సొంతగడ్డపై చెలరేగితే ఆంధ్రను నిలవరించవచ్చు. మరో వైపు ఆంధ్ర జట్టు హనుమ విహారి, కేఎస్ భరత్, కర్ణ్ షిండే వంటి హేమాహేమీ సీనియర్లతో ఉన్నా విజయాలు మాత్రం వరించడం లేదు. ఈ సీజన్‌లో ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో మూడింట్లో ఓడిపోయి, ఓ మ్యాచ్‌ను డ్రా చేసుకుంది. రికీ భుయ్ అందుబాటులో లేకపోవడంతో అనూహ్య పరిస్థితుల్లో జట్టు పగ్గాలు అందుకున్న షేక్ రషీద్‌కు సీనియర్లను సమన్వయం చేసుకోవడం కత్తిమీద సాముగా మారింది.



బరిలోకి షమి

బెంగాల్‌కు ప్రాతినిధ్యం

ఇండోర్: దాదాపు ఏడాది తర్వాత పేసర్ మహ్మద్ షమి మైదానంలోకి దిగనున్నాడు. బుధవారం నుంచి మధ్యప్రదేశ్‌తో జరిగే రంజీ మ్యాచ్‌లో అతను బెంగాల్ తరఫున బరిలోకి దిగబోతున్నాడు. గతేడాది వన్డే వరల్డ్ కప్ ముగిశాక ఈ వెటరన్ పేసర్ గాయం కారణంగా క్రికెట్‌కు దూరమయ్యాడు. అయితే వీలైనంత త్వరగా జాతీయ జట్టులో పునరాగమనం చేయాలనే కసితో ఉన్న షమి ఈ మ్యాచ్ ద్వారా ఫిట్‌నెస్ నిరూపించుకోనున్నాడు. ఇందులో రాణిస్తే ఆసీస్ టూర్‌లోని భారత టెస్టు జట్టులోనూ చోటు దక్కే అవకాశం లేకపోలేదు.



స్టార్ల సమరం

టాటా స్టీల్ చెస్ నేటి నుంచే

కోల్‌కతా: టాటా స్టీల్ చెస్ ఇండియా టోర్నమెంట్ బుధవారం ఇక్కడ మొదలవనుంది. ఈనెల 17 వరకు జరిగే ఈ మెగా టోర్నీలో అంతర్జాతీయ స్టార్లు పోటీపడుతున్నారు. ఓపెన్, మహిళల విభాగాల్లో ర్యాపిడ్, బ్లిట్జ్ కేటగిరిల్లో పోటీలుంటాయి. ప్రపంచ నెంబర్‌వన్ కార్ల్‌సన్, వెస్లీ సో, విన్సెంట్ కేమర్‌తో పాటు భారత ఏస్ ఆటగాళ్లు అర్జున్ ఇరిగేసి, ప్రజ్ఞానంద, విదిత్ గుజరాతి, నిహాల్ సరీన్ బరిలో ఉన్నారు. మహిళల్లో కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక, వైశాలి, దివ్యా దేశ్‌ముఖ్, అలెగ్జాండ్రా కోస్తన్యుక్, వాలెంటినా లాంటి ప్రపంచ క్రీడాకారిణులు తలపడుతున్నారు.

గాయత్రి జోడీ పరాజయం

కుమమొటో (జపాన్): గాయత్రీ గోపీచంద్/ట్రీసా జాలీ జోడీ జపాన్ మాస్టర్స్ టోర్నమెంట్‌లో నిరాశపరిచింది. మంగళవారం జరిగిన మహిళల డబుల్స్ తొలి పోరులో ప్రపంచ 20వ ర్యాంక్ ద్వయం గాయత్రి/ట్రీసా 16-21, 16-21తో సూ యిన్ హశా/లిన్ యిన్ హశా (చైనీస్ తైపీ) చేతిలో పరాజయం పాలైంది.

బోపన్న జోడీ.. ఓటమితో మొదలు

ట్యూరిన్ (ఇటలీ): ప్రతిష్ఠాత్మక ఏటీపీ వరల్డ్ టూర్ ఫైనల్స్‌లో భారత స్టార్ రోహన్ బోపన్న/మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ తమ డబుల్స్ పోరును పరాజయంతో ప్రారంభించింది. తమ గ్రూప్ తొలి మ్యాచ్‌లో ఆరో సీడ్ బోపన్న ద్వయం 2-6, 3-6తో సిమోన్ బొలెల్లి/ఆండ్రీ వవాసొరి (ఇటలీ) చేతిలో ఓటమి పాలైంది.

బిజినెస్

పసిడి దిగొచ్చింది..

రూ.77,800కు 10 గ్రా. ధర
కిలో వెండి రూ.2,700 డౌన్

ఒక్కరోజే రూ.1,750 తగ్గుదల



న్యూఢిల్లీ: బులియన్ ధరలు క్రమంగా కొండ దిగుతున్నాయి. ఢిల్లీ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర మంగళవారం రూ.1,750 తగ్గుదలతో రూ.77,800కు జారుకుంది. కిలో వెండి రూ.2,700 తగ్గి రూ.91,300కు పరిమితమైంది. బంగారం, వెండి రేటు తగ్గడం వరుసగా ఇది రెండో రోజు. అంతర్జాతీయ మార్కెట్లో వీటి ధరలు గణనీయంగా తగ్గడంతో పాటు దేశీయంగానూ జువెలర్ల నుంచి డిమాండ్ తగ్గడం ఇందుకు ప్రధాన కారణమని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ పేర్కొంది. కాగా, అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ఒక దశలో 2,600 డాలర్లకు పడిపోగా.. వెండి 30.43 డాలర్లకు తగ్గింది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ స్పష్టమైన మెజారిటీతో విజయం సాధించడంతో అంతర్జాతీయంగా డాలర్ బలం పుంజుకుంది. ఇందుకు తోడు, ట్రంప్ మలివిడత పాలనలో రష్యా-ఉక్రెయిన్‌తో పాటు పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధాలకు తెరపడేందుకు అవకాశాలు పెరగడంతో అనిశ్చితుల్లో భద్రమైన పెట్టుబడి సాధనంగా పేరున్న బంగారం, వెండికి డిమాండ్‌కు ఒక్కసారిగా పడిపోయింది. ఔన్స్ గోల్డ్ ఈ మధ్య నమోదు చేసిన ఆల్‌టైం రికార్డు స్థాయి 2,800 డాలర్ల స్థాయి నుంచి 200 డాలర్ల మేర క్షీణించింది. ముున్ముందు మరింత తగ్గి 2,500 డాలర్లకు పడిపోవచ్చన్న అంచనాలున్నాయి.

నాట్కో ఫార్మా లాభం రూ.677 కోట్లు

ఒక్కో షేరుకు రూ.1.5 మధ్యంతర డివిడెండ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): నాట్కో ఫార్మా.. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలను ప్రకటించింది. ఆదాయాలు గణనీయంగా పెరగటంతో జూలై-సెప్టెంబరు త్రైమాసికంలో కంపెనీ నికర లాభం కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏకంగా 83 శాతం వృద్ధి చెంది రూ.676.50 కోట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే కాలంలో నికర లాభం రూ.369 కోట్లుగా ఉంది. త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం రెవెన్యూ కూడా 35.3 శాతం వృద్ధితో రూ.1,060.80 కోట్ల నుంచి రూ.1,434.90 కోట్లకు చేరుకుంది. సెప్టెంబరు త్రైమాసికంలో దేశీయ ఫార్మా వ్యాపారం నిలకడగా ఉండటంతో పాటు ఫార్ములేషన్స్ ఎగుమతులు మెరుగ్గా ఉండటం కలిసివచ్చిందని నాట్కో ఫార్మా పేర్కొంది. ఫలితాలు ప్రోత్సాహకరగా ఉండటంతో రూ.2 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు రూ.1.50 రెండో మధ్యంతర డివిడెండ్‌ను కంపెనీ ప్రకటించింది. డివిడెండ్ చెల్లింపులకు నవంబరు 25ను రికార్డు తేదీగా ఖరారు చేసింది. డిసెంబరు 2 నుంచి ఈ డివిడెండ్ చెల్లింపులు ప్రారంభించనుంది.

- సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో నెక్సస్ సెలెక్ట్ ట్రస్ట్ నికర నిర్వహణ ఆదాయం 5 శాతం వృద్ధి చెంది రూ.371.30 కోట్లకు చేరుకుంది. భారత్‌లో తొలి రిటైల్ రీట్స్ (రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్) అయిన నెక్సస్.. టెనెంట్ అమ్మకాలు రూ.3,000 కోట్లుగా నమోదయ్యాయి. కంపెనీ ఇటీవల బెంగళూరులో వేగా సిటీ మాల్‌ను కొనుగోలు చేసింది.
- నైపుణ్య శిక్షణ కోసం యాక్సిస్ బ్యాంక్‌తో అడ్డా247 వ్యూహాత్మక ఒప్పందం కుదుర్చుకుంది. ఒప్పందంలో భాగంగా సేల్స్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్ సహా కస్టమర్ సేల్ విభాగాల కోసం నైపుణ్యాలు కలిగిన ఉద్యోగులను అడ్డా247 తీర్చిదిద్దనుంది. అంతేకాకుండా యాక్సిస్ బ్యాంక్ అవసరాలకు తగ్గట్టుగా మెరికల్లాంటి ఉద్యోగులను తయారు చేసేందుకు ప్రత్యేకంగా కార్యక్రమాలను నిర్వహించనుంది.

రూ.5.29 లక్షల కోట్లు ఫట్

భారీగా తగ్గిన స్టాక్ మార్కెట్ సంపద

- 23,900 దిగువకి నిఫ్టీ
- బ్యాంకింగ్, పవర్, ఆటో షేర్లు విలవిల

సెన్సెక్స్ 821 పాయింట్ల పతనం



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు మంగళవారం భారీ గా నష్టపోయాయి. సెన్సెక్స్ 79,000, నిఫ్టీ 24,000 స్థాయిలను కోల్పోయాయి. విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల ఉపసంహరణ, అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూల సంకేతాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు బ్యాంకింగ్, పవర్, వాహన రంగ షేర్లలో భారీగా అమ్మకాలకు పాల్పడటం ఇందుకు కారణం. ఒక దశలో 948 పాయింట్లు క్షీణించిన సెన్సెక్స్.. చివరికి 820.97 పాయింట్ల (1.03 శాతం) నష్టంతో 78,675.18 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 257.85 పాయింట్లు (1.07 శాతం) పతనమై 23,883.45 వద్ద ముగిసింది.

సూచీ నష్టపోవడం ఇది నాలుగో రోజు. అమ్మకాల హోరులో స్టాక్ మార్కెట్ సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.5.29 లక్ష కోట్లకు పైగా తగ్గి రూ.437.24 లక్షల కోట్లకు (5.18 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది. మరిన్ని ముఖ్యాంశాలు..

- సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 24 నష్టాలు చవిచూశాయి. ఎన్‌టీపీసీ షేరు 3.16 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. హెచ్‌డీఎ్ఫసీ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్, ఎస్‌బీఐ, టాటా మోటార్స్, మారుతి సుజుకీ, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, పవర్‌గ్రిడ్ షేర్లు రెండు శాతానికి పైగా నష్టపోయాయి.
- బీఎస్ఈలోని చిన్న, మధ్య స్థాయి కంపెనీల ప్రాతినిధ్య సూచీలైన స్మాల్‌క్యాప్ 1.26 శాతం, మిడ్‌క్యాప్ 0.98 శాతం తగ్గాయి. రంగాలవారీ సూచీల్లో పవర్ 2.79 శాతం, యుటిలిటీస్ 2.20 శాతం, క్యాపిటల్ గూడ్స్ 2.14 శాతం నష్టపోయాయి. ఆటో, ఇండస్ట్రియల్స్, మెటల్ ఇండెక్స్‌లు 1.95 శాతం వరకు విలువను కోల్పోయాయి. రియల్టీ, ఐటీ సూచీలు మాత్రం లాభపడ్డాయి.
- బీఎస్ఈలో 4,061 కంపెనీల షేర్లు ట్రేడవగా.. 2,791 నష్టపోయాయి. 1,181 కంపెనీల స్టాక్ లాభపడగా.. 89 యథాతథంగా ముగిశాయి. 71 కంపెనీల షేర్లు సరికొత్త ఏడాది కనిష్ఠానికి జారుకున్నాయి.
- ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ ఒక పైసా తగ్గి సరికొత్త జీవిత కాల గరిష్ఠ స్థాయి 84.39 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ ముడి చమురు పీపా ధర ఒక దశలో 0.56 శాతం పెరిగి 72.23 డాలర్ల స్థాయిలో ట్రేడైంది.

స్విగ్గీ ఉద్యోగులకు జాక్‌పాట్

ఒక్కో ఉద్యోగికి రూ.1.8 కోట్ల ఈ-సాప్స్

ఫుడ్ డెలివరీ యాప్ 'స్విగ్గీ' పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) లిస్టింగ్ ఆ కంపెనీ ఉద్యోగులను కోటీశ్వరులను చేస్తోంది. ఐపీఓ కంటే ఎంతో ముందే తన 5,000 మంది ఉద్యోగులకు ఎంప్లాయీ స్టాక్ ఓనర్‌షిప్ ప్లాన్ (ఈ-సాప్స్) కింద పెద్ద మొత్తంలో షేర్లు కేటాయించింది. బుధవారం స్విగ్గీ షేర్లు బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో లిస్టు కానున్నాయి. ఐపీఓ అప్పర్ ప్రైస్ బ్యాండ్ రూ.390 వద్ద లిస్టయినా ఒక్కో ఉద్యోగి వద్ద ఉన్న షేర్ల సగటు విలువ రూ.1.8 కోట్లకు చేరుతుందని (మొత్తం విలువ రూ.9,000 కోట్లు) మార్కెట్ వర్గాల అంచనా.

హైదరాబాద్‌లో గ్లోబల్ లాజిక్ డెలివరీ కేంద్రం

హైదరాబాద్‌లో మరో అంతర్జాతీయ సంస్థ కొలువు తీరింది. హిటాచీ గ్రూప్ కంపెనీ, డిజిటల్ ఇంజనీరింగ్ సేవల్లో పేరొందిన గ్లోబల్‌లాజిక్ హైదరాబాద్‌లో తన డెలివరీ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ప్రస్తుతం 600 మంది ఇంజనీర్లతో ప్రారంభించిన ఈ కేంద్రాన్ని వచ్చే మూడేళ్లలో 2,000కు విస్తరిస్తామని తెలిపింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



13వ తేదీ			
హైదరాబాద్	520	విజయవాడ	535
వరంగల్	522	గోదావరి	540
చిత్తూరు	593	విశాఖపట్నం	525
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	100	విజయవాడ	114
వరంగల్	100	గుంటూరు	110
కరీంనగర్	100	ఒంగోలు	110
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	102
కర్నూలు	100	నెల్లూరు	102
విశాఖపట్నం	108	అనంతపురం	102
గోదావరి	114		

మెర్సిడెస్ ఏఎంజీ సీ 63 ఎస్ఈ పెర్ఫార్మెన్స్

ధర రూ.1.95 కోట్లు



న్యూఢిల్లీ: లగ్జరీ కార్ల దిగ్గజం మెర్సిడెస్ బెంజ్ మార్కెట్లో కొత్త కారు "ఏఎంజీ సీ 63 ఎస్ఈ పెర్ఫార్మెన్స్"ను విడుదల చేసింది. ఎఫ్1 హైబ్రిడ్ టెక్నాలజీతో వచ్చిన ఈ కారు ధర రూ.1.95 కోట్లు. ఇది ఈ ఏడాదిలో తాము ప్రవేశ పెట్టిన 14వ ఉత్పత్తి అని మెర్సిడెస్ బెంజ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ సంతోష్ అయ్యర్ చెప్పారు. రూ.1.5 కోట్ల పైబడిన విలువ గల టాప్ ఎండ్ వాహనాల (టీఈవీ) విక్రమాలు పెంచుకునే ప్రయత్నంలో భాగంగా ఈ ఏడాది 10 కొత్త కార్లు తెస్తామని గతంలో ప్రకటించిన తాము ఆ లక్ష్యాన్ని దాటినట్టు ఆయన తెలిపారు. ఈ ఏడాది దేశంలో లగ్జరీ కార్ల విక్రయాలు 52,000 స్థాయిని చేరగలవని పరిశ్రమ భావిస్తున్నదని అయ్యర్ అన్నారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,290 ▼	70,850 ▼	1,00,000 ▼
ముంబై	74,900 ▼	68,608 ▼	88,252 ▼

బిట్‌కాయిన్ బిరబిరా..

- 90,000 డాలర్లకు చేరువైన ధర
- ఒక్కరోజే 10 శాతం పెరుగుదల

అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నికవడం క్రిప్టో కరెన్సీ మార్కెట్‌కు సరికొత్త ఊపునిచ్చింది. ప్రముఖ క్రిప్టో కరెన్సీ బిట్ కాయిన్ విలువ 90,000 డాలర్లకు చేరువైంది. సోమవారం ట్రేడింగ్‌లో బిట్‌కాయిన్ ఏకంగా 10 శాతం వృద్ధితో 89,623 డాలర్ల వద్ద సరికొత్త ఆల్‌టైం రికార్డు గరిష్ఠాన్ని నమోదు చేసింది. మంగళవారం ట్రేడింగ్‌లో స్వల్పంగా తగ్గినప్పటికీ, ముున్ముందు సెషన్లలో బిట్ కాయిన్ సరికొత్త గరిష్ఠాలకు ఎగబాకనుందని క్రిప్టో మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. ఈ నెల 5న అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరిగిన రోజు నుంచి ఇప్పటివరకు బిట్‌కాయిన్ విలువ 25 శాతానికి పైగా పుంజుకుంది. మరో క్రిప్టో కరెన్సీ ఈథర్ ఏకంగా 30 శాతం ఎగబాకింది. అమెరికాను క్రిప్టోల రాజధానిగా తీర్చిదిద్దుతానని, బిట్‌కాయిన్‌ల వ్యూహాత్మక నిల్వలను ఏర్పాటు చేస్తానని ఎన్నికల ప్రచారంలో ట్రంప్ ప్రకటించారు. అంతేకాదు, ఎన్నికల ప్రచార కార్యక్రమాలకు అవసరమైన విరాళాలను క్రిప్టోల్లోనూ స్వీకరించారు. ట్రంప్ సానుకూల వైఖరితో ఈ వర్చువల్ కరెన్సీల విలువ ముున్ముందు మరింత పెరగవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

మళ్లీ ధరల మంట

అక్టోబరులో 6 శాతం దాటిన ద్రవ్యోల్బణం
14 నెలల గరిష్ఠ స్థాయి

న్యూఢిల్లీ: దేశంలో ఆహార వస్తువుల ధరలు మండిపోతున్నాయి. ఫలితంగా అక్టోబరు నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం 14 నెలల గరిష్ఠ స్థాయి 6.21 శాతానికి దూసుకుపోయింది. గత ఏడాది జూలై తర్వాత రిటైల్ ద్రవ్యోల్బణం ఈ స్థాయిలో ఉండడం ఇదే ప్రథమం. ప్రధానంగా పళ్లు, కూరగాయలు, మాంసం, చేపలు, ఆయిల్స్ అండ్ ఫ్యాట్స్ ధరలు కొండెక్కాయి. పప్పులు, అనుబంధ ఉత్పత్తులు, గుడ్లు, చక్కెర, కన్ఫెక్షనరీ విభాగాల్లో మాత్రం ధరలు గణనీయంగా తగ్గాయి. జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) విడుదల చేసిన గణాంకాల ప్రకారం అక్టోబరు నెలలో ఉమ్మడి ఆహార ధరల సూచీ (సీఎఫ్‌పీఐ) 10.87 శాతానికి దూసుకుపోయింది. ఇది 15 నెలల గరిష్ఠ స్థాయి. సీఎఫ్‌పీఐ సెప్టెంబరు నెలలో 9.24 శాతం ఉంది. దీంతో వచ్చే నెలలో నిర్వహించనున్న సమీక్షలో కూడా ఆర్‌బీఐ వడ్డీ రేట్లు తగ్గించే ఆస్కారం లేదని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

పోకర్ణ ఇంజనీర్డ్ స్టోన్ రూ.440 కోట్ల పెట్టుబడులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): పోకర్ణ లిమిటెడ్ అనుబంధ సంస్థ పోకర్ణ ఇంజనీర్డ్ స్టోన్ లిమిటెడ్ (పీఈఎస్ఎల్)..రూ.440 కోట్ల పెట్టుబడులు పెడుతున్నట్లు ప్రకటించింది. తెలంగాణలోని మేకగూడలోని క్వార్ట్జ్ ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు ఈ మొత్తాలను వినియోగించనున్నట్లు తెలిపింది. విస్తరణలో భాగంగా మూడో బ్రెటోన్‌స్టోన్ ఉత్పత్తి లైన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొంది. 2026 మార్చి నాటికల్లా ఈ కొత్త లైన్ వాణిజ్యపరంగా అందుబాటులోకి వస్తుందని తెలిపింది. అంతర్జాతీయంగా ప్రీమియం క్వార్ట్జ్ సర్ఫేస్‌కు పెరుగుతున్న డిమాండ్‌ను అందుకునేందుకు ఈ విస్తరణ దోహదపడుతుందని పీఈఎస్ఎల్ సీఎండీ గౌతమ్ చంద్ జైన్ తెలిపారు. కాగా ఈ మొత్తాలను పూర్తిగా అంతర్గత వనరులు, రుణాల రూపంలో సమీకరించనున్నట్లు పోకర్ణ వెల్లడించింది.

క్యూ2 లాభం రూ.45 కోట్లు: సెప్టెంబరుతో ముగిసిన ద్వితీయ త్రైమాసికంలో పోకర్ణ లిమిటెడ్ రూ.253.46 కోట్ల కన్సాలిడేటెడ్ రెవెన్యూపై రూ.44.95 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంలో కంపెనీ నికర లాభం రూ.33.04 కోట్లుగా ఉండగా రెవెన్యూ రూ.203.86 కోట్లుగా ఉంది.

నవ్య

కుటుంబ కదంబం

బుధవారం • 13 నవంబరు 2024



దేశం చుట్టేస్తున్నారు

మన దేశంలో 22 రాష్ట్రాలు, ఆరు కేంద్రపాలిత ప్రాంతాలను, కొన్ని విదేశాలను సైతం ట్రక్కులో చుట్టేశారు జలజా రతీశ్. తోటికోడలికి, కుమార్తెలకే కాదు... ఎంతోమందికి ట్రక్ నడపడంలో ప్రేరణగా నిలుస్తున్నారు. మరోవైపు ట్రావెల్ వ్లాగ్ కూడా నిర్వహిస్తున్నారు. 'ట్రక్కు డ్రైవింగ్ మహిళలు చేసే పని కాదనేవారికి మేమే సమాధానం' అంటున్న 42 ఏళ్ల జలజ స్ఫూర్తి మంతమైన ప్రయాణం ఆమె మాటల్లోనే...

"నేను పుట్టి పెరిగింది కేరళలోని కొరుత్తాడ్‌లో. చదువు మధ్యలో ఉండగానే పెళ్ళయింది. ఆ తరువాత ఎట్టుమనూర్‌లోని మా అత్తవారి ఇంట్లోకి అడుగుపెట్టాను. నా భర్త రితీశ్ ట్రక్కు డ్రైవర్. సొంతంగా కొన్ని ట్రక్కులు ఉండేవి. దేశంలోని వివిధ ప్రాంతాలకు సరుకులను రవాణా చేసేవారు. ఇంట్లో ఉన్నప్పుడు తను చూసిన ప్రదేశాల గురించి చెబుతూ ఉంటే.. నేను కూడా అవన్నీ చూస్తే బాగుంటుందనిపించేది. ఒకసారి "మన పెళ్ళిరోజుకు కశ్మీర్ తీసికెళ్తారా" అని అడిగాను. "అలాగే వెళ్దాం! కానీ నువ్వు ట్రక్కు నడిపితేనే తీసికెళ్తాను" అన్నారు. దాంతో ఆయన దగ్గరే ట్రక్కు డ్రైవింగ్ నేర్చుకున్నాను. ఇచ్చిన మాట ప్రకారం ఆయన కశ్మీర్ తీసుకువెళ్ళారు. కానీ నాకు స్టీరింగ్ అప్పగించలేదు. అక్కడి నుంచి వచ్చాక.. డ్రైవింగ్ పరీక్షలకు హాజరై... హెవీ వెహికిల్ లైసెన్స్, ఆ తరువాత అప్పుడప్పుడు తక్కువ దూరాలకు ట్రక్కుల్లో సరుకులు చేరవేసేదాన్ని. దూర ప్రయాణం చేసే అవకాశం 2022 ఫిబ్రవరిలో వచ్చింది. ఆ ఏడాది మా పెళ్ళి రోజు సందర్భంగా నాకు ఒక ట్రక్కు తాళాలను మా ఆయన అప్పగించారు. కశ్మీర్ వరకూ నేనే ట్రక్కు నడిపాను. ఇది నాకు ఎంతో సంతోషం కలిగించింది. నాలో ఆత్మస్థైర్యాన్ని పెంచింది.

ఆరు రోజులు రోడ్డు మీదే ...

పన్నెండు టైర్లు ఉన్న వాహనంలో... గతుకులు, గుంతలు, ఇరుకైన మలుపులు ఉన్న రోడ్ల మీద సరుకులను రవాణా చెయ్యడం ఒక పెద్ద సవాలు. ఒకసారి జమ్మూ-కశ్మీర్ మధ్య వెళ్తున్నాను. ఒకవైపు రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మార్గమధ్యంలో కొండ చరియలు పడి, వాహనాలు ఆగిపోయాయి. వాతావరణం అనుకూలించకపోవడంతో.. దాదాపు ఆరు రోజుల పాటు వాహనాలను అధికారులు ఆపేశారు. కాలకృత్యాల కోసం రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న హోటల్‌కు నడిచి వెళ్ళాల్సి వచ్చేది. ఇలాంటి అనుభవాలు ఎన్నో ఎదురైనా... నేను చేసే ప్రతి ప్రయాణం ఎంతో ఆహ్లాదంగా అనిపిస్తుంది. సాధారణంగా మా ట్రక్కులో నేను, నా భర్త వెళ్తూ ఉంటాం. ఒకరు విశ్రాంతి తీసుకుంటే మరొకరం వాహనం



అత్తగారి కోరిక తీర్చాం...

ఈ రెండేళ్ళలో నేను మన దేశంలోని ఇరవై రెండు రాష్ట్రాలు, లడఖ్‌తో సహా ఆరు కేంద్ర పాలిత ప్రాంతాలు, నేపాల్, భూటాన్ దేశాలను కూడా ట్రక్కులో చుట్టేసి వచ్చాను. నన్ను చూసి స్ఫూర్తి పొందిన నా తోటికోడలు సూర్య, బీకామ్ చదువుతున్న మా అమ్మాయి దేవిక కూడా హెవీ వెహికిల్ లైసెన్సులు తీసుకొని నాకు తోడయ్యారు. మా మరో అమ్మాయి గోపిక ఇప్పుడు చెన్నైలో బీబీఎ చదువుతోంది. తను కూడా లైసెన్స్ కోసం ఎదురుచూస్తోంది. ఈమధ్యే మా అత్తగారిని ట్రక్కులో ఋషీకేశ్ తీసుకువెళ్ళాం. ఋషీకేశ్‌లో గంగా హారతి చూడాలనే ఆమె కోరిక తీర్చాం. 23 రోజుల పాటు 11 రాష్ట్రాల్లో సాగిన ఈ యాత్రలో ఆమెకు ఎన్నో ప్రదేశాలు చూపించాం.

నడుపుతాం. పెట్రోల్ బంకుల్లోని వాష్ రూమ్‌లను వాడుకుంటాం. రోడ్డు పక్కన ఆగి వంట చేసుకుంటాం. దానికోసం ఒక స్టవ్, సరుకులు, పాత్రలను మాతోనే తీసుకువెళ్తాం.

అవకాశం వచ్చినప్పుడల్లా... మా కుటుంబం మొత్తం ట్రక్కుల్లోనే పర్యటనలకు వెళ్తున్నాం. దానికోసం క్యాబిన్లలో ఏసీలు కూడా పెట్టించాం. ఎంతో సరదాగా, ఆహ్లాదంగా సాగే ఆ ప్రయాణాల కోసం అందరం ఎంతగానో ఎదురు చూస్తాం. ఇక, దూరప్రాంతాలకు సరుకులు తీసుకువెళ్ళేటప్పుడు... కనీసం ఇద్దరు కుటుంబ సభ్యులు మాతో ఉంటారు. కాబట్టి సమస్యలేదు. ఇది మహిళలు చేసే పని కాదనే వారికి మేమే సమాధానం. 'మహిళా ట్రక్ డ్రైవర్‌గా ఇబ్బందులు లేవా?' అంటే ఉన్నాయి. ప్రతిచోటా మహిళలకు అనువైన టాయిలెట్ సౌకర్యాలు ఉండవు. ఇంటికి రోజుల తరబడి దూరంగా ఉండాల్సి వస్తుంది. సరైన సమయంలో భోజనం చేసే వీలు ఉండదు. కానీ దేశమంతా చూడాలనే నా ఆకాంక్ష... నేను అనుకున్నదానికన్నా వేగంగానే తీరుతోంది. ఇంకా అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, త్రిపుర, మణిపూర్, సిక్కిం, మిజోరం ప్రాంతాలను సందర్శించాలి. అవి కూడా చూసేస్తే... దేశంలోని ప్రతి రాష్ట్రాన్నీ ట్రక్కు నడుపుతూ సందర్శించిన తొలి మహిళను బహుశా నేనే అవుతాను.

ఎక్కడికి వెళ్లినా గుర్తుపడుతున్నారు...

ఒక ట్రక్కుతో ప్రారంభమైన మా 'పుతెట్టు ట్రాన్స్‌పోర్ట్'లో ఇప్పుడు దాదాపు ముప్ఫై ట్రక్కులున్నాయి. ఇవి కన్యాకుమారి నుంచి నేపాల్ వరకూ, గుజరాత్ నుంచి అసోం వరకూ తిరుగుతాయి. వీటి కార్యకలాపాల్లో నేను, సూర్య, దేవిక ప్రధానపాత్ర పోషిస్తున్నాం. మొదట్లో నా ప్రయాణ అనుభవాలను వీడియోలు, ఫొటోలు తీసి స్నేహితులకి, బంధువులకి పంపించేదాన్ని. ప్రతి ఒక్కరికీ అవి నచ్చడంతో... యూట్యూబ్ ఛానెల్ ప్రారంభించాలనే ఆలోచన వచ్చింది. 'పుతెట్టు ట్రావెల్ వ్లాగ్' పేరుతో మా కుటుంబ సభ్యుల ప్రయాణ అనుభవాల, అనుభూతుల వీడియోలను యూట్యూబ్‌లో పోస్ట్ చేస్తున్నాం. ప్రస్తుతం దానికి 4.25 లక్షలమంది సబ్‌స్క్రైబర్స్ ఉన్నారు. స్పందన కూడా బాగుంది. నేను ఎక్కడికి వెళ్ళినా జనం గుర్తుపడుతున్నారు. నాతో మాట్లాడడానికి ఆసక్తి చూపిస్తున్నారు. "మిమ్మల్ని స్ఫూర్తిగా తీసుకొని భారీ వాహనాల లైసెన్స్ తీసుకున్నాం" అని ఎంతోమంది అమ్మాయిలు చెబుతున్నారు. 'కొత్త ప్రాంతాలను చూడాలి. అక్కడ ప్రజల జీవన విధానాన్ని చూడాలి' అనే ఆకాంక్ష నన్ను ట్రక్కు డ్రైవర్‌గా మార్చింది. నా ఆకాంక్ష నెరవేరడంతో పాటు గుర్తింపు లభించింది. ఇంతకుమించి నేను కోరుకొనేది ఇంకేం ఉంటుంది?"

ఫ్యాషన్

జాలీగా, కులాసాగా షికారు చేసే సమయంలో సౌకర్యంగా ఉండే దుస్తుల మీదే దృష్టి పెడతాం! అలాంటి వాటిలో చెప్పుకోదగినవి 'బటన్ డౌన్' డ్రస్సులు. సింపుల్‌గా, స్టైలిష్‌గా ఉండే ఈ రకం దుస్తుల్లో ఇదిగో ఇలా అదరగొట్టేయాలి.



భలే 'బటన్ డౌన్'

బటన్ డౌన్ డ్రస్సుల మూలాలు పురుషుల షర్టుల్లో ఉన్నాయి. ఆ చొక్కాల నుంచే షర్ట్ డ్రస్సులు పుట్టుకొచ్చాయి. వాటికి కొత్త హంగులు జోడించి, పైనుంచి కింది వరకూ వరుస గుండీలుండే షర్ట్ డౌన్ డ్రస్సులు రూపొందాయి. కాలర్, ముందు వైపు గుండీలు కలిగి ఉండడం ఈ దుస్తుల ప్రత్యేకత. కాటన్ సిల్క్ లాంటి బిరుసుగా ఉండే ఫ్యాబ్రిక్‌తో ఈ దుస్తులు తయారవుతూ ఉంటాయి. తాజాగా కాటన్, క్రేప్ మొదలైన మెటీరియల్స్‌ను కూడా ఈ దుస్తుల తయారీలో ఉపయోగిస్తున్నారు.

- సన్నగా, నాజూకుగా కనిపించేలా చేసే షర్ట్ డౌన్ డ్రస్సులు డైలీవేర్‌గా కూడా పనికొస్తాయి. వీటిని ధరించడం, నిర్వహించడం తేలిక కాబట్టి డైలీవేర్‌గా, ఈవినింగ్ వేర్‌గా రెండు విధాలా ఉపయోగించుకోవచ్చు.
- పూల డిజైన్లు, జామెట్రిక్ డిజైన్లు, నిలువు చారలు... ఇలా ఎన్నో రకాల డిజైన్లలో ఈ డ్రస్సులు దొరుకుతూ ఉంటాయి. అలాగే ఎన్నో రకాల ఆకట్టుకునే ప్రింటుల్లో కూడా ఈ దుస్తులు రూపొందుతూ ఉంటాయి. కాబట్టి నచ్చిన డిజైన్‌ను ఎంచుకునే వీలుంటుంది.
- వెడ్జెస్, స్టేట్‌మెంట్ జ్యూవెలరీలను జోడించిన బటన్ డౌన్ డ్రస్సులు చిన్న చిన్న పార్టీలకు బాగుంటాయి. ఫ్లాట్స్ హ్యాట్‌లను జోడించిన బటన్ డౌన్ డ్రస్సు క్యాజువల్ వేర్‌గా సూటవుతుంది.



పాదాలూ చెబుతాయి..

మనకు ఉన్న ఆరోగ్య సమస్యలను మన పాదాలకు సంబంధించిన కొన్ని లక్షణాలు చెబుతాయి. వాటిని వెంటనే గమనించి చర్యలు తీసుకుంటే దీర్ఘకాలిక సమస్యల నుంచి బయటపడవచ్చు.

- గుండెకు లేదా కాలేయానికి సంబంధించిన సంబంధించిన సమస్యలు కావచ్చు. మన శరీరంలో రక్తాన్ని శుద్ధి చేయటంలో కీలకమైన పాత్ర పోషిస్తుంది. కాలేయ సమస్యలు ఉన్నప్పుడు కాళ్లు వాస్తాయి. అదే విధంగా కాళ్లకు రక్తప్రసారం సరిగ్గా జరగక పోయినా కాళ్లు వాస్తాయి.
- మహిళల్లో ఈస్ట్రోజెన్ హార్మోన్ల విలువల్లో తేడాలు వచ్చినప్పుడు కాళ్ల వాచే అవకాశముంది. రసజ్వల అయినప్పుడు.. గర్భవతి అయినప్పుడు.. రుతుస్రావం ఆగిపోయే సమయంలోను కాళ్ల వాపులు కనిపిస్తాయి. ఈ వాపు ముఖ్యంగా పాదాల దగ్గర ఎక్కువగా కనిపిస్తుంది.



- కొందరికి మడమల పైభాగంలో వాపు కనిపిస్తూ ఉంటుంది. ఇది ఎక్కువ కాలం తగ్గకపోతే యూరిక్ యాసిడ్ ఎక్కువ అయినట్లుగా భావించవచ్చు.
- కొందరి కాళ్లను జాగ్రత్తగా చూస్తే చిన్న చిన్న నరాలు పైకి ఉబికి ఉంటాయి. వీటిని వైద్య పరిభాషలో 'స్పైడర్ వీన్స్' అంటారు. కాళ్లలోకి రక్తప్రసారం సరిగ్గా లేకపోతే ఇవి ఏర్పడతాయి.
- కొందరికి ప్రతి రోజూ కాళ్ల తిమ్మిరిలు వస్తూ ఉంటాయి. మధుమేహం సమస్య ఉన్నవారికి ఈ సంకేతాలు కనిపించిన వెంటనే వైద్యులకు చూపించుకోవటం మంచిది.

దినచర్య ఇలా

పిల్లల శారీరక మానసిక ఎదుగుదలకు మంచి దినచర్య అలవాటు చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే. ఉదయం నిద్రలేచినప్పటి నుంచి రాత్రి పడుకునే వరకు పిల్లలు ఏ సమయానికి ఏమి చేయాలన్నదాన్ని నిర్ణయించి వారు దాన్ని పాటించేలా చూడాలి. దీనివల్ల పిల్లలకు సమయ పాలన, క్రమశిక్షణ అలవడతాయి. ఆ దినచర్య ఎలా ఉండాలో చూద్దాం!

ఉదయమే లేవాలి: పిల్లలు రాత్రి త్వరగా నిద్రకు ఉపక్రమిస్తే ఉదయం త్వరగా మేలుకొనడానికి వీలవుతుంది. సాధ్యమైనంతవరకు ప్రతిరోజూ ఒక నిర్దిష్ట సమయానికి పడుకొని లేవడం పిల్లలకు అలవాటు చేయాలి. పాఠశాలకు వెళ్లే పిల్లలకు కనీసం ఎనిమిది గంటల నిద్ర తప్పనిసరి. నిర్ణీత సమయంలో నిద్ర నుంచి మేలుకొన్నపుడే అన్ని పనులు సమయానుసారం పూర్తవుతాయని పిల్లలకు చెప్పాలి.

గోరువెచ్చని నీళ్లు తాగాలి: పిల్లలు నిద్రలేచిన వెంటనే పళ్లు, నాలుక, నోరు శుభ్రం చేసుకునేలా చూడాలి. తరవాత పరగడుపున ఒక గ్లాసు గోరువెచ్చని నీరు త్రాగే అలవాటు చేయాలి. దీనివల్ల పొట్ట, ప్రేగులు పరిశుభ్రమవడంతోపాటు శారీరక, మానసిక ఆరోగ్యం బలపడుతుంది. ఈ అలవాటు పిల్లలకు జీవితాంతం ఉపయోగపడుతుంది.

యోగా: ఉదయాన్నే పిల్లలు ధ్యానం, యోగ, ప్రాణా

పేరెంటింగ్



యామం చేసేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలి. యోగాసనాలు వేయడం వల్ల పిల్లలు శారీరకంగా బలవంతులవుతారు. ధ్యానం వల్ల ఏకాగ్రత శక్తి పెరుగుతుంది. ప్రాణాయామం వల్ల శరీరానికి కొత్త శక్తి సమకూరుతుంది. ఈ అలవాటు వల్ల పిల్లల్లో క్రమశిక్షణ మొదలవుతుంది.

అల్పాహారం: ఉదయం అల్పాహారం తీసుకోవడం వల్ల పిల్లలు రోజంతా ఉత్సాహంగా ఉంటారు. అల్పాహారంలో భాగంగా పండ్లు, డ్రై ఫ్రూట్స్, ఉడికించిన కూరగాయలు తినిపించండి. తల్లిదండ్రులు కూడా ఇవే తింటూఉంటే పిల్లలు మారాం చేయకుండా తినడానికి ఆసక్తి చూపిస్తారు.

పాఠశాలకు వెళ్లే ముందు: తల్లిదండ్రులు పిల్లలకు యూనిఫామ్, టై, బెల్ట్, సాక్స్, షూస్ ధరించడం నేర్పించాలి. స్కూల్ టైమ్ టేబుల్ ప్రకారం పుస్తకాలను బ్యాగ్‌లో చక్కగా సర్దుకోవడం, వాటర్ బాటిల్ సిద్ధం చేసుకోవడం చూపించాలి. లంచ్ బాక్స్ తీసుకెళ్లడం మరచిపోవద్దని హెచ్చరించాలి.

హోం వర్క్: పిల్లలు పాఠశాల నుంచి ఇంటికి రాగానే స్నానం చేసి పరిశుభ్రమైన దుస్తులు ధరించే అలవాటు చేయాలి. సాయంత్రం సమయాల్లో ఆరోగ్యకరమైన పౌష్టికాహారం తినిపించాలి. ఆ రోజు పాఠశాలలో ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు చదువుకునేలా చూడాలి. పిల్లలకు ఏవైనా సందేహాలుంటే వాటిని తల్లిదండ్రులు తీర్చే ప్రయత్నం చేయాలి. ప్రతిరోజూ ఉపాధ్యాయులు ఇచ్చిన హోం వర్క్‌ను పిల్లలు ఎప్పటికప్పుడు పూర్తిచేసేలా ప్రోత్సహించాలి.

ఆటలు: పిల్లల మానసిక పరిపక్వతకు ఆటలు దోహదం చేస్తాయి. ప్రతిరోజూ కొంత సమయాన్ని ఆటలకు కేటాయించాలి. తోటి పిల్లలతో కలసి మెలసి ఆడుకునేలా చూడాలి.

ఆరోగ్యం

చలి కాలంలో

రోగనిరోధకశక్తికి...



శీతాకాలం వచ్చేసింది. చాలా మందికి అడపాదడపా జ్వరం, జలుబు వస్తూనే ఉంటాయి. దీనికి కారణం రోగనిరోధక శక్తి లేకపోవటం. రోగనిరోధక శక్తిని పెంపొందించుకోవటానికి ఉన్న ఒక సాధనం జీడిపప్పు, బాదం, అక్రూట్, పిస్తా వంటి డ్రై ఫ్రూట్స్. వీటిలో ఉండే ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్, ప్రొటీన్స్ మన శరీరానికి ఎంతగానో ఉపకరిస్తాయి. అయితే వీటిని నేరుగా తినకుండా నానబెట్టి తినటం వల్ల ప్రయోజనం ఉంటుందంటున్నారు పౌష్టికాహార నిపుణులు. ఆ వివరాలేమిటో చూద్దాం.

బాదం: ప్రొటీన్, ఫైబర్, విటమిన్-ఈ, మెగ్నిషియం, జింక్, ఐరన్ వంటి అనేక పదార్థాలు బాదంలో ఉంటాయి. అయితే బాదంలో ఫైటెక్ యాసిడ్ ఉంటుంది. ఇది జింక్, ఐరన్ వంటివి మన శరీరంలో చేరకుండా అడ్డుపడుతూ ఉంటుంది. బాదంను తినే ముందు నానబెడితే ఈ యాసిడ్ నిర్వీర్యం అవుతుంది.

జీడిపప్పు: జీడిపప్పులో కూడా అనేక రకాల మినరల్స్ ప్రొటీన్లు ఉంటాయి. తినే ముందు- కొద్ది సేపు జీడిపప్పును నానబెడితే శరీరంలోకి మెగ్నీషియం త్వరగా చేరుతుంది. మన శరీరంలోని కండరాలు, నరాల పనితీరుపై ఇది ప్రభావం చూపుతుంది.

వాల్‌నట్స్: మెదడు చురుకుగా పనిచేయటానికి ఉపకరిస్తాయి. వాల్‌నట్స్‌లో టానిన్స్ అనే పదార్థం ఉంటుంది. ఇది జీర్ణప్రక్రియకు అడ్డం పడుతూ ఉంటుంది. అందువల్ల వాల్‌నట్స్‌ను కొద్దిసేపు నానబెడితే ఈ పదార్థం పనితీరులో మార్పు వస్తుంది.

అంజీర్: అంజీర్‌ను పండుగా తినప్పుడు ఎటువంటి ఇబ్బంది ఉండదు. కానీ అంజీర్‌ను ఎండబెట్టినప్పుడు దానిలో ఉండే పీచు పదార్థం గట్టి పడుతుంది. అందువల్ల జీర్ణమవటం కష్టమవుతుంది. ఎండు అంజీర్‌లను కొద్ది సేపు నానబెడితే- దానిలో ఉండే ఫైబర్ మెత్తపడుతుంది. త్వరగా జీర్ణమవుతుంది.

పిస్తాలు: పిస్తాలలో కూడా ఫైటెక్ యాసిడ్ ఉంటుంది. అందువల్ల జీర్ణమవటం కష్టమవుతుంది. వీటిని కొద్ది సేపు నానబెడితే ఫైటెక్ యాసిడ్ నిర్వీర్యం అవుతుంది. అప్పుడు పిస్తాపప్పు సులభంగా జీర్ణమవుతుంది.

విభిన్నం

ఆమె 'కృషి'... నేలకు రక్ష..!

నర్సుగా రోగులకు సేవ చేయాలనుకుంది మహారాష్ట్రకు చెందిన కావ్య ధోబలే. కానీ కొవిడ్ మరణాలతో కలత చెందిన ఆమె ప్రభుత్వోద్యోగాన్ని వదిలి సొంతూర్లో సేంద్రియ ఎరువు తయారీ సంస్థను ప్రారంభించింది. వినూత్నమైన ఆలోచనతో రైతులకు ఆదర్శంగా నిలిచిన కావ్య ధోబలే ప్రయాణం ఇది.

కావ్యకు చిన్నప్పటి నుంచి ఇతరులకు సేవ చేయడమంటే చాలా ఇష్టం. నర్సుగా శిక్షణ పొంది తన ఆశయం నెరవేర్చుకోవాలనుకుంది. జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీలో డిప్లొమా పూర్తి చేసి ముంబయిలోని లోకమాన్య తిలక్ మునిసిపల్ మెడికల్ కాలేజ్ అండ్ జనరల్ హాస్పిటల్ (సియాన్ హాస్పిటల్)లో నర్సుగా చేరింది. తరవాత టాటా క్యాన్సర్ హాస్పిటల్‌లో ఉద్యోగం చేస్తూ బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసింది. ఓ ప్రైవేట్ కళాశాలలో అధ్యాపకురాలిగా చేరింది. కొన్నాళ్లకు తిరిగి సియాన్ హాస్పిటల్‌లో స్టాఫ్ నర్స్‌గా చేరింది. అదే సమయంలో దేశమంతటా కొవిడ్ వ్యాప్తి చెందింది. ఆసుపత్రికి ఎంతోమంది బాధితులు వచ్చేవారు. వారికి సేవ చేస్తూ తను కూడా కొవిడ్ బారిన పడింది. చావు అంచుల దాకా వెళ్లి బతికింది. అయినా రోగులకు సేవ చేయడం ఆపలేదు కావ్య. రోజుల వ్యవధిలో పెరుగుతున్న మరణాలు చూసి చలించిపోయింది. ఈ సంఘటనలన్నీ ఆమెను ఆలోచనలో పడవేశాయి.



కొవిడ్‌తో కలత చెంది...

ఆసుపత్రికి వస్తున్న కొవిడ్ బాధితులంతా బలహీనంగా ఉండడం గమనించింది కావ్య. శరీరంలో ఇమ్యూనిటీ వ్యవస్థ సరిగా పని చేయకపోవడంవల్లనే మరణాలు సంభవిస్తున్నాయని తెలుసుకుని దానికి కారణాలు అన్వేషించింది. తీసుకునే ఆహారంలో పోషకాలు లేకుండా రసాయన భరితంగా ఉండడంవల్లే శరీరానికి రోగనిరోధకశక్తి లభించడంలేదని తెలుసుకుంది. రసాయనాలు ఉపయోగించకుండా సేంద్రియ పద్ధతులు అనుసరిస్తే ప్రజలకు రసాయన రహిత పోషకాహారం అందించవచ్చని గ్రహించింది కావ్య. వెంటనే తను చేస్తున్న ప్రభుత్వోద్యోగం వదిలి భర్తతో కలసి సొంత గ్రామానికి వచ్చేసింది.

నర్స్ ఉద్యోగాన్ని వదిలి...

కావ్య భర్త రాజేష్. సొంతూరు పుణెలోని దత్‌ఖిలేవాడి. వీరికి అక్కడ అయిదు గుంటల ఖాళీ స్థలం ఉంది. అక్కడ కావ్య స్థానిక రైతులందరినీ సమావేశపరచి సేంద్రియ వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని, అందులో ప్రధానంగా వర్మీ కంపోస్ట్‌ను ఉపయోగిస్తే నేల సారవంతమవడంతో పాటు పంట మొక్కలకు పోషకాలు అందుతాయని చెప్పడం ప్రారంభించింది. దాంతో రైతులందరూ ముక్త కంఠంతో 'అదేదో మీరే చేసి చూపించండి' అనడంతో కావ్య వర్మీ కంపోస్ట్ తయారీని ఆరంభించాలని నిర్ణయించుకుంది.

గత ఏడాది 'కృషి కావ్య బ్రాండ్' పేరుతో అమ్మకాలు ప్రారంభించింది కావ్య. రైతులకు వీటిని నేరుగా అందించడమే కాకుండా ప్రీ బుకింగ్ సర్వీస్ కూడా అందుబాటులోకి తెచ్చింది. రైతులందరూ వీటిని ఉపయోగించి, సేంద్రియ సాగు వైపు అడుగులు వేయాలన్నదే ఆమె ఆశ. వ్యాపారం ప్రారంభించిన మొదటి ఏడాదే ఆమె 24 లక్షల టర్నోవర్



సాధించింది. అందరికీ ఆదర్శంగా నిలిచింది.

ఐదు వందలతో మొదలై...

'వర్మీ కంపోస్ట్ తయారు చేయాలనుకున్నపుడు నేను పెద్దగా పెట్టుబడి పెట్టలేదు. ఒక చిన్న బెడ్‌లో ఒక కేజీ వానపాములను ఆవు పేడలో కలిపి పెట్టాను. దీనికి కేవలం ఐదు వందల రూపాయలు మాత్రమే ఖర్చయింది. రెండు నెలల్లో వర్మీ కంపోస్ట్ తయారైంది. క్రమంగా పది బెడ్ల వరకు పెంచాం. మరో రెండు నెలల్లో అయిదు టన్నుల వర్మీ కంపోస్ట్ సిద్ధమైంది. దీనిని ఉపయోగించిన స్థానిక రైతులు మంచి దిగుబడి సాధించడంతో క్రమంగా డిమాండ్ కూడా పెరిగింది. అప్పుడే ఈ పరిశ్రమను మరింత పెంచాలని నిర్ణయించుకున్నా. ప్రస్తుతం మావద్ద 70 బెడ్లు ఉన్నాయి. ఒక్కో బెడ్‌లో 500 నుంచి 600 కేజీల వర్మీ కంపోస్ట్ సిద్ధమవుతుంది. అలాగే వానపాములను కూడా విరివిగానే పెంచుతున్నాం.'

శిక్షణ ఇస్తూ

వర్మీ కంపోస్ట్ తయారీకి సంబంధించి ట్రెయినింగ్ సెంటర్‌ను ప్రారంభించింది కావ్య. ఇందులో ఔత్సాహికులకు ఒక రోజు శిక్షణ ఉంటుంది. తనవద్ద శిక్షణ పొందిన 200 మంది ఇప్పటికే వర్మీ కంపోస్ట్ తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసుకున్నారని ఇది తనకెంతో ఆనందాన్నిస్తుందని చెప్పుకొచ్చింది. వ్యవసాయ పద్ధతులను వివరిస్తూ యూ ట్యూబ్ ఛానెల్‌ను కూడా నిర్వహిస్తోంది. పలువురు రైతులతో మాట్లాడి వారి అనుభవాలను ఈ ఛానెల్ ద్వారా అందరికీ అందుబాటులో ఉంచుతోంది.

కడప జిల్లాలో దెబ్బకు కర్నూలులో కాక!

యురేనియం తవ్వకాలపై ప్రజాగ్రహం.. 'పులివెందుల' శుద్ధికర్మాగారంతో అనర్థాలు


పులివెందుల నియోజకవర్గంలో ఎం.తుమ్మలపల్లె వద్ద ఉన్న యురేనియం శుద్ధి కర్మాగారం

ఆంధ్రజ్యోతి ప్రత్యేకం

కర్నూలు జిల్లా కప్పట్రాళ్ల రిజర్వు ఫారెస్ట్ ప్రాంతంలో యురేనియం తవ్వకాలకు వ్యతిరేకంగా 15 గ్రామాల ప్రజలు మూడు నెలలుగా ఆందోళన చేస్తున్నారు. గత జగన్ ప్రభుత్వం ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పోరుబాట పట్టారు. వారి ఆవేదనకు, భయాలకు... పొరుగునే ఉన్న కడప జిల్లాలో వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో శ్రీకారం చుట్టిన యురేనియం శుద్ధికర్మాగారం వల్ల నేడు చోటు చేసుకుంటున్న దుష్పరిణామలు అద్దం పడుతున్నాయి. ప్లాంట్ ఏర్పాటు చేయకముందు అక్కడి పరిస్థితులు ఎలా ఉండేవి? ఇప్పుడు స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

(పులివెందుల-ఆంధ్రజ్యోతి)

పులివెందుల నియోజకవర్గంలో యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (యూసీఐఎల్) శుద్ధిక ర్మాగారం ఏర్పాటు చేసిన ఎం.తుమ్మలపల్లె ప్రాంతంలో ఒకప్పుడు వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా ఉండేది. అరటి తోటలు, పచ్చని పంటలతో ఆ ప్రాంతం కళకళలాడుతుండేది. పరిసర గ్రామాల్లో ఎలాంటి అనారోగ్య సమస్యలు ఉండేవి కావు. ఇక్కడ యూసీఐఎల్ శుద్ధికర్మాగారం ఏర్పాటు చేసిన తర్వాత పరిస్థితులు మారిపోయాయి. యురేనియం తవ్వకాలు, శుద్ధి, సరఫరాతో స్థానికులు ఎన్నో అనారోగ్య సమస్యలు ఎదు ర్కొంటున్నారు. వాతావరణం, నీరు కలుషితమైంది. పచ్చగా కళకళలాడాల్సిన పంట పొలాలు బీళ్లుగా మారే పరిస్థితి నెల కొంది. యూసీఐఎల్ శుద్ధికర్మాగారం ఏర్పాటు సమయంలో ఎన్నో హామీలిచ్చారు. ఆచరణలోకి వచ్చేసరికి పూర్తి స్థాయిలో అమలు చేయలేదు. అత్యంత జాగ్రత్తగా పరిరక్షించాల్సిన టెయి లింగ్‌పాండ్‌ను యూసీఐఎల్ గాలికి వదిలేసింది.

* పచ్చని పల్లెలకు శాపం

పులివెందుల నియోజకవర్గంలోని వేముల మండలం ఎం.తుమ్మలపల్లె వద్ద వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 2007లో దాదాపు రూ.1,100 కోట్లతో యూసీఐఎల్ శుద్ధి కర్మాగార పనులు ప్రారంభించింది. 2009 నాటికి శుద్ధిక ర్మాగారం పనులు పూర్తిచేసుకుని ఉత్పత్తి మొదలు పెట్టింది. ఈ కర్మాగారానికి చుట్టుపక్కల ఎం.తుమ్మలపల్లె, మబ్బుచింత పల్లె, భూమయ్యగారిపల్లె, మీది పెంట్ల, కేకే కొట్టాల తదితర గ్రామాలున్నాయి. ఈ ప్రాంత మంతా పూర్తిగా అరటితోటలకు నిలయం. ముడి యురేనియం తవ్వకాలు ప్రారంభించినప్పటి నుంచి భూగర్భజలాలు కలుషిత మవుతూ వచ్చాయి. భూగ ర్భంలో బ్లాస్టింగ్ చేసినపుడు సమీపంలో ఉన్న బోరుబా వుల్లో నీరు కలుషితమైంది. ఈ నీరు తాగడంతో ప్రజ లకు ఒంటిపై దద్దుర్లు, దురదలు వస్తున్నాయి. కొందరు మహిళలకు గర్భస్రావమైందని, మగవారిలో లైంగిక సామర్థ్యం తగ్గిపోతోందని స్థానికులు చెబుతున్నారు. గొర్రెలు, పశువులకు కూడా ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. అయితే ఇవి వాతావరణ పరిస్థితులే తప్ప తమకు సంబంధం లేదని యూసీఐఎల్ అప్పట్లో కొట్టిపారేసింది. ప్రజలు, శాస్త్రవే త్తలు, మానవహక్కుల సంఘాలు పెద్దఎత్తున ఆందోళనలు చేసినా ఏమాత్రం పట్టించుకోలేదు.

- వైఎస్ హయాంలో ప్లాంటుకు శ్రీకారం
- 15 ఏళ్లుగా తవ్వకాలు, శుద్ధి, సరఫరా
- కీలకమైన టెయిలింగ్‌పాండ్ భద్రత గాలికి
- హామీలను విస్మరించిన యూసీఐఎల్
- పరిసర గ్రామాల్లో గాలి, నీరు కలుషితం
- స్థానిక ప్రజలకు అనారోగ్య సమస్యలు
- పంటలు కూడా సాగుచేయలేని దుస్థితి
- కర్నూలులో 'తవ్వకాలు' వద్దని ఉద్యమబాట
- స్పందించిన సర్కారు... తవ్వకాలకు బ్రేక్

* టెయిలింగ్‌పాండ్ నిర్వహణ గాలికి

ముడి యురేనియంను శుద్ధి చేసిన తర్వాత వచ్చే వ్యర్థాలను నిల్వచేసే టెయిలింగ్‌పాండ్‌ను అత్యంత జాగ్రత్తగా పర్యవేక్షిం చాలి. అయితే యూసీఐఎల్ దీని నిర్వహణనే గాలికి వదిలే సింది. ముడి యురేనియాన్ని వెలికితీసేందుకు, శుద్ధి చేసేం దుకు మానవాళికి అత్యంత ప్రమాదకరమైన రసాయ నాలు వాడతారని, వీటి వ్యర్థా లను జాగ్రత్తగా టెయిలింగ్ పాండ్‌లో నిల్వ చేయాల్సి ఉందని శాస్త్ర వేత్తలు, పర్యావరణ వేత్తలు చెబుతు న్నారు. కానీ టెయిలింగ్‌పాండ్ నిర్మాణ సమయంలో సరైన భద్రతా ప్రమా ణాలు పాటించలేదనే ఆరోప ణలున్నాయి. టెయిలింగ్‌పాండ్ కింది భాగాన్ని పూర్తిగా అత్యంత నాణ్యతతో కూడిన సిమెంట్ లైనింగ్‌తో ఏర్పాటు చేయాలి. దీనివల్ల అందులో నిల్వ చేసే వ్యర్థాలు భూమిలోకి ఇంకవు. యూసీఐ ఎల్ తీసుకోవాల్సిన జాగ్రత్తల్లో ఇది ప్రధానమైందని శాస్త్రవేత్తలు అంటు న్నారు. కానీ టెయిలింగ్‌పాండ్ తరచూ ఆరిపోతూ ఉంటోంది. దీని కారణంగా అందులో నుంచి తెల్లనిపొడర్‌లా వచ్చి చుట్టుపక్కల పరిస రాల్లో పడుతోంది. ఈ ధూళి పడటంతో దద్దుర్లు, దురదలు వస్తున్నాయని ప్రజలు అంటున్నారు. ఇటీవల టెయిలింగ్‌పాండ్ చుట్టూ ఎత్తు పెంచే సమయంలో ప్లాస్టిక్ షీట్ ఏర్పాటు చేశారు. దీనిపైన పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. శుద్ధికర్మా గారం నుంచి వ్యర్థాలు సరఫరా అయ్యే పైప్‌లైన్లు తరచూ మర మ్మతులకు గురికావడంతో ఇవి పరిసర ప్రాంతాల్లోని పొలాల్లో ప్రవహిస్తున్నాయి. మరమ్మతులు చేయకుండా యూసీఐఎల్ అలసత్వం చూపుతోంది. దీంతో జరగాల్సిన నష్టం జరిగిపోతోం దని ప్రజలు అంటున్నారు. కాగా, జనం ఆందోళనల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. యురేనియం తవ్వకాలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది.


భూగర్భం నుంచి వెలికితీసి కుప్పగా వేసిన ముడి యురేనియం


టెయిలింగ్‌పాండ్ ఎత్తు పెంచిన సమయంలో చుట్టూ ప్లాస్టిక్ పట్టలు ఏర్పాటు చేసిన దృశ్యం

ఇవీ దుష్పరిణామాలు

- ముడి యురేనియం తవ్వకాలతో వాతావరణం, భూగర్భజలాలు కలుషితం
- కలుషిత నీరు తాగడంతో ప్రజలకు ఒంటిపై దద్దుర్లు, దురదలు
- కొందరు మహిళలకు గర్భస్రావం, మగవారిలో లైంగిక సామర్థ్యం తగ్గడం
- కలుషిత నీటిని తాగిన గొర్రెలు, పశువులకూ అనారోగ్య సమస్యలు
- బ్లాస్టింగ్ చేసినపుడు సమీపంలోని బోరుబావుల్లో నీటి రాక బంద్
- టెయిలింగ్‌పాండ్ నుంచి తెల్లనిపొడర్‌లా వస్తున్న ధూళి పడటంతో పంట పొలాలు దెబ్బతింటున్నాయి
- శుద్ధికర్మాగారం నుంచి వ్యర్థాలు సరఫరా అయ్యే పైప్‌లైన్లు తరచూ మరమ్మ తులకు గురికావడంతో పరిసర ప్రాంతాల్లోని పొలాల్లో అవి ప్రవహిస్తున్నాయి

హామీలు గాలికి

ఎం.తుమ్మలపల్లె వద్ద యూసీఐఎల్ శుద్ధి కర్మా గారం ఏర్పాటు చేయాలనుకున్నప్పుడు ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. దీంతో యూసీఐఎల్ అనేక హామీలు గుప్పించింది. పంట పొలాలకు నష్టపరిహారం ఇస్తూ ఉద్యోగ భద్రత కల్పిస్తామని చెప్పింది. టెయిలింగ్ పాండ్ చుట్టూ, కర్మాగారం పరిసర ప్రాంతాల్లో పెద్దఎ త్తున మొక్కలు నాటుతామని చెప్పింది. ఈ హామీలను నెరవేర్చడంలో విఫలమైందని, 15 ఏళ్లుగా తాము ఇబ్బంది పడుతున్నామని స్థానికులు తెలిపారు.


శుద్ధికర్మాగారం నుంచి వ్యర్థాలు తరలించే పైప్‌లైన్లు

■ ఎన్నో అనారోగ్య సమస్యలు



యురేనియం శుద్ధికర్మాగారం ఏర్పాటు చేసినప్పటి నుంచి మబ్బుచింత లపల్లె, ఎం.తుమ్మలపల్లె, కేకే కొట్టాల తది తర గ్రామాల్లో ప్రజలకు అనేక ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. దురదలకు, దద్దుర్లకు క్రమం తప్పకుండా మందులు వాడాల్సిందే. మా గ్రామం కేకే కొట్టాలలో టెయిలింగ్‌పాండ్ వలన భూగర్భజలాలు కలుషితమవుతున్నాయి. పంట పొలాలు దెబ్బతింటున్నాయి. పంట పొలాలను బీళ్లుగా పెట్టు కునే పరిస్థితి నెలకొంది. ఇక్కడ కర్మాగారం వద్దని చెప్పినా వి నకుండా ఏర్పాటు చేసి మమ్మల్ని ఇబ్బందులపాలు చేశారు.

– సింగంశెట్టి లింగేశ్వరయ్య, కేకే కొట్టాల, వేముల మండలం

■ మమ్మల్ని నాశనం చేశారు



యురేనియం ప్రాజెక్టు పెట్టే సమ యంలో ఎన్నో మాయ మాటలు చెప్పి నాశనం చేశారు. ఆ మాటలన్నీ గాలికొది లేశారు. భూగర్భంలో జరిగే బ్లాస్టింగ్ వల్ల, టెయిలింగ్‌పాండ్ వల్ల తెల్లని దుమ్ము లాగా వచ్చి పడుతోంది. దీనివల్ల కీళ్లనొ ప్పులు, దురదలు, దద్దుర్లు వస్తున్నాయి. చివరకు కళ్లు కూడా క్రమంగా కనిపించకుండా పోతున్నాయి. భూములు తీసుకొని ఉద్యోగాలు ఇస్తామని, అందరూ సంతోషంగా ఉండవచ్చని చెప్పారు. ఉన్న భూముల్లో కొన్నింటిని మాత్రమే తీసుకుని వి గిలిన వాటిని తీసుకోలేదు. ఆ భూములలో పంట పెట్టుకోలేక ఇబ్బందులు పడుతున్నాం. అన్ని విధాలా నష్టపోయాం.

– దస్తగిరమ్మ, ఎం.తుమ్మలపల్లె, వేముల మండలం


■ నీరు కలుషితం



యురేనియం ప్రాజెక్టు వల్ల మా గ్రామంలో నీరు కలుషితమవుతోంది. సాగుచేసుకుంటున్న అరటి తోటలు కూడా వదిలేశాం. గొర్రెలు, మేకలు మేపు కొందామనుకున్నా భయంగా ఉంది. టెయిలింగ్‌పాండ్ నుంచి లీకైన నీటిలో గొర్రెలు, మేకలు దిగడంతో రోగాలు వచ్చి చనిపోతున్నాయి.

– లక్ష్మీదేవి, మబ్బుచింతలపల్లె, వేముల మండలం

■ మా ప్రాంతం నాశనమైంది



పచ్చని పంటపొలాలతో, కొండ గుట్ట లతో చల్లని వాతావరణంతో ఆహ్లాదక రంగా ఉండే మా ప్రాంతం యురేనియం ప్రాజెక్టు వల్ల నాశనం అయింది. వాతావ రణం అంతా కలుషితమైంది. నీరు తాగా లన్నా, బయటకు వెళ్లాలన్నా భయం. యురేనియం ప్రాజెక్టును తెచ్చి మా నెత్తిన రుద్దారు. గాలిలో ధూళి వచ్చి ఆరోగ్యాన్ని పాడుచేస్తోంది. క్రమం తప్పకుండా మందులు వాడుతున్నాం.

– వేమిరెడ్డి, మబ్బుచింతలపల్లె, వేముల మండలం

అవుట్ సోర్సింగ్‌దే పెత్తనం..!

దేవదాయ శాఖలో కీలక సెక్షన్లన్నీ వారి చేతు

- ప్రధానమైన విజిలెన్స్‌లోనూ వారికే ప్రాధాన్యం
- మానేసిన ఉద్యోగిని తీసుకొచ్చి మరీ బాధ్యతలు
- డీఈవోలకు జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి
- ఈవోలపైనే అవుట్ సోర్సింగ్ సిబ్బంది పెత్తనం
- వారికే అండగా నిలుస్తున్న దేవదాయశాఖ అధికారులు



(అమరావతి - ఆంధ్రజ్యోతి)

దేవదాయ శాఖ ప్రధాన కార్యాలయం నెమ్మదిగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల చేతుల్లోకి వెళ్తోంది..! అధికారులు కూడా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకే అధిక ప్రాధాన్యతనిస్తున్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్ల (డీఈవో)కు జూనియర్ అసిస్టెం ట్లుగా పదోన్నతి కల్పించి మరీ కీలకమైన విభాగాల్లో పోస్టిం గులు ఇస్తున్నారు. ఇది ప్రమాదమని తెలిసినా కూడా.. వారినే ప్రోత్సహిస్తున్నారు. దేవదాయశాఖలో ఏ, బీ సెక్షన్లు చాలా కీలకమైనవి. ఆలయాల అడ్మినిస్ట్రేషన్‌తో పాటు లీజులు, లైసెన్స్‌ల వ్యవహారం మొత్తం ఈ సెక్షన్ల పరిధిలోనే ఉంటాయి. ఇలాంటి కీలకమైన సెక్షన్ల బాధ్యతను రెగ్యులర్ ఉద్యోగులు చూసుకుంటారు. వారికి పనిభారం తగ్గించేం దుకు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను నియమించుకుని వారి సేవలను ఉపయోగించుకుంటూ ఉంటారు. కానీ.. దేవ దాయ శాఖ ప్రధాన కార్యాలయంలో రెగ్యులర్ ఉద్యోగుల సేవలను పక్కనపెట్టి మరీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రధాన సెక్షన్లు అప్పగిస్తున్నారు. ఏ, బీ సెక్షన్లతోపాటు విజి లెన్స్, సీజీఎఫ్ సెక్షన్లు కూడా అవుట్ సోర్సింగ్ సిబ్బంది చేతుల్లోనే ఉన్నాయి. విజిలెన్స్‌లో విధులు నిర్వహిస్తున్న అవుట్‌సోర్సింగ్ మహిళా ఉద్యోగి కొద్దికాలం క్రితం మానేసి వెళ్లిపోయారు. కానీ, ఆ ఉద్యోగిని అధికారులే మళ్లీ పిలిచి వి జిలెన్స్ సెక్షన్ బాధ్యతలు అప్పగించారు. విజిలెన్స్‌తోపాటు ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగం కూడా కొన్నాళ్లుగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగి చేతుల్లోనే ఉంది. ఉద్యోగుల ఇంక్రిమెంట్లు, పెన్షన్లు ఇతర బెనిఫిట్లు మొత్తం ఈ సెక్షన్ పరిధిలోనే ఉంటాయి. దేవదాయ శాఖ ప్రధాన కార్యా లయంలో రెగ్యులర్ ఉద్యోగుల కొరత ఉన్న మాట వాస్తవమే కానీ.. వారిని పక్కన పెట్టిమరీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కీలకమైన బాధ్యతలు ఇచ్చేంత కొరత మాత్రం లేదు. కాగా, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతో ఏ పనైనా సులువుగా చేయిం చుకోవచ్చన్న ఉద్దేశంతోనే వారికి కీలకమైన విభాగాలు అప్పగించారన్న విమర్శలు విని పిస్తున్నాయి. దేవదాయ శాఖలో భూములు, పద్దుల వి భాగాలను కూడా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులతో నింపేశారు. రెగ్యులర్ ఉద్యోగులు ఖాళీగా ఉన్నా వారికి పని చెప్పకుండా పక్కన కూర్చోబెడుతున్నారు.

నియామకాల ఊసే లేదు..

దేవదాయ శాఖలో భారీగా ఖాళీలు ఉన్నప్పటికీ వాటి భర్తీకి అధికారులు ముందడుగు వేయడం లేదు. 2016, 2018, 2022లో ఏపీపీఎస్సీ దేవదాయ శాఖలో ఖాళీల వివ రాలు కోరింది. కానీ, అధికారుల ఆ వివరాలు పంపించలేదు. దీంతో ఏపీపీఎస్సీ నోటిఫికేషన్‌లో దేవదాయశాఖ ప్రస్తావన లేకుండా పోయింది. వైసీపీ ప్రభుత్వంలో దేవదాయ శాఖను గాలికి వదిలేయడంతోపాటు పోస్టుల భర్తీపైనా దృష్టిపెట్ట లేదు. రెండు రోజుల క్రితం దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి దేవదాయ శాఖలో ఖాళీలు మొత్తం భర్తీ చేస్తానని ప్రకటించారు. ఆయన ఇచ్చిన హామీ ప్రకారం ఖాళీలు మొత్తం భర్తీ అయితే అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల పెత్తనం తగ్గుతుంది. దీంతో ప్రధాన కార్యాలయంలో పాలన గాడిలో పడుతుంది.

ఈవోలపై పెత్తనం...

అవుట్ సోర్సింగ్ ఉద్యో గులకు కీలకమైన విభాగాల బాధ్యతలు అప్పగించడంతో కొంతమంది.. మేజర్ ఆల యాల ఈవోలపై సైతం పెత్తనం చెలాయించే స్థాయికి వెళ్లారు. మేజర్ ఆలయాల ఈవోలంటే దాదాపు జాయింట్ కమిషనర్ కేడర్‌లో ఉంటారు. దర్శనాలు, ఇతర పనుల నిమిత్తం అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు వారిపై కూడా ఒత్తిడి తీసుకువస్తున్నారు. ఆయా ఆలయాలకు సంబంధించిన ఫైల్స్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులే పెట్టాలన్న ఉద్దేశంతో కొంతమంది ఈవోలు దిక్కుతోచక వారు చెప్పింది చేస్తున్నారు. మేజర్ ఆలయాల ఈవోల పరిస్థితే ఇలా ఉంటే డీసీ, ఏసీ కేడర్, 6 ఏ, 6 బీ ఆలయాల ఈవోల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు తమపై పెత్తనం చేస్తున్నారన్న విషయాన్ని ఈవోలు కూడా కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లలేని పరిస్థితి. ఈవో స్థాయి అధికారులు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులపై ఫిర్యాదులు చేస్తున్నారేమిటని ఆయన భావిస్తారనే ఉద్దేశంతో వెనక్కి తగ్గుతున్నారు. దీనిపై దేవదాయ శాఖ కమిషనర్ దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

2.27 కోట్లతో ఆరు గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టులపై అధ్యయనం

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

అమరావతి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో ఆరు గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్ పోర్టుల నిర్మాణం సాధ్యాసాధ్యాలపై అధ్యయనానికి రూ.2.27 కోట్లు కేటాయించినట్లు రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి చెప్పారు. కుప్పం, శ్రీకాకుళం, నాగార్జునసాగర్, తుని- అన్నవరం, తాడేపల్లిగూడెం, ఒంగో లుల్లో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టులు అభివృద్ధి చేయడం ద్వారా ఎయిర్ కనెక్టివిటీ, కార్గో సేవలు పెంచడం, ప్రయాణికులకు మరింత విస్తృతంగా సేవలందించే లక్ష్యంతో ప్రభుత్వం ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ)కు ప్రతిపాద నలు పంపించిందని వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఏఏఐ.. ప్రతిపాదిత ఎయిర్‌పోర్టుల అభివృద్ధికి అవసరమైన భూమిని గుర్తించి, నివేదికలు అందించాలని కోరిందని మంత్రి మంగళవారం తెలిపారు. కుప్పంలో 1,501 ఎకరాలు, నాగార్జునసాగర్‌లో 1,670 ఎకరాలు, తాడే పల్లిగూడెంలో 1,123 ఎకరాలు, శ్రీకాకుళంలో 1,383 ఎక రాలు, తుని-అన్నవరంలో 787 ఎకరాలు, ఒంగోలులో 657 ఎకరాలు చొప్పున అందుబాటులో ఉన్నట్లు కలెక్టర్ల ద్వారా ప్రభుత్వానికి నివేదికలు సమర్పించినట్లు వివరించారు. గుర్తించిన భూముల్లో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్ పోర్టుల అభివృద్ధికి సాధ్యాసాధ్యాలపై ముందస్తు అధ్యయనానికి ఏఏఐ ఆధ్వ ర్యంలో సాంకేతిక కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఆలయాల ఆదాయ పరిమితులు పెంపు

అమరావతి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖ పరిధిలోని ఆలయాల ఆదాయ పరిమితులను ప్రభు త్వం పెంచింది. ఆలయాలకు వచ్చే ఆదాయం ఆధారంగా వాటి గ్రేడ్‌లను నిర్ణయిస్తూ జీవో 268ను విడుదల చేసింది. ఇకపై రూ.50 లక్షలపైన ఆదాయం ఉండే వాటిని 6ఏ ఆల యాలుగా, రూ.15-50 లక్షల లోపు ఆదాయం ఉన్న వాటిని 6బీ ఆలయాలుగా, రూ.15 లక్షల్లోపు ఆదాయం ఉన్న వాటిని 6సీ ఆలయాలుగా అప్‌గ్రేడ్ చేసింది. ఈ మేరకు దేవదాయ శాఖ చట్టం 1987 ప్రకారం మార్పులు చేస్తూ.. ఆ శాఖ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. 2007లో దేవదాయ ఉత్తర్వుల ప్రకారం రూ.25 లక్షలపైన ఆదాయం ఉంటే 6ఏ ఆలయాలుగా, 2-25 లక్షల మధ్య ఉంటే 6బీ ఆలయాలుగా, రూ.2లక్షల లోపు ఉన్న వాటిని 6సీ ఆలయాలుగా పరిగణించేవారు.

అందెశ్రీకి లోక్ నాయక్ పురస్కారం

- డాక్టర్ హరనాథ్‌కు జీవన సాఫల్య పురస్కారం

విశాఖపట్నం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): తెలంగాణ కు చెందిన ప్రముఖ కవి అందెశ్రీకి ఈ ఏడాది లోక్ నాయ క్ ఫౌండేషన్ సాహిత్య పురస్కారం ఇవ్వనున్నట్టు ఆ ఫౌం డేషన్ ప్రకటించింది. ఈ ఏడాది అందెశ్రీకి అవార్డుతో పా టు రూ.2 లక్షల నగదు, ప్రముఖ ముస్లిం కవి ఖాదర్ మొ హియుద్దీన్‌కు సాహిత్య పురస్కారంతో పాటు రూ.లక్ష నగ దు ఇస్తున్నామని తెలిపింది. వైద్య రంగంలో విశేష సేవలు అందిస్తున్న గ్లోబల్ ఆస్పత్రి గ్రూపు ఛైర్మన్ డాక్టర్ హరనా థ్ పొలిచర్లకు జీవనసాఫల్య పురస్కారం ఇస్తున్నట్లు పేర్కొంది. నెల్లూరు, విజయవాడ, హైదరాబాద్ ప్రాంతాల్లో యువతకు స్వయం ఉపాధి శిక్షణనిచ్చి, సొంత కాళ్లపై నిల బడేలా చేస్తున్న స్వర్ణ భారతి ట్రస్ట్‌కు చెందిన దీపా వెంక ట్‌కు సేవా పురస్కారంతో పాటు రూ.లక్ష నగదు, స్వచ్ఛ భారత్ నినాదాన్ని అందిపుచ్చుకొని కృష్ణా జిల్లా చల్లపల్లిలో పదేళ్లుగా శ్రమదానం చేస్తూ పారిశుధ్యం కోసం కృషి చేస్తు న్న డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్, పద్మావతి దంపతులకు సమా జసేవ పురస్కారం అందజేస్తున్నట్లు ఫౌండేషన్ పేర్కొంది. విశాఖలో జనవరి 18న అవార్డుల అందిస్తామని ఫౌండేషన్ వ్యవస్థాపకులు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తెలిపారు.

యురేనియంకు బ్రేక్

(మొదటి పేజీ తరువాయి)

ఆందోళన దృష్ట్యా ఇకపై ఈ అంశంలో ఎలాంటి ప్రక్రియ కొనసాగించొద్దని స్పష్టం చేశారు. సీఎం ఆదేశాలపై కలెక్టరు పి.రంజిత్ బాషా స్పందించారు. ప్రజలు ఆందోళన చెందవ ద్దని, ఎట్టి పరిస్థితుల్లోనూ బోర్ల తవ్వకాలు జరపబోమని పేర్కొన్నారు. కర్నూలు జిల్లా దేవనకొండ మండలంలో 468.25 హెక్టార్ల విస్తీర్ణంలో కప్పట్రాళ్ల రిజర్వు ఫారెస్ట్ భూములు ఉన్నాయి. కౌలుట్లయ్యమలగా గుర్తింపు ఉన్న ఈ ప్రాంతం ఆదోని రేంజ్ పత్తికొండ సెక్షన్ కిందకు వస్తుంది. ఈ కొండపై కౌలుట్లయ్య స్వామి ఆలయం ఉంది. ఈ అటవీ భూముల్లో యురేనియం నిక్షేపాలు ఉన్నట్లు గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన ప్రాథమిక సర్వేలో గుర్తించారు. భూగ ర్భంలో ఎంత లోతులో, ఎంత పరిమాణంలో యురేనియం నిక్షేపాలు ఉన్నాయనే విషయాన్ని నిర్ధారించిన తర్వాతే తవ్వ కాలు చేయాల్సి ఉంటుంది. అటవీ భూముల్లో ఖనిజాల అన్వే షణ చేపట్టాలంటే కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ అనుమతి తప్పనిసరిగా తీసుకో వాలి. కప్పట్రాళ్ల రిజర్వు ఫారెస్ట్ పరిధిలో యురేనియం నిల్వలు ఎంత పరిమాణంలో నిక్షిప్తమై ఉన్నదీ నిర్ధారణ కోసం 6.80 హెక్టార్లలో 68 బోర్ల తవ్వకానికి అటామిక్ మిన రల్ డైరెక్టరేట్ ఆఫ్ ఎక్స్‌ప్లొరేషన్ అండ్ రీసెర్చ్ రీజినల్ డైరెక్ట ర్‌కు కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ అనుమతిచ్చింది. 2022-23లో అప్పటి వైసీపీ ప్రభుత్వ హయాంలోనే ఈ ప్రక్రియ అంతా జరిగింది.

ఆందోళనల బాటలో వేలాది మంది

యురేనియం తవ్వకాలపై అక్టోబరు 18న 'యురేనియం అలజడి!' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ఈ అంశాన్ని వెలుగులోకి తెచ్చింది. ఆ తర్వాత యురేనియం సమస్య, తవ్వకాలకు వ్యతి రేకంగా ప్రజలు చేస్తున్న ఆందోళనల వార్తలను ప్రచురిం చింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ప్రకటన 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్ అని కప్పట్రాళ్ల, సమీప గ్రామాల ప్రజలు కొనియాడారు. 'యురేనియం తవ్వకాలు వద్దే వద్దు.. మా ప్రాణాలతో చెల గాటం ఆడొద్దు..! సేవ్ కప్పట్రాళ్లమల.. సేవ్ పల్లెసీమలు..!' అంటూ టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కప్పట్రాళ్ల బొజ్జమ్మ, కప్పట్రాళ్ల గ్రామ సర్పంచి చెన్నమ్మనాయుడు, టీడీపీ మండల కన్వీనర్ విజయ భాస్కరగౌడ్, నాయకులు మల్లికార్జున, బంటుపల్లి వెంకటస్వామి గౌడ్, బేతపల్లి సర్పంచి మహేశ్వరరెడ్డి, పి.కోట కొండ సర్పంచి తిమ్మక్క, ఆమె భర్త లింగన్న, పల్లెమలి రంగడు, సుభాన్ తదితరుల ఆధ్వర్యంలో 12 గ్రామాలు ఏక మయ్యాయి. వేలాదిగా తరలివచ్చిన జనం కప్పట్రాళ్లమలలో వెలసిన కౌలుట్లయ్య స్వామి క్షేత్రంలో సమావేశమయ్యారు. 'యురేనియం తవ్వకాలను అడ్డుకుందాం, కౌలుట్లయ్యమలను కాపాడుకుందాం' అని పిలుపుతో ఆందోళనలు చేశారు.

ప్రజలు ఆందోళన చెందవద్దు: కలెక్టరు రంజిత్

యురేనియం లభ్యత, పరిశోధన కోసం బోర్ల తవ్వకాలను ఆపేయాలంటూ కప్పట్రాళ్ల సహా వివిధ గ్రామాల ప్రజలు ఆందోళనను చేస్తున్న విషయాన్ని ప్రభుత్వం దృష్టి తీసు కెళ్లాం. ఈ ప్రక్రియను ఇంతటితో నిలిపివేయాలని, తవ్వ కాలు చేయొద్దని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీచేశారు. ఈ ప్రక్రియను ఇంతటితో ఆపేస్తున్నాం.

ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు: మంత్రి భరత్

అమరావతి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కప్పట్రాళ్లలో యురేనియం తవ్వకాలకు ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదని మంత్రి టీజీ భరత్ తెలిపారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఆ ప్రాంతంలో డ్రిల్లింగ్ గానీ, మరే ఇతర కార్యక్రమం గాని జరగదని మంత్రి అసెంబ్లీ వద్ద స్పష్టం చేశారు. వైసీపీ నేతలు ప్రజల్లో గందరగోళం సృష్టిస్తు న్నారని, అనవసరమైన వదంతులు సృష్టిస్తున్నారని మండిప డ్డారు. ప్రజల సమస్యలను కూటమి ప్రభుత్వం వెంటనే పరి ష్కరిస్తుందన్నారు. వైసీపీ దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని కోడుమూరు టీడీపీ ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి కోరారు.

పెద్దిరెడ్డి చెప్పారని కట్టబెట్టారు!

- ఆయన సన్నిహితుల సంస్థకే కాంట్రాక్టు
- అడ్డగోలుగా సోలార్ రూఫ్ టాప్ టెండర్లు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

వైసీపీ అధికారంలో లేకపోయినా.. మంత్రి పదవిలో లేకపో యినా.. అమరావతి స్మార్ట్ సిటీ కార్పొరేషన్‌లో పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి హవా నడుస్తోంది. ఇటీవల ఈ కార్పొరేషన్ పిలి చిన టెండర్లలో పెద్దిరెడ్డి సన్నిహితులకు చెందిన సంస్థకు అర్హత లేకపోయినా కాంట్రాక్టును కట్టబెటట్టేశారు. రాష్ట్రవ్యా ప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ సెంటర్లు, ఈ-హెల్త్ సెంటర్లలో సోలార్ రూఫ్‌టాప్ సిస్టమ్‌లు ఏర్పాటు చేయ డంతో పాటు ఐదేళ్లు వాటిని నిర్వహించేందుకు సుమారు రూ.2.47 కోట్లతో ఈ ఏడాది అక్టోబరులో టెండర్లు పిలిచారు. అయితే పెద్దిరెడ్డి చెప్పారంటూ అర్హత లేని కాంట్రాక్టర్‌కు ఆ టెండరును అప్పగించారు. సోలార్ రూఫ్‌టాప్ సిస్టమ్‌ల ఏర్పాటుకు అమరావతి స్మార్ట్ అండ్ సస్టెయినబుల్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ పిలిచిన టెండర్లలో రెండు సంస్థలు పాల్గొన్నాయి. నవంబరు 3న గుంటూరుకు చెందిన కియాన్ ప్రాజెక్ట్స్ అండ్ ఇండస్ట్రీస్‌కు టెండరు కట్టబెట్టారు. పెద్దిరెడ్డికి సన్నిహితుడి సంస్థ కావడమే అర్హతగా వారికి టెండరు ఖరారు చేయడం గమనార్హం. టెండరులో పాల్గొన్న ఇషాన్ ఎనర్జీ సంస్థ 15శాతం తక్కువకు బిడ్ దాఖలు చేసింది. తద్వారా ప్రభుత్వానికి రూ.37లక్షలు ఆదా అవుతాయి. కియా న్ ప్రాజెక్ట్స్ మాత్రం 8.5 శాతం తక్కువకు టెండరు వేయడం గమనార్హం. తద్వారా ప్రభుత్వానికి ఆదా అయ్యేది రూ.19.80 లక్షలే. టెండరులో పాల్గొనేందుకు గతంలో ప్రభుత్వ ప్రాజె క్టులు చేసిన అనుభవం ఉండాలని నిబంధనల్లో పేర్కొన్నారు. కియాన్ ప్రాజెక్ట్స్‌కు ఈ అనుభవం లేదు. కానీ అనుభవం ఉందంటూ ఆంధ్రప్రదేశ్ నూతన, పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ నుంచి ఆ సంస్థ సర్టిఫికెట్ పొందింది. పుంగనూరులోని సమ్మర్ స్టోరేజీ ప్లాంటు వద్ద ఒక మెగావాట్ సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు ఈ సర్టిఫికె ట్‌ను పొందారు. 2023 నవంబరు 17న ఈ పని దక్కించుకు న్నట్లు, 2024 జనవరి నెలాఖరుకు పని పూర్తిచేసినట్లు అందు లో పేర్కొన్నారు. వాస్తవానికి ఒక మెగావాట్ ప్లాంట్‌ను రెండు న్నర నెలల్లో పూర్తిచేయడం అసాధ్యమని నిపుణులు చెబుతు న్నారు. సర్టిఫికెట్ ఇచ్చేనాటికి అసలు పనే పూర్తికాలేదని కేవలం పెద్దిరెడ్డి ఒత్తిడితోనే అధికారులు ఎక్స్‌పీరియన్స్ సర్టిఫి కెట్ ఇచ్చేశారని ఆరోపణలు వస్తున్నాయి. మరోవైపు ఇషాన్ ఎనర్జీ గతంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఐటీడీఏల్లో సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేసిన అనుభవం సర్టిఫికెట్‌ను సమర్పించగా దాన్ని అధికారులు పరిగణనలోకి తీసుకోలేదు.

దుర్గా కోఆపరేటివ్ బ్యాంకు లైసెన్సు రద్దు

» బ్యాంకింగ్ కార్యకలాపాలు నిలిపివేసిన ఆర్బీఐ

» రూ.5 లక్షల లోపువారికి పూర్తి చెల్లింపులు

విజయవాడ వన్‌టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పెద్ద ఎత్తున బకాయిలు పేరుకుపోవడం, డిపాజిట్లు లేకపోవడంతో విజయవాడ వన్‌టౌన్‌లోని దుర్గా కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లైసెన్సును రద్దు చేస్తూ రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్బీఐ) మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. బ్యాంకింగ్ కార్యకలాపాలను తక్షణం నిలిపివేసి, ఏపీ సహకార సంఘాల రిజిస్ట్రార్‌ను లిక్విడేటర్‌ను నియమించాలని ఆదేశించింది. విజయవాడ వన్‌టౌన్‌లో ఉన్న దుర్గా కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకులో మంగళవారం ఆర్బీఐ అధికారులు తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో కోట్లాది రూపాయల బకాయిలు పేరుకుపోయినట్లు గుర్తించారు. మరోవైపు బ్యాంకు వద్ద తగిన స్థాయిలో డిపాజిట్లు లేవని తేల్చారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఖాతాదారులు భారీగా నష్టపోయే ప్రమాదం ఉందని భావించి, బ్యాంకు లైసెన్సు రద్దు చేస్తూ ఆదేశాలు ఇచ్చారు. లిక్విడేటర్‌ను నియమించిన తర్వాత డిపాజిటర్లకు సొమ్ములు చెల్లిస్తామని అధికారులు తెలిపారు. పెద్ద మొత్తంలో డిపాజిట్ చేసినవారికి గరిష్ఠంగా రూ.5 లక్షలు మాత్రమే వచ్చే అవకాశం ఉంది. బ్యాంకు అధికారులు ఆర్బీఐకు ఇచ్చిన సమాచారం ప్రకారం 95.8 శాతం డిపాజిటర్లు రూ.5 లక్షలలోపు వారేనని, వారికి పూర్తిమొత్తం చెల్లిస్తామని ఆర్బీఐ అధికారులు తెలిపారు.

ఎన్నో అవినీతి ఆరోపణలు... కేసులు

దుర్గా కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకుపై గత పదేళ్లుగా అవినీతి ఆరోపణలు, పలు కేసులు నమోదవుతూ వస్తున్నాయి. వీటిపై విచారణ జరిపిన ఆర్బీఐ ఉన్నతాధికారులు బ్యాంకుపై పలు ఆంక్షలు విధించారు. డిపాజిట్‌దారులు తాము దాచుకున్న మొత్తంలో రూ.లక్షన్నర వరకే విత్ డ్రా చేసుకోవాలని చెప్పారు. దీనిపై డిపాజిట్‌దారులు ఆందోళనలు చేశారు. బ్యాంకు అధికారులు వివిధ రుణాల రూపేణా సుమారు రూ.60 కోట్ల వరకు ఇచ్చారు. ఈ రుణాలను తిరిగి వసూలు చేయలేకపోవటంతో పదేళ్ల నుంచి వడ్డీతో రూ.190 కోట్లకు చేరింది. ఈ క్రమంలో బెంగళూరు నుంచి వచ్చిన ఇద్దరు ఆర్బీఐ అధికారులు అర్బన్ బ్యాంకులో తనిఖీలు చేసి.. లైసెన్సు రద్దు చేశారు.

జగన్ అక్రమాస్తుల కేసులో 'నాట్ బిఫోర్ మీ'

» విచారణ నుంచి మరోసారి వైదొలగిన సుప్రీం న్యాయమూర్తి జస్టిస్ సంజయ్‌కుమార్

న్యూఢిల్లీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం వైఎస్ జగన్ అక్రమాస్తుల కేసు విచారణ నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీవీ సంజయ్‌కుమార్ మరోసారి వైదొలిగారు. జగన్ బెయిల్ రద్దు చేయాలని, విచారణను హైదరాబాద్ నుంచి వేరే రాష్ట్రానికి మార్చాలని అప్పటి వైసీపీ ఎంపీ, ప్రస్తుత టీడీపీ ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు నిరుడు నవంబరు 1న సుప్రీంకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. అవి ప్రధాన న్యాయమూర్తి, జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌తో కూడిన ధర్మాసనం ముందు మంగళవారం విచారణకు వచ్చాయి. విచారణ ప్రారంభం కాగానే.. ఆంధ్రప్రదేశ్‌లో మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో కౌంటర్ దాఖలు చేయడానికి మరికొంత సమయం కావాలని సీబీఐ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోరారు. ఈ క్రమంలో జస్టిస్ సంజయ్‌కుమార్ కేసును తాను విచారించనంటూ 'నాట్ బిఫోర్ మీ' అని అన్నారు. దీంతో విచారణను మరో ధర్మాసనానికి సీజేఐ బదిలీ చేశారు. జస్టిస్ అభయ్ ఎస్ ఓకా నేతృత్వంలోని ధర్మాసనం ముందుకు డిసెంబరు 2న విచారణకు పంపాలని రిజిస్ట్రీని ఆదేశించారు. గతంలోనూ జగన్ అక్రమాస్తులకు సంబంధించిన మరో పిటిషన్ విచారణ నుంచి జస్టిస్ సంజయ్‌కుమార్ వైదొలగడ గమనార్హం. జగన్ అక్రమాస్తుల వ్యవహారంలో సీబీఐ కేసుల్లో తీర్పు వెలువడిన తర్వాతే ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఈడీ) కేసుల్లో తీర్పులు ఇవ్వాలని గతంలో తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. సీబీఐ, ఈడీ కేసులను విడివిడిగా లేదా సమాంతరంగా విచారించినా ఆ పద్ధతినే అనుసరించాలని అప్పట్లో స్పష్టం చేసింది. ఈ తీర్పును గతేడాది మే నెలలో ఈడీ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఆ పిటిషన్ సైతం గతంలో జస్టిస్ సంజయ్‌కుమార్ ఉన్న ధర్మాసనం ఎదుటే విచారణకు రాగా ఆయన మరో ధర్మాసనానికి పంపాలని సూచించారు.

డిప్యూటీ స్పీకర్‌గా రఘురామ కృష్ణరాజు

పేరు ఖరారు చేసిన చంద్రబాబు

ఎన్నిక లాంఛనప్రాయమే




అమరావతి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ, ప్రస్తుతం ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజు శాసనసభ ఉప సభాపతి హోదాలో 'అధ్యక్షా...' అని పిలిపించుకోనున్నారు. టీడీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు డిప్యూటీ స్పీకర్‌గా రఘురామ పేరును ఖరారు చేశారు. అసెంబ్లీలో ఈ ఎన్నిక ప్రక్రియ జరగాల్సి ఉంది. వైసీపీ కేవలం 11 స్థానాలకే పరిమితం కావడం, ఆ పార్టీ సభ్యులు సభకు దూరంగా ఉంటున్న నేపథ్యంలో... ఉప సభాపతిగా రఘురామ ఎన్నిక లాంఛనప్రాయమే కానుంది. పారిశ్రామిక వేత్త అయిన రఘురామకృష్ణ రాజు కొంతకాలం బీజేపీలో ఉన్నారు. 2019 ఎన్నికల ముందు వైసీపీలో చేరి... నరసాపురం ఎంపీ అయ్యారు. అతి కొద్దికాలానికే జగన్ వైఖరితో విసిగి వేసారిపోయారు. వైసీపీ రెబల్ ఎంపీగా నిత్యం జగన్‌పై ఢిల్లీ వేదికగా ప్రెస్‌మీట్లతో విరుచుకుపడ్డారు. ఈ క్రమంలోనే రఘురామను సీఐడీ అరెస్టు చేయడం, కస్టడీలో తీవ్రంగా హింసించడం జాతీయ స్థాయిలో సంచలనం సృష్టించింది. గత ఎన్నికల ముందు రఘురామ టీడీపీలో చేరారు. ఆయనను తిరిగి లోక్‌సభకు పంపించాలని భావించినా... కూటమిలో సమీకరణలు, సీట్ల సర్దుబాటులో అది కుదరలేదు. దీంతో... రఘురామను ఉండి నుంచి టీడీపీ ఎమ్మెల్యేగా బరిలో నిలబెట్టారు. కూటమి ఘన విజయం అనంతరం ఆయనకు సముచిత గౌరవం లభిస్తుందని అంతా భావిస్తూ వచ్చారు. ఇప్పుడు ఉప సభాపతి పదవికి ఎంపిక చేశారు.

బాబు.. పవర్‌ఫుల్ సీఎం!

అత్యంత శక్తిమంతులైన టాప్ టెన్ నేతల్లో ఐదో స్థానం

- 'ఇండియా టుడే' కథనం
- మొదటి 4 ర్యాంకుల్లో మోదీ, భాగవత్, షా, రాహుల్
- బాబు తర్వాత నితీశ్, యోగి, స్టాలిన్, మమత, అఖిలేశ్
- ఫీనిక్స్ పక్షిలా చంద్రబాబు పునరుత్తేజం
- మీడియా సంస్థ కితాబు

న్యూఢిల్లీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబును అత్యంత శక్తిమంతుడైన ముఖ్యమంత్రిగా జాతీయ మీడియా సంస్థ 'ఇండియాటుడే' అభివర్ణించింది. దేశవ్యాప్తంగా శక్తిసంపన్నులైన వ్యక్తుల్లో ఆయన ఐదో స్థానంలో ఉన్నట్లు తెలిపింది. ఆయనకు ముందు తొలి నాలుగు స్థానాల్లో ప్రధాని మోదీ, ఆర్‌ఎస్ఎస్ అధినేత మోహన్ భాగవత్, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, కాంగ్రెస్ అగ్రనేత-లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఉండగా.. ఆయన తర్వాత బిహార్, యూపీ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ సీఎంలు నితీశ్‌కుమార్, యోగి ఆదిత్యనాథ్, ఎంకే స్టాలిన్, మమతా బెనర్జీ, సమాజ్‌వాదీ అధ్యక్షుడు, యూపీ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్ ఉన్నారు. జనసేన, బీజేపీతో పొత్తుతో.. టీడీపీని పతనావస్థ నుంచి విజయతీరానికి చేర్చారని మంగళవారం నాటి ప్రత్యేక కథనంలో ఆకాశానికెత్తింది. జైలుకెళ్లడం ద్వారా రాజకీయంగా అనిశ్చిత పరిస్థితి నుంచి ఫీనిక్స్ పక్షిలా పునర్జన్మ ఎత్తి.. అధికారం చేజిక్కించుకున్నారని, భారతీయ రాజకీయాల్లో కీలక నేతగా మారారని వెల్లడించింది. ఇవాళ చంద్రబాబు భారత్‌లోనే అత్యంత సీనియర్ ముఖ్యమంత్రి అని పేర్కొంది. హాలీవుడ్ థ్రిల్లర్ సినిమాల్లో మాత్రమే ఇలాంటి చరిత్రాత్మక పునరాగమనాలు చూస్తామని, అయితే చంద్రబాబు వాస్తవంగా చేసి చూపించారని వ్యాఖ్యానించింది. 'లోక్‌సభలో టీడీపీకి ఉన్న 16 మంది ఎంపీలను మినహాయిస్తే కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రమాదకర పరిస్థితుల్లో పడిపోతుంది. మెజారిటీ మార్కుకు దూరమవుతుంది. దీంతో పాలక ఎన్‌డీఏలో చంద్రబాబు పట్టు పెరిగింది. నాలుగోసారి సీఎం అయిన ఆయన.. తన చిరకాల స్వప్నమైన స్వర్ణాంధ్ర సాధన, రాజధాని అమరావతి నిర్మాణం లక్ష్యాలను చేరుకునే అవకాశం ఉంది.. కార్పొరేట్లకు విత్రుడిగా ఉండే చంద్రబాబు.. ఉమ్మడి రాష్ట్రానికి రెండోసారి సీఎం అయినప్పుడు ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) ఏర్పాటుకు చొరవ చూపారు. ఇటీవల విజన్-2047 డాక్యుమెంట్ ఆవిష్కరించారు. 15 శాతం వృద్ధి రేటుతో 2047కల్లా ఆంధ్ర ఎకానమీని 2.4 ట్రిలియన్ డాలర్లకు, తలసరి ఆదాయాన్ని 43 వేల డాలర్లకు తీసుకెళ్లడం ఆయన లక్ష్యం. ప్రజల భాగస్వామ్యం ఉండే వ్యూహాన్ని అభివృద్ధి చేసే విజన్ కావాలని ఆయన ఎప్పుడూ అంటుంటారు' అని పేర్కొంది.



బాబు,నితీశ్ అండతోనే మోదీ సర్కారు

» వారు తలుచుకుంటే ఏడాదిలో కూలుతుంది

» టీడీపీలో చంద్రబాబుతో కలిసి పనిచేశా

» 'ద ఇండియన్ ఎక్స్‌ప్రెస్ అడ్డా'లో రేవంత్

న్యూఢిల్లీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఏపీ సీఎం చంద్రబాబు, బిహార్ సీఎం నితీశ్ తలుచుకుంటే మోదీ ప్రభుత్వం ఏడాది కూడా అధికారంలో కొనసాగదని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం వారిద్దరి అండతోనే నడుస్తోందన్నారు. అప్పుడు కేంద్రంలో కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి వచ్చే అవకాశం ఉన్నదని చెప్పారు. సోమవారం ఢిల్లీలో 'ద ఇండియన్ ఎక్స్‌ప్రెస్ అడ్డా' కార్యక్రమంలో రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తాను గతంలో చంద్రబాబు, టీడీపీతో కలిసి పనిచేశానని రేవంత్ గుర్తుచేసుకున్నారు. గతంలో పనిచేసిన ఏబీవీపీ, టీడీపీతోపాటు కాంగ్రెస్ పార్టీలోని ఏ లక్షణం ఇష్టమని రేవంత్‌రెడ్డిని అడగ్గా...ఏబీవీపీకి దేశం పట్ల ఉన్న అంకితభావం, తెలుగుదేశం పార్టీకి అభివృద్ధి పట్ల ఉన్న దృక్పథం, కాంగ్రెస్ అనుసరిస్తున్న సామాజిక న్యాయ విధానం తనకు ఇష్టమని రేవంత్ చెప్పారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య విభజన సమస్యలను కలిసి చర్చించి పరిష్కరించుకోవచ్చని రేవంత్ తెలిపారు. అందుకోసం తాము ఢిల్లీ వచ్చి కేంద్రం మధ్యవర్తిత్వాన్ని కోరనవసరం లేదన్నారు. మోదీ హయాంలో దక్షిణాదికి తీరని అన్యాయం జరుగుతోందని రేవంత్ రెడ్డి విమర్శించారు.

శాసనసభ చీఫ్ విప్‌గా జీవీ ఆంజనేయులు

- మండలి చీఫ్ విప్‌గా అనురాధ
- ఆరు కార్పొరేషన్లకు 90 మంది డైరెక్టర్లు



అమరావతి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): శాసనసభ చీఫ్ విప్‌గా వినుకొండ ఎమ్మెల్యే (టీడీపీ) గోనుగుంట్ల వెంకట శివ సీతారామాంజనేయులు (జీవీ ఆంజనేయులు) నియమితులయ్యారు. శాసన మం డలిలో చీఫ్ విప్‌గా పంచుమర్తి అనురాధ (టీడీపీ) నియమితులయ్యారు. వీరితోపాటు శాసనసభలో 11 మంది టీడీపీ, ముగ్గురు జనసేన, ఒక బీజేపీ ఎమ్మెల్యేను, కౌన్సిల్‌లో ఇద్దరు టీడీపీ, ఒక జనసేన ఎమ్మెల్సీని విప్‌లుగా ప్రకటించారు. శాసనసభలో విప్‌లుగా నియమితులైనవారిలో సి.ఆదినారాయణరెడ్డి (జమ్మలమడుగు, బీజే పీ), అరవ శ్రీధర్(రైల్వే కోడూరు, జనసేన), బొలిశెట్టి శ్రీనివాస్(తాడేపల్లిగూడెం, జనసేన), బొమ్మిడి నారాయణ నాయకర్(నరసాపురం, జనసేన)లతోపాటు టీడీపీ ఎమ్మెల్యేలు బెందాళం అశోక్(ఇచ్ఛాపురం), బొండా ఉమామహేశ్వరరావు (విజయవాడ సెంట్రల్), దాట్ల సుబ్బరాజు (ముమ్మిడివరం), యనమల దివ్య (తుని), వి.ఎం.థామస్ (గంగాధర నెల్లూరు), తోయక జగదీశ్వరి (కురుపాం), కాల్వ శ్రీనివాసులు (రాయదుర్గం), రెడ్డప్పగారి మాధవి (కడప), పీజీవీఆర్ నాయుడు-గణబాబు (విశాఖపట్నం పశ్చిమ), తంగిరాల సౌమ్య (నందిగామ), యార్లగడ్డ వెంకట్రావు (గన్నవరం) ఉన్నారు. శాసనసభ చీఫ్ విప్‌గా పొన్నూరు శాసనసభ్యుడు ధూళిపాళ్ల నరేంద్ర పేరు ప్రచారం జరిగింది. ఆయన సుముఖత వ్యక్తం చేయకపోవడంతో అదే పూర్వపు గుంటూరు జిల్లాకు చెందిన జీవీ ఆంజనేయులును ఎంపిక చేశారు. విప్‌లలో నలుగురు రాయలసీమ, ముగ్గురు ఉత్తరాంధ్ర, 9 మంది కోస్తాంధ్ర ప్రాంతాలకు చెందినవారు. ఇక, శాసనమండలి చీఫ్ విప్‌గా పంచుమర్తి అనురాధను నియమించగా.. విప్‌లుగా వేపాడ చిరంజీవిరావు, కంచర్ల శ్రీకాంత్(టీడీపీ), పిడుగు హరిప్రసాద్(జనసేన)లను ప్రకటించారు. కాగా, ఆరు కార్పొరేషన్లు... కురుబ, కళింగ, వన్యకుల క్షత్రియ, శెట్టిబలిజ, ఆర్యవైశ్య, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్లకు డైరెక్టర్లను ప్రభుత్వం నియమించింది. ఒక్కో కార్పొరేషన్‌కు 15 మంది సభ్యుల చొప్పున మొత్తం 90 మందిని నియమించింది. ప్రతి కార్పొరేషన్‌లో రెండు పదవులు జనసేనకు, ఒకటి బీజేపీకి కేటాయించి, మిగతా డైరెక్టర్ పదవులను టీడీపీకి కేటాయించింది.

సంతకాలు పెట్టిందెవరో తెలియాలి

- పేరు, హోదా స్పష్టంగా రాయాలి.. సీఎస్ ఆదేశాలు

అమరావతి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఉన్నతాధికారులకు బదులు వారి స్థానంలో సంతకాలు పెడుతున్న అధికారులు ఎవరో స్పష్టంగా అందరికీ తెలియాలని సీఎస్ నీరబ్ కుమార్ స్పష్టం చేశారు. లెటర్లు, మెమోలు, సర్క్యులర్లు, జీవోలు ఇతర రూపాల్లో వస్తున్న పత్రాల్లో సంబంధిత ఉన్నతాధికారి సంతకం కాకుండా కిందిస్థాయి అధికారుల సంతకాలు ఉంటున్నాయి. ఫర్ సెక్రెటరీ/ఫర్ డైరెక్టర్/ఫర్ కలెక్టర్ అన్న చోట ఆ శాఖ ఉన్నతాధికారులు కాకుండా కిందిస్థాయి అధికారులు సంతకాలు పెడుతుంటారు. ఇక నుంచి అలా సెక్రెటరీ, డైరెక్టర్లు, హెచ్‌ఓడీలు, కలెక్టర్ల బదులు సంతకాలు పెడుతున్న అధికారులు కూడా వారి పేరు, హోదా స్పష్టంగా రాసి సంతకాలు పెట్టాలని సీఎస్ ఆదేశించారు.

బాధ్యతగా ఉందాం!


అసెంబ్లీలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో శాసనసభ్యులు

(మొదటి పేజీ తరువాయి)

చింతకాయల అయ్యన్నపాత్రుడు నేతృత్వంలో... బడ్జెట్‌పై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలోనూ చంద్రబాబు ప్రసంగించారు. ఇసుక, మద్యం జోలికి వెళ్లొద్దని ఎమ్మెల్యేలను ఆదేశించారు. "అసెంబ్లీలో ప్రతిపక్షం లేదు కదా...అని అనుకోవద్దు. ప్రతిపక్ష పార్టీకి బాధ్యత లేదు. కానీ మనకు బాధ్యత ఉంది. మనం ప్రజలకు జవాబుదారీగా పని చేద్దాం" అని కూటమి ఎమ్మెల్యేలకు చంద్రబాబు హితవు పలికారు. "అధికారంలోకి రాగానే ఏడు శ్వేతపత్రాలు విడుదల చేశాం. ఐదేళ్ల విధ్వంసాన్ని ప్రజలనకు ఆ శ్వేతపత్రాల ద్వారా తెలియజేశాం. ప్రజలు గెలవాలి... రాష్ట్రం నిలవాలి అని ఎన్నికల ముందు పిలుపునిచ్చాం. ప్రజలు మన పక్షాన నిలిచి గెలిపించారు.. ఇప్పుడు వారి ఆకాంక్షలను మనం నెరవేర్చాలి" అని నిర్దేశించారు. కేంద్రం సహకరించకుంటే చాలా ఇబ్బందులు పడేవాళ్లమని, ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయలేకపోయేవారమని తెలిపారు. "మనం అధికారంలోకి వచ్చిన 150 రోజుల్లో అనేక హామీలు అమలు చేసి, పలు కార్యక్రమాలు చేపట్టాం. ఏ రాష్ట్రంలో ఇవ్వనిస్థాయిలో 64 లక్షల మందికి పెన్షన్లు అందిస్తున్నాం. అన్న క్యాంటీన్లతో పాటు దీపావళి నుంచి దీపం - 2 పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్ కూడా అందిస్తున్నాం. రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడంతోపాటు అభివృద్ధిని కూడా జోడెద్దుల బండి మాదిరి ముందుకు తీసుకెళుతున్నాం. అభివృద్ధి చేస్తే సంపద పెరుగుతుంది. సంపద పెరిగితే సంక్షేమ కార్యక్రమాలు మరిన్ని అమలు చేయవచ్చు. ఎస్సీ వర్గీకరణపైనా ఇప్పటికే ఎమ్మెల్యేలతో మాట్లాడాం. జిల్లా వారీగా ఏబీసీ కేటగిరీలు పెట్టి జిల్లా, జోన్, స్టేట్ వారీగా కమిటీలు వేసి అమలు చేస్తాం. ప్రతి ఒక్కరూ పేదలతో మమేకమవ్వాలి. వారి కనీస అవసరాలు తీర్చాలి" అని ముఖ్యమంత్రి కోరారు. ఇంకా చంద్రబాబు ఏమన్నారంటే..

ప్రజా సమస్యలపై...

"ప్రతి ఎమ్మెల్యే జాగ్రత్తగా ఉండాలి. బిల్లులు, పాలసీలపై అధ్యయనం చేయాలి. పబ్లిక్ గవర్నెన్స్‌లో ఎమ్మెల్యేలనూ భాగస్వాములను చేస్తాను. స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్ 2047 డాక్యుమెంట్‌ను రూపొందిస్తున్నాం. 20247 నాటికి 43 వేల డాలర్ల తలసరి ఆదాయం లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటికే ఇసుక, భూ అక్రమణల నిరోధక చట్టం, మద్యం పాలసీలు ప్రవేశపెట్టాం. క్లీన్ ఎనర్జీ, డ్రోన్, ఎలక్ట్రానిక్ పాలసీ, ఫుడ్ ప్రాసెసింగ్, ఇన్‌ఫ్రా లపై పాలసీలు తెచ్చాం. ఇలా 10 పాలసీల ఆధారంగా విజన్ డాక్యుమెంట్ తయారు చేస్తున్నాం. మనం తెచ్చిన పాలసీలు దారిద్రాన్ని నిర్మూలించి... ఉద్యోగ కల్పనకు ఉపయోగపడతాయి. ఒక కుటుంబం.. ఒక పారిశ్రామికవేత్త అనే నినాదం తీసుకొచ్చాం. రతన్ టాటా పేరుతో ఇన్నోవేషన్ హబ్‌ను అమరావతిలో ఏర్పాటు చేస్తాం. విశాఖ, రాజమండ్రి, విజయవాడ,అనంతపురంలో కూడా హబ్‌లు ఉంటాయి. టాటా సంస్థ 10వేల ఉద్యోగాల కల్పనకు ముందుకొచ్చింది. టీసీఎస్, ఇన్ఫోసిస్, సత్యం వంటి దాదాపు 10 పెద్ద కంపెనీలు రాష్ట్రానికి తీసుకొస్తాం".

సచివాలయాల పునర్‌వ్యవస్థీకరణ

"ప్రతి నియోజకవర్గంలో ఒక ఇండస్ట్రియల్ పార్కు ఉంటుంది. ఎమ్మెల్యేలే దానికి చైర్మన్లుగా ఉంటారు. అక్కడ పరిశ్రమలు పెట్టించే బాధ్యత ఎమ్మెల్యేలు తీసుకోవాలి. అమరావతికి కేంద్రం.... ఏడీబీ, ప్రపంచ బ్యాంకు ద్వారా రూ.15 వేల కోట్ల ఆర్థికసాయం అందించేందుకు ముం దుకొచ్చింది. సచివాలయాలను రీ - ఆర్గనైజ్ చేయాల్సి ఉంది. జవాబుదారీతనాన్ని ఏర్పరిచి అన్ని సచివాలయాలను అంతర్భాగం చేస్తూ మరింతగా సేవలందించేలా చేస్తాం. పంచాయతీల్లో చేపట్టిన పనులు కూడా జనవరిలోపు పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇప్పటికే ఆదేశాలిచ్చారు. రూ.860 కోట్లతో రాష్ట్రంలోని రోడ్లపై గుంతలు పూడ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం."

నేనూ నేర్చుకున్నా....

"ఎమ్మెల్యేల కోసం ఏర్పాటుచేసిన శిక్షణ కార్యక్రమం నుంచి నేనూ రెండు విషయాలు నేర్చుకున్నాను. గ్రీన్ బడ్జెట్‌తో పాటు సస్టైనబుల్ బడ్జెట్‌పైనా కొంత అవగాహన వచ్చింది. ప్రకృతి అవసరాల నిమిత్తం ఖర్చుచేసే నిధులతో పాటు సోలార్, విండ్, బయోగ్యాస్ వంటి ప్రాజెక్టు ద్వారా వచ్చే ఆదాయాన్ని కూడా కలుపుకొని గ్రీన్ బడ్జెట్ ప్రవేశపెడితే బాగుంటుందన్న ఆలోచన వచ్చింది. వచ్చే ఏడాది నుంచి దీనిపై దృష్టి పెడదాం. అలానే సస్టైనబుల్ బడ్జెట్ కూడా రాష్ట్రానికి అవసరమే".

ఇసుక పాలసీ చదివారా?

ఇసుక పాలసీని అందరూ చదివి అర్థం చేసుకోవాలని చంద్రబాబు సూచించారు. చీరాల ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ...ఇసుక పాలసీ బాగోలేదన్నారు. చంద్రబాబు వెంటనే స్పందించి.. పాలసీ ఏ విధంగా బాగోలేదో చెప్పాలన్నారు. పాలసీ మీరు చదివారా అని ఎమ్మెల్యేను ప్రశ్నించారు. ఇసుక, మద్యం జోలికి ఎమ్మెల్యేలు వెళ్లొద్దని గట్టిగా హెచ్చరించారు. ఎమ్మెల్యేలకు టీటీడీ దర్శన కోటా పెంచాలని ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు కోరారు. దీనిపై మంత్రి లోకేశ్ కల్పించుకుంటూ.. ఈ నెల 18న జరిగే టీటీడీ బోర్డు సమావేశంలో దీనిపై నిర్ణయం ఉంటుందన్నారు. భూసర్వేలో తలెత్తుతున్న సమస్యలను కొందరు ప్రస్తావించగా, గ్రామసభల్లో వాటిలో కొన్ని పరిష్కారం అవుతున్నాయని రెవెన్యూమంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. గ్రామసభ నిర్ణయాలతోపాటు గతంలో టీడీపీ అనుసరించిన విధానాలపైనా దృష్టిపెట్టాలని మంత్రికి సీఎం సూచించారు.

> "మనం (ఎమ్మెల్యేలను ఉద్దేశించి) సభలో పబ్లిక్ పాలసీలు రూపొందిస్తాం. ఈ పాలసీలు ప్రజా జీవితంలో మార్పులు తెస్తాయి. మనం తెచ్చే పాలసీలే రాష్ట్రంలోని సమస్యలకు శాశ్వత పరిష్కారాలను చూపిస్తాయి. గతంలో ఒక సబ్జెక్టుపై ఎంత సమయమైనా చర్చించేవాళ్లం. రాను రాను ఎమ్మెల్యేలకు సబ్జెక్టు నేర్చుకోవాలనే ఆసక్తి తగ్గుతోంది. ఎమ్మెల్యేలు నిరంతరం నేర్చుకోవాలి. శాఖల్లో ఏం జరుగుతుందో మీకు అవగాహన లేకపోతే నియోజకవర్గానికి ఏం అవసరమో తెలియదు. బడ్జెట్ సమావేశాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం.''

విధానాలతో మార్పు..

బాబు భేష్

బాగా కష్టపడుతున్నారు: పవన్ కల్యాణ్

ముఖ్యమంత్రి చంద్రబాబు అనుభవం రాష్ట్రానికి ఎంతో అవసరమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కొనియాడారు. ఎన్నికల్లో పొత్తు పెట్టుకోవడానికి కూడా ఇదే కారణమన్నారు. కానీ ఇప్పుడు దగ్గర నుంచి చూస్తుంటే రాష్ట్రం కోసం బాగా కష్టపడుతున్నారని అన్నారు. ఆయన దగ్గర నుంచి ఎమ్మెల్యేలంతా నేర్చుకోవాలని సూచించారు. ఆయన ముందుచూపు రాష్ట్రాభివృద్ధికి ఉపయోగపడుతుందని అన్నారు. ఇదే సమయంలో సీఎం చంద్రబాబు కల్పించుకుని.... తాను, పవన్ కల్యాణ్ చెప్పింది ఎమ్మెల్యేలు ఆచరించాల్సిందేనని, 2029లోనూ మీరంతా ఎమ్మెల్యేలుగా గెలిచి అసెంబ్లీకి రావాలని తాము కోరుకుంటున్నామని చంద్రబాబు తెలిపారు.

విద్యార్థులు, మహిళలకు వర్క్ ఫ్రమ్ హోమ్

రాబోయే రోజుల్లో వర్చువల్ వర్కింగ్ ఉంటుందని చంద్రబాబు తెలిపారు. ఇప్పటికే చాలా మంది వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తున్నారనీ, వర్క్ స్టేషన్లు ఏర్పాటు చేస్తామని ఆయన అనగా, పవన్ కల్యాణ్ స్పందిస్తూ.. చదువుకునే విద్యార్థులకు, మహిళలకు కూడా వర్క్ ఫ్రమ్ హోమ్ వంటి పనులు కల్పించాలని సూచించారు. దీనిపై సీఎం సానుకూలంగా స్పందించారు. ఈ అంశంపై వర్క్ అవుట్ చేస్తున్నామని తెలిపారు.

సభలో ఎలా మెలగాలో తెలిసింది

అవగాహన సదస్సుపై కొత్త ఎమ్మెల్యేలు

అమరావతి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌పై తొలిసారిగా ఎన్నికైన ఎమ్మెల్యేలకు మంగళవారం అమరావతి అసెంబ్లీ కమిటీ హాల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. సభలో పాటించాల్సిన అంశాలకు సంబంధించి మెటీరియల్ ఇచ్చారు. రాష్ట్రాభివృద్ధికి సభా సమావేశాలు ఎంత కీలకమో అవగాహన కలిగిందని నూతన ఎమ్మెల్యేలు ఈ సందర్భంగా చెప్పారు. కొంత మంది ఎమ్మెల్యేలు రుషికొండను చూపించాలని కోరారు.

● సభ నియమ నిబంధనలు తెలిశాయి: భాష్యం ప్రవీణ్

కూటమి ప్రభుత్వానికి ఇది తొలి బడ్జెట్ సమావేశం. సభను హుందాగా నిర్వహించేందుకు సభ నియమ, నిబంధనలు వివరించారు. కొత్తగా ఎన్నికైన సభ్యులు ఏ అంశాలను చర్చించాలి, ఏవిధంగా మాట్లాడాలో చెప్పారు.

● బడ్జెట్ రూపకల్పన గురించి తెలిసింది: నజీర్ అహ్మద్

బడ్జెట్ రూపకల్పనలో ఏయే అంశాలను పరిగణలోకి తీసుకుంటారో తెలిపారు. చర్చలో ఏం మాట్లాడాలి, ఏవిధంగా చర్చించాలి అనేది చెప్పారు. ఏయే శాఖలకు ఎంత కేటాయించారు? ఎలా అభివృద్ధి చేస్తారో తెలిపారు.

● సమస్యల ప్రస్తావనకు అసెంబ్లీనే వేదిక: యార్లగడ్డ

ప్రజా సమస్యలను ప్రస్తావించడానికి అసెంబ్లీ చక్కని వేదిక. సభకు రాకుండానే మాట్లాడేందుకు అవకాశం ఇవ్వలేదని, మైకు ఇవ్వలేదని జగన్ చెప్పడం దుర్మార్గం. సభకు రాకుండా మీడియాతోనే మాట్లాడతాం అనడం సిగ్గుచేటు. సభకు రానప్పుడు, ప్రజా సమస్యలు ప్రస్తావించలేనప్పుడు పోటీ చేయడం ఎందుకు?. ప్రతిపక్ష హోదాలేదని సభను బాయ్‌కాట్ చేయడం సిగ్గుచేటు.

● ప్రతిపక్ష హోదా సర్టిఫికెట్ కాదు: గౌతు శిరీష

బడ్జెట్‌పై కొత్త సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం చాలా సంతోషం. ప్రతిపక్ష హోదా అనేది సర్టిఫికెట్ కాదు. నిబంధల ప్రకారం ఇస్తారు.

● జీతభత్యాలు తీసుకుంటూ సభకు రారా?: నల్లమిల్లి

సభలో ప్రజా సమస్యలను ఏవిధంగా లేవనెత్తాలి, సభలో ఎలా ప్రశ్నించాలనే విషయాలపై అవగాహన కల్పించారు. వైసీపీ నేత జగన్ జీతభత్యాలు తీసుకుంటూ సభకు ఎందుకు వెళ్లరని షర్మిల ప్రశ్నించిన దానికి జగన్ సమాధానం చెప్పాలి. .

● సభా వ్యవహారాలపై ప్రాథమిక అవగాహన: కొలికపూడి

కొత్తగా ఎన్నికైన సభ్యులకు శాసనసభ వ్యవహారాలపై అవగాహన కోసం నిర్వహించిన ఈ సదస్సు అద్భుతంగా ఉపయోగపడుతుంది. బడ్జెట్‌పై, అందులోని టెక్నికల్ టెర్మినాలజీపైనా ఢిల్లీ సంస్థతో అవగాహన కల్పించడం శుభ పరిణామం.

● చంద్రబాబు సీనియారిటీ ఎవరికీ లేదు: కంచర్ల

బడ్జెట్ రూపకల్పన, సభలో ప్రవేశపెట్టడం, సభ నిర్వహణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. తొలిసారి ఎమ్మెల్యే అయినప్పుడు, మంత్రి అయినప్పుడు, ముఖ్యమంత్రి అయినప్పుడు సభ ఎలా నడిచేదో, ఇప్పుడెలా జరుగుతుందో చంద్రబాబు చక్కగా వివరించారు. ప్రజా సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చే సంప్రదాయాన్ని ప్రతిపక్షం పాటించడంలేదు.

● 2 గంటల్లోనే చెప్పేశారు: వసంత కృష్ణ ప్రసాద్

మేం గత ఐదేళ్లలో ఎమ్మెల్యేగా తెలుసుకున్న అంశాలను ఈ సదస్సులో రెండు గంటల్లోనే చెప్పేశారు. బడ్జెట్ అంశాలపై పూర్తి సమాచారం అందించారు. గత ప్రభుత్వం ఎప్పుడూ ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించలేదు. ప్రతిపక్ష సభ్యులు కూడా అసెంబ్లీలో ఉంటే అర్థవంతమైన చర్చ జరిగేది. ప్రజా సమస్యలు చర్చించడానికి సభకు రాకపోతే జగన్ రాజీనామా చేయాలి.

● జగన్ పిరికిపంద: సోమిరెడ్డి

జగన్ ఒక పిరికిపంద. అవగాహన సదస్సుకు వచ్చే వారిని సైతం అడ్డుకున్నారు. జగన్ తరఫున గెలిచిన వారు కూడా ఇదేం కర్మ అంటూ బాధపడుతున్నారు. జగన్‌కు ప్రతిపక్ష హోదా ఎందుకు ఇవ్వాలి. సాక్షిని సాక్షిగా పెట్టుకుని జగన్ తన ఇంట్లో అసెంబ్లీని నడుపుతున్నారు. బడ్జెట్లో ఏ అంశాలుంటాయి, పార్ట్ నోటీస్ అంటే ఏంటి? వంటి విషయాలు కొత్త సభ్యులకు తెలిశాయి.

మాస్టారి ప్రాణం నిలపండి!


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సత్య వరప్రసాద్

రెండుసార్లు కొవిడ్‌తో దెబ్బతిన్న ఊపిరితిత్తులు

ఏడాదిగా జీతం లేని సెలవులు

వైద్యం కోసం సాయం అర్థిస్తున్న కుటుంబం

ఉరవకొండ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా ఉరవకొండ పట్టణంలోని డ్రైవర్స్ కాలనీకి చెందిన సత్య వరప్రసాద్ అనే ఉపాధ్యాయుడు.. విడపనకల్లు మండలం పాల్తూరు ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో ఎస్టీటీగా పనిచేసేవారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నాలుగేళ్ల క్రితం తొలిసారి కొవిడ్ బారిన పడ్డారు. తీవ్ర అనారోగ్యం పాలవడంతో అప్పట్లో ఆర్డీటీ ఆస్పత్రితో పాటు, బెంగళూరులోనూ వెంటిలేటర్ల మీద చికిత్స పొందారు. ఎలాగోలా మహమ్మారి వైరస్ నుంచి బయటపడ్డారు. ఆరోగ్యం కుదుటపడిందని అనుకుంటున్న సమయంలో... సత్య వరప్రసాద్‌కు మరోమారు కొవిడ్ సోకింది. రెండోసారి వైరస్ బారిన పడటంతో ఆయన ఊపిరితిత్తులు బాగా దెబ్బతిన్నాయి. పల్మనరీ ఫైబ్రోసిస్ అనే వ్యాధి సోకింది. బీఐపీఏపీ యంత్రంపై ఆధారపడి ప్రాణాలు నిలుపుకోవాల్సిన పరిస్థితి. రెండేళ్లుగా మంచానికే పరిమితమైన ఆయన.. ఏడాదిగా జీతాలు లేని సెలవుల్లో కొనసాగుతున్నారు. వైద్యం చేయించేందుకు ఆయన కుటుంబ సభ్యులు ఆస్తులమ్మి రూ.25 లక్షలవరకూ ఖర్చు పెట్టారు. చేతిలో చిల్లిగవ్వ లేని పరిస్థితి. ప్రస్తుతం వరప్రసాద్ బెంగళూరులోని ఓ ఆస్పత్రి ఐసీయూలో చికిత్స పొందుతున్నారు.

సాయం చేయాల్సిన బ్యాంకు ఖాతా వివరాలు:

సాకెల సత్య వరప్రసాద్,
ఉరవకొండ, అనంతపురం జిల్లా
యూనియన్ బ్యాంకు ఖాతా నంబర్:
195510100010837
ఐఎఫ్ఎస్‌సీ కోడ్: యూబీఐఎన్0819557
ఫోన్ నంబర్: 9492625502

కష్టాల కడలిలో ఉన్నాం.. ఆదుకోండి

ఇంటి వద్ద ఉంటూ వైద్యం చేయించుకుంటేనే నెలకు రూ.20 వేలకు పైగా ఖర్చు అవుతోంది. దీనికి తోడు ఇప్పుడు ఆస్పత్రి ఖర్చును భరించలేకున్నాం. ఏడాదిగా జీతం రావడం లేదు. వైద్యం కోసం ఉన్న ఆస్తులను అమ్మేశాం. ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం, దాతలు మాకు అండగా నిలవాలని అభ్యర్థిస్తున్నాం.

\- సత్యవరప్రసాద్ భార్య మధు

వర్రాను మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చాం

» రవీంద్రా రెడ్డికి 25 వరకు రిమాండ్ విధించారు

» హైకోర్టుకు నివేదించిన ఎస్‌జీపీ.. విచారణ 18కి వాయిదా

అమరావతి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాలలో అసభ్యకర పోస్టులు పెట్టిన వర్రా రవీంద్రా రెడ్డి, సుబ్బారెడ్డి, ఉదయ్‌కుమార్ రెడ్డిలను అరెస్ట్ చేసి కడప 2వ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చామని పోలీసులు హైకోర్టుకు నివేదించారు. వీరిలో రవీంద్రారెడ్డికి 25 వరకు జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ మేజిస్ట్రేట్ ఉత్తర్వులు ఇచ్చారని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) టి. విష్ణుతేజ వివరించారు. తన భర్తను పోలీసులు అక్రమంగా నిర్బంధించారని, ఆయనను కోర్టుముందు హాజరుపర్చేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ రవీంద్రా రెడ్డి భార్య హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. అలాగే సుబ్బారెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి బంధువులు కూడా హెబియస్ కార్పస్ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలను హైకోర్టు మంగళవారం లంచ్‌మోషన్‌గా విచారణకు స్వీకరించింది. పిటిషనర్ల తరఫున న్యాయవాది వీఆర్ రెడ్డి కొవ్వూరి వాదిస్తూ.. రవీంద్రా రెడ్డితో పాటు ఇతర నిందితులను పోలీసులు ఈ నెల 6 నుంచి అక్రమంగా నిర్బంధించారని, మంగళవారం వేకువజామున కోర్టు ముందు హాజరుపర్చారని, రవీంద్రా రెడ్డిని వివిధ ప్రాంతాల్లో తిప్పి చిత్రహింసలకు గురిచేశారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని మేజిస్ట్రేట్ దృష్టికి తీసుకెళ్లగా రవీంద్రా రెడ్డికి వైద్యపరీక్షలు నిర్వహించాలని ఆదేశించారని తెలిపారు. వైద్య పరీక్షల నివేదికను కోర్టు ముందు ఉంచేలా ఆదేశాలు ఇవ్వాలని, రవీంద్రా రెడ్డిని నిర్బంధించిన ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజ్‌ను సంబంధిత మేజిస్ట్రేట్ ముందు ఉంచేలా ఆదేశించాలని కోరారు. అయితే, ఎక్కడ నిర్బంధించారో వివరాలు చెప్పకుండా, సీసీటీవీ ఫుటేజ్‌ను సమర్పించాలని ఎలా ఆదేశించగలమని ధర్మాసనం ప్రశ్నించింది. వైద్య పరీక్షల నివేదిక వ్యవహారాన్ని సంబంధిత మేజిస్ట్రేట్ వద్దే తేల్చుకోవాలని సూచించింది. అక్రమ నిర్బంధానికి సంబంధించిన వివరాలతో అదనపు అఫిడవిట్ వేసేందుకు పిటిషనర్‌కు వెసులుబాటు ఇచ్చింది. పూర్తివివరాలతో కౌంటర్ వేయాలని పోలీసులను ఆదేశిస్తూ విచారణను 18వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ కుంచం మహేశ్వరరావుతో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు ఇచ్చింది.

పోసాని కృష్ణమురళిపై కేసు

విజయవాడ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): సినీనటుడు, వైసీపీ నేత పోసాని కృష్ణమురళిపై విజయవాడ భవానీపురం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. జనసేన నేత బాడిత శంకర్ మంగళవారం ఇచ్చిన ఫిర్యాదుపై ఈ కేసు నమోదు చేశారు. 2021 సెప్టెంబరు 28న హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో పోసాని మీడియాతో మాట్లాడుతూ పవన్ కల్యాణ్ ప్రతిష్ఠను దిగజార్చేవిధంగా అనుచిత వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదు చేశారు.

విద్యాసాగర్‌కు ముగిసిన పోలీసు కస్టడీ

విజయవాడ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ముంబై నటి కాదంబరి జెత్వాని కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న కుక్కల విద్యాసాగర్ పోలీసు కస్టడీ మంగళవారంతో ముగిసింది. సీఐడీ అధికారులు ఈ నెల 10 నుంచి విద్యాసాగర్‌ను మంగళగిరిలోని ప్రధాన కార్యాలయంలో విచారించారు. విచారణ పూర్తవడంతో, వైద్య పరీక్షలు చేయించి తిరిగి మూడో అదనపు చీఫ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. అతడికి న్యాయాధికారి తిరుమలరావు ఈ నెల 26 వరకు రిమాండ్ పొడిగించారు. కాగా, మహిళా సెషన్స్ కోర్టులో ఉన్న విద్యాసాగర్ బెయిల్ పిటిషన్‌పై విచారణను గురువారానికి వాయిదా వేశారు.

విద్యాసాగర్‌పై లుక్ అవుట్ నోటీసు

ముంబై నటి జెత్వానిపై కేసు నమోదు చేయించి, తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో ఆమె కుటుంబాన్ని జైలుకు పంపిన కేసులో ప్రధాన నిందితుడు కుక్కల విద్యాసాగర్‌పై పోలీసులు సెప్టెంబరు 14న లుక్ అవుట్ నోటీసు జారీ చేశారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

మా సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు

» ఎన్‌హెచ్‌ఆర్‌సీకి వైసీపీ ఎంపీల ఫిర్యాదు

న్యూఢిల్లీ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఏపీలో తమ పార్టీ సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారంటూ వైసీపీ ఎంపీల బృందం జాతీయ మానవ హక్కుల సంఘాని(ఎన్‌హెచ్‌ఆర్‌సీ)కి ఫిర్యాదు చేసింది. వైసీపీ ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, మేడా రఘునాథ్‌రెడ్డి, తనూజారాణి, గొల్ల బాబూరావు మంగళవారమిక్కడ కమిషన్ తాత్కాలిక చైర్‌పర్సన్ విజయభారతితో సమావేశమయ్యారు. రాష్ట్రంలో 57 మంది సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టారని, 12 మంది ఆచూకీ తెలియడం లేదని తెలిపారు. తమ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలను నియోజకవర్గాల్లో తిరగనివ్వడం లేదన్నారు. వెంటనే ఎన్‌హెచ్‌ఆర్‌సీ జోక్యం చేసుకుని, సమగ్ర విచారణ జరిపించాలని కోరారు.

దొంగే దొంగ అన్నట్లుగా వైసీపీ నేతల వైఖరి

» ఎన్‌హెచ్‌ఆర్సీకి వైసీపీ ఎంపీల ఫిర్యాదుపై టీడీపీ నేతల ఆగ్రహం

న్యూఢిల్లీ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతల వైఖరి దొంగే దొంగ అన్నట్లుగా ఉందని టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్‌హెచ్‌ఆర్సీనివైసీపీ ఎంపీలు కలిసి ఫిర్యాదు చేయడం చూస్తే నవ్వొస్తోందని ఎద్దేవా చేశారు. సోషల్‌మీడియా ముసుగులో వైసీపీ కార్యకర్తలు దుర్మార్గంగా వ్యవహరించారన్నారు. టీడీపీ ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, జాతీయ అధికార ప్రతినిధి తిరుమలగిరి జ్యోత్స్న మంగళవారం ఇక్కడ మీడియాతో మాట్లాడారు. వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలు సామాజిక మాధ్యమాల వేదికగా మాట్లాడినందుకు వారిని అరెస్టు చేయడం లేదని, చట్టాలను ఉల్లంఘించినందునే వారిపై పోలీసులు చర్యలు తీసుకుంటున్నారని ప్రసాదరావు తెలిపారు. సోషల్ మీడియా వేదికగా మహిళలు సహా అనేక మందిని వైసీపీ కార్యకర్తలు టార్గెట్ చేసి విష ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మానవ హక్కుల ఉల్లంఘన అంటే వైసీపీ నేతలకు అర్థం తెలుసా? అని జ్యోత్స్న ప్రశ్నించారు. అమరావతి మహిళలను నడిరోడ్డుపై జుట్టు పట్టి లాగి వారిని హింసించడం, డాక్టర్ సుధాకర్‌ను పిచ్చివాడిగా ముద్రవేసి చంపడం, సొంతపార్టీ ఎంపీని అరెస్టు చేసి దారుణంగా కొట్టడం మానవ హక్కుల ఉల్లంఘన కిందికి వస్తుందని అన్నారు.

చిచ్చు పెట్టే ముఠా!

(మొదటి పేజీ తరువాయి)

ఫేస్‌బుక్ ఖాతాలో పోస్టు చేసిన 40 నీచమైన వ్యాఖ్యల స్క్రీన్‌షాట్లను కూడా సేకరించామని... అవి తాను పోస్టు చేసినవే అని అతడు అంగీకరించాడని చెప్పారు. వైసీపీ సోషల్ మీడియా పేరుతో జరిగే 'ఆర్గనైజ్డ్ క్రైమ్'లో వర్రా రవీంద్రా రెడ్డి భాగస్వామిగా ఉంటూ నీచమైన పనులు చేస్తున్నాడని పోలీసులు తెలిపారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఎక్స్‌లో తప్పుడు వార్తలు సృష్టించడం, నీచమైన వ్యాఖ్యలు చేయడం వ్యవస్థీకృతంగా జరుగుతోందన్నారు. ఇందులో.. సజ్జల భార్గవ్ రెడ్డితోపాటు సిరిగిరి అర్జున్ రెడ్డి (ఏ3)ది కీలక పాత్ర అని తెలిపారు. "వైసీపీ సోషల్ మీడియా నుంచి వచ్చే కంటెంట్ తీసుకుని చిన్నపిల్లలు, మహిళలపై అసభ్య, అసహ్యకరమైన వ్యాఖ్యలు చేయడం.. తమకు నచ్చని పార్టీలనేతలపై జుగుప్సాకరమైన మార్ఫింగ్ ఫొటోలు పెట్టడం.. హోంమంత్రి అనిత వ్యక్తిత్వాన్ని హననం చేయడం.. వ్యవస్థలంటే లెక్కలేకుండా రెచ్చిపోవడం వర్రా రవీందర్ రెడ్డి నేర స్వభావం" అని పోలీసులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు.

భయానక వాతావరణం...

"అనుచిత పోస్టులు వ్యాప్తిచేసే వైసీపీ సోషల్ మీడియా విభాగంలో వర్రా రవీందర్ రెడ్డి 2012 నుంచే భాగస్వామిగా ఉన్నాడు. అతడికి సజ్జల భార్గవ్‌రెడ్డి తదితరులతో మంచి సంబంధాలున్నాయి. వైసీపీ సోషల్ మీడియా విభాగం కోకన్వీనర్‌గా వర్రా క్రియాశీలక పాత్ర పోషించాడు. అప్పట్లో అధికారంలో ఉండటంతో... ఏమాత్రం భయంలేకుండా తప్పుడు వార్తలు సృష్టించి, ప్రచారం చేశారు. ఏ1 వర్రా రవీంద్రా రెడ్డి, ఏ2 సజ్జల భార్గవ రెడ్డి, వారి బృందంలోని సభ్యులు నైతికత, నీతి లేకుండా... విచ్చలవిడిగా, దారుణమైన వ్యాఖ్యలతో విరుచుకుపడ్డారు. తమకు గిట్టని పార్టీల నాయకులను, వారి కుటుంబ సభ్యులను, పిల్లలను అవమానించేలా పోస్టులు పెట్టారు. సాధారణ జీవితం గడిపేందుకే భయపడేలా చేశారు. రాజకీయ, ఆర్థిక, సామాజిక వర్గాల మధ్య చిచ్చు పెట్టి.. హింసను రాజేశారు. తాడేపల్లి నుంచి వచ్చే కంటెంట్‌ను వీలైనంత ఎక్కువ మందికి చేరవేసేందుకు ప్రతినెలా 13వేలు వేతనం తీసుకొంటున్నట్లు వర్రా రవీందర్ రెడ్డి తన వాంగ్మూలంలో చెప్పాడు" అని పోలీసులు తెలిపారు. చట్టంపై గౌరవం, భయం ఏమాత్రంలేని ఇటువంటి వ్యక్తిని బయటికి వదిలితే సమాజానికి నష్టం జరుగుతుందని, జైల్లో పెట్టాలని కోర్టును అభ్యర్థించారు.

ఇదీ కేసు...

2023 డిసెంబరు నుంచి మంద కృష్ణ మాదిగపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న నేపథ్యంలో సింహాద్రిపురం మండలానికి చెందిన హరి అనే వ్యక్తి కలత చెందారు. పులివెందులలో జయమ్మ కాంప్లెక్స్‌లో ఉంటున్న వర్రా రవీందర్ రెడ్డి వద్దకెళ్లి... ఆ వ్యాఖ్యలను తొలగించాలని అడిగారు. అందుకు ఆయన ఇందుకు నిరాకరించి, కులం పేరుతో దూషించాడు. 2లక్షలిస్తే పోస్టులు తొలగిస్తానని డిమాండ్ చేశాడు. విధిలేని పరిస్థితుల్లో హరి 20వేలు ఇచ్చి మిగతా డబ్బు విడతల వారీగా ఇస్తానని చెప్పాడు. అయినా కామెంట్స్ తొలగించలేదు. దీంతో ఈనెల 8న పోలీసులకు హరి ఫిర్యాదు చేశారు. ఆదివారం రాత్రి దోర్నాల-కుంట మార్గంలో ఒక కారులో వర్రా పారిపోతున్నట్లు గుర్తించారు. కారు నడుపుతున్న గురజాల ఉదయ్ కుమార్‌రెడ్డి భారతీ సిమెంట్స్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. మరొకరు... గుర్రంపాటి వెంకట సుబ్బారెడ్డి. వీరిద్దరూ వర్రా రవీంద్రా రెడ్డికి సన్నిహితులు. ఈ ముగ్గురినీ పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. న్యాయస్థానం వారికి 14 రోజుల రిమాండు విధించింది.

సజ్జల భార్గవ్ రెడ్డి, అర్జున్ రెడ్డిపై ఎల్‌వోసీ..

రాజకీయ ప్రత్యర్థులపై బూతు పురాణానికి బీజం వేసిన వైసీపీ సోషల్ మీడియా బాధ్యుడు సజ్జల భార్గవ్‌రెడ్డి కోసం పోలీసుల వేట ముమ్మరం చేశారు. ఆయన సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ కావడంతో గాలింపు మొదలుపెట్టారు. ఆయన విదేశాలకు పారిపోయే అవకాశం ఉన్నందున లుక్ అవుట్ సర్క్యులర్ (ఎల్‌వోసీ) జారీ చేశారు. కడప జిల్లాలో నమోదైన కేసుల్లో సజ్జల భార్గవ్ రెడ్డి, అర్జున్ రెడ్డి కోసం ఎల్‌వోసీ జారీ చేశామని, వారి ఆచూకీ తెలిస్తే చెప్పాలని కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా మరికొందరు సోషల్ సైకోలపైనా ఎల్‌వోసీలు జారీ చేసినట్లు పోలీసు వర్గాలు చెబుతున్నాయి.

స్టేషన్‌లో బోరుగడ్డ లీలలు!

» కస్టడీలో ఉండగా చెంతకు మైనర్ బాలుడు

» వైరలైన రెండో వీడియో

» వర్చువల్‌గా కోర్టుకు... 14 రోజులు రిమాండ్

గుంటూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సోషల్ మీడియా వేదికగా జుగుప్సాకరమైన వ్యాఖ్యలు, దూషణలు, బెదిరింపులతో రెచ్చిపోయిన రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్ కస్టడీ వ్యవహారం గుంటూరు పోలీసులకు తలనొప్పిగా మారింది. కోర్టు అనుమతితో పోలీసులు మూడ్రోజులపాటు అతడిని గత నెలాఖరులో గుంటూరు అరండల్‌పేట పోలీసు స్టేషన్‌లో విచారించిన సంగతి తెలిసిందే. ఆ సందర్భంగా అక్కడ అతడికి సకల సదుపాయాలూ కల్పించడం దుమారం రేపింది. దీంతో సీఐని వీఆర్‌కు పంపుతూ గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు. తాజాగా రెండో వీడియో బయటకు వచ్చింది. ఇది గత నెల 26న ఆ పోలీసు స్టేషన్‌లోనిదే. పోలీసు కస్టడీలో భాగంగా అనిల్‌ను అక్కడ ఉంచారు. అర్ధరాత్రి సమయంలో ఓ మైనర్ బాలుడు ఏకంగా స్టేషన్‌లోకే వచ్చాడు. ఆ బాలుడిని బోరుగడ్డ తన కుర్చీ పక్కన మరో కుర్చీలో కూర్చోబెట్టుకుని అరగంటకు పైగా మాటామంతీ సాగించాడు. దీనికి సంబంధించిన వీడియో వైరల్ అయింది. ఈ నేపథ్యంలో పోలీసులు, అనిల్‌ను వర్చువల్‌గా గుంటూరు 5వ అదనపు మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరిచారు. మెజిస్ట్రేట్ కే లత బోరుగడ్డకు 14 రోజుల రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

భార్గవ్‌రెడ్డిపై పెట్టిన కేసేంటి?

» వివరాలు సమర్పించాలని గుడివాడ పోలీసులకు హైకోర్టు ఆదేశం



అమరావతి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన సతీమణిపై సామాజిక మాధ్యమాల్లో అనుచిత పోస్టులు పెట్టాల్సిందిగా ఆదేశించారంటూ వైసీపీ సోషల్ మీడియా మాజీ అధినేత సజ్జల భార్గవ్‌రెడ్డిపై నమోదు చేసిన కేసులో పూర్తి వివరాలు సమర్పించాలని గుడివాడ పోలీసులను హైకోర్టు ఆదేశించింది. అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తూ మధ్యంతర ఉత్తర్వులివ్వాలన్న ఆయన అభ్యర్థనను తోసిపుచ్చింది. ఈ దశలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులూ ఇవ్వలేమని పేర్కొంది. ఆయన దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను గురువారానికి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ముందస్తు బెయిల్ కోరుతూ ఇదే కేసులో రెండో నిందితుడిగా ఉన్న అర్జున్‌రెడ్డి వేసిన పిటిషన్‌ను కూడా అదే రోజుకు వాయిదా వేశారు. చంద్రబాబును, ఆయన భార్య భువనేశ్వరిని దూషిస్తూ కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన మహ్మద్ ఖాజాబాబా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారని గుడివాడ బాహుజీనగర్‌కు చెందిన ఆకునూరి శ్రీరాం కనకాంబరం ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా అక్కడి పోలీసులు ఈ నెల 3న కేసు నమోదు చేశారు. ఖాజాబాబాను అరెస్టు చేసి సంబంధిత కోర్టులో రిమాండ్ రిపోర్టు దాఖలు చేశారు. సజ్జల భార్గవ్‌రెడ్డి ఆదేశాల మేరకే పోస్టులు పెట్టామని అతడు వాంగ్మూలం ఇచ్చినట్లు అందులో పేర్కొన్నారు. భార్గవ్‌రెడ్డిని కేసులో మొదటి నిందితుడిగా, ఎస్.అర్జున్‌రెడ్డిని రెండో నిందితుడిగా చేర్చారు. వారిద్దరూ ముందస్తు బెయిల్ కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యాలు మంగళవారం విచారణకు రాగా.. వారి తరఫున సీనియర్ న్యాయవాదులు పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, ఓ మనోహర్‌రెడ్డి వాదనలు వినిపించారు. బీఎన్ఎస్ చట్టం 2024 జూలై 1న అమల్లోకి వచ్చిందని.. నేర ఘటన జరిగేనాటికి అది అమల్లో లేనందున ఆ చట్టంలోని సెక్షన్ 111 కింద పిటిషనర్లపై నమోదు చేసిన కేసు చెల్లుబాటు కాదని తెలిపారు. పోలీసులు మొదట నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో భార్గవ్‌రెడ్డి, అర్జున్‌రెడ్డి పేర్లు లేవని.. ఓ నిందితుడు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా వారిని కేసులో నిందితులుగా చేర్చారని.. వారిని అరెస్టు చేసే ప్రమాదం ఉందని, తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించాలని కోరారు. ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ స్పందిస్తూ.. ఈ ఏడాది సెప్టెంబరులో కూడా అసభ్యకర పోస్టులు పెట్టారని.. అందుచేత బీఎన్ఎస్ చట్టంలోని సెక్షన్ 111 వర్తిస్తుందని తెలిపారు. ముందస్తు బెయిల్ పిటిషన్లు మొదటిసారి విచారణకు వచ్చాయని.. కేసు వివరాలు తెలుసుకుని వాదనలు వినిపించేందుకు సమయమివ్వాలని కోరారు.

అవినీతి 'ద్వారం' మూత

» అక్రమాల అడ్డాగా ద్వారంపూడి రొయ్యల ఫ్యాక్టరీ

» రొయ్యల ఎగుమతి యూనిట్‌లో భారీ ఉల్లంఘనలు గుర్తింపు

» పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు ఆన్‌లైన్‌లో తప్పుడు నివేదికలు

» ద్వారంపూడి ఫ్యాక్టరీలో ఉత్పత్తి నిలిపివేస్తూ పీసీబీ ఆదేశాలు

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

అది.. కాకినాడ సిటీ వైసీపీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డికి చెందిన వీరభద్ర రొయ్యల ఎగుమతి ప్లాంట్.. గత ఐదేళ్ల అధికారాన్ని అడ్డంపెట్టుకుని నిబంధనలేమీ పాటించకుండా అడ్డగోలుగా వ్యవహరించారు. ఈ ఫ్యాక్టరీలో వెలువడే వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండానే పంటకాలవలు, డ్రైనేజీల్లోకి వదిలిపెట్టారు. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలేమీ ఖాతరు చేయకుండా.. చుట్టుపక్కల ప్రాంతాన్ని కాలుష్య కాసారంగా మార్చేశారు. అధికారులు కనీసం కన్నెత్తి చూడడానికే భయపడేలా చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అడుగడుగునా అనేక ఉల్లంఘనలు గుర్తించిన అధికారులు వాటిని సరిదిద్దుకోవడానికి వ్యవధి ఇచ్చినా లెక్కచేయలేదు. దీంతో ఈ రొయ్యల ఫ్యాక్టరీపై రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఉక్కుపాదం మోపింది. ఇష్టారాజ్యంగా నడుస్తున్న ఫ్యాక్టరీలో ఉత్పత్తి నిలిపివేస్తూ ఆదేశాలు జారీచేసింది. అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఎన్నో ఏళ్లగా నిబంధనలు ఉల్లంఘిస్తున్న ద్వారంపూడికి పెద్దషాక్ ఇచ్చింది.

అంతా మా ఇష్టం.. అడిగేదెవరు..

కాకినాడ జిల్లా కరప మండలం గురజనాపల్లిలో సర్వే నంబరు 116, 119బై 1, 2, 4, 8లో ద్వారంపూడి కుటుంబం వీరభద్ర రొయ్యల ఫ్యాక్టరీ నడుపుతోంది. సేకరించి తెచ్చిన రొయ్యలను ఇక్కడ ప్రాసెస్ చేసి ఎగుమతి చేస్తారు. ఈ కంపెనీలో వ్యర్థజలాల కాలుష్యం భారీగా ఉందని కొన్నేళ్లుగా స్థానికులు, రైతులు అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. కానీ గత వైసీపీ ప్రభుత్వం ఇవేమీ పట్టించుకోలేదు. వైసీపీ అధినేత జగన్‌కు ద్వారంపూడి అత్యంత సన్నిహితుడు కావడంతో అధికారులు ఈ కంపెనీపై కన్నెత్తి చూడలేదు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రావడంతో కాకినాడ రూరల్ నియోజకవర్గానికి చెందిన కొందరు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో జూలై 2న కాకినాడ కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్షలో పవన్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ద్వారంపూడి రొయ్యల ఫ్యాక్టరీలో కాలుష్యం



ద్వారంపూడి రొయ్యల పరిశ్రమ

వెదజల్లుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. తక్షణం అక్కడ వాస్తవ పరిస్థితులు అధ్యయనం చేసి నివేదిక పంపాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో జిల్లా, విశాఖలోని కాలుష్య నియంత్రణ మండలి జోన్ అధికారులు జూలై 11న ఫ్యాక్టరీలో తనిఖీలు చేపట్టి పలు భారీ ఉల్లంఘనలు గుర్తించారు. 22న నివేదిక తయారు చేశారు.

గ్రీన్‌బెల్ట్ లేదు.. మురుగునీటి శుద్ధి లేదు..

ఈ నివేదిక ప్రకారం ఫ్యాక్టరీలో రొయ్యల శుద్ధి సమయంలో వెలువడే వ్యర్థజలాలను శుద్ధి చేయకుండా నేరుగా సమీప పంట కాలువలు, డ్రైన్లలోకి వదిలేస్తున్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ) నిబంధనలు ఎక్కడా అమలు చేయకుండా పరిశ్రమ నడుపుతున్నారు. 13 ఎకరాల్లో పరిశ్రమకు సంబంధించి గ్రీన్‌బెల్ట్ నిర్వహించాల్సి ఉండగా అసలు అలాంటిదేమీ ఏర్పాటు చేయలేదు. వ్యర్థ జలాల శుద్ధీకరణకు సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయకుండా నేరుగా వాటిని డ్రెయిన్లు, పంట కాలువల్లో కలిపేస్తున్నారు. పీసీబీ వెబ్‌సైట్‌కు ఆన్‌లైన్ ద్వారా సమర్పించిన వివరాలన్నీ తప్పులతడకగా ఉన్నాయి. పీసీబీ అనుమతులు లేకుండా నాన్ ఐడీఆర్ బాయిలర్లు, ఐస్‌ప్లాంట్ నిర్వహిస్తున్నారు. ఈ నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి ఆగస్టు 6న నోటీసులిచ్చారు. అయితే నవంబరు 8 నాటికి 14 ఎకరాలు కొనుగోలు చేసి గ్రీన్‌బెల్ట్ ఏర్పాటు చేస్తామని, అదనపు సామర్థ్యంతో కూడిన ఈటీపీ నిర్మిస్తామని పీసీబీని సదరు కంపెనీ గడువు కోరింది. కానీ.. ఆ కంపెనీ అవేమీ చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించింది. దీంతో ఈ ప్లాంట్‌ను పూర్తిగా మూసివేస్తూ అధికారులు ఆదేశాలు జారీచేశారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని లంపకలోవలో నిర్వహిస్తోన్న ద్వారంపూడికి చెందిన మరో రొయ్యల ఫ్యాక్టరీలోనూ భారీ ఉల్లంఘనలను అధికారులు గుర్తించారు. దీనికి సంబంధించి ఇప్పటికే నోటీసులు జారీ చేశారు.

సైతాన్ సైన్యానికి నాయకుడు జగన్

» నాపై తప్పుడు ప్రచారం చేయించింది ఆయనే

» అసెంబ్లీకి వచ్చే ధైర్యం లేకపోతే రాజీనామా చేయాలి

» ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వ్యాఖ్యలు



వైసీపీ ఎమ్మెల్యేలకు రాసిన లేఖను చూపిస్తున్న పీసీసీ చీఫ్ షర్మిల

అమరావతి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల.. వైసీపీ సోషల్ మీడియాను సైతాన్ సైన్యంతో పోల్చారు. ఈ సైతాన్ సైన్యానికి నాయకుడు జగన్మోహన్‌రెడ్డేనని అన్నారు. 'సోషల్‌మీడియాలో అసభ్యంగా పోస్టులు చేసిన విషనాగులను పట్టుకుటున్నారు. వాటిని పెంచుతున్న అనకొండను కూడా పట్టుకోవాలి' అని పరోక్షంగా జగన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. సోషల్ మీడియాలో తనపై తప్పుడు ప్రచారం చేయించింది జగన్మోహన్ రెడ్డేనని షర్మిల కుండబద్దలు గొట్టారు. మహిళలపైనా, అమ్మ, చెల్లెళ్లపైనా వికృతంగా పోస్టులు పెడుతుంటే ఆపలేదంటే.. వాటి వెనుక జగన్ ఉన్నట్టేకదా అని ప్రశ్నించారు. మంగళవారం విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో షర్మిల మాట్లాడారు. 'ప్రతిపక్ష నేత హోదా ఇస్తేనే అసెంబ్లీకి వెళ్తాననడం జగన్‌కు భావ్యమేనా?, నియోజకవర్గంలో గెలిపించిన ప్రజల సమస్యలను అసెంబ్లీ వేదికగా లేవనెత్తాల్సిన బాధ్యత జగన్‌కు లేదా?' అని నిలదీశారు. అసెంబ్లీలో మైకు ఇవ్వని పరిస్థితి రావడానికి జగన్ స్వయంకృపరాధమని పేర్కొన్నారు. 'కూటమి ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశ పెడితే అసెంబ్లీకి వెళ్లరా? బడ్జెట్ పద్దులపై ప్రతిపక్షంకాక మరెవరు ప్రశ్నిస్తారు? ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగట్టేది ఎవరు?' అని ప్రశ్నించారు. అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీసే దమ్మూ ధైర్యం లేకపోతే జగన్ సహా వైసీపీ సభ్యులు ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేయాలని షర్మిల డిమాండ్ చేశారు. ఈ మేరకు వైసీపీ ఎమ్మెల్యేలకు ఆమె బహిరంగ లేఖ రాశారు. కూటమి ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజా బడ్జెట్ కాదని.. కూటమి పార్టీల మరో మేనిఫెస్టోగా ఉందని విమర్శించారు. 'కూటమి ప్రవేశపెట్టింది బడ్జెట్టో, మేనిఫెస్టోనో అర్థం కావడంలేదు. సూపర్ సిక్స్ అమలు చేయాలంటే ప్రతి యేటా లక్షా ఇరవై వేల కోట్లు అవసరం. సూపర్ సిక్స్‌కు చంద్రబాబు బడ్జెట్‌లో పావువంతు కూడా కేటాయింపులు చేయలేదు. తల్లికి వందనం కింద ప్రతిబిడ్డకూ రూ.15000 ఇవ్వాలంటే బడ్జెట్‌లో పదివేల కోట్లు కేటాయించాలి. మరి కేటాయింపులు లేవంటే సగం మంది పిల్లలకు నిధులు ఇవ్వరా?' అని ప్రశ్నించారు. ఉచిత బస్సు పథకానికి ఒక్క రూపాయి కేటాయించలేదని, అన్నదాత పథకానికి రూ.10వేల కోట్లు కేటాయించాల్సి ఉందని షర్మిల అన్నారు.



ఉప్పుటేరులో సముద్రపు కాకుల విన్యాసాలు

చలికాలం వచ్చిందంటే చాలు. విదేశాల నుంచి వచ్చిన సీగల్స్, పెయింటెడ్ స్టార్క్స్ తిరుపతి జిల్లా వాకాడు సమీపంలోని కొండూరుపాళెంలో విన్యాసాలతో అలరిస్తాయి. చిన్న చేపలు, రొయ్యలు, ఎండ్రకాయలను వేటాడే వీటిని సముద్రపు కాకి, కాస్పియన్ టెర్న్ అని కూడా అంటారు. ఇవి గుంపులుగానే కనిపిస్తుంటాయి. ఈ సముద్రపు కాకులు నేలపట్టులో కనిపించవు. పులికాట్‌లో అక్కడక్కడా తారసపడతాయి. కాకినాడ హోప్ ఐలెండ్స్‌లో ఇదే కాలంలో కనిపించినా, అవి 200 లోపే ఉంటాయంటారు. కొండూరుపాళెం, తూపిలిపాళెం, ఉప్పుటేరులో మాత్రం వందలాదిగా సముద్ర కాకులు సందడి చేస్తున్నాయి.

- వాకాడు, ఆంధ్రజ్యోతి



పూలవెందుల!

పులివెందులలో పూల వనాలు గుబాళిస్తున్నాయి. బంతి... చామంతి సహా రంగు రంగుల పూల తోటలు పరిమళిస్తున్నాయి. కడప జిల్లాలోని పులివెందుల సహా పెండ్లిమర్రి, ఖాజీపేట తదితర ప్రాంతాల్లో అరవిరిసిన పూలతో తోటలన్నీ ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ప్రస్తుతం కార్తీక మాసం కావడంతో రైతులకు కాసులూ కురిపిస్తున్నాయి.



తుంగభద్రలో ఇసుక జాతర!

తుంగభద్ర నదిలో కర్నూలు జిల్లాలో సాగుతున్న ఇసుక జాతర ఇది. రాష్ట్ర ప్రభుత్వం ఇసుక ఉచితం చేయడంతో ట్రాక్టర్లు, ఎడ్లబండ్లతో పెద్ద సంఖ్యలో ఇసుకను తరలిస్తున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.